భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

మే 1963

సంపుటము 40 : సంచిక 5

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మే 1963

వసంత వర్ణన

శ్రీ నారన సూరన

[ఈ కవి క్రీ. శ. 1500 ప్రాంతమువాడు. ఉదయనోదయము, వనమాలీ విలాస మను ఆయన ప్రబంధములు ప్రసిద్ధములు. అముద్రితములు. వసంతవర్ణన ఉదయనోదయము లోనిది.

—భా. సం]

మ. విరహగ్లానికరంబు, భూజన సుఖావేశంబు, నానావనీ
తరువల్లీ తనుసిద్ధి, షట్పద సముత్సాహంబు, నిర్జీవన
స్మరసంజీవన సిద్ధవిద్య, పికవాఙ్మౌన వ్రతోద్యాపనం
బరుదెంచెన్మధు మాస మంచితలతాంతామోది తాశాంతమై.

సీ. కోకిల కాకలీ కోలాహలంబుతోఁ
బాలుపొందె మా కంద భూరుహములు
మధుమత్తరోలంబ మధురస్వనంబుతో
భాసిల్లె పున్నాగపాదపములు
కుసుమసౌరభ భరాలస సమీరములతోఁ
గనుపట్టె వాసంతికాగృహములు
వాచాలమదకీర వాచారవంబుతో
దీపించె బరువులై తియ్యమావు

గీ. లలరుతేనియ జల్లెలు లెగమించె
రాలి పుప్పొడి సైకత రాసులయ్యె
నిఖిలవనికాభినవ రామణీయమగుచు
వసుధఁ జెన్నొందు మధుమాస వైభవములు.

మ. పునరుజ్జీవన మంత్రముల్ మృతమనోభూ భూమిభృన్మౌళికిన్
స్తనితంబుల్ మధు దుర్దినంబులకు, భాస్వత్సామిధేనుల్ వియో
గినికాయస్మరవహ్నికిన్ మధుమహీశక్షితిసేనకుంగాహళుల్
వినవచ్చెం గలకంఠ కూజితము లు ద్వేలంబులై తోఁటలన్.

సీ. జొంపంబులై కెంపు సొంపు సంపాదించు
చిగురాకు నెఱినింగి సిరిఘటింప
శ్రేణులై యుద్యాన సీమలకేగు కీ
రములైంద్ర చాప విభ్రమ మొనర్ప
మూఁకలై మొలమావిమోఁకలపై వచ్చు
కొదమ తేఁటుల మొగుల్ గుములఁ జేయ
సోనలై వెలుజక జోఱునఁ గురియు గ్రొ
వ్విరుల తేనియ లతివృష్టిగాఁగఁ

ఆ వె. గొనలుమీఱ మీఁదికెనిఁ బ్రాఁకునవలతా
వళులు వానకాలవైభవంబు
సంతరింప నవ్వసంతాగమం బంబు
దాగమంబనంగ నతిశయిల్లె

మ. అలి ఝుంకారరవం బుపాంగ నినదంబై యింపుఁ బాటింపఁ గో
కిల బాలాకమనీయ కోమల కుహూగేయంబులం గూడ మం
జుల మందానిల నర్తకుండు మదన క్షోణీశు ప్రాంగణల్
విలసిల్లన్ మధువేళఁ జూపె వనవల్లీలాసికాలాస్యముల్

శా. ధమ్మిల్లంబుల బొందు మల్లియ విరుల్ దై వాఱఁ బాలిండ్లపైఁ
గమ్మందావుల పొన్న మొగ్గలసరుల్ గరపింప లీలారసం
బిమ్మై మీఱఁగఁ గర్ణపర్వములుగా హిందోళ రాగంబులన్
సమ్మోదంబునఁ బాడిరిందు వదనల్ చంచల్లతా డోలలన్

గీ. విరియుబొండు మల్లె విరులతో నెలదేంట్లు
వ్రాలిచూడ్కి కుత్సవం బొనర్ప
విషమశరుని రాజ్యవిభవంబు వనలక్ష్మి
కన్నువిచ్చి చూచుచున్న మాడ్కి

మ. కలకంఠస్ఫుట కంఠకాహళులతో, గర్వించు రాచిల్క తే
జులతో, గేకి మదేభ బృందములతో, శుంభద్ద్విరేఫావళీ
బల సంఘంబులతోడవచ్చి విడిసెంబర్యంత కాంతార వీ
థులఁ జైత్రాగమ యామ్యదిక్పవనముల్ తో రా మరుం దుద్ధతిన్

వసంత వర్ణన

చ. అలితతినీలముల్ ముదురుటాకులు పచ్చలు లేఁజిగుళ్లు కెం
పులు దళరాజి వజ్రచయముల్ కలికావళు లాణి ముత్తియం
బులుగ పొసంగు చంగజాని బొక్కసమెల్లన నాత్మలోన నిం
పులు పొదలించె రాజనకుఁ బూచి బెడంగగు పొన్నలున్నతిన్

ఉ. సారెకుసారెకామ్రతరు శాఖలఁ బ్రాఁకి తనర్చు మాధవీ
వీరుధు లర్థిఁజేరుదల వెల్వడు భూవరుమీఁదఁ గ్రొవ్విరుల్
బోరన రాల్చుటొప్పె నళిపోత గరుత్ప్ర విచాలనంబులం
గోరి వనాంతలక్ష్మియొసగుం గుసుమాంజలి చందమందమై

సీ. ఆరఁబండిన క్రొత్త యల్లోనేరెడు బండ్లు
కుంతలంబుల యొప్పుసంతరింప
కమియఁబండిన పెద్దగజనిమ్మపండులు
పాలిండ్లచెలువంబు ప్రస్తరింప
మదురఁబండిన మంచి మాతులుంగపు బండు
లంగంబు కాంతి చెన్నవధరింప
తనియఁబండిన తీయ ద్రాక్షాఫలంబులు
కలికివాతెఱ సోయగంబుగాఁగ
గీ. పలుచఁబాఱిన లతవిశాపల్లవములు
గండపాళుల విభవంబు గ్రమ్మరింపఁ
పొలుచు వనలక్ష్మి యవయవంబులను బోని
వనవిశేషంబు లీక్షించె మనుజవిభుఁడు.

సీ. కట్టిన పూవన్నె పుట్టంబు కెంజాయ
కమనీయసాంధ్య రాగంబుఁగాఁగ
ముడివీడి వ్రేలు క్రొమ్ముడిసోగ వెండ్రుకల్
కడలొత్తు చిమ్మచీకటులుగాఁగ
నురువడి నూఁగుచో నుప్పరంబెగయుము
క్తాహారములు తారకములుగాఁగ
నిగుడు కాంతులతోడ నెమ్మోము నెత్తమ్మి
పరిపూర్ణ చంద్రబింబంబుగాఁగ

గీ. వికచలోచన రుచులు చంద్రికలుఁగాఁగ
యామవతియను విచికిత్స నావహింప
నళివ యొక్కర్తు తీగ యుయ్యాలనూఁగె
నింపు లిగురొత్త నొక పొదరింటిలోన.

1. యథామాతృకము.

★

వేసవిలో మందమారుతము

శా. ఆ కల్లాడద దేమొ? నేఁడు పవనుం డాకాశ వాపీతటా
శోకానేక వనాళిఁ గ్రుమ్మరుచు నచ్చో దాఁగెనో లేక గం
గా కల్లోలవతీ తరంగముల నూఁగంబోయెనో, లేక కాం
తా కర్పూర కపోలపాళికల నిద్రాసక్తుఁడై యుండెనో.

[ఎవరిదో తెలియదు. మీరు చెప్పగలరా? భా. సం]

శతకాలూ - ముక్తకాలూ

డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

7

ఈ నవ్యయుగంలో శతకాలు ఎన్నోరాలేదు. అయితే ప్రకీర్ణక వస్తువునూ ప్రకీర్ణక భావములనూ అందంగా కూర్చడానికి శతకాలు అవసరమే. ఈ అందాన్ని సేకరించుకోవడము వల్లనే కాళహస్తీశ్వర శతకము, ఆంధ్రనాయక శతకము, దాశరథీ శతకము వంటివి ఈ నాటికీ చదువరుల నలరిస్తున్నాయి.. మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి గారిది ఆశుపద్యరచనా ధార. మెఱుపుల్లాంటి భావాలు 'ఒక లంబోదరు సృష్టిచేసి సంతుష్టిపడక నన్నొక లంబోదరుణ్ణి సృష్టించావు ప్రభూ; మరి ఆతణ్ణి భరించినట్లుగానే నన్ను భరించు' 'శ్రీ కృష్ణ మేఘుంబునా హృదయాకాశము గ్రమ్మి శోక బహుళగ్రీష్మాతపం బార్చుతన్' వంటివి అడపాదడపా మెరిసినా, 'ఒక చిన్నము కష్ట మనంగ నెట్టిదో ఎఱుగని,' 'తెలుపన్నేర్తునె యొక్క జీవనమునందే నన్ను నీ వెన్నిమారులు సృష్టించి లయింప జేసితి' అంటూ దూకుడుగా దాటుకుపోయే వైఖరే ఎక్కువపాలులో వుంటుంది వీరి రచనలలో.

విశ్వనాథవారి 'మా స్వామి' 1926 నాటిది. వారి భావ సౌందర్యాతిశయము ఏ కృతిలో ఎక్కువగా కూడినదీ అని నన్నడిగితే, 'ఈ కృతిలో' అంటాను. శతకములోని పద్యాలభావాలు క్రమాభివృద్ధితో చదువరిని సద్యఃపరనిర్వృతికి తీసుకుపోనక్కరలేదు. ఏ పద్యానికాపద్యమే దానికాళ్లమీద అది నిలబడాలి. ప్రతిపద్యములోనూ, రసలేశమున్న చాలును వానజల్లు ఉండనక్కరలేదు, ఉంటే మంచిదే. సత్యనారాయణగారిది ఉఱుములా మెఱుములా రచన. కథాగమనము— ప్రవంతివలె— (ఇంచుమించు) ఒకే మట్టములో సాగవలసిన చోట ఆయన రచన దుముకులాటకు ఉత్సహిస్తుంది. ఆ ఉత్సాహము అక్కడ విపరీతమైనా శతకంలోని పద్యముయొక్క చిన్న శరీరములో చక్కగా అమిరిపోతుంది. ఆంధ్ర విష్ణువులో "సాగర మేఖలా చారుకుచద్వయాశాయి ఆంధ్రావని చక్రవర్తి" అన్న వర్ణన నాకు పైనించి ఎక్కణ్ణించో పద్యముమీద పడ్డట్టు వినపడింది. ఇక్కడ సరిగా అలాంటివర్ణనే 'ప్రాలేయాచల కన్యకా కుచతటీ పర్యంక నిద్రాగతంబై' నట్టిది సంప్రదాయ పద్ధతిలోని వర్ణనయై దాటుకుపోతున్నది. 'నీవే రాజువు నేను పత్కవిని దండ్రీ ! నిన్ను వర్ణించెదన్, నీవే దైవము నేను భక్తుడను దండ్రీ నిన్ను ధ్యానించెదన్' అన్నతర్వాత ప్రభువు భూమిమీ ఈయన కర్షకులా అయి భక్తి ఒకమెట్టు దిగినా, "నీవే భూమివి నేను గర్షకుడ దండ్రీ ! నిన్ను బండించెదన్ నా వైదగ్ధ్యము నీవచూతు, కృపసంధానించు విశ్వేశ్వరా !" అన్న రెండుపంక్తుల ఉత్సాహములో కలిసిపోయి వేరుగా కానరాదు. ఇక "చలిమిన్నేటి కెలంకులందు సొగసుంజాబిల్లి పూరేక వంకలు సింగారముగా నమర్చి చెవులన్ గంపింపగా బాహుపోగులు మేనన్ బుఱితోలు వైచికొని కొంగుల్ జారబ్రేమంపు జూపుల సంధ్యాసతి జూచునీ సొగసు మమ్మున్ బ్రోచు విశ్వేశ్వరా!"అని నిరంతరాయముగా సాగేచోటా "స్వామీ నా బ్రతుకెండి నీ కరుణ వర్షాగాఢ జీమూత మాలా మాధుర్యములేది దుఃఖమయవేళా గ్రీష్మ సూర్యాత పోష్ణ్య మందత్వముచేత బీడువడి యంతా నెఱ్ఱెలై యున్నదింకేమో సొగుకు గుంభవృష్టిపడికానీరాదు, విశ్వేశ్వరా !" అని మొరపెట్టేచోటా పద్యాలువచ్చి లాగుతాయా యూడుస్తాయా అంటే అదొకమాటా ?

సత్యనారాయణగారు మూడో పద్యంలో 'నా వైదగ్ధ్యము నీవచూతు కృపసంధానించు విశ్వేశ్వరా' అని వ్రాసినందుకే కాబోలు— గ్ధ్వ్యాత్మ, ంప్ర, గ్వ్య, ంహ, ధ్మ, ద్వ్య, క్త్య, శ్వా, వంటి— దుష్కర ప్రాసలు వాడి రచించారు, 'నీ కారుణ్యము సాటితెత్తును' అంటూ ఉపక్రమించిన పద్యాలలోనూ మరికొన్నిచోట్లా సమాస నిర్మాణ వైదగ్ధ్యము చూపేరు. కాని ఈ విశ్వేశ్వర శతకము ప్రధానంగా సంసార బాధా నివారణకోసము రచించినట్టు "ఈ నా భార్యయు బిల్లలున్ బ్రతుకు త్రోవేదని జూపించుమంతే నేడే చనియేగిరీంద్రములనో నిద్రింతు, నే వాగులందో నీరానెద, నే ఫలావళులతో తిందున్, బర్ణముల్ మేసెదన్, నీ నిష్ఠాగతి నీవుగాక మరి లేనే లేను విశ్వేశ్వరా !" వంటి పద్యాలవల్ల తెలుస్తుంది. లోకపు కడగండ్లను గూర్చినవి పద్యాలు చాలానే ఉన్నాయి. అయితే జీవుని నైజాన్ని "తెలిపూ బామువులందు నొత్తిగిలి నిద్రింపన్, జగాలేత వెన్నెలలో జల్లని పిల్లగాలి పొరలో నెమ్మేను చేర్పన్ నెలంతల లే నవ్వుల సోగ బుగ్గ గిలిగింతల్ వెట్ట, నెంతెంత కోర్కులు నా కున్నవో, అంత నిన్నుగను కోర్కుల్ వేవు, విశ్వేశ్వరా" అనీ, "నీ కారుణ్యము కోసమై విధురతంత్రీ వీణ వాయించు బాలాకృత్యంబుగ నంగలార్చినది నాలన్ నాదు జిహ్వాగ్రవాణీ కింక్ణింకిణి నూపుర స్వనము లెంతే దట్టమై పోయెనే ఓ కారుణ్యము చూచి నా కసలు నోరే రాదు విశ్వేశ్వరా !" అనీ బయలుపెట్టిన పద్యాలు—ఒకమారు చదివితే తగులములే

అయ్యే పద్యాలు—పెక్కు ఉన్నాయి. ఈ శతకములో. ఇది ఆధునికముగా ఎందుకని లెక్కించావూ అని అడిగితే, చెప్పే పద్ధతిమీద కంటె చెప్పే వస్తువు—అదిన్నీ శమ అనుభవము—మీదనే కవిగారు ఎక్కువ వూతము పెట్టియుండటము వల్ల నని జవాబు. దుష్కర ప్రాసయా దీర్ఘ సమాసాలూ ఉన్న పద్యాలలోనూ కవిగారి వేదనాసూత్రము స్ఫుటంగా కనబడుతూంది. పౌరాణిక వస్తువును వాడి తద్వారా కూర్చిన గొప్ప ఉన్నప్పటికీ, పరిమాణంలో కవి స్వానుభవానికి చాలదు.

మోచర్ల రామకృష్ణయ్యగారి 'అమృతకలశము' వాస్తవానికి శ్రీకృష్ణ శతకము. అయితే మకుటము తీసేశారూ, ఒకే వృత్తం వాడక (గద్యలేని) చంపూ కావ్యంగా తయారుచేశారు. వస్తువు పౌరాణికమే ఎక్కువ. అయితే "నావాగ్రంగము నెక్కి యొక్క క్షణమైనన్ నిల్చి, లావణ్య లీలావిర్భూత గతిన్ నటించి యొక బ్రహ్మానందగీతంబు కృష్ణా, వాయింపగదోయి నీ మురళిపై, 'నా చిత్తముకురాన .... ఒదిగి ప్రతిఫలింపుమోయి కృష్ణ' వంటి జీవుని ప్రగాఢాశయాలు శక్తివంతంగా వచ్చాయి. ఈ కావ్యానికీ, శతకాలకూ గల తేడా ఆధునిక కవిత్వ ప్రభావమే నంటున్నాను. ముదిగొండ వీరభద్రమూర్తిగారి 'వేణుగోపాల శతకము' ప్రౌఢము, మన పెద్ద శతకాలలో ఎంచవలసినది. అయితే నూటికి నూరుపాళ్లా పూర్వ సంప్రదాయపు శతకమే, ఆధునికము కాదు.

యెమ్మనూరి చిః వెంకటరెడ్డిగారి 'దక్షిణానిలము', 'అలనముగ దక్షిణా నిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!'' అన్న ధ్రువమును మూడేసి జంపె వరుసల పాదముల చివ్వర వాడిన గేయ చరణాలు 103 కూర్చిన శతకము. 'దక్షిణానిలము వీచె' నన్న వార్తను మిషగా గ్రహించి ప్రకృతి సౌందర్యాన్ని చక్కగా ప్రౌఢంగా రచించారు రెడ్డిగారు. ఉత్సాహము పాండిత్యము హాయిగా రంగరించుకున్నాయి ఈ శతకములో. "కవిలోక భావ సంక్రాంతి తెర లెత్తికొన, శివరమ్య భారత శ్రీలాస్యముల నింప, చరితాభ్యుదయ నాట్య సంకేతముల చెంప'' వీచెనట దక్షిణానిలము. 'తరతరమ్ముల భావదాస్యము తొలగించి', 'జగతి యంతయును నొక్క సంసారమని పల్కు' అనహాయ కృషిక భావావేశముల జాడ' వంటి సమకాలిక రాజకీయాభిప్రాయాలూ ఉన్నాయి దీనిలో. అయితే అచ్చుపోతా లోహమూ కొత్తలు. వీరి శైలి ప్రౌఢసుందరము. "దళిత మానవతా ప్రతప్త జీవన తటాకములలో, భంగలోకములలో, సముదీర్ణతమములో, చంద్రికా సముదీర్ణతలు బెంచి'' వీచెనట దక్షిణానిలము. ఇది 1960 నాటిది.

ముక్తకాలు

కవితా సౌందర్యదృష్టిలో శతక పద్యాలకన్న ముక్తకాలు చాలా నయము. మానవ స్వభావాన్ని తెరమీది కెక్కించి చూపిస్తాయి. తెలుగులో ముక్తకాలు తమంతట తాము రచించిన కవులు ఉన్నారేమో నే నెరుగను. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారు మొదట శాలివాహన సప్తశతిని తేటగీతములూ, ఆటవెలదులూ వాడుతూ తెలుగుచేసి భారతిలో ప్రచురించారు. చాటువుల కంటె ఎక్కువగా యత్నాన్ని పురికొల్పేవీ, శతక పద్యభావాలకన్న సౌందర్యమును ఎక్కువగా బింబించేవీ, ఈ పద్యాలు ఆధునిక కవిత్వంలో కొత్తదారి నేర్పరచాయి. అనంతకృష్ణ శర్మగారి మితభాషిత్వము వల్లనే కాక మూల ప్రాకృత పద్యాల చిన్న సైజువల్ల కూడా ఈ సప్తశతి పద్యాలు తెలుగులో చిన్నవైనాయి. అల్పాక్షరముల అధికార్థ రచనకీ పద్ధతి అనుకూలము. ఇవి ప్రాకృత పద్యాలకు తెలుగుసేత కనుక ఆధునిక కవిత్వ పరిశీలనా సందర్భములో మనము వీటిని ఎక్కువగా పరిశీలించుకో నక్కరలేదు. రచించిన కవులు ఇంగుమించు పద్యము పద్యానికీ వేరే కనుక ఇవన్నీ ప్రాకృత వాఙ్మయాకాశములో చుక్కలవలె మెరసినట్టివనిన్నీ ఒకే కవి రచించియుంటే ఇంత వైవిధ్యము కూడడము సాధ్యము కాదనిన్నీ గుర్తించుకుని దాటిపోదాము.

విశ్వనాథవారు సప్తశతిని కాక పంచశతిని రచించారు. భైరను కవివలె ఆంధ్ర ప్రశస్తీ, నండూరి వలె కిన్నెరసాని పాటలూ, కాళిదాసువలె ఋతుసంహారమూ, శశిదూతమూ, కుమారాభ్యుదయమూ, జయదేవునివలె శృంగారవీథీ, శాలివాహనుని వలె 'పంచశతీ', ధూర్జటివలె మాస్వామీ రచించారూ, మల్లంపల్లి, కట్టమంచి, కొమర్రాజు వంటి మేథావసువులకు తమ గ్రంథాలను అంకితము లిచ్చారు. వీరి పూనిక గౌరవింప దగినది. మొదటలోనే వీరు ఒక హెచ్చరిక చేస్తున్నారు. "ఉర్విలోన మహాకవి యోగినంటివాడు, సర్వమ్ము భావనావధిగ జూచు(ను), అల్పులంబోలె బ్రతుకులో ననుభవించె నను కొనుట వట్టి పామరమైన యూహ'' అని. ఈయన రచన లన్నిటిలోనూ ఈ అభిప్రాయము పూసలలోని దారము. మహాకవి సర్వమునూ భావనావధిగ చూడవలెనా? బ్రతుకులోని అనుభవమును కావ్యగత మొనర్చుట అల్పుల పనా? కాళిదాసు వింధ్యాద్రిశోభనూ హిమాలయ సౌందర్యమునూ అనుభవించకుండా రచించాడా ఋతుసంహారమూ కుమారసంభవమూ? వేమన్నదంతా భావనావధి రచనేనా? ఓమర్ ఖయామూ అల్పుడా? .... విశ్వనాథవారి సాహిత్య అభిప్రాయాలు అతి పెలుసు. వాటి జోలి మనకు ఇక్కడ వద్దు. అయితే వీరి పంచశతిలోని వస్తువు భావనావధిగ చూచి రచించినదా? లేక బ్రతుకులో చూచినట్టిదా? అన్న ప్రశ్నను ఆదికి ముందు మన యెదుట పెట్టి పంచశతి పరిశీలనకు ఒక దారి చూపిస్తున్నారు వీరు. "కొన్ని వ్యంగ్యములన్ ధ్వనులును గొన్ని వట్టి వర్ణనలు, కొన్ని రమణీయ వాచ్య సరణి వ్రాసెద'' నని రెండో పద్యంలోనే భావనావధిగ కాక 'వట్టి వర్ణనలు'గ వ్రాసెదనని ఈయన చెప్పడాన్నిబట్టి పై పద్యంలోని భావం కేవలం ఆదర్శసూచకమేనని మనము గ్రహించవచ్చును. విశ్వనాథ పంచశతిలో బ్రతుకులో కవిచూచి అనుభవించెనని చెప్పడానికి వీలిచ్చే వస్తువు— కవికి సమకాలికము— చాలావున్నది. రైలుస్టేషను, పరీక్షనంబరు, తలకు రంగు, ఎయిరురెయిడు షెల్టరు, స్కూలుపిల్లల మిస్సమ్మ,

సర్కసు, పత్రిక, రేడియో, డార్వినువాదము, వీధివంపు, యంత్ర యుగము, ఉపన్యాసములు, టిక్కట్టు, ప్రజాస్వామికము, విద్యాధికారి, సిఫార్సు, యడ్వర్టైజుమెంటు, తెలుగువాచకము ఈ నాడు ప్రత్యక్షమయ్యే వస్తువులే. "వీనికి మదిలేదు వర్ణ భేద, ముల్లమునను శాఖాభేదముజ్జ్వలంబు," "అవును తనదేమి పోయినదంత రెడ్డిబిడ్డ చనుదెంచి మార్కులు వేయుడ నిన వేయరాదేమి ? వాడేమొ విజయు తనకు గడకుజెడియె బరీక్షాధికారి పదవి" "అకట ప్రాజెక్టుకట్టు దిక్కమెచు లేకజాజువారెడు గోదావరీ జలంబు" అని అనుకోగం కాలమిదే. కనుక "బ్రతుకులో ననుభవించే" ననడానికి వీలిచ్చే వస్తువు (అదంతా భావనా వధియేమీకాదు) విశ్వనాథ పంచశతిలో ధారాళంగావున్నది.

ఉండవలెను గూడ. సమకాలిక ప్రపంచముతో సంబంధములేని ఊహలు నేలవిడిచినసాము. ప్రబంధకవుల స్త్రీల సౌందర్య వర్ణనలు నూటికి తొంభైతొమ్మిదిపాళ్లు అలాటివే. వారిలో గుడ్డికవి అయినా బట్టీపట్టిన సంస్కృతకవుల అలంకారపు పేకముక్కలతో దృశ్యాలసెట్లు నిర్మించగలడు. ఇంట్లో వీణానాదము కంకణారావమూ వినలేని చెవిటిఅయినా పొలములోని మధుపమ్ముల చూడకుండానే జుమ్మువు వినగలడు. చిరపరిచిత ఊహాసౌందర్యపు కోతిగంతులు కొన్నిశతాబ్దాల పాటు తెలుగు చదువరులనువట్టి వారిరుచిని చెడిపినవి. ఆ వ్యర్థపుటడుగు లింకాఎందుకు ? సౌందర్యము విశ్వమంతటా వ్యాపించివున్నది. కళ్ళూ చెవులూ గుర్తించలేని సౌందర్యాన్ని మనస్సు గుర్తించగలదా ? అనుభవము కవికి విషయముకాదు, ఏరి అతని శరీరపు నెత్తుతారు. లలిత లవంగలతా పరిశీలన కోమల మలయ సమీరపు కౌగిలింతా, విద్యోతమానోగ్ర ఖద్యోత కిరణ జిద్విద్యుద్ద్యుచ్ఛతి టావిభవమూ అతన్నిమనలనుకంటె చక్కగా స్పృశిస్తాయి. అతడు ఆ స్పర్శ ఇతరులకు చక్కగా తగిలే భాషారచన చెయ్యగలడు, మనము చెయ్యలేము. మన దళసరి చర్మానికి మందబుద్ధికీ తోచని సౌందర్యము కవికి గిలిగింత పెట్టుతుంది. మనలను పలకరించక దాటుకుపోయే సౌందర్యము అతణ్ణి పలకరిస్తుంది. ఆ సౌందర్యాన్ని చక్కని మాటలతో మనకి అందిస్తాడుకవి. కవికిగల అదనపు చైతన్యాన్నే మనభాషలో మనము భావన అంటాము. కవిభావన మానవ చైతన్యపు యౌవనదశ. కవి మొక్కపాటివారివలె నీలికొండల గుసగుసలను కూడావిని తన్మయుడయేవాడు గాని తన గొప్ప కోసము కొండలను సలికించేవాడుకాదు. కవిభావన ఇంద్ర జాలముకాదు, ప్రకృతి సౌందర్య వర్షావసరము. కవి అనుభవమే పండి భావన అవుతుంది. అనుభవపు మెఱుపులను పండు వెన్నెలగా ప్రసంచించేది భావన. అనుభవానికి వెలిఅయిన భావన— స్వాతంత్ర్య సంపాదనకోసము బానిస తనయేలికల ముందుచేసే నృత్యములాంటిది. అది— మెప్పునే కలిగిస్తుంది గాని ఆనందాన్నివ్వదు.

శాలివాహన గాథా సప్తశతిని బట్టియే విశ్వనాథవారు తమ రచనలకు పంచశతి అనిపేరు పెటినారు. ఆ పద్యముల వలె ఈ పద్యములుకూడా 'ఏ పద్యమ్మున కదియే' నాటివలెనే ఇవీ చిన్నవి. అయితే అవి పలువురు కవులు రచించినవి. ఇవి ఒక్క కవి భావనావధిని బింబిస్తాయి. వీనిలో సప్తశతిలో వలెనే "మన యింటి కెదురుగా నుండినవారల కూతునకును నిజముగ దేల్కుట్టినదని యడిగి తెలిసికొని వసరుట నీ జాలిగుండె వలననె ప్రియుడా," "పేరంటమునకు వచ్చినవారి పడుచు దాల్చినట్టి వలువబోగడమీ నేరిచిన యంతనేరువవహౌరా! మే మాడువారమయ్యును ప్రియుడా !" వంటివ్యంగ్య ఉపాలంభనములూ, "రయిలులో గూరుచున్నట్టి రమణియొక్క కోతివలె నున్న యేడాది కొడుకుమీద శిశువులపైని వాత్సల్య మెంత నెఱపవచ్చునో యంతయు నెఱిపినతడూ," "ముట్టుకో నీయక తొలగి కసరికొట్టుతూకూడా పయ్యెద కొంగుతో బతికి నేలో విసరు పద్మగంధి," "అతడు ప్రక్కనుండి యూల కించుచు నుండెనంచు దెలిసి అతని భార్యతో "పూవుబోడి ! నీశతిపూవుటమ్మువాడు నన్నడమ్మలు" అనే పక్కింటియామే, "మెల్లనేడాది తిరుగని పిల్లవాడు కాళ్లపైవంగి సందుగా గాంచుచుండ దానుకొట్టిన నవ్వెడు" తండ్రీ, "కాకర పాదు వంటి— పేసంగిలోకూడ వేటిసిళ్లు కావలయు బావా," వంటి సమకాలిక నమ్మకాలు బింబించే వ్యక్తులూ, (కవివ్యంగ్యోపాలంభనల రూపాన్నవున్న) నీతులూ, 'క్రొత్తగా గుడ్లుపెట్టిన గూటిని' వదలి తిండికికూడా పోనితొండ, 'అగ్ని హోత్రాలు లేకుండ నక్షరంబు' సాగని సత్కవి—, వర్ణనలూ, ఉన్నాయి. భావనావధిచేరిన పద్యాలు "అందరును కోకిలను మెత్తురంచ తండు, కోకిలను దిట్టుచును వ్రాసె గ్రొత్తపాట (మునివాణి క్యమువారు !) యెవరుచెప్పిరో కోకిల కీవిషయము, వానియెల నాగగొంతుతో వచ్చి కూయు !", "ఊరి భార్యలెల్ల నూహించి యూమె మంచంబుతో నిడిరి స్మశానమందు, నటపిశాచ కాంత లాలోచనముచేసి పడతిమఱల నూరినడుమ నిడిరి" "నన్నుంచుకొనిన వానికి గన్నుంగప్పుటయు నంత కష్టము కాదే, నిన్నువిడిచి యెవరెవ్వరో నన్నడిగిరటంచు జెప్పినంజాలు సఖా" "నిన్ను నాకిత్తునన్నారు మున్నుచెలియ ! యెందుకో మఱీ తప్పిపోయినదిగాని" "యెందుకో యేల ? నీవన్న వేను చెల్లెలను మఱీ పూర్వజన్మమందుననొ కాని" వంటివి కొన్ని వున్నాయి. ఇవి సప్తశతిలోనివేనేమో ననిపించే "రమణి ! నే నంత సామంతురాలకాను. ఇల్లువదలి రానాస్కారమింతలేదు, దాని దుంపతెగిరిలే జగానవెల్ల వనితలును నందగాండ్రకే భార్యలైరె" వంటివీ ఉన్నాయి. గాథా సప్తశతిలోని పలుకుబడులు 'వార్ధకమ్మున యౌవనవతికి భర్త' 'పశువుకొంత నయమువాడు, వంటివి ఉన్నవీ, పొయ్యిఊదే పద్యమూ, నాథు రొమ్ముమీద కాంతమేల్కని యుండిన పద్యమూ వంటివి పోలికలూ ఉన్నవి.

అయితే సప్తశతి పద్యాలకూ పంచశతి పద్యాలకూ— పగలూ రాత్రికివలె— కనిపించే వ్యత్యాసమూ ఆ కవుల నిరంజన చైతన్యదృష్టి, విశ్వనాథవారి 'నిర్నిరంజన' ఆవేశ దృష్టిని. ఆ కవులు "గురజాడ వారిలాగ లోకమనే రంగంలో చిత్ర కోటి రీతులను ఆటాడే పాత్రముల సొగసుకనిపెట్టడము అల

వాటు'' చేసుకున్నారు. కనుక వారుచిత్రించే వ్యక్తులలో సొగసు లేని వ్యక్తే వృగ్యము. స్నేహమూ ప్రేమా అనే రెండు వెలుగులు మనుష్యులమీదికి సప్తశతి కవులు ప్రసరించి కాంచినారు. కనుక ప్రతివ్యక్తిలోనూ వింతసొగసులు బయలుదేరినవి. విశ్వనాథవారు తమ నీతులూ, తమ నమ్మకాలూ, తమ కొలబద్దలూతో మానవులను కొలిచి శతక కవుల పద్ధతిలో రచన సాగించినారు. 'ఔరా పెండ్లమ ! ఊరున నూరేగింపునకుం గ్రొత్త యొడుపులు వలయున్, కోరికగలపతి నాకడఁ జేరెడిచో బనికిరాని చీరలు చాలున్'' అని (అందవు టవలోకనముగా కాకుండా) తీవ్రమైన అభిప్రాయంగా మలిచి ఇస్తారు కొన్నిపద్యాల్లోవీరు. సప్తశతిలోని వ్యక్తుల వర్తనము మనకు నచ్చుతుందని అనలేము. అయితే వారిమీద స్నేహమూ ప్రేమా మాత్రము మనకి తప్పకుండా కలిగి, చిన్నపిల్లవాడి తప్పుడుమాటలు విని' నవ్వినట్టు వారివిచిత్ర వర్తనము చూచి నవ్వుతాము. సప్తశతిలోనిది 'వానిమీద బడియె వనిత గోదావరి జాఱురేవు దిగెడు సాకు పెట్టి, కనికరమున దప్పుకొనరాదని వాడు, గట్టిగాగ దాని గౌగిలించె'' అన్నది ఒకగాథ. విశ్వనాథవారి రచనలో ఇలాంటి సన్నివేశమే రూపముమారి ''అవునవు జిటారు కొమ్మనున్నట్టి పూవులామె కందవు, పూజకై యందులోన దమరుమల్లి కోసి పెట్టినం దప్పుకాదు, కాంతపిగ్గున గొనుటంత కన్నంగాదు'' అన్న ప్రౌఢభార్య ఉపాలంభనముగా కనబడుతుంది. ఆమెకు వచ్చిన కోపము కవిగారికి సంక్రమించుటవల్ల 'కోసి విసరిన' అనీ, 'కాంత పైటను గొనుటంత కన్నగాదు' అనీ అయినా స్ఫురించినదికాదు ! వారి కవిత్వముకంటె నా పైత్యము బాగున్నదనికాదు నా సూచన, కోపగించడము చూపుతారు గాని విశ్వనాథవారు, కోపకారణాన్ని వెండితెరమీది కెక్కించి మనకా సొగసు చూపించరనీ ! శాలివాహన సప్తశతి కీ నిరంజన చైతన్యదృష్టియే జీవము. ఆవేశాలూ అభిప్రాయాలూ ప్రవేశిస్తే కవి అభిప్రాయ మాయనదీ చదువరుల అభిప్రాయాలు చదువరులవీని.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ''విశ్వదాభిరామ వినురవేమ'' పద్యాలూ (1945, 46) సప్తశతి గాథల చాలివే. లోకపు వాస్తవస్థితిని గుర్తించి దానినిచెప్పక తాను నిర్మించుకున్న భావనా మందిరంలోనో, 'జలదంపు నీలంపు నిగ్గుల' లోనో కాలముగడిపేస్తున్నారనీ, ''నీ కనుల్ నింగికేరు పరుచు నిచ్చెనలనీ'' అందరూ అన్నారట. ఇది సత్యముకాదనీ తన కనుల్ 'లోకమ్ము దొలిచిచూచు చాకుతుదల'నీ చూపే ఉద్దేశముతో కృష్ణశాస్త్రిగారు వేమనపద్యాలు వ్రాశారు. ఈయనను కలలో ఉత్సాహపరచినకవి'' ''నవ్వింపునవ్వు, మరిమరి కవ్వింపుము కలచు కనలు గర్జింపుము వైదువ్వము రువ్వుము రవ్వల దివ్వెల వెలిగింపు తేటతెనుగు తెరువులన్'' అన్నాడు. ఇతరులను నవ్వించడము కష్టముకాదు. విషనులాగ వడిస్తేనూ నత్తి అభినయిస్తేను, -బాలుర వమకరిస్తేనూ 'నే నైతే, మహాకవినే, నా పద్యాలుమట్టుకు పిరికెవ్వరికీ కొఱికబడవంటేనూ నవ్వుతారు ప్రజ. తానుకూడా నవ్వగలిగేటట్లుగా నవ్వించడము అందము, కష్టము కూడాను. అతిసామాన్యమైపోయిన అవకతవకలను చూపిస్తే నవ్వరు ప్రజ, వెక్కిరిస్తారేమో కూడాను. తనకుమాత్రమే విచిత్రంగా కనబడేదాన్ని వర్ణిస్తే అద్భుత పడతారు ప్రజ, నవ్వరు నవ్వగలిగినంత పరిచయము కల్గించేటట్లు రచించాలి కవి. లేకుంటే, ఏదో చూచివచ్చి కడుపు పట్టుకుని నవ్వేవాణ్ణి చూచినట్టే అవుతుంది చదువరికి.

కృష్ణశాస్త్రిగారు ''కత్తివదరి రాజుకామిని చేపట్టె గంటమొందరి మంత్రి గరితెపట్టె, వేసమునకు మిగిలె పిసాల దుబ్బులే'' అని గర్జించారు, 'కుండలాలవారు పెండిలిపెద్దలు, పింఛనయ్యగారి పెత్తనమ్ము, వరుడు శకటరేఫ అరసున్న వధువయా' అని కలచినారూ, 'పంచదారకంటె పరదారతీయన రాజుకంటె మోజు రంకుమగడు. ఐనదానికంటె కానిది మేలయా అని దువ్వేరూ; ''సకలమతములన్న చక్కని బుక్కులు ఎన్నోను కవివాక్కు లన్నివచ్చు భక్తవరుని తెలివి బ్రహ్మకులేదయా'' అని రువ్వేరూ, ''అపుడు విష్ణుభక్తి అప్పుడు శివభక్తి బ్రహ్మభక్తి యిపుడు బయలుదేరె ఒక్కదేవునకును చిక్కదు విశ్రాంతి'' అని ''మొఘలు పాదుషాలు తుఘలక్ నబాబులు డొక్కచించి తోలుచెక్కి రంచుకుట్టు పాయబయ్య కొట్టు బడాయీలు' అనీ నవ్వేరూ, ''దివ్య గుణములతడు తెగలాగి వర్ణింప తెల్లతెల్లబోయె దేవదేవు, డమ్మబాబోయంచు అవును కాబోలంచు విశ్వదాభిరామ వినురవేమ' అనీ, 'నాటకాలలోన నారివేసము వేయు పురుషునట్లు లుండు పోతురాజు, ఉత్తయుప్పువట్టి యువతీ లలామమే' అని నవ్వించారు. మొత్తముమీద వారిపద్యాలు 'ఆమెకున్న ఆస్తి ఆకలి కడుపైన, అతనికున్న ఆస్తి అవటికాలు. ఇరువురికిని నడుమ విరితూపు తెగిరెరా' అంటూ లోకాన్ని చీల్చిచూపేటివి లని అనవచ్చు. వారు చూపించే ప్రత్యేక వ్యక్తుల అవకతవకల్ని చూచి నవ్వుతాముగాని ఆ వ్యక్తులలో దీపించే మానవ స్వభావపు అవకతవకలను చూచికాదు మనము నవ్వేది. గాథాసప్తశతి సాధించినదదీ. కృష్ణపక్షములోని 'లోకము' 'విరిచేడె' కొంతవరకూ గాథల తత్వాన్ని పరిమళిస్తున్నాయి.

ఈ యిద్దరి రచనలూ చూచేకాబోలు శ్రీ.శ్రీ కి(1945) ''అందంగా మధురస నిష్యందంగా, పఠితృ హృదయ సంస్పందంగా, కందాలొక వంద రచించిందికి మనసయ్యె''నట. శతకమువైపు తిరిగింది గాథాసప్తశతి అనుసరణతో ప్రారంభించిన ఈ ఉద్యమము. చక్రపాణి శ్రీ. శ్రీతో నన్నమాటలు : ''భారద్వాజస గోత్రుడ వారబ్ధనటేశ తాండవాడంబర మంజీరా రవాను రణనస్మేరా ననమూర్త నీవు సిరిసిరిరావూ.'' ప్రబంధ కాలపు పలుకులువచ్చాయి ! శ్రీ. శ్రీ ఉద్యమము ''ఛవిమద్ర సవద్గతులన్ చదివెడు సుదారులకు హృదయతృష్ణ శమింపన్ నవనవమగు శతకము వ్రాసివేయ''డము. ఈయన యత్నము మాత్రము వైచిత్రిని వె లయించడమే అయింది. అప్పటికే దేశీయ కవిత్వాలూ భావకవిత్వాలూ ఆవేశంతోవచ్చి తొక్కుకుపోయాయి. వాటిమీద ఎవరికీ ఆసక్తి కుదరడములేదు. ఆస్థితిలోనే ఈయన ''కుర్చీలు విరిగిపోతే కూర్చోడం మాననట్లు గొప్పరచనలన్ కూర్చేశక్తి నశిస్తే

శతకాలూ - ముక్తకాలూ

చేర్చెద నాకింతచెత్త" నన్నారు. 'పనిలేని యట్టివుంగరి మును కొని మార్జాలశీర్షమును గొరిగెడు తీరున రాస్తానేరో, రాసిన దానికి కోపమేల సిరిసిరిమువ్వా" అన్నారు. కాలక్షేపానికి రాసిన దానిలో కలము చెప్పినట్లు రచన సాగిందా అనికూడా అనిపిస్తుంది. "హిప్పోపొటోమసాక్క బిషప్పును గని యడిగెనిట్లు" స్వామీ! మీ రెల్లప్పుడు చెప్పిందాన్నే చెప్పెద మెంచేత ననుచు సిరిసిరి మువ్వా.' పకారద్వయ ప్రాసవల్ల వచ్చాడా బిషప్పు, కవి ఊహలోనే వున్నాడా అనిపిస్తుంది. అలాటిదే మరొకటి : "భోషాణప్పెట్టెల్లో ఘోషా స్త్రీలను బిగించి గొళ్ళెం వేస్తూ భేషు బలే బీగాలని శ్లేషించెను సాయబొకడు సిరిసిరి మువ్వా." ఇదీ ప్రాసక్రీడయేననిపిస్తుంది.

వేమన్న పద్యాలూ, సిరిసిరిమువ్వ పద్యాలు చూచే కాబోలు కొవ్వరపోలు వెంకట సుబ్బారావుగారు 'చెకుముకిరవ్వా' అన్న అంత్య పదాలతో కందపద్యాలు రాశారు. వీరిరచన ధారాపాతంగా సాగుతుందని "కారేరాజులు ? వారున్నారే ? సిరిగొంచు పోయి నారే? ఎవడీ ధారుణినేలిని వానికి చేరెడి దేమున్నదింక చెకుముకిరవ్వా" అన్నపద్యము సూచిస్తుంది. వీరి ఉద్దేశము మాత్రము "ఈ లొల్లి మెట్ట వేదాంతాలే మన కొంపలెల్ల త్రవ్వెనికైనా మేలుకొనండీ తూరుపుచేలను రక్తనది ముంచె చెకుముకిరవ్వా" అని ప్రబోధించుటకే. "తోవేటి" అన్న కలముపేరుతో, 'పక్షీంద్రా' అన్న అంత్య పదముతో కందాలురాశారు ఎవరో. (శ్రీ. శ్రీ తన సిరిసిరిమువ్వ పద్యాలకుముందు "నీ కొక సిగరెట్టిస్తా నాకొక శతకమ్ము వ్రాసినయమున నిమ్మా" అని ఆంధ్రజ్యోతి మాసపత్రిక సంపాదకుడడిగినట్లు వ్రాశారు.) ఇదేమో "పొగ చుట్టయినా యివ్వని మగస్త్రీ పై శతక"మట. పిసీనమావేడకి కాంక్రీటుగోడ, హల్వాలోహా లొగున, యిన ప్రాక్షర భరితము, స్టారను కందకు దురదంటివాడు, టాకీయను పేకాటకి జోకరు, ఘోర అందము,వంటి అసంప్రదాయములైనా శక్తివంతమైన మాటలు వాడేరీకవి యెవరో.... 'వాస్తవమ్ము నార్లవారి మాట' అన్నమకుటముతో నార్లవెంకటేశ్వరరావుగారు పద్యాలు వ్రాయడానికి వేమనకవిపట్ల వారికిగల భక్తి గౌరవాలే కారణం. వేమనరచనలు సప్తశతి రచనల వంటివికావు. వేమనపద్యాలు సమకాలిక జీవితముమీద ఆయన అభిప్రాయాలు. సప్తశతి పద్యాలు సమకాలిక చిత్రములే, అభిప్రాయములు కావు. వాటినిచూచి అభిప్రాయాలేర్పరుచుకోవడమూ మానడమూ మనవంతు. పై ఆధునికులు సప్తశతిని అనుకరించారని అనలేముగాని సప్తశతి పద్ధతిని ఏ కొంతో దిగుమతి చేసినవారు విశ్వనాథవారే. మిగిలినవారు శతక పద్ధతిని తమ అభిప్రాయాల్నే వెలిబుచ్చారు. అభిప్రాయాలు కవిత కాదు, బోధనము. మన జిజ్ఞాసకవితతోనే బోధనతోకాదు. కనుక ఈ వాఙ్మయమునకు నిన్నమొన్న చేరిన చివురులు పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారి 'శతపత్రము' చూతాము. ఈయన శాలివాహన సప్తశతి అందాన్ని బాగాపట్టుకున్నారు. 'చిన్నదానను ఏమిరాచితివో పసరునిన్ను విడలేను— పట్టెదు పిసరు ఇంట నుండవు— నేడు రేయొండ కొసరునాకు వచ్చెను— ప్రియుడ ప్రాణమ్ము కెసరు'వంటి అమాయిక ముగ్ధ ప్రేమాలాపాలూ, 'మించుబోడిరో ! గుడ్లప్పగించి చూతు నా వయిపు ప్రొద్దు తిరుగుడుం బూవువోలె యాశపడితిని నిన్ను గన్నంతనేను అంతలో నేల యుగుదువే యత్తపత్తి' వంటి శృంగారచేష్టలూ, 'ఒడలు పసిడిచాయ హొయలెల్ల బయలుగా సీమచీరకట్టు చిన్నదాని చేదుకొనుట బదులు చేదుగా జూచెను వడుకునూళ్ళు కట్టువాడు ప్రియుడు' వంటి స్వభావోక్తులూ ఉన్నాయి. 'పేరుపేరున నక్క పెండ్లికొడుకు వందనమ్మిడు పెద్దల వరుసలోను గ్రొత్తగా గాపురమ్మైన యత్తనవతి యాదరమ్మున దీర్ఘాయువని హసించె' వంటి నర్మోక్తులు కొంత తక్కువ. 'గట్టిగా తోడుపెట్టిన గడ్డపెరుగు తీసుకొనివచ్చి బొట్టెను దిట్టె మగడువట్టి జావైన యీ పాడుపడుచు పెరుగు వాడు కనుబెట్టినాడని వగచెభార్య' వంటి నర్మచిత్రాలు చాలా ఉన్నాయి. సప్తశతిలోని అనుకోని ఎదురు తిరుగుళ్లు తొలిభాగానికి అనుకూలములేఅయి చిన్న కథలలోని క్లైమాక్సు(పతాకదశ) వంటివేకాగా ఇందులోనివి యాంటీ క్లైమాక్సు(ప్రతిపతాకలు)గా తయారైనాయి : 'పాట వినుచుండ మూతలు పడెను కనులు తెఱచినను మూసినను నొక్కతీరె నీవు కోకిలమ్మవు, ఇదియు నిక్కువ మటన్న చాన నయనమ్ములయ్యె కషాయితములు,' 'సీమసున్నపు కణిక, నీ చేయిజూచి జారినది గుండె, యోతెల్లచాన! యనిన భ్రష్టుడా! రమ్ము, నా ప్రేమ పాత్రమైన శిలువ, యాశ్రయమిడునని చెలియపలికె ? చక్కగా ఉంది. రెండు నాల్కలపతాక (డబుల్ క్లైమాక్సు) ఇది వినండి ! 'సుందరీ ! యంచు పిల్తురు చూచువారు న్యాయమును జెప్పు! నేను సుందరినె ? యన్న చెలికి, నెదవిప్పి, యామె నెచ్చెలి వచించె, 'పరమసత్యము— నాట్య సుందరివి ! నీవు.'' ఇలాంటిదే ఇంకొకటి ! 'చేరవచ్చువానిం జెంపపెట్టుగగొట్టి తోడచూచె, జారితోడం జూన, చట్టు తగులుచోట జలయున్న దనుమాట నిజము; అపెయయ్యె— సజలనయన.' సప్తశతి శక్తిని బాగాపట్టేరు సుబ్బరామశాస్త్రిగారు. అయితే ఈ కాలానికి తగిన ప్రకీర్ణక పద్యాలు, ఉక్తివైచిత్రికాక భావవైచిత్రిని బింబించే పద్యాలు, శతకములుకాదు సహస్రములు వీరు రాయవచ్చుమ. వస్తువు కావలసినంత ఉన్నది.

వచన ముక్తకాలు

సమకాలిక ప్రపంచాన్ని గమనించి వ్యక్తుల వర్తనా వైవిధ్యాన్ని గుర్తించి తద్వారా గోచరించగల సొగసును చూపించే పద్యాలు చూచాము. భాషను పరిశీలించి మాటల్ని జోడించడమువల్ల బయలుదేరే వింతసొగసులు చూచిన చిత్రకవి తిక్కవరపు పట్టాభిరామరెడ్డిగారు (పఠాభి). అనుప్రాసం సొగసులూ, శ్లేషల సొగసులూ ప్రబంధకవులు చాలా చూశారు. అయితే "పతివ్రతకున్నూ పతితకున్నూ వర్ణభేదము మట్టుకేమ" అనగా విన్నప్పుడు అటులోకంలోని సత్యమూ ఇటుభాష

లోని సత్యమూ మనము ఎరగని సాహచర్యాన్ని ప్రదర్శిస్తాయి. ''ఏని పాటలన్న నాక యిష్టము'' అని విన్నప్పుడు 'అలాగా, పోనీ లెమ్మం'టాము, వెంటనే 'పాటలు వ్రాయటం నాసని' అని వినబడగానే దీని సత్యము ఒకవేపునుంచీ, మాటల తిరగవేత ఇంకొకవేపునించీ వచ్చి కలుస్తాయి. 'ఓపికవాణి నీకుగల యోపిక వాణికిలేదు' అని ప్రబంధకవి హరిశ్చంద్రలో అన్నప్పుడు 'పికవాణి' అన్న పదము సార్ధకమైతే ఈ అందము సమకూడి యుండును అక్కడ. 'రాజాజి'లోని 'రాజి', రామాయణంలోని మాయ, భాగవతములోని భావము (లేదా గతము) రెండుజడల తలలు గదా !

'పఠాభి పంచాగము' అనే వ్రాతప్రతి శ్రీ. శ్రీ. సౌజన్యమువల్ల నాకు చూడలభించింది. 'పఠాభి'గారి స్నేహాన్ని అర్థిస్తూ వారి పంచాగములోని 'కణములు' ఎనవి చేసేస్తున్నాను. ''యుద్ధమ్ము వలన, వసుధలోన, సువర్ణంబులోపించి, వధ మాత్రము నిలంబడి యున్నదట ! 'ద్రవ్యం యావత్తు పోయింది, ద్రవంఅయి' 'ద్రవ్యం'లో 'యా'వత్తు పోతే మిగిలేది 'ద్రవం'కాదా మరి ? 'వెలయాలు చాలాప్రియము, ఆలు చాలా సరసము' 'చిరకాల సత్యము ! 'దంతికన్నా వదంతి పెద్దది' కాదామరి. 'సారాయి తాగినవాడు, షరాయి వీడిపోతున్నా, తాను నయుస్రాయి అనుకుంటాడ'ట. శ్రీ. శ్రీది 'తురాయికంటె ఆకురాయికంటె కీచురాయికంటె హిమాంశురాయి గొప్పవాడు' అన్నరచనపక్కన ఈ రచన అందం చక్కగా కనబడుతుంది.

పఠాభి పంచాంగంలో, 'సిత్యమూ నాకు ఆలు బహువచనంగనే ఇష్టము,' 'గణితంకన్నా మణితము ఇష్టము' 'నాయకుని కావాల్నని ఆసలేదు, వక్క దక్షిణ నాయకునిగా తప్పు' వంటి ఒంటిములికి బాణాలున్నా, 'మందువల్ల యుద్ధంలో మనుష్యులు చస్తారు' వంటి జోడుగుళ్లబారులే యెక్కువ. 'ఇంతి' నడుముసున్నట (ఆ మాటలో నడుము అక్షరము సున్న కాదా ?) 'కరగ్రహణానికి ముందువేలు కావాలంటాడు ఈ నాటి వరుడు' 'నారికీ వారనారికీ మధ్యవారవుంది.' 'వలంటీర్లకు వడకడం తగ్గి ఏకడం హెచ్చింది.' 'పరువు ప్రతిష్టగల ఆట క్రికెట్టు' 'నరుని హృదయములో దయఉన్నది !' ఇదంతా కవిత్వంగా లెక్కగట్టుతున్నావేం అంటే ఇది వచనముకాదు, గద్య కాదు. ఆలోచనవల్ల హాస్యరసోత్పత్తి కలుగుతుంది వీటిలో. ''మాయా ప్రపంచములో మసుచున్నట్టి మానిసియొక్క తిరుగుబాటు సినిమా''ట ! శ్లేషరచన ఆశురచన కవిత్వమంటారే, ఇదికాదా ? ''ఖయాం రుబాయతును సిరాతోకాదు సారాయితో రాశాడు''ట. ''ఝాన్సీదళంలోని కురంగినేత్రలంతా ఫిరంగినేత్రులుగా మారారుట''. ''కాంచనం కాంత కాదంబరి అనేవి జగత్తులో ముక్కాలు, మిగిలింది నేను''ట. ఇది కవిత్వం కాకుంటే మరేది ?

ఈ నడుమ (నవంబరు 62 భారతిలో) దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు 'న్యూ సిలబస్' అన్న శీర్షికతో ముక్తకాలే వచనంలో వ్రాశారు. 'అమెరికాలో డాలర్లు పండును. ఇండియాలో సంతానం పండును.' అంటూ ప్రారంభించారు. 'దరిద్రం సముద్రంలో వేదనల తెరచాపలెత్తి ప్రయాణించే జీవన నౌకలకి మృత్యువే లైట్‌హౌసు.'' అన్నారు మిశ్రరూపకము. 'ఆశ ఉత్తరధ్రువం విధి దక్షిణధ్రువం, మనిషి రెండింటి మధ్యా బంతిలా యెగిరిపడే ప్రహసనం.' అభిప్రాయమే అయినా జీవితసత్యంలాగా మెఱుగుపెట్టారు. 'చంద్రగోళం చవిటి పర్రమీద వెలగ్గా ప్రబంధ నాయికల ఉపాలంభనలు దొరికినవట. విశ్వనాథవారు వెనక్కినడవగా నడవగా వేదకాలం యింకా వెనక్కి వెనక్కి పోయిందట'' అన్నది సిలబస్‌కాదు స్పష్టమే. వచన ముక్తకము పదునెక్కుతున్నది తిలక్‌చేతిలో. 'సుందరాంగుల జాగ్రఫీలో విద్యార్థులునిమ్నోన్నతాలు గుర్తిస్తారు' 'భూమధ్య రేఖకన్న ఆడదాని భ్రూమధ్యరేఖదగ్గర వేడిఎక్కువ' అన్నవి సప్తశతి పద్యాలకు దగ్గర. ఒకవిధమైన నడక వీటికి సామెతలపాటి దీర్ఘాయువు నిస్తుంది.

శా. చోళ ద్రావిడ పాండ్యరాజ్య మహీభృత్ శుద్ధాంత కాంతావయః
కేళీసక్తత దంగ రాగిత కురంగీ నాభినీలీభవ
ల్లీలావారి భవాభి రామయయి కాళిందీనదిం బోలుచున్
గ్రాలుం భూనవవేణికా విధమునన్ గావేరి లీలావతీ!

— నారవ సూరన వనమాలి విలాసము.

పరిష్కారం

శ్రీ సింగరాజు రామచంద్రమూర్తి

వరండాలో కూర్చునుంది పద్మావతి. కాంపౌండులో రకరకాల వయస్సు పిల్లలు ఆడుకుంటుంటే వాళ్ళతోపాటు తనూ లీనమయిపోయింది అందులో—వాళ్ళకి సలహాలిస్తూ!

ఎవరు ఎక్కువదూరం దూకగలరోనని పందెం వేసుకుని ఒక్కొక్కరే పరుగెత్తుకుంటూవచ్చి బరిమీద పాదం వేసి ఎగిరి దూకుతున్నారు. అంతవరకు ఎక్కువదూరం దూకిన వాళ్ళకి మట్టుకు మట్టిలో ఒక గుర్తు పెట్టిస్తోంది పద్మావతి. ఎవరయినా తప్పుగా అడుగువేస్తే చెప్పడం కూడా ఆవిడ వంతే కావడాన నిశితంగా వాళ్ళని పరిశీలిస్తోంది.

అందరూ అయిపోయారు. అంతలో పద్మావతికి వెనక పక్కగా ఆమె కొంగు పట్టుకుని నిలబడ్డ బాబు గభాలున ముందుకొచ్చి, "నే గూడా దూకుతా!" అన్నాడు ఆమెతో.

ఫక్కున నవ్వొచ్చింది ఆవిడకి.

"నువ్వు దూకలేవుబాబూ" అంది వాడిచేత ఆ ప్రయత్నం మానిపించే ప్రయత్నంలో.

"విసిం దూకలా—నే గూడా దూకుతా!"

విసిం అంటే విశ్వం అన్నమాట. వాడు బాబుకన్న కొంచెం పెద్దవాడు.

"నువ్వు అందరికన్న చిన్నవాడివి బాబూ! అనిక మనిద్దరం దూకుదాం—సరా?"

కాని, వాడికి ఆ 'చిన్నితనం' ఏమిటో అంతుపట్టలేదు. పైగా తన్నేదో అవమానించేస్తున్నట్టుగా అనుమానం కూడా వచ్చింది. దాంతో ఏడుపు ప్రారంభిద్దామని కింది పెదవి విరిచాడు. వాడి ప్రయత్నం గబుక్కున కనిపెట్టేసింది పద్మావతి.

"సరేరా నా తండ్రీ, దూకుదుగాని పద" అని తను కూడా లేచి వాడిని వెంట పెట్టుకుని బరి దగ్గరకు తీసుకుపోయింది.

వాడి నక్కడ నుంచోపెట్టి "దూకు" అంది.

కాని వాడి కది నచ్చలేదు. "పలుగెత్తాలి!" అన్నాడు.

ఫకాలున నవ్వేసింది పద్మావతి. "సరే, పరుగెత్తుకురా. నేను ఇక్కడే ఉంటా" అంది.

వాడు ఒక ఇరవయి గజాలు వెనక్కి వెళ్ళాడు. పిల్లలందరూ వాడు దూకలేకపోతే ఏడిపించేద్దామని సిద్ధంగా ఉన్నారు.

"ఊ! ఇక చాల్లే, పరుగెత్తుకురా" అంది పద్మావతి.

వాడు పరుగెత్తడం మొదలెట్టాడు. కాని, తీరా బరి దగ్గరకు వచ్చేసరికి లాగువూడి జారిపోయి, కాళ్ళకి అడ్డంపడి కిందపడబోయాడు. గభాలున పట్టుకుంది పద్మావతి.

అందరూ గొల్లున నవ్వేశారు.

బాబు బావురుమని ఏడుపు లంకించుకున్నాడు. పద్మావతి కూడా మరీ నవ్వితే వాడు ఇంకా ఏడుస్తాడని, అందరినీ నవ్వద్దని కసిరి, గభాలున వాడిని ఎత్తుకుని లాగు తొడిగింది.

"ఏం జరిగిందినాన్నా" అంటూ హడావుడిగా వచ్చింది బాబు వాళ్ళ అమ్మ.

"ఏంలేదండి అక్కయ్యగారూ! వాడు కూడా దూకుతానన్నాడు. తీరా పరుగెట్టేసరికి లాగువూడిపోయింది" అంటూ పకపక నవ్వింది పద్మావతి.

కాని, తల్లికిమాత్రం వాడి కళ్ళనిండుకున్న నీళ్ళు చూస్తే నవ్వు రాలేదు. మాట్లాడకుండా ఎత్తుకుని లోపలికి తీసుకెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్ళిన దిక్కే చూస్తూ, ఉస్సురని నిట్టూర్చింది పద్మావతి.

అప్పుడేవచ్చి, ఈ ఆఖరి దృశ్యాన్ని చూసిన ఆనందరావు పద్మావతి భుజంమీద చేయివేసి, "లోపలికిపోదాం పద" అంటూ మెల్లిగా కదిపాడు........

ఒక్కసారి నీటి తెరలగుండా అతనివంక చూసింది పద్మావతి. మాట్లాడకుండా తలవంచుకుని లోపలికి నడిచింది. ఆనందరావు ఆమెను అనుసరించాడు.

సోఫాలో కూర్చుని బూటు లేసులు విప్పుకుంటున్న ఆనందరావు మనస్సులో మళ్ళీ ఇందాకటి సన్నివేశం మెదిలింది. పద్మావతిమీద జాలి కలిగింది. ఆలోచనల్లోకి జారిపోయాడు.

"డబ్బు లాగానే సంతానం కూడా కావలసినవారికి ఉండదు. అక్కరలేనివాళ్ళకి కుచేల సంతానం కలిగిస్తాడు భగవంతుడు.

తను కాపురంలో 'లోటు' అనేదిలేదు—పిల్లలు లేకపోవడం తప్ప. తనకి పెద్ద హోదాగల ఉద్యోగం, కారు—అందమయిన మేడలో ఉండటం అందంలో తను చాలా బాగా ఉంటాడని చాలామంది అభిప్రాయం. ముఖ్యంగా తనతో చదువుకున్న ఆడపిల్లలు తనతో మాట్లాడాలని అభిలషించే వారు—అదే తన అందానికి గీటురాయి. రెండు 'ల' కారాలు దాటే పొలాలు వగయిరా లున్నాయి. రొష్టుపెట్టని తలితండ్రులు.

ఇక పద్మావతిమాత్రం......తను కేవలం ఆమె అందాన్ని చూసే చేసుకున్నాడు. దానికితోడు చదువుకున్నది. 'చిలకా గోరింకలు' అన్న పేరు సర్వ విధాలా సార్థకంచేసే దాంపత్యం తమది. కాని, ఒక చిలకపిల్ల లేకపోవడమే నలుగురికీ కనబడే లోపం!

అదే పద్మావతి దిగులు కూడా!....

''మనం ఒకటయి ఇంకా నాలుగేళ్ళయినా కాలేదు—అప్పుడే అంతగా దిగులుపడితే ఎలా పద్మా! అసలు ఇంగ్లీషు వాళ్ళ పద్ధతి ఏమిటో తెలుసా? అయిదారేళ్ళపాటు పిల్లలుండకుండా స్వేచ్ఛగా విహంగాల్లా గడిపేయడం. అప్పుడు ఈ జీవితంలోకి మరొక ఆకర్షణ ప్రవేశపెట్టుకోవడానికి సంతానం, వాళ్ళతోటి బాదరబందీ!'' అని ఎన్ని నచ్చచెప్పినా పద్మావతికి తలకెక్కవు. ఆమెకి కావలసింది ఇంట్లో సరదాగా తిరిగే పిల్లలు! వాళ్లే లేనప్పుడు లోకంలోని సౌఖ్యాలన్నీ అందుబాటులో ఉన్నా ఆమె కేదో వెలితి ఉండనే ఉంటుంది.

అందుకనే తామే వూళ్లో ఉన్నా, ఇంటిచుట్టు పక్కల నున్న పిల్లలెప్పుడూ పద్మావతిచుట్టూ ఉండేవారు. వాళ్ళని తనవైపుకు ఆకర్షించుకునేందుకు ఆమె పడేపాట్లు చూస్తుంటే తనకి ఒక్కొక్కసారి నవ్వు కూడా వస్తూంటుంది. ఇంటినిండా బిస్కట్లు, చాకలెట్లు ఉంచుతుంది, ఎప్పుడూ తియ్యకుండా. ఇద్దరూ కలిసి బజారుకి వెళ్ళినప్పుడు బిస్కట్లుకొంటుంటే ఆమెని కేవలం ఏడిపించాలని అడుగుతుండేవాడు తను, ఎందుకు పద్మా, ఇన్ని చిరుతిళ్ళు. మనం ఇద్దరమేగా'' అని.

అందుకు నవ్వేసి, ''నాకు చిన్నతనంనుంచి ఇవి అలవాటండీ, అంతగా ఈ ఖర్చు మీరు భరించలేనంటే మా నాన్నకి రాస్తాను—నాకు బిస్కట్లకి డబ్బివ్వడంలేదు నాన్నోయ్ అని'' అనేది

''నిన్ను నాకు అప్పజెప్పేప్పుడు ''మా అమ్మాయికి మొండి పట్టుదల కొంచెం ఎక్కువ నాయనా, గారాబంగా పెరిగింది'' అన్నారేగాని, ఈ విషయం చెప్పలేదు సుమీ !'' అని ఫక్కున నవ్వేసేవాడు తను.

ఈ ఇంట్లోకి వచ్చి సంవత్సరం దాటుతోంది. రోజూ మధ్యాహ్నం పూట పిల్లలందరినీ పోగుజేసి బిస్కట్లపార్టీ పెడుతుంటుంది పద్మావతి. ముఖ్యంగా ఆమెని ఆకర్షించినవాడు పక్కింటివారి బాబు.

''మన అదృష్టం బాగుండి, ఇటువంటివాడు పుడితే నా స్వామికి నిలువు దోపిడ ఇవ్వనూ'' అంటుంది వాడిని ఎత్తుకుని.

కాని, తనకిమాత్రం వాళ్ళనెవరినీ చూడ బుద్ధికాదు.

ఇలా పిల్లలమీది వెర్రి మోజుతో అప్పుడప్పుడూ కొన్ని మాటలు కూడా పడిందికాని, ఆ వ్యామోహంలో పట్టించుకోదు.

ఒకసారి బీచీ సెంటరులో పిల్లల ప్రదర్శన పెడుతుంటే తా మిద్దరికీ ఆహ్వానం వచ్చింది. సరిగా బయలుదేరే ముందు ఆమె కెందుకు తట్టిందో గభాలున పక్కింటి వారింటికి పరుగెత్తి బాబుని ఎత్తుకొచ్చింది. తన కర్థమయిపోయింది ఆమె ప్రయత్నం. కాని కాదంటే కష్టపడుతుందని తాపీగా మళ్ళీ సోఫాలో కూలబడ్డాడు.

అక్కడనుంచి వాడికి ముఖం రుద్దింది, మేకప్ చేసింది. వాడికోసమని మిషన్‌మీద ఇదివరకే కుట్టిన బట్టలు తొడిగి ఎత్తుకుని ''బయలు దేరండి'' అంటూ వెళ్ళి కారులో కూర్చుంది.

మాట్లాడకుండా కారు స్టార్టు చేశాడు తను.

ఆ పిల్లల పోటీలో బాబుని కూడా పెట్టింది పద్మావతి. బొద్దుగా, అందంగా ఉన్నాడేమో—వాడికే మొదటి బహుమతి వచ్చింది.

పద్మావతి ఆనందానికి అంతులేదు. కాని, తనకిమాత్రం మనసులో పీకుతూనేఉంది. పరాయి పిల్లాడ్ని ఇలా నలుగురిలోకి తెస్తే వీడికి కాల్లో ముల్లుగుచ్చుకున్నా మాట పడాలసివస్తుంది.

తను భయపడినంతా అయింది. ఇంటికొచ్చి, వాడె ఎత్తుకుని, ప్రైజు పుచ్చుకుని గర్వంగా పక్కింటి కెళ్ళిన పద్మావతి వాడిపోయిన ముఖంతో తిరిగొచ్చింది. లాలించి ఆరా తీస్తే తేలిన విషయం—వాడికి ఒళ్ళు కొద్దిగా వెచ్చబడిందని, నలుగురిలోకి తీకుకెళ్ళడంవలన దృష్టి కొట్టి జ్వరం వచ్చినటు వాళ్ళఅమ్మ అన్న దనీను.

నిజానికి తను చాలా రోజులుగా చూస్తున్నాడు—బాబుని పద్మావతి గారాబం చేయడం. వాడు కూడా స్వంత తల్లిదగ్గర కన్నా పద్మ దగ్గరే చనువుగా ఉండటం వాడి తల్లికి నచ్చనటు ఆ ముఖంలోనే స్పష్టంగా అగపడేది. అది సహజం కూడా! తల్లి తన పిల్లల ప్రేమంతా తనమీదే కేంద్రీకృతమవాలని కోరుకుంటుంది. అందులో ఇతరులు ఏమాత్రం భాగం పంచుకున్నా సహించదు, సహించలేదు.

కాని, వాడిని పద్మావతికి ఇవ్వకుండా ఉండలేదు కూడా ఆవిడ— కారణం వాడికి పద్మచేసే పోషణ. వాడీనాడు ఇంత ఆరోగ్యంగా ఉన్నాడంటే అందుకు పద్మావతే బాధ్యురాలు. రోజూ ఉదయం వాడిని ఎత్తుకొచ్చేసి, హార్లిక్స్ పెడుతుంది. ఖరీదయిన బిస్కట్లు పెడుతుంది. సరే, వాడికోసం రక రకాల బట్టలు కుడుతుంది. ఒక్కొక్కరోజున వాడిని ఆడపిల్లగా తయారు చేయాలని మనస్సుపుడితే అప్పటికప్పుడు పరికిణీ, జాకెట్టు తయారుచేసి వాడికి, తొడిగి, కళ్ళనిండా కాటుకపెట్టి తన సరదా తీర్చుకుంటుంది.

చిత్రమేమిటంటే అలా వాడికి కుట్టిన బట్టలు మళ్ళీ ఆమె కంటబడవు. ఆ విషయం పద్మావతి పట్టించుకోదు కూడా!

ఇన్ని లాభాలున్నందువలననే పద్మావతి బాబుని తీసుకు వస్తుంటే లోపల ఎంతగా అయిష్టంఉన్నా, బయట పడదు. ఆవిడ!

తనకీ విషయాలన్నీ తెలుసు. కాని, పద్మ సరదాలకి తను ఎన్నడూ అడ్డురాడు. ఆమె మనస్సు కష్టపడితే తను సహించలేడు!

ఈ సమస్యని ఒక రకంగా పరిష్కరించేందుకు మార్గం తను అనుకున్న ప్రకారం నడవడమే. కాని ఆమాట అందా

మంటే పద్మ ఏమనుకుంటుందో నన్న భయం పరిష్కారాన్ని వాయిదా వేయిస్తోంది.

ఆలోచనల్లోంచి బయటపడిన ఆనందరావుకి పద్మావతి జాప్యం ఆశ్చర్యాన్ని కలిగించింది. గభాలునలేచి, వంటింట్లోకి వెళ్ళాడు.

స్టవ్‌మీది నీళ్ళు మరిగిపోతున్నాయి. అదేమీ పట్టనట్టుగా నీలంగా వెలిగే ఆ మంటల్లోకి తదేకంగా చూస్తోంది. ఆమె ముఖంలోని విచారంచూసి భయపడ్డాడు ఆనందరావు. మెల్లిగా వెళ్ళి ఆమె భుజంమీద చేయి వేశాడు. ఉలిక్కి పడింది.

''ఎందుకు రాణీ, ఆ పరధ్యానం? అలా బయటికి పోదాం రా—ఏదైనా పిక్చరుకి.''

మాట్లాడకుండా కాఫీనీళ్ళు దించి, ఫిల్టర్‌లోపోసి, పాలు ఎక్కించింది. ఒక్కక్షణం ఆలోచించాడు ఆనందరావు—

''చూడు పద్మా! పరాయి పిల్లలు మన పిల్లలెలా అవుతారు? వాడిని మనం ఎంతగా గారాబం చేసినా 'అమ్మా' అని ఆవిడ్నే అంటాడుగాని నిన్నునడుగదా!'' అన్నాడు.

ఆశ్చర్యంతో అతనివంక చూసింది పద్మావతి.

ఖంగారుపడ్డాడు ఆనందరావు. కాని తను చెప్పవలసిన దానికి ఇదే అదును అనిపించింది అతనికి.

''మనకి పెళ్ళయి ఇంకా నాలుగేళ్ళయినా కాలేదు—అప్పుడే ఏదో వయసుడిగిపోయిన వాళ్ళలా పిల్లలకోసం అలా దిగులు పడతావేం? అయినా ఇప్పటినుంచి పిల్లలు, ఆ జంజాటంలో నువ్వు పడిపోవడం నేను సహించలేను. కాని ఇల్లు నిండినట్టు ఉండాలంటే పిల్లలే అందం అంటారు మరి. ఆ మాట నిజమే. ముఖ్యంగా నే నింట్లో లేనప్పుడు నీకు బాగా కాలం గడుస్తుంది. అందుకనే నా కొకటి అనిపిస్తోంది''—ఆనేశాడు.

''ఏమిటి?'' అనడిగింది పద్మావతి కుతూహలంతో.

''ఎవరినయినా పెంచుకుంటే?''

తెల్లబోయి చూసింది అతనివంక.

''అదికాదు పద్మా నే ననేది—'పెంపు' అంటె నా ఉద్దేశం అదికాదు. అనాథ శరణాలయాల్లో అందమయిన పిల్లలుంటారు. రక రకాల వయస్సుల వాళ్ళుంటారు. అందులో మనకి కావలసినవారిని ఏరుకోవచ్చు. వాళ్ళు మనతో కలిసిపోతే చేసుకోవచ్చును. లేకపోతే మళ్ళీ వాళ్ళకి అప్పజెప్పేయచ్చు. దీనివలన మనకి లాభం కూడా ఉంటుంది. నిజంగా ఎవరి దగ్గరినుంచో దత్తతకి తీసుకున్నామనుకో—వాళ్ళు చూసేది కేవలం మన ఆస్తిని. ఆస్తిమీద కన్నేసే మనకి పిల్లల్ని ఇస్తారు. సరే! ఆ తరువాత మన అదృష్టం బావుండి, మనకి ఒక పాప పుడితే అప్పుడు వీళ్ళ నిజ స్వరూపాలు బయట పడతాయి. కేవలం ఆస్తినిచూసి, ఇచ్చినవాళ్ళు మన ఆస్తికి వారసులు పుట్టగానే రాక్షసుల్లాగా ప్రవర్తించేందుకు వెనకాడరు. అది ప్రమాదం కూడా! కాని, ఈ అనాథ శరణాలయంనుంచి తీసుకు వచ్చిన పిల్లలకి మన ఆస్తిమీద ఎప్పుడూ ఎటువంటి హక్కు ఉండదు. మనం ప్రేమగా పెంచితే మన కన్నబిడ్డలా కలిసిపోతారు. ఒక పని చేసే పిల్లగా పెరగమన్నా పెరుగుతారు. అంతా మన మనస్సులమీధ ఉంటుంది. దిక్కులేనివాళ్ళకి కావలసినది ఆదరణ మాత్రమే.''

మాట్లాడకుండా వింటోంది పద్మావతి. ఆమె ముఖం లోని ప్రసన్నత అతనికి మరింత ధైర్యానిచ్చింది.

''ఇందులో కేవలం స్వార్థం—అంటే కొంతలో కొంత మనకి పిల్లలు లేనికొరత తీరడంతోపాటు పరమార్థం కూడా ఉంది. ఒక అనాథనితెచ్చి, వ్యక్తిగా నలుగురిలోనూ నిలబడేట్టు తయారు చేద్దాము. మనకి భగవంతుడు అలా చేయగల ఆర్థిక స్తోమతు నిచ్చాడు. నీఇష్టం—ఆలోచించుకో'' అన్నాడు.

పద్మావతి కాఫీ కలిపి అతనికి కప్పులోపోసి, చేతి కందించింది. ఆనందరావు ఆమె అభిప్రాయంకోసం ఎదురుచూస్తూ కాఫీ గుటకలు వేయసాగాడు.

క్షణాలు భారంగా నిమిషాలుగా మారుతున్నాయి.

చివరికి పద్మావతి తలెత్తి, ''సరే మీ ఇష్టం!'' అంది.

''అలా అంటేకాదు పద్మా, ఇది కుక్కపిల్లని పెంచినట్టుకాదు. కొంత ఆనందంతోపాటు, కొన్ని బరువు బాధ్యతలు కూడా స్వీకరించాలి మనం. అందుకు నువ్వు, సిద్ధంగా ఉన్నావా?''

''ఊఁ! సిద్ధంగా ఉన్నాను. నేను పిల్లలమధ్యన పెరిగాను. నాకు కావలసింది ఇంట్లో పిల్లల సందడి'' అంది తలవంచుకుని.

ఆనందరావుకి చాలా సంతోషం కలిగించాయి ఆ మాటలు. గబుక్కున ఆమెకి దగ్గరగా జరిగి, ''రాణిగారిది చాలా జాలి గుండె. అనాథ సంరక్షణి, చల్లని తల్లి'' అన్నాడు ఆమెను చేతో చుట్టేస్తూ.

''రేపు పెంపకంపిల్ల వచ్చిన తరువాత మీ కిటువంటి అవకాశాలు ఉండవు జాగ్రత్త'' అని ఫక్కున నవ్వింది పద్మావతి.

''పెద్దవాళ్ళు మాట్లాడుకుంటుంటే, చిన్న పిల్లలు లోపలికి రాకూడదు అని ఆర్డరు వేసేయనూ!'' అని ఆమె ముక్కు పుచ్చుకుని ఊపి లేచాడు ఆనందరావు.

''ఇంతకీ నీ కే పిల్ల కావాలోయ్?'' అన్నాడు మళ్ళీ దగ్గిర కొచ్చి.

''ఛీ. ఛీ. అవేం మాటలు!'' సిగ్గుపడింది పద్మావతి.

''అదికాదు మాడమ్. వీళ్ళు రెడీమేడ్‌గదా! మగపిల్లాడయితే హాయిగా బాధ ఉండదు.......వెడదాంరా నువ్వు కూడా!''

ఒక్కసారి ఆలోచించి, ''నేను రానులెండి—వచ్చినకాడినుంచి ఒకడిని తెచ్చి, మిగిలిన వాళ్ళని అక్కడే వదిలేస్తే నా మనస్సుకి బాధగా ఉంటుంది—వాళ్ళకేదో అన్యాయం చేసేసినట్టు......అందమయిన కుర్రాడిని—బాబులాగా ఉండాలి—తీసుకురండి'' అంది.

''ఆల్‌రైట్. రేపు మంచిరోజు'' ఈలేసుకుంటూ వెళ్ళిపోయాడు ఆనందరావు.

అతనివంకే చూస్తూండిపోయింది పద్మావతి.

పరుగెత్తుతున్న ఆలోచనలని బలవంతాన ఆపుకుంటోంది.........ఎటువంటివాడు వస్తాడో—ఎలా ఉంటాడో? ఎంతగా అనాథ అయినా తన దగ్గరకు వచ్చినాక వాడు దిక్కులేనివాడు ఎలా అవుతాడు!

తనవాళ్ళంతా (హేళన చేస్తారేమో? చేయనీ తనకి మాత్రం భయం ఏమిటి?'' ''జాలేసి పెంచుతున్నాం'' అంటుంది తను. ఆ మాటకివస్తే ఇదివరకు ఈ విషయంమీద తనెన్నిసార్లు ఇరుకున పడలేదు.

ఒకమాటు అన్నయ్య మరదలి పెళ్ళికి వెడితే, వదినలు, అక్కయ్యలు అంతా చేరారుకదా అని తనూ కూర్చుంది వెళ్ళి ఆ గదిలో. వాళ్ళ మాటలు అలా అలా పిల్లలమీదికి మళ్ళి ఎవరి పెద్దాడు ఎంత చిలిపివాడయిందీ, చిన్నాడి చురుకుదనం, బుల్లాడి మంకుతనం—వగయిరాలమీద జోరుగా సాగిపోయింది సంభాషణ. తను వింటూ మాటాడేప్పుడు వాళ్ళ కవళికలను చూస్తూ కూర్చుంది. ఎవరికివారే ఇతరుల పిల్లల విషయాలు వింటున్నట్లే నటిస్తూ, తమ పిల్లల గురించి చెప్పే అవకాశం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. అది చూసి, తనకి నవ్వొచ్చి ఫక్కున నవ్వేసింది.

''నవ్వులాటవమ్మా! నీకేం మొగుడ్ని బుట్టలో పెట్టేశావు. అత్తగారి ఆరడిలేదు. ముఖ్యంగా ప్రాణం తీసి క్షణం తీరిక లేకుండా చేసేందుకు పిల్లలులేరు. ఏనాడో పెట్టిపుట్టావు ఈనాడు అనుభవిస్తున్నావు'' అంది చిన్న వదిన.

తన మనస్సు చివుక్కుమంది. ముఖ్యంగా ఆఖరి మాటలకి. ఏదో వంకచెప్పి లేచి వెళ్ళిపోయింది. తరువాత అన్నయ్య వదినను చీవాట్లు కూడా వేశాడుట పాపం!

పెంచటంతో కనీసం తనూ, మిగిలిన వారితో సమంగా మాట్లాడవచ్చు. ఒక్కొక్కసారి ఈ పెంచుకున్న పిల్లలు వచ్చిన వేళా విశేషం బాగుంటే........సిగ్గుపడి నవ్వుకుంది......

* * * *

గుమ్మంలోనే ఆపి, కుర్రాడ్ని దింపమంది పద్మావతి. నిలబడిన వాడినిచూసి మురిసిపోయింది. గులాబీపూలు మింగినట్లుగా బుగ్గలంతా ఎరుపే! పైగా సొట్టలు.

వాళ్ళిద్దరివంక నిశితంగా చూస్తున్న ఆనందరావు తృప్తిగా నిట్టూర్చి, లోపలికి వెళ్ళబోయాడు.

''ఆగండి, కలిపి దిష్టి తీయాలి'' అని ఇద్దరినీ నిలబెట్టి గుప్పెడు ఉప్పు తీసేసింది. వాడిని దగ్గరగా తీసుకుని, ''నీ పేరేమిటి బాబూ'' అనడిగింది.

వాడు బిక్కముఖంపెట్టి, ఆమెనుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తూ, ''మాధవ'' అన్నాడు.

''దొరబాబులా ఉన్నాడు'' అంది ఆనందరావుతో.

మాట్లాడకుండా షర్ట్ బటన్స్ విప్పుకుంటూ, నిలబడ్డాడు ఆనందరావు.

ముద్దు పెట్టుకోబోయింది పద్మావతి మాధవుడ్ని. ఆమెని ఒక్కతోపు తోసేసి, ఏడుపుముఖంతో ఆనందరావు దగ్గరకు పరుగెత్తాడు వాడు.

''తప్పునాన్నా! అమ్మ బిస్కట్లు పెడుతుంది వెళ్ళు'' అన్నాడు ఆనందరావు. కాని వాడు అతని పాంటు పట్టుకుని అలానే నిలబడ్డాడు.

పద్మావతి వాడిని మచ్చిక చేసుకువేందుకు వాడి రాక కోసం ప్రత్యేకంగా చేసిన తినుబండారాలు పట్టుకొచ్చి, ''మాధవా, ఇటు రా. తాయిలాలు పెడుతా'' అని పిలిచింది.

''ఊహు నేను రాను'' అన్నాడు వాడు బుంగమూతి పెట్టి.

''నువ్వు రాకపోతే నేనే వస్తాను నీ దగ్గరకు'' అని వాడిని బలవంతంగా లాక్కుని ఒళ్ళో పెట్టుకుని ఒక్కొక్కటి నోటికి అందిస్తూ, ''చూడు నాన్నా, నన్ను ఇకనుంచి 'అమ్మా' అని పిలవాలి. ఆయన్ని ''నాన్నగారు'' అనాలి. తెలిసిందా? నీకేం కావలసినా నన్నడగాలి'' అంది.

కాని వాడివేమీ వింటంలేదు. తినడంలో నిమగ్నమయిపోయాడు.

''ఎంతంట వయస్సు?'' అనడిగింది ఆనందరావుని.

''నాలుగోఏడు''

''ఖచ్చితంగా తెలుసా మీకు?''

కొంచెం తటపటాయించాడు ఆనందరావు. ''వాళ్ళు చెప్పడమేకదా! మన కెలా తెలుస్తుంది? పుట్టిన తేదీ ఇవ్వరు గాని, వయస్సుమాత్రం సుమారుగా ఇస్తారు. వీడి విషయంలో పుట్టిన తేదీ కూడా ఇవ్వగలిగారు.

''చిన్నినోరు సున్నాలాగాఉంది వెధవాయిది! ఈ లడ్డు ఎలా పడుతుందో వీడి నోట్లో!'' అని పకపక నవ్వింది.

తన్నేదో ఎక్కిరించేస్తోందని అనుమానం వేసినట్లుంది. వాడు గభాలున లేచి, ఏడుస్తూ, ఆనందరావు దగ్గరకు పరుగెత్తాడు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

''ఇక వాడికి త్రైర్‌కొట్టి వశపరుచుకో. నా డ్యూటీ అయిపోయింది.''

ఎలాగయినా వాడిని పూర్తిగా వశపరుచుకుని, తనే సర్వస్వంగా వాడు తనమీద ఆధారపడితే బాగుండునని ప్రయత్నించసాగింది పద్మావతి. వాడికి రక రకాల బిస్కట్లు పెట్టడం, వాడు ఏ వస్తువువంక చూస్తుంటే అది వాడికి తెచ్చిఇవ్వడం వంటివి ఇందుకు ఆమె ప్రయత్నాల్లో కొన్ని. వాడిని వెంటేసుకుని బట్టలకొట్లన్నీ తిరిగి, రక రకాల బట్టలుకొని కుట్టేది. కాని, వాడు రాను రాను తనకు దగ్గర రాకపోగా, దూరం కూడా అవుతున్నాడేమోనని అనుమానపడసాగింది ఆమె.

కేవలం తనేమయినా అంటుందేమో నన్నట్లు తాను తినమన్నవన్నీ తినడం, వేసుకోమన్నవన్నీ వేసుకోవడం తప్ప, నోరు తెరిచి ఏదీ కావాలని వాడు అడగకపోవడం పద్మావతికి

ఎంతో లోపంగా అనిపించేది. వాడు తన వేదో దూరం చేస్తున్నటు గా బాధపడసాగింది.

ముఖ్యంగా ఆమె ప్రయత్నించినా సాధించలేనిది వాడిచేత "అమ్మా" అనిపించుకోవడం. ఎలాగయినా వాడిచేత ఆమాట అనిపించుకోవాలని ఒక్కొక్కసారి చాలా తీవ్రంగా ప్రయత్నించేది. ఒకరోజున అన్నం పెట్టడం మర్చిపోయినట్లుగా తనమట్టుకు తను చదువుకుంటూ కూర్చుంది. కాని చెవులు మాత్రం వాడి పిలుపుకోసం ఎదురు చూస్తున్నాయి.

వాడు విసుగు పుట్టేంతవరకు బొమ్మల్ని ముందేసుకు కూర్చున్నాడు. ఇక అక్కడినుంచి ఆకలి ఎక్కువయినట్లుంది—లేచి, మెల్లగా ఆమె దగ్గరకెళ్ళి నిలబడ్డాడు. పట్టనట్లుగా చదువుకోసాగింది. ఇక లాభం లేదనుకున్నట్లున్నాడు. తలవంచుకుని, "ఆకలేస్తోంది" అన్నాడు మెల్లిగా

వాడి పట్టుదలకి నవ్వొచ్చింది పద్మావతికి. కాని మళ్ళీ వాడు మాట్లాడక పోయేసరికి తలెత్తి వాడివంక చూసింది.

ఎర్రటిముఖం వాడిపోయిన గులాబి పువ్వులాఉంది. కాళ్ళు బలువుగా వాలుతున్నాయి. జాలేసింది. తనమీద తనకే కోపం వచ్చింది పద్మావతికి.

గబుక్కునలేచి "పద నాన్నా మరిచిపోయాను" అంటూ వెంటబెట్టుకుని తీసుకుపోయింది లోపలికి.

వాడు వచ్చిన రోజునే వెంటేసుకుని చుట్టుపక్కల తా వెరుగున్న వాళ్ళ అందరి ఇళ్ళకు తిప్పింది. ఆమాట విన్న ఆనందరావు నవ్వుతూ అన్నాడు, "నువ్వేదో కొత్త వస్తువు కొనుక్కున్నట్లుగా ఆ ప్రదర్శన ఎందుకో? వాడెవడంటే ఏం చెప్పావుమరి?"

"ఇందులో ఎగ్జిబిషన్ ఏముందిట? ఇకనుంచి వీడు మా అబ్బాయి—తెలుసుకోనండహో అని' చెప్పి వచ్చాను—అందులో తప్పేముందిట? పెళ్ళిలో మనిద్దరినీ ఎందుకుట కారులో ఎక్కించి వూరంతా వూరేగించారు—"ఇదుగో ఈ అమ్మాయి ఇకనుంచి ఈ అబ్బాయితో తిరుగుతూంటుంది. వాళ్ళు మీకంటబడినప్పుడు మరేమీ అనుకోకండి" అని చెప్పేందుకు. అలాగే ఇదీను" అని కాసేపాగి, "అందరూ ఏమన్నారో తెలుసా?" అనడిగింది.

"మీ అబ్బాయి కబుర్లేకానీ, నాకు కాఫీ ఏమయినా—"

"చెప్పేది వింటేనే!......అచ్చం వాడు మీ పోలికేనట. "ముమ్మూర్తులా మీ ఆయన పోలికేనమ్మా పద్మా! అసలెందుకు, నువ్వు చెబుతే తెలుసుకుంటారుగాని లేకపోతే నీ సొంత కొడుకే ననుకుంటారు" అంది మా సూర్యం అత్తగారు. అందరూ అదేమాట!"

"అయితే వాడిఖర్మ. వాడినీ, నన్నేడిపించినట్లే ఏడిపిస్తావన్నమాట!" అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

"అబ్బో! మీ ప్రాణం తీస్తున్నానుకదూ?........ వాడంటే అందుకే నాకు అంత ప్రేమ!" అంది గోముగా అతని వంకచూసి.

"ఇంతకీ 'అమ్మా' అనిపించుకున్నావా?"

"మిమ్మల్ని 'బాబాయి' అనిపించుకుంటున్నారుగా—నన్నా 'పిన్నీ' అంటాడు కాబోలు" కొంచెంసేపు ఎవరూ మాట్లాడలేదు తరువాత.

"అయితే మీ చెల్లెలి పెళ్ళికి వీడినీ తీసుకు వెడతున్నావా—ఆ అభిప్రాయం మార్చుకున్నావా?" అనడిగాడు ఆనందరావు.

"అంత అనుమానం ఎందుకు వచ్చిందో? నేను వెడుతుంటే వాడు రాడూ! అయినా "తీసుకు వెడుతున్నావా" అంటున్నారు దొరగారు దయ్యచెయ్యరా?"

"అదికాదు పద్మా—వాడిని తీసుకెడితే నీకు లేనిపోని బాదరబందీ. పైగా.......బాగుండదేమోనని"

"మరేం బాధలేదు—నాకు లేని దిగులు మీకెందుకుట?"

* * * *

ఊరెళ్ళి తిరిగిన వచ్చిన పద్మావతికి తల పగిలిపోతోంది. ఆలోచనలతో.........అందరూ ఒకే మాట "అచ్చం మీ ఆయన పోలికేనే వీడు" అని.

తన భర్త చిన్నతనం తెలిసిన ఇద్దరు ముగ్గురు బామ్మగార్లు "మా ఆనందు ఇలాగే ఉండేవాడే పద్మా— అచ్చం వాడి నోటిలోనుంచి వచ్చినట్లున్నాడు ఈ వెధవాయి. గుమ్మడి పండులాగా ఉండేవాడు మీ ఆయన ఇప్పుడంటే నీ చేతి వంట తిని శల్యమయిపోయాడుగానీ—" అని అంటుంటే తనూ నవ్వేసింది మొదట.

కాని అందరూ అదే మాటంటుంటే దాన్ని గురించి ఆలోచించింది తను కూడా. పరిశీలనగా చూసింది వాడిని. "నిజమే—వాళ్ళన్నకొంట్లో ఏమాత్రం అబద్ధంలేదు. ముమ్మూర్తులా ఆయన పోలికే వీడు" అనిపించింది తనకి కూడా.

అయితే అప్పట్లో తను ఆలోచించింది అంతవరకే. తమతో అంతలా కలిసి పోయేలా మాధవు డున్నందుకు సంతోషపడింది కూడా.

అయితే తన ఆలోచనలని మరోవైపుకు మరల్చింది నీరజ. అది ఆయనకి వరసకి మరదలు. తనకి స్నేహితురాలు......

"పూర్తిగా మీ ఆయన పోలికేనే నీ కొడుకు. ఈ బామ్మగార్లంతా ఇలా ఎవరో పిల్లాడు వాళ్ళ ఆనందులాగానే ఉండడం కేవలం భగవంతుడి లీలని, వీడివి మీ కోసమే ఆ పరమాత్ముడు సృష్టించాడని భ్రమపడుతున్నావు. కాని, అమ్మడూ, నాకేం నమ్మకంలేదు. ఏమన్నాఅంటే నాలాంటి వాళ్ళని నాస్తికులని తీసిపారేస్తారు. కాని, కొంచెం డీప్‌గా ఎందుకు ఆలోచించరో? ఇది మీ ఆయన లీలే ఎందుకు కాకూడదూ? ఏం, ఆయనమాత్రం బొత్తిగా అమాయకుడా? పైగా ఇంకో విషయం జ్ఞాపకంఉందా—నువ్వే చెప్పావునాకు. మాధవుడు కూడా అతని దగ్గరే చనువుగా ఉంటున్నాడు......

అరుగో మీ ఆయనగారు దయ చేస్తున్నారు. బావగారండోయ్, మీ శ్రీమతికి విన్ను గురించి కొన్ని నగ్న సత్యాలు చెబుతున్నా నోయ్!'' అంది.

నీరజ మాటలు విని, తను మొదట తెల్లబోయింది. దానిమీదకోపం కూడా వచ్చిందికాని, ఆ ఆలోచనమాత్రం తన మనసుని దొలచసాగింది. గతంలోని సన్నివేశాలు మళ్ళీ గుర్తుకు వచ్చాయి. అవన్నీ కూడా నీరజ చెప్పిన మాటలని బలపరిచాయి.

విజమే మరి—అసలు పిల్లాడిని పెంచుదామన్న ప్రసక్తి తెచ్చినది ఆయన. మగపిల్లాడని పెంచుకుందామన్నదీ ఆయనే! వాడిని అక్కడినుంచి తెచ్చింది ఆయనే!........ఇదంతా ముందే ఆలోచించి ఉంచుకున్న పథకం ప్రకారం జరిపించారన్నమాట. తనేమో పిచ్చిదానిలాగా సంబరపడిపోయింది. నీరజ చెప్పింది రైటే—మాధవుడు తన దగ్గర ఇంతవరకు చనువు కాలేదు తను ఎంతగా ప్రయత్నించినా. అటువంటిది ఆయన దగ్గర మొదటినుంచీ కూడా మాలిమి అయాడు—'బాబాయ్' అని పిలుస్తాడు. తను మొదట్లో వాడిని పక్క ఇళ్ళవాళ్ళకి చూపించి, ''మీ పోలికే నంటున్నారండి'' అంటే ఆయన మాట మార్చే శారు........ఆలోచిస్తున్నకొద్దీ పద్మావతికి మంచు విడిపోయి నట్లుగా స్పష్టంగా అగపడుతోంది. తనెంతగా మోసపోయింది'' అనుకుని పదోసారి ఆశ్చర్యపోయింది.

''ఇంటికి రాగానే తేల్చేసుకోవాలి. ఈ నాటకం అనుభ వించలేదు. వాడిని చూస్తుంటే తనకి జరిగిన అన్యాయానికి వాడు ప్రతిబింబంగా అనిపిస్తోంది. వాడిని తనీ ఇంట్లో భరించలేదు''..........ఏం చేయాలో, ఏమి చెప్పాలో పూర్తిగా ఆలోచించుకుని నిర్ణయించుకుంది.మెత్తమెత్తగాభర్త చెప్పబోయే మాటలకు తను లొంగిపోకుండా ఉండేందుకు అసలు అతనిమాటలు వినకూడదని కూడా నిర్ణయించుకుంది.

తనకి కావలసినదల్లా ఒక్కటేమాట—వాడికీ ఆయ నకి ఏమిటి సంబంధం? నలుగురూ అనే మాటల్లో ఎంత వరకు నిజం ఉంది?........బోనులో పెట్టిన పులిలా అటూ ఇటూ తిరగసాగింది అతని రాకకై ఎదురుచూస్తూ.

''హల్లో పద్మావతీదేవీ, తిన్నది అరగలేదా ఏమిటి పచార్లు చేస్తున్నావు?'' అన్నాడు ఆనందరావు లోపలికి వస్తూనే.

గబుక్కున అతనివైపుకు తిరిగి ''వాడు మీకు ఏమవు తాడు చెప్పండి?'' అనడిగింది తీక్షణంగా.

గతుక్కుమన్నాడు ఆనందరావు. ''ఎవడు?'' అనడి గాడు.

''వాడే—కుర్రాడు—మాధవుడు''

''నీకేమవుతాడో నాకూ అదే—''

''అదికాదు నే నడిగేది. ప్రత్యేకించి, మీ కేమవుతాడు'' అని.

అతను మాట్లాడలేదు.

''నాకు తెలుసు—దానికి మీరేమీ సమాధానం చెప్పరని! కాని, ఒక్కటిమాత్రం వినండి—నా కళ్ళు మూసినా, మీరు లోకం నోరు మూయలేరు. మీరు చెప్పిన కథలన్నీ నమ్మి, మీరు ముందే వేసుకున్న ప్లాను ప్రకారం నడవటానికి నాలాటి తెలివి తక్కువ వాళ్లే కావాలి......... చదువుకున్న చదువును బ్రహ్మాండంగా వాడుకున్నారు. ఉన్న తెలివినంతా నన్ను మోసం చేయడంలోనే ఉపయోగించారు పాపం!''

ఆనందరావు కాసేపు ఏమీ మాట్లాడలేదు. తరువాత వెళ్ళి ఒక కవరు తీసుకొచ్చి, ఆమెకిచ్చి ''ఇది చదువు'' అని చెప్పి బయటికి వెళ్ళిపోయాడు.

గబగబ చింపి, ఉత్తరం చదవసాగింది పద్మావతి.

''అనుకున్న రోజు, ఎదురు చూసిన ప్రశ్న—రెండూ వచ్చాయి. ఈక్షణం ఎప్పటికయినా వచ్చి తీరుతుందనే ఉత్తరం రాసి సిద్ధంగా ఉంచుకున్నాను. మనుష్యుల్ని ఎదట అర్థం చేసు కోవడంకన్నా, ఉత్తరాల ద్వారా తేలిక. చెప్పడం కూడా అంతే. క్షమించగలగడం కూడను!

అవును—వాడు నా కొడుకే! విన్నదాని మీద నువ్వు వూహించినది నిజమే!

కాని ఇది మన వివాహంకాని క్రితం సంగతి—

ఈ ఉద్యోగంకోసం నేను మద్రాసులో ట్రయినింగయా నని చెప్పాను నీకు లోగడనే. అప్పుడే నాకు పరిచయమయింది జయ.

ఆమెపేరు జయలక్ష్మి. ఎమ్మెస్సీ పాసయి మద్రాసు లోనే ఒక కంపెనీలో కెమిస్టుగా పని చేస్తుండేది. ఆమెకి తల్లి తండ్రి ఇచ్చిపోయిన ఆస్తి ఏమీలేదు చదువుతప్ప. ఇకపోతే పెరివలన ఆమెకు కలిగిన అదృష్టం వివాహం లేకపోవడం. వాళ్ళదీ ప్రేమ వివాహమే! కులాలువేరు, భాషవేరు వాళ్ళది. ఒకరు తెలుగు, ఒకరు అరవం. అందువలన ఆమెకి విశాల భావాలయితే నేర్పగలిగారుగాని, ఒక కులం అంటూ ఇవ్వలేక పోయారు. దాని కప్పిపుచ్చుకునేందుకనే తల్లిపోయినా తండ్రి ఈమెని చదివించాడు. కూతురు స్వతంత్రంగా ఉద్యోగం చేయ డంచూసి, ఆయన కళ్ళు మూశాడు. కాని, ఆయన కూతుర్ని ఒక ఇంటిదాన్ని చేయలేకపోయాననే దిగులు మాత్రం ఉండేదిట !

జయకి, నాకు పరిచయం అయింది ఉద్యోగ రీత్యానే. కేవలం ఆమె అందం నన్ను ఆకర్షించిందని చెబితే ఆమెకు అన్యాయం చేసినవాడినే అవుతాను.

నిండు కుండలాంటి మనిషి, ఏ విషయంలోనూ తొందర పడి మాట్లాడేదికాదు. ఎప్పుడూ పెదవులమీద చిరునవు తాండ విస్తుండేది.......'భార్య' అవబోయే మనిషికి ఏ ఏ లక్ష ణాలుండాలని కలలు కంటుండేవాడినో అవన్నీ మూర్తీభవించి నట్లుండేది జయలక్ష్మి. అందుకనే ఆమె నన్ను అమితంగా ఆకర్షించింది.

పరిష్కారం

ఆమె నాలో ఏంచూసి నేనంటే ఇష్టపడిందో నాకయితే తెలియదుగాని, ఆమె మాటల్లోనే చెప్పాలంటే "మీలాంటి సహృదయుడు దొరకడం నా అదృష్టం. మా నాన్న ఉంటే ఎంతగా సంతోషపడేవాడో" అనేది.

'ప్రేమ' అన్నది వయస్సులోనున్న యువతీ, యువకులమధ్య కలిగినప్పుడు అది కేవలం మనస్సులకే పరిమితం అయిఉండటం అసంభవం. అందుకే ననుకుంటా మన పూర్వీకులు దీన్ని నిరసించారు.

మా ప్రేమ ఫలించిందని, జయ తల్లి కాబోతోందని తెలిసినప్పుడు నేను అమితంగా ఆనందించాను. మనస్సాక్షిగా చెబుతున్నాను, సంతోషపడ్డానని. కథల్లోని నాయకుల్లాగా "ఎలా ఈ బెడద వదిలించుకోవడం" అన్న ఆలోచనే రాలేదు నాకు ఎప్పుడూ కూడా.

"మా అమ్మావాళ్ళకి తెలియబరుస్తాను జయా మన విషయం" అనేవాడిని. కాని జయలక్ష్మి అందుకు ఒప్పుకునేదికాదు.

"మీమీద నాకు నమ్మకంఉంది. మీరు నన్ను అన్యాయం చేయరన్న ధైర్యం ఉంది. అటువంటప్పుడు ఎందుకు తొందర పడాలి? అవతల మీ చెల్లెలికి పెళ్ళి చేయాలనుకుంటున్నారని చెప్పారాయె. మన పెళ్ళి సంఘం మెచ్చేదికాదు. నేను కులంలేని దాన్ని కాబట్టి, ఇప్పుడు మన విషయం చెప్పి, వాళ్ళు ఇష్టపడినా, పడకపోయినా నన్ను చేసుకుంటారనుకోండి! దానివలన మీ చెల్లెలి భవిష్యత్తు ఏమవుతుందో ఆలోచించండి!" అనేది.

"అయితే ఏం చేయమంటావు" అనే వాడిని అయోమయంగా.

ఫక్కున నవ్వేసి, "ఆఫీసరు కాబోతున్నారు—ఆడపిల్ల చెప్పాలా ఏం చేయవలసినదీనూ! భలేవారే, మీ చెల్లెలిపెళ్ళి అయేదాకా ఇలాగేఉందాం. అప్పుడు మన విషయం చెబుదురు గానీ!" అనేది.

"పోనీ, రిజిష్టర్ మారేజి చేసుకుందాం."

"నామీద మీకు నమ్మకంలేదా?"

"ఛ, అవేం మాటలు"

"మీరంటే నా కెటువంటి అనుమానంలేదు., ఎందుకు మనకి తొందర?"

ఇక జయతో వాదించలేక పూరుకునేవాడిని. ఈ విషయం ఎన్నిసార్లు ప్రస్తావించినా సంభాషణ ఇక్కడితోనే ఆగిపోయేది. చివరికి జయలక్ష్మి నవ్వుతూ, "మీరు ఉట్టి పిచ్చివారు. నాకేదో అన్యాయం జరగవచ్చునన్న ఊహే మీ కెంత భయం కలిగించుతోందో? మీలాంటివారు చేయాలన్నా మోసం చేయకలరా" అనేది.

ఆరు నెలల ట్రయినింగుతో మద్రాసు వదిలి వచ్చేశాను. నన్ను ధైర్యంగా ఉండమని మరీ మరీ చెప్పి సాగనంపింది జయలక్ష్మి. నాకు విచారంలో కూడా నవ్వు వచ్చింది" తనకి నేను చెప్పవలసిందిపోయి, నాకు ఆమె చెబుతుందేమో" అని.

చివరిసారి—మా వాళ్ళకి చెప్పేస్తానని అని, మళ్ళీ ఆమె చేత ఆ మాటలన్నీ చెప్పించుకుని బండి ఎక్కాను.

మా చెల్లెలి పెళ్ళికి నేనే తొందరపడి సంబంధాలు వెదికాను. కాని దానికి ఆశలు ఎక్కువ. దానికితోడు నాన్నగారి స్తోమతు కూడా పెద్దదే కావడాన "గొప్ప భవిష్యత్తు" ఉన్న కుర్రాళ్ళని వేటాడలేక నామచ్చమూసేది. నా దురదృష్టమే అనుకుంటా దానికి త్వరగా సంబంధం స్థిరపడక పోవడం.

దానికి తీరా సంబంధం అదీ కుదిరి పెళ్ళి జరిగిపోయి ఇక మనకి ఏ అడ్డంకిలేదు అనుకుంటుంటే జయలక్ష్మి దగ్గర నుంచి వెంటనే రమ్మనమని ఉత్తరం వచ్చింది.

నేను వెళ్ళేసరికి అంతా అయిపోయింది. వీడుమాత్రం దక్కేడు నాకు.

ఆమె పోకుండా ఉంటే వెంటనే మా వాళ్ళకి చెప్పేద్దామనుకున్నాను నేను. కాని నా కా అదృష్టంలేదు.

'మాధవుడు' అని పేరు పెట్టుకున్నది జయలక్ష్మి. మొదట నాకు వాడిని ఏం చేయాలన్నది తోచలేదు. నేరుగా ఇంటికి తెచ్చేసి, "జరిగినదిది, వీడు మీ మనవడు" అని చెబుదామనుకున్నాను. కాని, నా విషయం పూర్తిగా తెలిసిన మా గోపాలరావు సలహామీద వీడిని ఒక అర్ఫనేజిలో చేర్పించాను—అనాథగా మాత్రంకాదు. డబ్బిస్తుంటే వాళ్ళు వీడిని జాగ్రత్తగా చూసేట్టు ఏర్పాటు చేశాడు గోపాలరావు. అక్కడ మూడు సంవత్సరాలుంచిన తరువాత తీసుకొచ్చి ఒక స్కూల్లో చేర్పించాను. అక్కడ హాస్టల్ కూడా ఉంటుంది స్కూలుతోపాటు. గురుకులంలాంటి దన్నమాట అది. మనం డబ్బు కడుతూఉంటే వాళ్ళకి మంచి శిక్షణలోపాటు చదువు కూడా నేర్పుతారు.

"నీకు పెళ్ళిఅయి, మీ ఆవిడ మంచిదయితే వీలుని బట్టి, ఆవిడకి నచ్చచెప్పి, వీడిని తీసుకెళుదువుగాని. అలా వీలులేదంటే తరువాత ఆలోచిద్దాం. నేను ఈలోగా వాడి విషయం కనుక్కుంటూ ఉంటాను. డబ్బు మనం పడేసినంతకాలం ఏలోపం రాదనుకో! ఇంట్లోకన్నా బాగా చూసేట్టు చేసే బాధ్యత నాది!" అన్నాడు గోపాలం.

ఆనాటినుంచి నీమీద ఆశ పెట్టుకుని ఉన్నాను నేను. నీతో అంటే కాదనవనిపించేది. దానికితోడు నీకు పిల్లలంటే ఉన్న మక్కువ నాకు కొండంత ధైర్యం కలిగించింది.

'స్వార్థం' అంటావు. నేను కాదనను. కాని, ప్రేమ అటువంటిది. వాడిని అన్యాయం చేస్తున్నానన్న బాధ! అందుకే వాడిని ఇంటికి తెచ్చాను. వాడిమీద నువ్వు చూపే ఆదరణచూసి, అదృష్టవంతుడు వీడు అనుకున్నాను"......

చదవడం ఆపేసింది పద్మావతి. ఆమె శరీరం కోపంతో వేడెక్కిపోయింది. గబగబ అతనికోసం గదిలోకి వెళ్ళిందికాని లేదు. గిరుక్కున వెనక్కి తిరిగింది. ఎదురుగా కనబడ్డాడు ఆనందరావు.

సున్నపు రాయిమీద నీళ్ళు పడినట్లయింది.

"నేనేం చేశానని నాకు మీరింత ద్రోహంచేశారు? నా ఒక్క దానికే మీ హృదయంలో స్థానం ఉన్నట్లుగా నటించారు ఇన్ని రోజులు—ఎంత గ్రంథసాంగులు! నేనే వెర్రిదాన్ని—"ఈ మనిషి వెనక ఇంత చరిత్ర ఉంది" అని తెలుసుకోలేకపోయాను. అసలు మగజాతిని నమ్మడంలోనే ఆడది తన తెలివి తక్కువ దనాన్ని చూపిస్తోంది. పైగా జరిగింది చాలక మీ 'ప్రేమ ఫలాన్ని' తీసుకొచ్చి నా నెత్తిన రుద్దడం కూడనా?"

"పద్మావతీ!" అన్నాడు బాధగా ఆనందరావు.

కాని ఆవిడ ఇంకా రెచ్చిపోయింది. "అవును, ఉన్న మాటలంటే ఖంగారు పడతారెందుకు? నిజం చెప్పి నన్ను ఒప్పించే ధైర్యం, ఆత్మ విశ్వాసం లేక నా నెత్తిన వాడిని రుద్దారు. ఎవరికో పుట్టిన........"

"పద్మ, తొందరపడుతున్నావు. నీ అంత సభ్యతగల కుటుంబంలోనిదే ఆ అమ్మాయి"

"అవు నవును—తెలుస్తూనేవుంది. వాళ్ళ అమ్మది నాన్న కులం కాదుట. వాళ్ళిద్దరి కులం ఈవిడదికాదుట. భాష ఏదో తెలియదుట. పెళ్ళయినా లేకుండా ఉద్యోగం వెలగబెడుతూ ఉండడం చాలక, మీలాంటివాళ్ళని వలలో వేసుకుని పిల్లల్ని కనడం! దానికి 'ప్రేమ' అన్న పేరు పెట్టడం. అడ్డమయిన బజారు పిల్లల్ని సాకేందుకు......"

మాట పూర్తి కాకుండానే చెంప చెళ్ళుమంది. రెండు, మూడు........కొట్టేస్తున్నాడు పిచ్చిగా ఆనందరావు.

నిద్రలేచి, గదిలోంచి బయటకొచ్చిన మాధవుడు ఆ దృశ్యంచూసి, హడలిపోయి, బావురుమని ఏడవడం మొదలెట్టాడు.

తను చేస్తున్నపని తెలిసొచ్చి గబుక్కున తలవంచుకుని వెళ్ళిపోయాడు ఆనందరావు.

జీవితంలో జరగని పని జరగడంతో మొదట తెల్లబోయిన పద్మావతి బాధతో, అవమానంతో ఏడుస్తూ వెళ్ళిపోయి మంచం మీద పడిపోయింది.

మాధవుడు ఏడుస్తూనే నిలబడిపోయాడు వంటరిగా.

కొంతసేపు గడిచాక, ఆనందరావు మెల్లగా పద్మావతి దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

ఏడుస్తూ వెక్కుతూన్నట్లుంది—వీపు ఎగిరి ఎగిరి పడుతోంది. నీరయిపోయాడు ఆనందరావు......గబుక్కున వంగి, ఆమెని చేతుల్తో లేవదీయపోయాడు. కాని, తన చేతులు తననే వెక్కిరించినట్లు కనబడేసరికి వాటిని వెనక్కి పెట్టేసుకుని "పద్మా" అని పిలిచాడు.

తలెత్తి ఒకసారి అతనివంకచూసి మళ్ళీ దిండులోకి పెట్టేసుకుంది. బుగ్గలు ఎర్రగా కందిపోయాయి. వాటి మీద కన్నీళ్ళ తడి ఇంకా ఆరలేదు.

బాధపడిపోయాడు ఆనందరావు. తను ఇంతవరకు వూహించనంత మూర్ఖంగా ప్రవర్తించాడు అనిపించిందతనికి. వెంటనే "నన్ను క్షమించుపద్మా, పశువులాగా ప్రవర్తించాను. నేను సిగ్గుపడుతున్నాను ఇప్పుడు. నా జీవితంలో మళ్ళీ ఇటు వంటి పని చేయనని ప్రమాణంచేసి చెబుతున్నాను.

ఈరోజు నేను క్యాంపుకి వెడుతున్నాను. మూడు రోజుల్లో తిరిగివస్తాను. అంతవరకు వాడిని........మాధవుడిని ఉండ నీయి. అది నీకు బాధ కలిగిస్తుంది—తెలుసు నాకు. కాని, నా కోసం ఈ మూడురోజులు ఉండనీ వాడిని. నేను తిరిగి రాగానే తీసుకువెళ్ళి మళ్ళీ ఆ బడిలో దింపివస్తాను. అక్కడ కూడా బాగా చూస్తారు.

సరే, మరొక్కసారి చెబుతున్నాను—నన్ను క్షమించు చాలా అసహ్యంగా ప్రవర్తించాను" అని గిరుక్కున తిరిగి గది లోంచి బయటికి నడిచాడు.

గుమ్మంలో నిలబడి ఉన్నాడు. మాధవుడు ఏడుస్తూ. కడుపులో చేయిపెట్టి దేవినట్లయింది ఆనందరావుకి. వాడిని దగ్గరకు తీసుకోపోయాడు. కాని, వాడే అతని చేతుల్లోంచి తప్పించుకుని దూరంగాపోయి నిలబడ్డాడు. ఇక వాడిని చూడ లేక ఆనందరావు పెద్ద పెద్ద అంగలతో బయటికి వెళ్ళిపోయాడు.

* * * *

తను ఎంత సేపటినుంచీ పడుకునుందో పద్మావతికి తెలియదుగాని, తనకి తెలియని కొత్త పిలుపువిని కళ్ళు విప్పి చూసింది.

పక్కనున్న బల్లమీద నిలబడి తనవంక చూస్తున్నాడు మాధవుడు.

జరిగినదంతా గుర్తుకొచ్చి తల తిప్పేసుకోబోయింది పద్మావతి. కాని......

"అమ్మా!" అన్నాడు మాధవుడు మళ్ళీ.

గభాలున కళ్ళు తెరిచి వాడివంక చూసింది. వాడు తన ముఖంలోకే ఆతృతగా చూస్తున్నాడు. వాడి బుగ్గలమీద పీడ్చిన గుర్తులు బాగా అగుపిస్తున్నాయి.

"అమ్మా, బాబాయి వెధవ!" అన్నాడు ఆమె ముఖం లోకే చూస్తూ.

ఆమె వాడు చెప్పే మాటలన్నీ పట్టించుకునే స్థితిలో లేదు. తన కిన్నాళ్ళు తెలియని, కొత్తదయిన ఆ పిలుపు—తనిన్నాళ్ళుగా ప్రయత్నంతో సాధించలేనిది విని ఆశ్చర్యంతో వాడివంకే చూస్తూ ఉండిపోయింది. పన్నీటి చిలకరింపులా ఉంది ఆ పిలుపు ఆమె హృదయానికి.

"బాబాయి రాచ్చసి, కదూ అమ్మా!" అన్నాడు వాడు మళ్ళీ—ఆమె నెలాగయినా మాట్లాడించాలని.

ఆమెకు అర్థం కాలేదు "ఎందుకు?" అనడిగింది.

"అందరినీ కొడతాడు. రాచ్చసి. రౌడీ!"

కొట్టడం అనగానే మళ్ళీ ఇందాకటి సన్నివేశం గుర్తు కొచ్చి తిరిగి పడుకుంది.

పరిష్కారం

రెండు మూడు సార్లు ఆమెని మాట్లాడించేందుకు ప్రయత్నించాడు మాధవుడు "బాబాయి జత పచ్చి" అంటూ. కాని ఆమె బలవంతాన వాడిమీద కోపం పెంచుకుని "మాట్లాడ కూడదు" అనుకుంది.

మనస్సుమాత్రం మళ్ళీ ఒక్కసారి "అమ్మా" అని పించుకోవాలని తహతహ లాడింది. అయినా నిగ్రహించుకు నేందుకని "వెధవ, దీనికంతటికీ వీడే కారణం" అనుకుంది. కాని, మనస్సు సమాధాన పడలేదు. బలవంతాన ఆలోచనలని మళ్ళించుకోవాలని అదే మాటని పదేపదే అనుకుంటూ, అలాగే మగత నిదరపోయింది. "అమ్మాయి పద్మావతీ, ఒళ్ళు ఇలా కాలి పోతుంటే నిద్రపోతున్నా వేమిటమ్మా! తప్పుకాదూ? ఈ వెధవాయికి నీమీద ఎంత ప్రేమనుకున్నావు—ఎలా కనుక్కు న్నాడో నీకు జ్వరం వచ్చినట్టు. నా దగ్గరకువచ్చి, బిక్కముఖంపెట్టి, "మా అమ్మకి జలం" లన్నాడు. "మీ నాన్న ఏమయాడురా" అనడిగాను. "లేడు" అన్నాడు. సరేనని ఆ పళాన మా వాడిని డాక్టరుగారి దగ్గరకు పంపించి ఇటొ చ్చాను" అంటూ చెప్పింది పక్కింటి పిన్నిగారు.

తలనెప్పి పగిలిపోతోంది పద్మావతికి. కళ్ళని బలవంతాన తెరిచి, "కూర్చోండి పిన్నిగారూ" అందిగాని, ఆమె కళ్ళు మాధ వుడికోసం వెదికాయి.

ఇందాకటి స్థానంలోనే బల్లమీద ఎక్కి, ఆమె ముఖం లోకి చూస్తున్నాడు. వాడి ముఖంలో కొట్టొచ్చినట్లు కన బడుతున్న ఆత్రం, భయం చూస్తే పద్మావతికి జాలేసింది.

ఏంచేస్తాడో చూద్దామని చేత్తో నుదురు గట్టిగా పట్టు కుని "ఏరా మాధవా, తల నెప్పిగా ఉందిరా నాన్నా!" అంది.

బావురుమని ఏడవడం మొదలెట్టాడు వాడు—అదేమిటో నని ఖంగారు పడిపోయి.

మనస్సుమీద బలవంతాన వేసుకున్న ఆంక్షలన్నీ ఒక్క సారిపోయాయి పద్మావతికి. గభాలున చేతులుచాచి, వాడిని దగ్గరకులాక్కుని గుండెలకి హత్తుకుంది.

పిన్నిగారి కళ్ళు చెమర్చాయి. "బాగానేఉంది తల్లీ కొడుకుల పని. నీకేదో అయిపోయిందని వాడేడవడం! అయినా వెధవాయికి తలనెప్పి అంటే ఏమర్థమయిందో?.........అరుగో డాక్టరు గారు వచ్చారు" అంది ఆవిడ.

*　　*　　*　　*

భయంగా, దిగులుగా లోపలికి వచ్చిన ఆనందరావు హాల్లో ఎవ్వరూ కన బడకపోయేసరికి ఖంగారుపడిపోయాడు. లోపలికి వెళ్ళేందుకు భయపడ్డాడు—ఎటువంటి సన్నివేశాన్ని ఎదుర్కోవల సి వస్తుందోనని.

అడుగులో అడుగు వేసుకుంటూ పడకగది దగ్గర కొచ్చాడు. గుమ్మంలో నిలబడి లోపలికి చూసిన అతనికి నేత్ర పర్వమయిన దృశ్యం అగపడడంతో ఆశ్చర్యపోయాడు.

పద్మావతి పడుకుంది మంచంమీద. మాధవుడు ఆమె పక్కన మంచంమీద కూర్చునున్నాడు. వాడి చుట్టూ చేయి వేసి, "......బుధవారము, గురువారము, శుక్రవారము, శని వారమూ—ఈ ఏడున్నూ వారముల పేర్లు" అని తను అని, వాడిచేత అనిపిస్తోంది పద్మావతి.

ఆశ్చర్యం పట్టలేక, కలా, యదార్థమా అన్న విషయం రూఢిగా తెల్చుకుందామని "పద్మా!" అన్నాడు ఆనందరావు.

అతన్నిచూసి, గబుక్కున లేవబోయి, మాధవుడు తనని అనుకుని ఉండటం గమనించి, "లే నాన్నా, నాన్నగారు వచ్చారు" అంది పద్మావతి.

యథార్థమే అని బుజువయింది ఆనందరావుకి. "వాడిని ఇవాళే తీసుకు వెడదామనుకుంటున్నాను" అన్నాడు ఎందు కయినా మంచిదని.

"కావాలంటే మీరే వెళ్ళండి—మేం రాము. ఏరా మాధ వా?" అంది పద్మావతి.

"ఉహుఁ, రాము. బాబాయి రౌడీ!" అన్నాడు వాడు ఆమెకి వత్తాసిస్తూ.

"ఓరి వెధవా—నేనురా రౌడీని! మరి ఆవిడో?"

"అమ్మ మంచిది!" అన్నాడు మాధవుడు.

ఆనందరావు సంతోషానికి అంతేలేదు "ఇదెప్పటినుంచి?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీరు కొట్టిన దెబ్బలతో వాడూ హడలిపోయాడు. బాధితులం ఇద్దరం రాజీ పడ్డాం. వెధవాయి నాకు జ్వరం వస్తే నన్ను క్షణం వదలలేదు.......పాపం వాడిని గురించి నేను మీతో ఏమన్నానో వాడికేం తెలుసు. అదంతా ఒక పీడ కలను కోండి. క్షమించండి నన్ను!"

"నువ్వే నన్ను క్షమించాలి పద్మా!.......అయినా ఇటు వంటి సన్నివేశం చూస్తానని కలలో కూడా అనుకోలేదుసుమీ! మా రాణీగారు మంచిదని నమ్మకంఉన్నా, ఖంగారు పడిపోయాను' అంటూ దగ్గరగావచ్చి, చేతులో ఆమెను చుట్టేయబోయాడు.

అతనినుంచి తప్పించుకుంటూ, "తప్పు, అబ్బాయి!" అంది నవ్వుతూ పద్మావతి.

"ఒరేయ్ వెధవాయ్, పెద్దవాళ్ళున్నప్పుడు పిల్లలు..... ఓ అన్నట్టు పద్మా— వీడు మరీ పిల్లాడుకదా! కొంచెం పెద్ద యాక చెబుతాను ఆ మాట. ప్రస్తుతానికి మరేం ఫరవాలేదు" అంటూ ఆమెను దగ్గరకు లాక్కున్నాడు.

వాక్యవిచారణము

శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తము

1

ప్రాచీన భారతీయ భాషావేత్తలయందు రెండుపక్షములు కానవచ్చును. ఒకటి—వాక్యసంస్కార పక్షము. రెండు——పద సంస్కార పక్షము. వాక్య సంస్కార పక్షమువా రిట్లందురు : అర్థమునకు సంబంధించినంతవరకు వాక్యమే పరిగణింపదగును. పదము లనునవి లేనేలేవు. 'గామ్' అనుదానిని స్వతంత్రముగాఁ గైకొని 'గో+అమ్' అని ప్రకృతి ప్రత్యయములుగా విభజింపరాదు. 'గామ్ ఆనయ' (గోవును తీసికొని రమ్ము) అనురీతి వాక్యములను బురస్కరించుకొని నప్పుడే యట్టి విభాగము సమంజస మగును. వైయాకరణు లీ సిద్ధాంతమునకుఁ జెందినవారు.

పదసంస్కార పక్షమువారు పదములు స్వతంత్రముగా నేర్పడుచున్నవని భావింతురు. ప్రకృతులకు ప్రత్యయములు చేరుటచే పదములు సిద్ధించును. ఇట్లేర్పడిన పదములు వాక్యమునం దన్వయించి వాక్యార్థమును జేకూర్చుచున్నవని వీరి యభిప్రాయము. పదముయొక్క యర్థమును బాగుగా విచారించియే పండితులు వాక్యమును గ్రహించుచున్నారు. (సువిచార్య పదస్యార్థం వాక్యం గృహ్ణన్తి సూరయః—పరిభాష. 22 సీరదేవ వాఖ్య) మీమాంసకులు, నైయాయికులు నీ పక్షమునకుఁ జెందినవారు. వైయాకరణులు పద సంస్కారపక్ష వాదమును గౌణ ముఖ్య న్యాయముచే స్వీకరింతురు. వాక్యమే ప్రధానమని, వాక్య గ్రహణానంతరము, అపోద్ధారముచే పదములను, ప్రకృతి ప్రత్యయములను తెలిసికొనవచ్చునని, అఖండ వాఖ్య స్ఫోట నంగీకరించిన వైయాకరణులే యనుమతించుచున్నారు. ఇట్టి పద్ధతులు శిక్షమాణులగు బాలురకు మరుగుపరచిన మాటలవంటి యుపాయములని వీరి తలంపు. (ఉపాయాః శిక్షమాణానాం బాలానా ముపలాపనాః॥ వాక్యపదీయము II—240) ఈ ఇరుపక్షములయం దేది ప్రాచీనము ? ఏది యుత్తమము ? నిర్ధారించుట కష్టము. ఈ రెండు వాదముల యందును కొన్ని గుణలోపములు కలవు.

పూర్వము వేదము లవిరామముగా పఠింపఁబడు చుండెడివి. దీనినే సంహితాపాఠ మందురు. ప్రాచీన మహర్షులగు శౌనకుఁడు, ఆత్రేయుఁడు మున్నగువారు ఇట్టి సంహితలను పదములుగా విభాగించి, అర్థగ్రహణమునకు, తన్మూలమున వేదములకు రక్ష చేకూర్చుటకు ప్రయత్నించిరి. ఇట్లు సిద్ధమొనర్చినవానికే పదపాఠములని వ్యవహారము. ఇదే భాషా విషయికమగు కృషికి ప్రప్రథమ ప్రయత్నము. ఈ కృషి యంతటితో నాగక, పదముల వ్యుత్పత్త్యర్థముల నిరూపణమునకును యాస్కుఁడు తన నిరుక్తమునం దుద్యమించెను. ఋగ్వేద ప్రాతిశాఖ్యనుబట్టి యాస్కుఁడు తన నిరుక్తమునందు "పద ప్రకృతిః సంహితాః" యని(I—612) పేర్కొనెను. దీనికి "పదానామ్ ప్రకృతిః" పదములయొక్క ప్రకృతి సంహితయని వాక్య సంస్కారవాదు లర్థము చెప్పిరి. కాని "పదాని ప్రకృతిః యస్యాః సా" పదములు ప్రకృతిగా గలది సంహిత యని బహువ్రీహ్యర్థమును పదవాదులు పేర్కొనిరి. ఈ రీతిగా నీ యిరు పక్షములవారును తమ తమ వాదముల కనుకూలముగా నర్థములను కల్పించుచుండిరి. అయినను, పదపాఠముల తరువాత క్రమపాఠము, తరువాత అష్టవికృతులతో కూడిన జటా పాఠము వెలయుటనుబట్టి సంహితా పాఠమే ప్రాచీనతమమనుట నిర్వివాదము.

2

వాక్యమును గూర్చి మీమాంసకులలో ద్వివిధములగు వాద భేదము లున్నవి. ఒకటి అభిహితాన్వయ వాదము. ఈ వాద ప్రతిపాదకుఁడు భాట్టుఁడు. అందుచే నీ వాదమునకు 'అను భాట్టుల వాదము' నియు నామాంతరము. "ప్రత్యేకం తత్తత్పదైః అభిహితానామ్ అర్థానామ్ పరస్పరమ్ అన్వయః భవతి ఇతివాదః అభిహితాన్వయవాదః' పదములు తమ తమ ప్రత్యేకార్థములను తెలిపిన పిమ్మట, పరస్పర మన్వయించి, వాక్యార్థమును దెలుపునని యీ వాదముయొక్క సారాంశము. అభిధా, లక్షణా, వ్యంజనాయను త్రివిధములగు శక్తులనే కాక, తాత్పర్యశక్తి యను వేరొక శక్తిని వీ రంగీకరించిరి. అభిధా లక్షణా వ్యంజనాశక్తులు శబ్దశక్తులు, అనఁగా శబ్దముయొక్క యర్థమును బోధించునవి. తాత్పర్యశక్తి వాక్యశక్తి. వారి యాశయ మిది : "శబ్దములు వాని సంకేతితార్థమును మాత్రమే బోధించును. అన్వయమును బోధింపవు. ఎట్లన 'గాం ఆనయ' (గోవును దెమ్ము) అన్నపుడు 'గాం' అను పదము 'గోవును' అనియు, 'ఆనయ' పదము 'తెమ్ము' అనియును అర్థమును దెలుపును. కాని యీ రెండర్థములను గలియుటెట్లు ? అభిధ పదముల యర్థమును మాత్రమే బోధించును. యన్వయమును బోధింపదు. కావున వాక్యమునందున్న పదముల కన్వయమును జేకూర్చి యఖండార్థమును బోధించుటకు వేరొకశక్తి యంగీకరింపవలసి యున్నది. దానికే తాత్పర్యశక్తి యని పేరు. అది లేకున్నచో పదములకు పరస్పరాన్వయముండదు. అన్వయము లేనిచో అఖండార్థము కలుగదు. అర్థములు ఖండ ఖండములుగానే యుండిపోవును.

మీమాంసకులలోనే, ప్రభాకరుఁడు, అతని యనుయాయులు పై వాదము నంగీకరింపలేదు. అందు గౌరవ మున్నదని వారు తలంచిరి. వీరి వాదమునకే అన్వితాభిధాన వాదమనియు, అనుప్రాభాకరుల వాదమనియు వ్యవహారము. "అన్వితైః పదైః అర్థస్య అభిధానమ్ యస్మిన్ వాదేసః అన్వితాభిధాన వాదః" అని విగ్రహము. వాక్యమునందలి పదములు ఒండొంటితో నన్వయించి, వాక్య తాత్పర్యమును దెలిపిన పిమ్మట తమ తమ ప్రత్యేకార్థములను దెల్పునను నీ వాద సారమునుబట్టి, తాత్పర్యశక్తి యను వేరొక శక్తి గ్రహించు నవసరము తప్పును. వీరి సిద్ధాంత మిట్టిది: "గామానయ" (గోవును దెమ్ము) అని యుత్తమ వృద్ధుఁడు మధ్యమ వృద్ధునితో చెప్పగా, మధ్యమవృద్ధుఁ డద్దానిని తీసికొని వచ్చుటను పరికింపుచున్న బాలుఁడు, ఆ వాక్యమునకు సాస్నాలాంగూల కకుద ఖుర విషాణ (గంగడోలు, తోఁక, మూపు, డెక్కలు, కొమ్ములు) వంతమగు ఒకానొక పిండమును గొని తెచ్చుట' యని సామాన్యముగా గ్రహించును. అంతేకాని ప్రత్యేకముగా ఈ పదమున కీ యర్థమని తెలిసికొనఁ జాలఁడు. పిమ్మట 'గాంబధాన' (గోవును బంధింపుము) 'అశ్వమానయ' (గుఱ్ఱమును దెమ్ము) అను వాక్యములను వినును. వెనుకటి 'గోవును దెమ్ము' వాక్యములోని గోవు వంటి వ్యక్తినే కట్టివేయుటను జూచి 'గోవు' అనగా 'ఇది' యని యర్థమును గ్రహించును. 'గుఱ్ఱమును దెమ్ము' అను వాక్యమును విని గుఱ్ఱమును దెచ్చుటను జూచి, 'ఆనయ' (తెమ్ము) అను పదము,పూర్వము 'గామానయ' అను వాక్యములోని 'ఆనయ' పదము వంటిదే యని తలంచి, దాని యర్థమును గ్రహించును. ఈ తీరుగా వాక్యార్థము వలననే ప్రత్యేక పదముల యర్థము స్పష్టపడును. ఈ మతమున తాత్పర్యశక్తి యక్కఱలేదు. ఏలన వాక్యార్థమే ముందు గోచరించును. అభిహితాన్వయ వాదులు "తొలుత పదములవలన అర్థబోధ—పిమ్మట వాక్యార్థబోధ" కల్గునని ప్రతిపాదింపగా, అన్వితాభిధానవాదులు ప్రథమముగా వాక్యార్థబోధయు, తదనంతరము పదార్థబోధయు కల్గునని వాదింతురు. ఈ రీతిగా మీమాంసకులలో నొక వర్గమువారు వాక్యార్థమునకే ప్రాధాన్యము నొసగిరి. పదములకు స్వతంత్రార్థము నంగీకరించుచో, పదమునందలి యే వర్ణమున కెంత యర్థమో నిర్ణయింపవలసి యున్నది. అది దుస్సాధ్యము. కావున వాక్యమే భాషయందలి కనీసపు టంశ మనవలసి యుండును. భాషాగ్రహణమున సహజముగాఁ గనుపట్టుచున్న అన్వితాభిధాన వాదమును బ్రఫ్ దొర సరియైనది కాదని విమర్శించుటకు హేతువు కానరాదు.[1] అన్వితాభిదాన వాదము వాక్యవాదులకు, పదవాదులకు మధ్యే మార్గము ననుసరించుచున్నట్లు కనుపట్టును.

3

భర్తృహరి తన కాలమునకు భాషాభిజ్ఞులలో ప్రాబల్యము వహించిన వివిధాభిప్రాయములను సమీక్షించి, వాక్యమునకు నిర్వచనము లనదగు వాని నెనిమిదింటి నీ రీతిగా సంతరించెను :—

(1)ఆఖ్యాత శబ్దః, (2)సంఘాతో, (3) జాతిః సంఘాత వర్తినీ, (4) ఏకోనవయవః శబ్దః, (5) క్రమో, (6) బుద్ధ్యను సంహృతిః, (7) పదమాద్యం, (8) పృథక్ సర్వపదం సాకాంక్ష మిత్యపి వాక్యం ప్రతిమతిర్భిన్నా బహుధా న్యాయవాదినామ్.
(వాక్య—II—1, 2)

ఇందు 3, 4, 6 నిర్వచనములు వాక్య మఖండమను పక్షమువారి వాదమును సమర్థించును. 1, 2, 5, 7, 8 నిర్వచనములు వాక్యము సఖండమను పక్షమువారి వాదమును బలపరచును. అభిహితాన్వయ వాదులు, అన్వితాభిధాన వాదులును నీ సఖండ పక్షమునకే చెందినవారు. ఇందు 2, 5 నిర్వచనములు అభిహితాన్వయ పక్షమునకు, 1, 7, 8 నిర్వచనములు అన్వితాభిధాన పక్షమునకు ననువర్తించును.

(1) ఆఖ్యాత శబ్దము వాక్యము :—అన్వితాభిధాన వాదమున నీ నిర్వచనము బలీయమైనది. వేదవిహితక్రతు నిర్వాహకాదులయందు, మధ్యమ పురుష క్రియారూప ప్రయోగమే విశేషముగా నుపయుక్తము. అంతేకాక సామాన్యభాషా ప్రయోగమునుబట్టి, వ్యాకరణశాస్త్రము ననుసరించి యీ నిర్వచనమునకు ప్రాముఖ్యము కలదు. ఏకపదము, నేకాక్షరము నగు రా, పో, తే, వంటి క్రియా పదములే వాక్యములు నగుచున్నవి. ప్రత్యక్ష సంభాషణమునందు వక్త తనకుఁ గల్గిన భావ వికారములను దెల్పుటకే భాష నుపయోగించును.. ఒక చెట్టు పడిపోవుటను గాని, ఒక లత పుష్పించుట గాని మున్నుగా గల చర్యలను దెల్పుటకు కేవలము క్రియాపదము లుపయోగించినను సరిపోవును. క్రియా పదాంతములందలి ఆఖ్యాతములే కర్తను గూర్చియు మనకు కొన్ని సూచనలు చేయును. అంతేకాక, ఆఖ్యాత శబ్దమే కారక పదముల నన్నింటి నాక్షేపించుకొని నిరాకాంక్ష మగును. (వాక్య. II—49—116) కావుననే వ్యాకరణ శాస్త్రమునందు క్రియాపదమే వాక్యమున కీలకస్థాన మగుచున్నది. "ఏక తిఙ్ వాక్యమ్" అనువార్తిక నిర్వచనమును దీనిపైన నభివృద్ధిగా "ఆఖ్యాతం సావ్యయం సకారకమ్ సకారక విశేషణం వాక్య సంజ్ఞం భవతి" అను పతంజలి నిర్వచనమును వ్యాకరణశాస్త్ర సంబంధుల ననుసంధింప నగును.

1. "The Prabhakara School, on the other hand, held the more sophisticated theory that the individual words did not express any meaning until they were united together into a sentence."

"Some Indian Theories of Meaning" by John Brough—T. P. S. 1953.

(2) కతిపయపద సంఘాతమే వాక్యమని కొందరి నిర్వచనము. ఇది యభిహితాన్వయ పక్షమునకుఁ జెందినది. కేవల పదమే యర్థమునకు వాచకమో, ఆ పదము వాక్యస్థ మైనను ఆ యర్థమునే చెప్పును.[2] పదముల సంఘాతమునకు పరస్పరాన్వయము కలిగిన వెనుక, గోచరించు ఆధిక్యము, అనఁగా సంసర్గము వాక్యార్థ మగును.[3] ఈ వాక్యార్థ మనేక పదములం దున్నను గోత్వాది జాతి, ప్రతి గో వ్యక్తి యందును గూడ నుండు రీతిగా ప్రతి పదార్థమునందును నుండునని గొందర మతము. కొందరు సంఖ్యవలె వాక్యార్థము సముదాయమునందే యుండు నందురు.[4] ఈ సంసర్గము అనుమేయము. దీనికొక రూపము లేదు. కావుననే దీని నసత్యభూత మందురు. అనఁగా పదార్థముల కంటె వేరైన సత్వము (ఉనికి) లేనిదని యర్థము.[5] పదములు ఆకాంక్షాదులవలన పదాంతరములతో నియతముగా సంశ్లిష్టములై వాక్య మగునని యీ వాద సారము.[6]

(3) సంఘాతవర్తిని యగు జాతి వాక్యము :

ఇది యఖండ పక్షమువారి నిర్వచనము. భిన్న భిన్న ప్రయత్నములచేత నుదీరితమగు భిన్న ధ్వనులు జాతి స్ఫోటయే కాని వ్యక్తిస్ఫోట కానేరదు. భ్రమణాది కర్మల కావృత్తి యున్నపుడు ప్రతిపత్త (జ్ఞాత) ప్రతి భ్రమణమునందును జాతి యున్నట్లు గ్రహింపఁగల్గుచున్నాఁడు. అట్లే వర్ణపద వాక్యములలో కూడ నభివ్యంజకమగు ధ్వనులు ఏకరూపముగా నున్నట్లు ప్రతీయమాన మగును.[7]

(4) ఏకము, అవయవ రహితమునగు శబ్దము వాక్యము :

ఇదికూడ నఖండ పక్షమునకుఁ జెందిన నిర్వచనమే. అవయవరహితమైన అఖండ శబ్దమే వాక్యమను నీ నిర్వచనము స్ఫోట లక్షణమే వాక్యమను మతమును బలపరచుచున్నది. ఒక శిల్పమును గాని, ఒకానొక చిత్రమును గాని దర్శించుటవలన కల్గు జ్ఞానమఖండము. విభాగ పరిశీలనము, తన్మూలమున గల్గు ఖండ జ్ఞానము కల్పితములు. ఇట్లే వాక్య, వాక్యార్థముల స్వరూపము నఖండ మైనది.[8] ఇట్లే వాక్యమును. ఉచ్చారితమైన శబ్దము స్ఫోట రూపము, క్రమ రహితము. అనయవయము. ఇది వ్యక్తి స్ఫోటకాని జాతిస్ఫోటకాన కావచ్చును.[9] ఇందలి క్రమ ప్రతిభాసము అభివ్యంజకములగు ధ్వనుల క్రమమునుబట్టి వచ్చునదే కాని, స్ఫోటాత్మకమగు శబ్దగతము కాదు. (వాక్య II–57) ఈ నిర్వచనము భర్తృహరి కిష్టమైనది.

(5) క్రమమే వాక్యము : ఇట క్రమ మనఁగా పద క్రమమే గ్రహింపవలయును. ఏలన పదక్రమము వాచక మైనట్లు వర్ణక్రమము వాచకము కానేరదు. పదములకు క్రమమునందు తప్ప, పృథక్కుగా కర్తృత్వ, కర్మత్వములు ప్రతీయమానములు కావు.[10] పదముల క్రమమే వాక్యము.[11] వర్ణముల క్రమము వాక్యము కాదు. (డిటో—53) వర్ణములు అర్థవంతములు కావు. పదములే యర్థవత్తులు. వాని క్రమమే వాక్యము. సంసర్గము వాక్యార్థము. (వాక్య II–54) కాలము యొక్క ధర్మమే క్రమము. అది తప్ప వాక్యము వేరులేదు.[12] ఈ నిర్వచన మన్వితాభిధాన వాదమునకుఁ జెందును.

(6) బుద్ధ్యను సంహృతము వాక్యము :—

స్ఫోటయాంతరము. వాక్యమును ఆంతరమే. ఇది యనవయవము. జ్ఞాన స్వభావము కలది. నిర్విభాగమగు శబ్దతత్వము, నాదములచేత బయటకుఁ ప్రకాశింపఁజేయ బడినదై 'వాక్య' మనుబడును.[13] వాక్యమాంతర మైనచో

---

2. కేవలేన పదేనార్థో యావా నేవాభిధీయతే
వాక్యస్థం తావతోఽర్థస్య తదాహు రభిధాయకమ్."
(వాక్య. II—41)

3. సంబంధే సతి యత్వన్య దాధిక్య ముపజాయతే
వాక్యార్థమేవ తం ప్రాహుః అనేక పద సంశ్రయమ్.
(42 శ్లో.)

4. వాక్యార్థస్య జాతివ త్ప్రత్యేక పరిసమాప్తిః కేషాంచిన్మతే సంఖ్యావ త్సముదాయ పరిసమాప్తిరితి పక్షద్వయం ప్రదర్శితుమాహ—
సత్వనేక పదస్థోఽపి ప్రతిభేదం సమాప్యతే
జాతివ త్సముదాయేపి, సంఖ్యావత్ కల్ప్యతే పరైః.
(43 శ్లో.)

5. వాక్యపదీయము—II—47.

6. —డిటో—II—48.

7. యథాక్షేప విశేషోఽపి కర్మభేదో న గృహ్యతే
ఆవృత్తౌ వ్యజ్యతే జాతిః కర్మభిర్భ్రమణాదిభిః.
(వాక్య II 20)
వర్ణవాక్య పదేష్వేవం తుల్యోప వ్యంజనాశ్రుతిః
అత్యంత భేదే తత్వస్య స్వరూపేవ ప్రతీయతే.
(వాక్య II 21)

8. వాక్య II–7, 8

9. అవ్యక్తః క్రమవాన్ శబ్ద ఉపాంశ్వయ మధీయతే
అక్రమస్తు వితత్యేవ బుద్ధిర్యత్రావతి తిష్ఠతే.
(19 శ్లో.)

10. సన్త ఏవ విశేషాయే పదార్థేషు వ్యవస్థితాః
తేక్రమాదను గమ్యన్తే నవాక్య మభిదాయకమ్.
(50 శ్లో.)

11. యేచ సంభ వినోభేదాః పదార్థేష్వ విభావితాః.
తే సన్నిధానే వ్యజ్యన్తే, నతువర్ణే ష్వయం క్రమః.
(—52 శ్లో.) వర్ణక్రమః పదముచ్యతాం నామ, వాక్య సంజ్ఞా పదక్రమ ఏవ .... (పుణ్యరాజు)

12. శబ్దానాం క్రమమాత్రేచ నాన్యః శబ్దోఽస్తి వాచకః
క్రమోహి ధర్మః కాలస్యతేన వాక్యం న విద్యతే.
(వాక్య II–51)

13. యదన్తః శబ్ద తత్వంతు నాదైరేకం ప్రకాశితమ్
తదాహురపరే శబ్దం తస్యవాక్యే తథైకతా.
(వాక్య II–30)

వాక్యార్థమును అంతరమే. అది ప్రతిభారూపము. కావున నాంతర శబ్దార్థము లభిన్నములు. అవి యాంతర తత్త్వమునకు సంబంధించినవి. బాహ్యములుగా భేదములు భాసింపవచ్చును. [14] ఇది యఖండ పక్షమునకుఁ జెందిన నిర్వచనము భర్తృహరి కథితము.

(7) ఆద్యమగు పదము వాక్యము : ఉపక్రమమునందు వివక్షితమైన అర్థమును దెలియఁజేయుటకై సకల విశేషణ సంబంధ విశిష్టమైన పద ముచ్చరింపఁబడును. ఆ పదమునందే వాక్యార్థము పరిసమాప్త మగును. దీనినిబట్టి యా వాక్యమున నితర పదము లుండవని భావింపరాదు. నిజమున కట్లితర పదములు లేనిచో ఆ పదమున కట్టి శక్తి కలుగదు. ఈ ఆద్యపద మితర పదములతో నన్వయించియే యుండును. అనువాదార్థముగాని నియమము కొరకుఁ గాని యితర పదము లవసరములు. [15] ఈ నిర్వచన మన్వితాభిధాన వాదమునకే చెందును.

(8) సాకాంక్షమగు పృథక్సర్వపదము వాక్యము : ఆకాంక్షగల ప్రత్యేకములగు పదములే వాక్య మగునని యీ నిర్వచనార్థము. ప్రత్యేకములగు కొన్ని పదములే సాకాంక్షములుగా నుండునని, అన్ని పదము లిట్లుండజాలవనియు వీరి యభిప్రాయముగాఁ గనుపట్టును. [16] ప్రాచీనమగు శ్రౌతసూత్రములందును 'నిరాకాంక్షమ్' (తే షాం మంత్రాణామ్ వాక్యమ్ నిరాకాంక్షమ్) అను రీతిని గల నిర్వచన మిట్టి నిర్వచనమునకు ఆధారమై యుండును. కాని యీ యాకాంక్ష యనునది కేవలము పదములకు మాత్రమే కాక వాక్యములకును, వాక్యములకును నుండును. అనంతర కాలమున తార్కికులు, ఆకాంక్షతోపాటు, యోగ్యత, ఆసత్తులు కూడఁ జేర్చిరి. మరికొందరు ఈ మూడింటితోపాటు 'తాత్పర్యము' కూడ శాబ్దబోధ కవసరమని భావించిరి. [17] ఇది విషయాంతరము. ఈ నిర్వచన మన్వితాభిధాన వాద పక్షమునకుఁ జెందును.

ఇట్లు వాక్య సంస్కార పక్షమువారు, పద సంస్కార పక్షమువారు వాక్యమును గూర్చి గావించిన నిర్వచనముల వంటి వానిని క్రోడీకరించి, అందు పద సంస్కార పక్షవాదములను ఖండించి, వాక్య మఖండము, అనవయవము, బుద్ధ్యను సంహృతమనువాదములను స్ఫోటవాదమునకు పబలకముగా భర్తృహరి బలపరచెను. అనిర్వచనీయమగు వాక్యమును తమ తమ దృక్పథముల ననుసరించి నిర్వచించుటకు మన ప్రాచీన భారతీయ భాషావేత్త లేరీతిగా నభినివేశము నగపరచిరో వాక్యపదీయ పఠనముచే గ్రహింపనగును. "ఒక పదమును ప్రకృతి ప్రత్యయములుగా నెట్లు విభాగించుచున్నామో, అట్లే వాక్యమునందు పదముల నపోద్ధారముచే గ్రహించుచున్నాము. [18] ఏ ఔ, ఓ, ఐ వంటి సంధ్యక్షరములు నిరంశముగా వర్ణాంతరముతో తుల్యముగాఁ బరిగణింపఁబడు చున్నట్లే పదమునందలి ప్రత్యయ ప్రకృతి విభాగమును, వాక్యమునందలి పదములను బరిగణింపనగును. [19] నిత్యమునకు పూర్వాపరములు లేవు. కాల భేదము లేదు. హ్రస్వ, దీర్ఘ, ప్లుతాదు లావృత్తినిబట్టి యేర్పడినవి. ఇవి యన్నియు నుపాధి భేదములు. స్ఫోట శబ్దము నిత్య శబ్దము. [20] నిత్యము, నేకమునగు కాలమునకు క్షణ, భూత, భవిష్యదాది భేదములు చెప్పుకొందుము. అంతమాత్రమున నవి కాల లక్షణములని భ్రమింపరాదు. వస్తువుల యుత్పత్తి వినాశాదుల చెప్పుట కిట్లు కాలముతో ననుసంధించుచున్నాము. అంతమాత్రమున కాలమనిత్యమని, ఖండమని యనరాదు. ఇట్లే స్ఫోట శబ్దము.[21]

ఇట్లనేకోపపత్తులతో స్ఫోట శబ్దమే వాక్యమని భర్తృహరి యుద్ఘాటించును. అంతేకాక, వాక్యమునందు పద పదార్థములు వేరుగా లేవనుటకు, తత్ప్రతీతియున్న మాత్రమున వాని యునికి యున్నట్లు కాదనుటకును నాతఁ డనేక యుక్తులు ప్రదర్శించెను :—

(1) పదములు సత్యములే యగుచో 'రాజ' పదార్థ ప్రతీతి నియతముగా నొక్క పదము వలననే కలుగవలయును. అట్లు కాక రాజా—రాజానామ్—రాజ్ఞా—రాజ్ఞే—రాజని యిత్యాద్య నియత స్వరూపమగు రాజపదముచే రాజార్థ

---

14. అర్థభాగైస్తథా తేషాం ఆన్తరోఽర్థః ప్రకాశ్యతే. (వాక్య II-31)

15. విశేష శబ్దాః కేషాంచిత్ సామాన్య ప్రతి రూపకాః
శబ్దాంతరాభి సంబంధా ద్వ్యజ్యన్తే ప్రతిపత్తృషు (వాక్య II-18)

ఉపక్రమ ఏవ వివక్షితార్థ ప్రత్యాయనాయ విశిష్టపదోదీరణ మారభత ఇత్యాద్య ఏవ పదే ప్రత్యేకం వా సకలస్య వాక్యార్థస్య సమాప్తి రవగన్తవ్యా (పుణ్యరాజ వ్యాఖ్యా)

16. వాక్య. II—48, 49.

17. ఆకాంక్షా, యోగ్యతాఽసత్తి తాత్పర్య జ్ఞానాని సహకారిణి ఫలం
శాబ్దబోధః ! .... తత్తదర్థ ప్రతీతీచ్ఛయోచ్ఛరితత్వం తాత్పర్యం, తేన
భోజన ప్రకరణా 'సైంధవమానయ' ఇత్యుక్తే అశ్వాన్వయ భోదోన భవతి.
తర్కామృతమ్ జగదీశః పుట 46—47 ఆర్యాప్రెస్— 1958.

18. యథాపదే విభజ్యన్తే ప్రకృతి ప్రత్యయాదయః
అపోద్ధారస్తథా వాక్యే పదానామ్ ఉపవర్ణ్యతే. (వాక్య II-10)

19. వర్ణాంతర సరూపంచ వర్ణభాగేషు దృశ్యతే
పదాంతర సరూపాశ్చ పదభాగా అవస్థితాః. (వాక్య II-11)

20. వాక్య II—22 శ్లో.

21. —డిటో— 23, 24 శ్లో.

ప్రతీతి కల్గుచున్నది. ఇది యనుపపన్నము. కావున 'మిథ్యావదాని.' 1

(2) 'రాజపురుష' అను సమాసమున 'రాజ' శబ్దము తిఙన్త సదృశమువగుటచే 'ఓపురుషుడా! (నీవు) ప్రకాశింపుము' అను వర్థప్రతీతియు చెప్పవగును. అది యనిష్టము కదా! 2

(3) "అశ్వకర్ణః" అనునది యొకానొక యోషధి విశేషము. ఇందలి అశ్వ శబ్దమునకు గుర్రమను నర్థము చెప్పరాదు కదా! ఇట్టి వనేకములు. (వాక్య II—36)

(4) 'దధ్యానయ' అను వాక్యమునందు 'దధి' పదము యొక్క రూపము సంధి వశమున కొంత నశించు చున్నది. కావున పృథక్ దధి పదార్థ ప్రతీతి యనుపపన్నము. (వాక్య II—91) ఈ సందర్భమున సంస్కృతభాష లేఖన సంప్రదాయము నందును పదవిభాగ ముండక పోవుట, సంహితతోనే వాక్యము విరచిత మగుట గమనింపనగును. 3

(5) 'కృష్ణసర్పః' అనుచో నల్లని పాముని యర్థము. కాక త్రాచుపాముని యర్థము. 'గౌర ఖరః' అనగా తెల్లని గాడిద యని కాక యొకానొక గాడిద యని యర్థము. 'చిత్రగుహుః' అనుచో కలవాడను నర్థమును జెప్పు పదమే యుందు కానరాదు. విశిష్టార్థమే యుట గ్రాహ్యము. (వాక్య II—219—222) ఈ మున్నగునవి పదముల యసత్యతను నిరూపించుచున్నవి. గంధ మెుక్కటైనను పుష్పమును చందనమును నాశ్రయించుటచే, అపోద్ధారమువలన పుష్పగంధము, చందన గంధమని వ్యవహృతము. ఇట్లే వాక్య మఖండ మైనను దేవదత్తాది పదకల్పన మేర్పడుచున్నది. (వాక్య II –91) పదముల నెరిగించు ఉపాయములకు, అనగా వ్యాకరణముల కొక నియతి యుండదు. కొందరు పాణినీయము మూలమున శబ్ద జ్ఞానము నబడయుదురు. మరికొందరు ఇతర వ్యాకృతుల మూలమునఁ బడయవచ్చును. 4 "ఉపాయాః శిక్షమాణానామ్ బాలానామ్ అపలాపనాః."

---

1. రాజశబ్దేన రాజార్థో భిన్నరూపేణ గమ్యతే. (వాక్య II —34)

2. వృత్తౌ ఆఖ్యాత సదృశం పదమన్యత్ర యుజ్యతే. (వాక్య II—35)

3. "The tendency to deny independence to the word is further stressed by the Sanskrit system of writing (unlike e.g. old Persian) takes no particular account of word division."

   మోదకైస్తాడయ, మా+ఉదకైస్తాడయ
   న—తేన లిఖితో లేఖః, నతేన లిఖితో లేఖః.

   "Phonetics in Ancient India by W. S. Allen - p. 9.

4. ఉపాయాశ్చ ననియతా ఇత్యాహ—

   ఉపాయానాంచ నియమో నావశ్య మవతిష్ఠతే
   అర్థం కథంచి త్పురుషః కశ్చిత్ సంప్రతి పద్యతే.

(II —38) కశ్చిదాచార్యః పాణిని విరచితేన లక్షణ శాస్త్రేణ శబ్దానధి గచ్ఛతి, కశ్చిదన్యేనేతిన నియమః.

అసహాయోద్యమము ముమ్మరముగా వ్యాప్తమైన దినములలో నీయబడిన యొక సాహిత్యసమస్యను మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు (కవిగారు) దేశకాలానుగుణముగా నీ క్రిందిరీతిని పూరించిరి-

"ఇంకం గుంకుమబొట్టు పెట్టకుము తన్వీ ఫాల భాగంబునన్"

శీ. బింకంబుల్ పలుమార్లుపల్కి సభలం బేరందు పల్కొర్కి ని
శ్శంకం తానటుచేయఁ జాలకిటు దేశద్రోహియై ఖైదనన్
జంకెన్నీపతి పేరు మాపుకొనియెన్ గావన్న వేఁయున్నదే
యింకం గుంకుమబొట్టు పెట్టకుము తన్వీ! ఫాల భాగంబునన్.

విజయలక్ష్మి

కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహకవి

(గత సంచిక తరువాయి)

ఏడవ ప్రకరణము

శాస్త్రిగారు వెళ్లినతరువాత రామేశముగారు తల్లిని పిలిచి 'అమ్మా, నీవును, నీ కోడలును శాస్త్రిగారు చెప్పినమాటలు విన్నారా'యని యడిగిరి. 'నాయనా వినకేమి, ఆ ముచ్చటలు వినుటకేగదా మమ్మిలోపలనుండి ప్రత్యేకముగా రప్పించితివి. శాస్త్రిగారి మాటలు నీ మతమున కనుకూలముగనే యున్నవి. ఇక నీ ఇష్టము. పిల్ల పెద్దదికాకమునుపు పెండ్లిచేసిననుసరే, పెద్దదియైనతరువాత చేసినను సరే, నీవును నీ భార్యయు నాలోచించుకొని మీ చిత్తము వచ్చినట్లు చేయుడు. కాటికి కాళ్లు చాపుకొన్న ముండను నేను, నా మాట పాటిచేయువారెవరు ? అడ్డాలనాడే బిడ్డలుగాని గెడ్డాలనాడు బిడ్డలా ? నీ యంత వాడవు నీవు. గృహయజమానివి. అది నీ కూతురుకానీ నా కూతురు గాదు. ఈ వివాహవిషయములో నేనే జోక్యము జేసికొనను. కలుగ జేసికొనుటకు నే నెవతెను?' అని కొన్నినిష్ఠురోక్తులు బలికి రత్నమ్మగారు లోపలకు వెళ్లిరి. దుర్గమ్మయు, సత్తగారివెంట యింటిలోనికి బోయెను.

మరునాటినుండి యెప్పటి యట్ల సాయంకాలమున శాస్త్రిగారువచ్చి విజయలక్ష్మికి పాఠములుచెప్ప నారంభించిరి. మొల్లరామాయణములోని కాండలు చిన్నచిన్నవిగ నుండుటచే విజయలక్ష్మి గ్రంథమంతయు మూడుమాసములలోనే పూర్తిచేసెను. ఆమె తెలివితేటలకు నర్థగ్రహణశక్తికి గురువుగారు మిక్కిలి సంతసించిరి. మొల్లరామాయణములో విజయలక్ష్మి కీ క్రింది పద్యము మిక్కిలియిష్టము.

ఆ : తేనెసోక నోరు తీయన యగురీతి
దోడనర్థ మెల్లదోచకున్న
గూఢశబ్ద వితతి కొట్లాట పనియేల్ల
మూగ చెవిటివారి ముచ్చటరయ;

ఈ పద్యము విజయలక్ష్మి పలుమారు చదువుకొని యానందించి జనకునితోను, శాస్త్రిగారితోను అప్పుడప్పుడిట్లనుచుండును "కవి, కవిత్వమెట్లు చెప్పవలెనో యావిధము మొల్ల విస్పష్టముగ చెప్పినదండీ. ఆమెకవిత్వ మామె చెప్పిన యట్లేయున్నది. మారుమూల పదములను మిక్కిలి కఠిన శబ్దములనువేసి కవనము చెప్పునట్టి మగవారుగూడ, నాడుదియు కుమ్మరిదియునైన మొల్ల కవిత్వము జూచి సిగ్గుపడవలెనండి." ఆ రామాయణమంతయు విజయలక్ష్మి పితామహికిని జననికిని జదివి వినిపించి తెలియనిచోట్ల నర్థముజెప్పి వారిని సంతోషపెట్టెను. 'అమ్మా! నీ పుణ్యమున రామాయణము అంతయు విన్నానే'యని రత్నమ్మగారు మనుమరాలిని మెచ్చుకొనెను. మొల్ల రామాయణము ముగియగానే దక్షిణామూర్తి శాస్త్రిగారు విజయలక్ష్మికి గట్టు ప్రభువు రచించిన కుచేలోపాఖ్యానము చెప్పనారంభించెను. విజయలక్ష్మి ఆ గ్రంథమును నాలుగుమాసములంతో చదివి ముగించెను. కుచేలోపాఖ్యానములోని యీ క్రిందిపద్యము ఆమెకు మిక్కిలియిష్టము.

సీ. విద్యుమోష్ఠి యొకర్తు, వింజామరలువీవ
లలన యొక్కర్తు కాళంజిబూన
కోకస్తని యొకర్తె యాకుమట్టలొసంగ
గరికి యొక్కర్తె బాగంబులీన
గమలాక్షి యోర్తు బంగారుగిండి వహింప
తొయ్యలియోర్తు పాదుకలుదేర
నెలతుక యొక్కర్తె నిలువుటద్దముజూప
సఖియ యొకతె హెచ్చరికసేయ

తే. గీ: రుక్మిణీ పుణ్యసాధ్వి యూరువులమీద
మస్తకముజేర్చి సత్యభామా వధూటి
తొడలపై బాదములు సాచి కడుసుఖాన
బవ్వళించిన యుందిరా భర్తగాంచె.

ఈ పద్య మామె చదువుచుండగవిని రామేశముగారు తరుచుగ నీ పద్యమును బిడ్డచేత జదివించుకొని వినుచుందురు. హరిశ్చంద్రోపాఖ్యానములోని నీ క్రింది రెండుపద్యములు విజయలక్ష్మి పలుమారు కంఠమెత్తి పాడుచుండును.

చ. హరపదపూజకుం దొలగి యంత్యజగొల్చి కులాభిమానమున్
నరగను వెచ్చబెట్టి హరిచందన కీర్తులు వీటిబుచ్చి దు
ష్కరమగు వల్లకాటి కధికారము నొందిన దుష్టబుద్ధికిన్
గరుణదలంప నెక్కడిది గంధ గజేంద్ర సమానగామినీ!

మ. అకటా! చేరెడు నేలకుం దగడె సప్తాంభోధి వేష్టిభవత్
సకలద్వీపకలాప భూప మకుటాంచత్ పద్మరాగోజ్వల
ప్రకటానర్గళ నిర్గళ త్కిరణ శుంభత్పాదుడై నట్టిరా
జకుమారుండని యేడ్చె కన్ను దవనశ్రుల్ కాల్వలై
పారగన్.

ఈ రెండు పద్యములువిని రత్నమ్మగారు వాని యర్థము జెప్పించుకొని చంద్రమతీ హరిశ్చంద్రుల దుస్థితికి గంటతడివెట్టుకొని దుఃఖించుచుండును.

హరిశ్చంద్రోపాఖ్యానము ముగిసినతరువాత దక్షిణామూర్తిగారు విజయలక్ష్మికి భారతములోని నలోపాఖ్యానమును, సత్యాద్రౌపదీ సంవాదమును చెప్పిరి. బడి లేనప్పుడు విజయలక్ష్మి మధ్యాహ్నమున తనపితామహిని, జననిని యిరుగుపొరుగు కాంతలను జేర్చి తాను చదివిన నలోపాఖ్యానాది గ్రంథములను చదివి యర్థముచెప్పి వారిచిత్తములు రంజింపజేయుచుండును. అదివిని ఇరుగుపొరుగు పడతులు, ఓసెమ్మా, ఆడది చదువుకొనగూడదని మన మగవారందరుగాని చదువుకొని విజయలక్ష్మి ఏమి పాడైనది? ఎన్నెన్ని పుణ్యకథలు మనకు వినిపించుచున్నదో చూడు. అది తల్లిదండ్రుల పుణ్యముసుమీ ? అని తమలోతాము చెప్పుకొనుచు వెళ్ళుచుందురు.

వినాయక చతుర్థినాడు శమంతకమణి వృత్తాంతము చదివించుకొని విని యావ్రతాక్షతలు తలపై వేసుకొని తరువాత మన హిందువులు చంద్రుని జూతురు, అట్లు చేయనిచో నపనిందలు మనపై బడునని మనవారి నమ్మకము. సాధారణముగా దేవాలయములో నెవరో యొకపండితుడు చదివి యక్షతలనిచ్చును. పెద్దలు పిన్నలు గుడికిబోయి కథవిని యక్షతలు శిరసావహించి కొన్ని యక్షతలను తమ బిడ్డలకొరకు, స్త్రీలకొరకును ఇంటికి బట్టుకొని పోవుదురు. విజయలక్ష్మి ఇరుగుపొరుగు వారికట్టి చిక్కులులేవు. ఏలయన విజయలక్ష్మి చతుర్థినాడు మధ్యాహ్నము తనయింటి ఆడువాండ్రను జుట్టుప్రక్కల సుదతులను బిలిపించి బమ్మెరపోతరాజుగారి భాగవతముచేత బుచ్చుకొని దశమస్కంధములోని శమంతకమాణిక్య వృత్తాంతమును శ్రావ్యముగా జదివి యర్థముజెప్పి వారికక్షతలిచ్చి పంపుచుండును. గుడికివెళ్ళలేని మగవారుగూడ విజయలక్ష్మి యిచ్చిన యక్షతలను తమ స్త్రీలచే దెప్పించుకొని ధరించుచుందురు.

ఈ విధముగ విజయలక్ష్మి యాంధ్రభాషలో గొన్ని గ్రంథములు జదివి కొంత సాహిత్యము సంపాదించిన తరువాత, నొకనాడు దక్షిణామూర్తి శాస్త్రిగారు శిష్యురాలికి పాఠము చెప్పిన తరువాత, రామేశముగారితో నిట్లనిరి. "పంతులుగారూ, నాదొక చిన్నమనవియున్నది. అది సావధానముగా చిత్తగించి మీ అభిప్రాయము సెలవిండు. ఇదిగో నా విజ్ఞాపనము వినుడు. నే నిదివరకెందరికో మగపిల్లవాండ్రకు సంస్కృతాంధ్రభాషలు జెప్పితిని. వారిలో కొందరక్కరకువచ్చిరి. కొందరు శుంఠలై నీటికాసులు దెచ్చుకొని జీవించుచున్నారు. నా దగ్గర విద్యాభ్యాసము చేసిన వారిలో మీ యమ్మాయివంటి తెలివిగల వారిని చూడలేదు. ఈమెది కుశాగ్రబుద్ధి. జ్ఞాపకశక్తి మెండు. ఈమె నాలుక మిక్కిలి చులకన. చెప్పినదంతయు, వెంటనే స్వచ్ఛముగ వచ్చుచున్నది. ఇప్పటి కమరములో ప్రథమకాండ కావచ్చినది. ఆంధ్రనామసంగ్రహముగూడ కొంతవరకైనది, తెలుగులో గూడ నాలుగైదు కావ్యములు చెప్పితిని. ఏమోగాని యీమెకు సంస్కృతము చెప్పవలెనని నా కెంతో కుతూహలముగానున్నది. మీ సెలవైనపక్షమున రేపటినుండి శబ్దములారంభించెదను. ఏమిసెలవు" అప్పలుకులువిని రామేశముగారు క్షణమాలోచించి శాస్త్రిగారూ, మీ కంతకుతూహలముగా నున్నప్పుడు నేను మీ కుత్సాహ భంగముచేయుట ధర్మమా ? కాని సంస్కృతభాషచాల కష్టమైనదట. చవటినేల జల్లిన విత్తనములవలె మీ పరిశ్రమ యీమెయెడ వ్యర్థ మగునేమోనని నా భయము. మీ ప్రయత్నము సఫలమగుననీ, మీకు ధైర్యమున్న పక్షమున రేపటినుండియే ప్రారంభింపుడు. రేపుదశమి మంచిది. వర్జ్యముదయముననే వెళ్లిపోవును. అమ్మాయీ, సంస్కృతము చదువగలవా?" అనియడిగిరి. "బాబయ్యా, చదువగలనండి" అని యామె ఉత్తరముచెప్పెను. బాలిక పలుకులువిని శాస్త్రిగారు మిక్కిలి సంతసించిరి. ఆ మరునాడు సాయంకాలము శాస్త్రిగారు కాగితములమీద వ్రాయబడిన శబ్దమఞ్జరి వ్రాతప్రతి యొకటిదెచ్చి సంస్కృతములో నేకవచనము, బహువచనము గాక ద్వివచనముగూడ నుండుననిచెప్పి, రామశబ్దము ప్రారంభించిరి. అట్లు క్రమముగా ప్రతిసాయంకాలము, శాస్త్రిగారు చెప్పుచుండుటచే విజయలక్ష్మి యజంత సాధారణ పుంలింగ, స్త్రీలింగ, నపుంసకలింగ శబ్దములు పదిదినములలో వల్లించి నప్పగించెను. తనప్రయత్నము వ్యర్థముగాదని, శాస్త్రిగారు పరమానంద భరితులై, హలంత సాధారణ శబ్దములు ప్రారంభించి చెప్పిరి. అవిగూడ పదిదినములలో బాలిక వల్లించి శాస్త్రిగారి కప్పగించెను. రామశబ్దము ప్రారంభించిన నెలదినములకే విజయలక్ష్మి విశేషశబ్దములను, సర్వనామములను గూడ వల్లించి యప్పగించెను. సంస్కృతము తనబిడ్డకు రాదేమోనని సందేహించుచున్న రామేశముగారును, తనపలుకు హాస్యాస్పద మగునేమోనని భయపడుచున్న శాస్త్రిగారును, బాలికబుద్ధి విశేషమునకును, శ్రద్ధా భక్తులకును, మేరమీరిన యానంద మొందిరి. పిమ్మట శాస్త్రిగారు, విజయలక్ష్మికి సమాస కుసుమావళిచెప్పి, యనంతరమున క్రియాజ్ఞానము కలుగజేయవలెనని యొక పరస్మైపదమును, నొకయాత్మనేపదమును జెప్పిరి. క్రియాపదములు వల్లించుటలో విజయలక్ష్మికి గొంత శ్రమ కలిగెను. పిమ్మట విజయలక్ష్మికి శాస్త్రిగారు శబ్దమంజరిలోని రామాయణసంగ్రహము చెప్పిరి. దీనినామె సులభముగానే గ్రహించెను. అది ముగిసినతరువాత, దక్షిణామూర్తి శాస్త్రిగారు విజయలక్ష్మిచేత వాల్మీకి రామాయణములోని ప్రథమసర్గయై బాలరామాయణమని పేరువడసిన భాగమును జదివించి విపులముగ నర్థముచెప్పిరి. అదియు ముగిసినతరువాత, రామేశముగారు తనకుమార్తెకు రఘువంశము జెప్పుమని కోరగా శాస్త్రిగారు, "పంతులుగారూ, రఘువంశము కొన్ని క్లిష్టాన్వయములతో గూడియున్నది. ప్రారంభకులకు ముందుగ బద్యకావ్య మారంభించుటకంటె వచనకావ్య మారంభించుట మంచిది. అందుచేత నేను హితోపదేశ మారంభించి చెప్పెదను. ఆదివచన కావ్యమైనను దానిలో నడుమ నడుమ గొన్ని శ్లోకములు గలవు. గద్య పద్యాత్మకమైన యాగ్రంథమును జదివిన పక్షమున భాషలో మంచిజ్ఞానముగలుగును. అదిజెప్పినతరువాత రఘువంశ మారంభించెదను" అని విన్నవించి మరునాడు నాగరలిపిలోనున్న హితోపదేశ గ్రంథమునుదెచ్చి "అమ్మాయీ, ఇది తెనుగులిపిలోలేదు, దేవనాగరి లిపిలోనున్నది. ఏవోగొన్నిదప్పు

సంస్కృత గ్రంథములు దేవనాగరలిపిలోనే యుండును. ఆలిపి గూడ నీవు నేర్చుకొనుట మంచిది. ఈ దినమున నీకు నే నచ్చులు చెప్పి వ్రాసియిచ్చెదను. అవినీవు దిద్ది రేపునా యెదుట స్వతంత్రముగ వ్రాసిజూపుము. పిమ్మట హల్లులు, మొదలైనవి చెప్పెదను. అని పలికి శాస్త్రిగారు నా డకారాదులైన యచ్చులను పలకమీద వ్రాసియిచ్చి ముందుగ తాను దిద్దించి వెళ్లిరి. విజయలక్ష్మి గురువుగారు వెళ్లినతరువాత నాయక్షరములను కొన్నిసారులు దిద్దుకొని కాగితముమీద గురువుగారుపెట్టిన వరవడి చూడకుండగ వ్రాసికొని మరునాడు గురువుగారి యెదుట నలవాటుపడిన తెనుగక్షరములవలెనే వ్రాసి చదివెను. ఆ మరునాడు శాస్త్రిగారు కకారాదులైన హల్లులను వ్రాసియిచ్చిరి. య, ర, వ, ల వరకున్నన్న హల్లులన్నియు నామెయొక్క వారములో వ్రాయ నేర్చెను. శాస్త్రిగారు క్రమక్రమముగా, హితోపదేశము విజయలక్ష్మి చేత చదివించి చెప్పనారంభించిరి. చెప్పినదెన్నడు మరచిపోక విజయలక్ష్మి చూపినంతమాత్రమున నందుకొని, హితోపదేశమునం గల నాలుగు తంత్రములను నాలుగు మాసములలో జదివి వ్రాసి యర్థము చెప్పగలిగెను. అసాధారణమైన యామె తెలివితేటలకు దక్షిణామూర్తిగారు తద్దయు నాశ్చర్యము నొందిరి. రామేశముగారు సంతోషించి మనసులో నొక్కింత గర్వపడిరి. హితోపదేశము ముగిసినతరువాత శాస్త్రిగారు విజయలక్ష్మికి రఘువంశము చెప్పనారంభించిరి. దినమునకొక్క శ్లోకముచొప్పున శాస్త్రిగారామెచే జదివింపగా నొకపక్షమైన తరువాత బాలిక, "శాస్త్రిగారూ, దినమునకు నాకు రెండు శ్లోకములు జెప్పండి" అనియడిగెను, ఆమె కోరిక ననుసరించి శాస్త్రిగారు మరునాటినుండి దినమునకు రెండుశ్లోకములను చెప్పనారంభించిరి. పదవిభాగము, ప్రతిపదార్థము, దండాన్వయము, మొదలైన వానిలో నొక్కతప్పైనను లేకుండ ననుదినము విజయలక్ష్మిగురువుగారి కప్పగింపసాగెను. ఆకలిగొన్నవాడు చకచక నన్నముతిన్నట్లు, తెలివిగలవారు విద్యమిక్కిలి వేగముగా గరచుటలో నాశ్చర్యమేమున్నది? బుద్ధివిశేషమునందు స్త్రీలు పురుషులు అను భేదములేదుగదా ? విద్య కధిదేవతయైన సరస్వతి స్త్రీయేగదా ?

ఈ విధముగ శాస్త్రిగారు రఘువంశములో నాలుగు సర్గలు విజయలక్ష్మికి చెప్పి, పిదప కుమార సంభవము ఆరంభించిరి. ఒకనాడు శాస్త్రిగారు పార్వతీదేవియొక్క విద్యావిషయమై చెప్పుచు, కాళిదాసు కుమార సంభవ కావ్యములో 'ప్రపేదిరే ప్రాక్తన జన్మవిద్యాః' పూర్వజన్మమునందలి విద్య లామెను పొందెనని దానియర్థము. అలాగే మీ యమ్మాయినిగూడ మునుపటి జన్మవిద్యలు వచ్చిచేరుచున్న వేమోనని నాకు తోచుచున్నది, లేనియెడల, బదునొకడేండ్ల బాలికయీమి యింతవేగముగా విద్యాగ్రహణము చేయుటేమి? నేను చాలామంది, మగపిల్లలకు విద్యచెప్పితినిగాని, మీ పిల్లవలె సూక్ష్మబుద్ధిగల విద్యార్థిని నే చూడలేదు. పూర్వ జన్మమునందీమె విద్యా విశారదయైన యంగనయై యుండవచ్చును. ఇది మీ పుణ్యము."

ఇట్లీ సంస్కృత విద్యాభ్యాసము జరుగుచుండగ నొకనాడు శాస్త్రిగారు రామేశముగారిని బిలిచి "అయ్యా ! పంతులుగారూ, ఈ సాహిత్యమునకు తోడుగ మీ అమ్మాయికి సంగీతము గూడ జెప్పించిన బాగుండును. సంగీతమనగ, ఫిడేళ్లు, వీణ, చెప్పించుమని నా యభిప్రాయముగాదు. అధ్యాత్మరామాయణము కీర్తనలు చక్కగపాడుట నేర్పింపుడు" అని జెప్ప బాగుగ నా కీర్తనలు చెప్పగలవారెవరండి ? యని రామేశముగారడిగిరి. అడుగగ దక్షిణామూర్తి శాస్త్రిగారు "పంతులుగారూ. మీరు సావధానముగ వినుడు. ఈ యూరిలో నొక వైష్ణవస్త్రీ గలదు. ఆమెపేరు చూడికుడుతమ్మ. ఆమె చరిత్రము మీరు వినవలసినదే. ఆమె తండ్రిగారిపేరు ముడుంబై ముకుందాచార్యులుగారు. ఆయన యిప్పుడులేరు. ఆయనపూర్వము యాయవారము చేసి జీవించెడివారు. ఆయనమిక్కిలి పేదవాడు. ఏ విధమైన యాస్తియులేదు. ఆయనకు ద్రావిడదివ్య ప్రబంధములు గొన్ని కొన్ని కంఠపాఠముగ వచ్చును. అదిగాక యధ్యాత్మరామాయణకీర్తనలుగూడ మిక్కిలి చక్కగ పాడగలిగినవారు. యాయవారమునకు వెళ్లినప్పుడుగూడ రామాయణకీర్తనలు పాడుచు వెళ్ళుచుండెడివారు. ఆయనకు చూడికుడుతమ్మ యేకపుత్రిక. కొత్తాలపట్టునుండి యొక వైష్ణవకుమారుని తీసుకొని వచ్చి యీ పిల్లనిచ్చి పెండ్లిచేసెను. కాని దురదృష్టమున వివాహమైన సంవత్సరమునకే యాయిల్లుడు మృతినొందెను. ఆ బాలవితంతువున కాయన మరియొక యాస్తియేదియు నీయలేక యధ్యాత్మరామాయణ కీర్తనలను గట్టిగ చెప్పెను. భర్తమొగ మెరుగని యా బాలవితంతువు అధ్యాత్మ రామాయణమే పిత్రార్జితమని భావించి యందు మంచికృషిచేసి పేరువడసెను. ఈ యూరిస్త్రీలు పెక్కండ్రు చూడికుడితమ్మదగ్గర నధ్యాత్మ రామాయణ కీర్తనలు నేర్చుకొనుచున్నారు. మీ యమ్మాయికి గూడ నామెయొద్ద నధ్యాత్మము జెప్పింపుడు. నెలకు రెండు రూపాయలిచ్చినపక్షమున నామె ప్రతిదినము మీ యింటికి వచ్చి పాఠము చెప్పుచుండును. మధ్యాహ్నము పండ్రెండు గంటలకు విజయలక్ష్మికి బడియుండదుగనుక నామెయొద్ద నప్పుడు కీర్తనలు చెప్పుకొనవచ్చును. సాయంకాలమున నేనువచ్చి యెప్పటివలె సంస్కృత కావ్యములు చెప్పుచుందును. కుమార సంభవ కావ్యములో మూడు సర్గలైనవి. నాలుగవదిగూడ చెప్పి యీ కావ్యము వదలిపెట్టుదును." రామేశముగారు సరేయని చూడికుడుతమ్మతో మాటాడి తమ యింటికి నామెను బంపుమని శాస్త్రిగారితో జెప్పిరి. ఆ సాయంకాలమే శాస్త్రిగారు చూడికుడుతమ్మగారి యింటికి వెళ్లి మాటాడిరి. మరునాటినుండి చూడికుడుతమ్మ రామేశముగారి యింటికి వెళ్లి విజయలక్ష్మి కధ్యాత్మరామాయణము జెప్ప నారంభించెను. అప్పటికి విజయలక్ష్మికి రమారమి పదునొకండు సంవత్సరములు నిండవచ్చెను. రామేశముగారి తల్లికి దన మనుమరాలు వివాహము గాకుండగనే రజస్వలయగునేమో యని భయము పట్టుకొనెను. పూర్వాచారపరాయణయైన యా నారీమణి యొకనాటి రాత్రి భోజన సమయమందు, దన కుమారుని

కెదురుగ గూర్చుండి యాయనతో నిట్లు ప్రసంగించెను. "అబ్బాయీ, నాకు బుద్ధిలేక యువకతవకమాట లేవో మాట లాడుచుందును. కోపగింపక చెవియొగ్గి శ్రద్ధతో నా వెఱ్ఱి కూత లొకసారి వినుము. నీ కుమార్తెకు రేపటి విజయ దశమికి పదునొకండు సంవత్సరములు నిండిపోవును. పండ్రెం డవ యేడు వచ్చెనా నీ పుత్రిక పెద్దది యగును. మీ నట్టింట నిలిచి నేనా ఘోరకృత్యము సహించజాలను. వివాహ మగు వరకు నేను మంచిలి వెళ్లి మా పుట్టింట నుండెదను. నేను వెళ్లిన తరువాత నామె వివాహము గాకమునుపే పెద్దదియైన పక్షమున నీవు, నీ భార్యయు, మీ యిష్టము వచ్చినట్లు చేసి కొనుడు. ఇచ్చట నిలిచి, నేనా యప్రతిష్ఠ భరింపజాలను. రాజుల పిల్లలకు, శూద్ర బాలికలకు నైన యట్లే యుక్త వయస్కురాలైన తరువాత నీ బిడ్డకు నీవు వివాహము చేయ వచ్చును. నాకు మంచిలిలోనే మరణమున్నది గాని, నీ చేతిలో గోదావరీ తీరమందు, మరణించు యోగము నాకు లేదు. ఈ బెంగచే నేను కుళ్లిపోవుచున్నాను. మనోవ్యాధికి మందు లేదన్నారు పెద్దలు." అని కంట తడి పెట్టుకొని గద్గద స్వరముతో మరి యేమో చెప్పబోవుచుండ రామేశముగారు తల్లిమాట కడ్డమువెళ్లి యిట్లు చెప్పిరి. "అమ్మా, బెంగ పెట్టుకొనకు. అటువంటి యాపదగాని, యప్రతిష్ఠగాని మన కుటుంబమునకు రానిచ్చు సంతటి దుర్మార్గుడను గాను. నేనును మా నాన్నగారి వలెనే పూర్వాచారములందు మిక్కిలి యాసక్తి గలవాడను. నా కుమార్తెకు లోకు లందరి వలెనే మన సాంప్రదాయము ననుసరించి వివాహము చేయవలెనన్న సంకల్పము నాకున్నది. దొడ్డిపట్లకు నేను జాబు వ్రాసి నా మామగారిని రప్పించి మంచి సంబంధమును వెదకి తీసికొని రమ్మని ప్రార్థించెదను. రే పుదయమె జాబు వ్రాసెదను. చూడు నీవు మంచిలి వెళ్లనక్కరలేదు. మరియొక చోటికి బోనక్కరలేదు. నీ మనసునకు వ్యసనము కలిగించిన తరువాత నా బ్రతు కెందుకు. "నమాతుః పరదైవతః" అను ధర్మ వాక్యమునందు నాకు నమ్మిక కలదు. ఇక నీవు బెంగ విడిచి, పిండి దిని హాయిగ నిద్రపొమ్ము." ఆ పలుకులు విని రత్నమ్మ గారు కొంత ధైర్యము దెచ్చుకొని పిండి తిని పండుకొని నిద్రపోయిరి. రామేశముగారు తల్లి కిచ్చిన యభయప్రదా నము మరువక మరునా డుదయమున ముందుగ మామగారిని రమ్మని జాబు వ్రాసిరి. ఆ జాబు చేరిన తోడనే తల్లాప్రగడ రామచంద్రయ్యగారు దొడ్డిపట్ల నుండి నరసాపురము వచ్చిరి. అప్పుడు రామేశముగారు మామగారిని బిలిచి "మామగారూ, వెనుక నే నన్న మాట మరచిపొండు. పిల్లకు వివాహయోగ్యమైన వయసు వచ్చినది. ఇంక జాగుచేయుటకు వీలులేదు. కావున మీరు శ్రద్ధచేసి వెళ్లవలసిన చోట్లకు వెళ్లి మంచి సంబం ధము వెదకికొని రండు. మన యారువేల వారు ఎట్టివారో కొంచెము చెప్పెదను వినుడు: ప్రసంగవశమున మొన్న మన శాస్త్రిగారు నా దగ్గర నీ క్రింది పద్యము చదివినారు.

సీ. అఖిల రాజాధి రాజాస్థాన జనహృద్య విద్యా విహారు
లార్వేల వారు
కల్పక బలి కర్ణ కలశార్ణ వోదీర్ణ వితరణోదారు లా
ర్వేలవారు
ఘన దుర్ఘటస్వామికార్య నిర్వహణ ప్రవీణతా ధారు
లార్వేలవారు
సజ్జన స్తవనీయ సతత నిర్వ్యాజహారి పరోపకారు
లార్వేలవారు.

తే. గీ. విమత గర్వాపహారు లార్వేలవారు . . . .

దీనింబట్టి చూడ మన యార్వేల నియోగులు మంచి మంచి దాతలై, రాజుల దగ్గర మంత్రులై, సేనాపతులై లోక మున గొప్ప ఖ్యాతి సంపాదించిరని తేలుచున్నది. కవులందరు మనవారే. ఈ ప్రాంతముల నున్న యార్వేలవారిలో మనతో సంబంధము కలిపినవారు కొంద రున్నారు, కొచ్చర్ల కోట వారు, విన్నకోటవారు, తల్లాప్రగడవారు, గాదివారు, పెద్దాడ వారు మొదలైనవారు. వీరిలో ఘన కనుకూలమైన పిల్లవాని నొకనిని వెదకి తీసికొనిరండి. కట్నము మాట మీరే పరిష్కరించ వచ్చును. ఆ విషయమై సర్వాధికారము మీకే యిచ్చినాను. పిల్లవాడు చదువుకొన్నవాడు గావలెను. రూపవంతుడుగ నున్న మంచిది. తల్లిదండ్రు లుండవలెను. కొంచెము భూవసతి గూడ నుండవలెను. పదిమంది బందుగు లున్నవారు దొరుకుట మంచిది. అన్న వస్త్రములున్నచోట బడవేసిన పక్షమున మనము పిల్ల విషయమై బెంగ పెట్టుకో నక్కరలేదు. పిల్ల చదువు విషయమై మీ రెరుగుదురు గదా ? తెనుగు, సంస్కృ తము గూడ చదువుకొన్నది. అధ్యాత్మము హాయిగ పాడగలదు. దాని గుణగణముల మాట నే చెప్పగూడదు. మీరు రేపె బయలు దేరి వెళ్లి నా కేవర్తమానము చెప్పుడు. ఇదిగో యీ పదు నైదు రూపాయలు మీ దగ్గర నుంచి, దారి ఖర్చుల క్రింద నుపయోగింపుడు. మీ దగ్గర సొమ్ము లేదని, మీరు ఖర్చు పెట్టలేరని నే నిచ్చుటలేదు. నా పనిమీద మీరు వెళ్లునప్పుడు నే నిచ్చుట ధర్మమని నాకు తోచినది." అని రూపాయలు దీసి పుచ్చుకొమ్మనగా "సొమ్మెందుకు, నా మనుమరాలు నాకు విధాయకము గాదా ? ఈమాత్రము సొమ్ము నేను ఖర్చుపెట్ట దగనా ?" యని సొమ్ము పుచ్చుగొనక కొంత బెట్టు సరి జేసిరి. అంతట దుర్గమ్మ వచ్చి "బాబయ్యా, తప్పు లేదు. పుచ్చుకో. మనుమరాలు పెండ్లికి నీ యిష్టము వచ్చి నంత సొమ్ము పెట్టవచ్చును. నీవు పెట్టతగిన వాడవు. మేము తినతగ్గ వారము." అని పలికి యా సొమ్ము తాను పుచ్చుకొని తండ్రి చేతిలో పెట్టెను. అప్పుడుకూడ వద్దనుట మోట దనముగ నుండునని రామచంద్రయ్యగారు, మారు మాటాడక యా పైకము గ్రహించి బొడ్డు కొంగున మూటగట్టెను. ఆ మరునా డుదయమున రామచంద్రయ్యగారు పంచాంగము చూచి, తిథి, వార, నక్షత్రములు జూచి, వర్జ్యములేని సమయ మున, పుణ్యస్త్రీ తన కెదురుగ వచ్చుచున్నట్లు జూచి యా మంచి శకునమున బయలుదేరిరి. అట్లు బయలుదేరి రామ

చంద్రయ్యగారు పేరెన్నికగన్న యార్వేల నియోగులున్న ప్రదేశములకు వెళ్లి వారి వారితో మాటాడి చేయవలసినంత వాకబుచేసి చేసి, రమారమి పది పంద్రెండు దినములలో మరల నరసాపురము వెళ్లి యల్లుని, గూతుని, వియ్యపురాలిని గూర్చుండబెట్టుకుని తన ప్రయాణ విషయముల నీవిధముగ జెప్పజొచ్చిరి. "నేను ముందుగ మొగలితుర్రు గ్రామము వెళ్లితిని. అక్కడ మన కుపయోగించువా రెవరు లేరు. పిమ్మట వీరవాసరము వెళ్లితిని. పెద్దాడవా రచ్చట నున్నార. గాని మనము కోరిన లక్షణములు గల వరుడు వారిలో లేడు చదువుకొన్నవా రున్నచోట భూవసతి లేదు. విద్యయు, భూవసతి యున్నచోట హీనదోషము పట్టినది. అక్కడనుండి కోనాలయు, తణుకు, పెనుగొండ వెళ్లి వాకబు చేసితిని. వారికి పెద్ద పెద్ద కట్నములమీద నెక్కువ యాశ యున్నది. ఒకా నొకరు వేయి నూట పదారు రూపాయలు కట్నముగాను, వియ్యపురాలు యాడుపడుచు లాంఛనముల క్రింద మూడు నూటపదియారులు రొఖ్ఖమును గావలెనని కోరిరి. ఇవిగాక పెండ్లికుమారునకు వెండి చెంబులును, జరీ పట్టు పంచలు తప్పక పెట్టవలెనని చెప్పిరి. కొందరు నాలుగై దెకరముల భూమి కట్నము కోరిరి. కొందరు "మేము బోగము మేళము పెట్టుకొందుము. దాని ఖర్చు మీరు భరింపవలె ననిరి". కొందరు సంగీత సభలు పెట్టింతుము. దాని ఖర్చు మీరే భరింపవలె ననిరి. తమకు తమ బందుగులకు రాను పోను ఖర్చు లిమ్మని యడిగిరి. అవి యన్నియు విని విని ప్రాణము విసిగి నేను రేలంగి గ్రామము వెళ్లితిని. అక్కడ విన్నకోటవారి కుటుంబములు రెండున్నవి. ఒక కుటుంబ యజమాని పేరు రథాంగపాణిగారు. రెండవ కుటుంబ యజమాని పేరు శేషశాయిగారు. వీ రిరువురును సోదరులు. వా రిరువురకు చెరి రెండు పుట్ల భూమి యున్నదట. వారి సాంప్రదాయము మంచిది. పూర్వము విన్నకోటవారిలో గొప్ప కవు లుండెడివారట. వీరికా కవిత్వము మొదలైన వేవియు లేవు. పెద్దల గొప్ప చెప్పుకొని యుప్పొంగుచుందురు. కాని గౌరవమునకు, నన్నవస్త్రములకు లోటులేదు. అన్నదమ్ము లిద్దరు గూడ వేరుగ నున్నారు. తమ భోజనముల వేళకు నతిధులు, నభ్యాగతులు నెవరైన వచ్చిన పక్షమున వారిని గౌరవించి యన్నోదకములిచ్చి బంపుదురు. చుట్టుప్రక్కల గ్రామములలోను, రేలంగిలోను వారికెంతో పలుకుబడి గలదు. అన్నదమ్ము లిద్దరకు మంచి పెంకుటి భవంతులు గలవు. పాడి యున్నది. అందులో రథాంగపాణిగారికి ఒక కుమాటుడున్నాడు. ఆ పిల్లవాని పేరు విశ్వనాథము. అతడు రాజమహేంద్రవరములో నింగ్లీషు జదువుచున్నాడు. అతని వయసు పదునెనిమిది సంవత్సరములు. ఇప్పుడు సెలవుదినము లగుటచే నత డింటియొద్దనే యున్నాడు. నే నతనిని జూచితిని. పిల్లవాడు పచ్చగ దబ్బపండువలె నున్నాడు. పరీక్షలలో నేటేట కృతార్థుడై యింతవరకు వచ్చినాడట. అతడు విశేషము పొడగరి కాడు. పొట్టివాడును గాడు. తగిన పొడుగును, లావును గలవాడు. చేతులకు బంగారపు మురుగు లున్నవి. రథాంగపాణిగారికి మొత్తము ముగ్గురు కుమారులు గలరు. వారిలో యీ విశ్వనాథమే జ్యేష్ఠుడు. రెండవవాడు చంద్రశేఖరుడు. అతడు గూడ రాజమహేంద్రవరములోనే చదువుచున్నాడట. మూడవవాడు తొమ్మిదేండ్ల వయసువాడు. రేలంగిలో నొక తెనుగు బడిలో జదువుచున్నాడు. రథాంగపాణిగారి యత్తవారి గ్రామము నిడదవోలు. ఆయన భార్య తల్లాప్రగడవారి యాడుపడుచు. ఆమెపేరు భ్రమరాంబ. ఆ దంపతుల కొక కుమార్తె గలదు. ఆమె పేరు పేరిందేవి. రథాంగపాణిగా రా పిల్లను మన యాచంట వారికే యిచ్చినారు. వారిది పెంటపాడు. మీరు కోరిన లక్షణము లన్నియు రథాంగపాణిగారి కుమారునియొద్ద నున్నవి. చదువున్నది. భూమి యున్నది. రూప మున్నది, మంచి సాంప్రదాయ మున్నది. పిల్లవాని యొద్ద వినయ విధేయతాది గుణము లున్నవట. చదువు మీద మిక్కిలి శ్రద్ధ యున్నదట. కోపముగాని, పొగరుబోతుతనముగాని, లేశము లేవట. మన సంబంధము మాట రథాంగపాణిగారితో నేను ముచ్చటించినాను. కట్న మేమి గావలెనని యడిగితిని. అడుగ సాంప్రదాయము మంచిదై పిల్ల లక్షణము గలదైన, పక్షమున వేరే కట్న మెందుకు? పిల్లవానికి పెండ్లి కూతురే కట్నము. పిల్లకు వరుడే కట్నము. సాంప్రదాయము మంచిది కానప్పుడు వేయి వరాలు కట్నమిచ్చినను మా కక్కర లేదు. పిల్ల లక్షణమైనది కానప్పుడు పదివే లిచ్చినను నే నంగీకరింపను. రామేశముగారిని నే నెరుగుదును. వారు బంధుసముద్రులు. సత్సాంప్రదాయకులు. కావున నేను కట్నముల విషయమై పీకులాడను. పిల్ల మాకు నచ్చిన పక్షమున నేనే విధమైన కట్నము గోరకయే సంబంధ మంగీకరింతును. పది దినములలో నేను నరసాపురము వచ్చి పెండ్లికూతును జూచెదను. ఆచంట వారికిని, విన్నకోట వారికిని మా పెద్దల నాటినుండియు సంబంధములు కలిసినవే. మా పిల్లవానిని రామేశముగారు చూడదలచుకొన్న పక్షమున రావచ్చును. తప్పక నేను పది దినములలో వచ్చెదను. మీరీపూట మాయింట భోజనముజేసి వెళ్లుడు" అని ప్రసంగించిరి. కలికిన నతకదను సామెత గలదు. గనుక నే నేదో వంకజెప్పి తప్పించుకొని బలిజేపల్లివారి యింట భోజనముజేసి మంచిలి వెళ్లి గాదివారితో నీ విషయము జెప్పి ప్రయాణము సమాప్తము జేసి మీ కడకు వచ్చితిని. మీరు ఖర్చుల క్రింద యిచ్చిన పదునైదు రూపాయలలో మూడు రూపాయలు నావద్ద మిగిలినవి. మీరు సొమ్ము నాయొద్ద బుచ్చుకొనరు గనుకనే నా సొమ్ము నా మనుమరాలి కిచ్చి బోయెదను. కోపపడవద్దు."

ఎనిమిదవ ప్రకరణము

పిమ్మట రమారమి పదిదినములలో రేలంగినుండి విన్నకోట రథాంగపాణిగారు తమ పురోహితుని వెంటబెట్టుకొని నరసాపురమువెళ్లి తిన్నగ రామేశముగారి యింటికి వెళ్లక వారి జ్ఞాతులైన విన్నకోటసేతుపురావు గారింటికి వెళ్లి యచ్చట బసచేసి తమరాక రామేశముగారికి తెలియపరిచిరి. మధ్యాహ్నము భోజనానంతరమున విజయలక్ష్మిని జూచుటకై రథాంగపాణి

గారు రా నిశ్చయించిరి. ఆందువలన రామేశముగారు వారి సమావేశమునకు దగు ప్రయత్నములు జేసిరి. కనకదుర్గమ్మ కూతునకు దలయంటి, బొట్టుకాటుకబెట్టి, జడవైచి, పరిశుభ్రమైన బట్టలు కట్టబెట్టి, బిడ్డకుగల నగలన్నియు బెట్టి సిద్ధముగ నుంచెను. రామేశముగారు, తివాసులు, చాపలు, జంబుకానాలు పరిపింపుమని గుమాస్తాతో జెప్పి యాదినమున బెందలకడ కచేరినుండి యింటికివచ్చిరి. వారువచ్చిన గొంతసేపటికి దక్షిణామూర్తి శాస్త్రిగారును, మరికొందరు బంధుమిత్రులును వచ్చి సావడిలో గూర్చుండిరి. అప్పుడు సేతుపురావుగారిని వెంటబెట్టుకొని రథాంగపాణిగారును వారిపురోహితుడును దయజేసిరి. రామేశముగారు వారికెదురుగ వెళ్లి గౌరవముగ దీసికొనివచ్చి తివాసిమీద గూర్చుండబెట్టి సావడిలోనున్న వారిని వారికెరుకపరచిరి. ఆ సమయమునకే దొడ్డిపట్లనుండి తల్లాప్రగడ రామచంద్రయ్యగారుకూడా దయచేసి లోనికిబోయి పాదప్రక్షాళనముజేసి దాహము పుచ్చుకొనివచ్చి సావడిలో గూర్చుండిరి. అప్పుడు రామేశముగారు "అమ్మాయీ విజయలక్ష్మి" యని కూతుంబిలిచిరి. సావడిప్రక్కనున్న గదిలో రత్నమ్మగారును, కనకదుర్గమ్మయు గూర్చుండిరి. సావడిలో జరిగిన సంభాషణము వారికి వినబడుచుండెను. సావడిలో జరిగిన చర్యలు గవాక్షమునుండి వారికిగనబడుచుండెను. అప్పుడు విజయలక్ష్మి ముసి ముసినవ్వులు నవ్వుకొనుచు, కొంచెము తల వంచుకొని తండ్రిప్రక్కను గూరుచుండెను. బాలిక రూపరేఖా విలాసముల జూడగానే రథాంగపాణిగారి కా బాలికమీద ప్రేమ కుదిరెను. 'అమ్మాయికేమైన పాటలు వచ్చునా ?' యని రథాంగపాణిగా రడిగిరి. "ఈ మధ్యనే రెండు మాసములనుండి యధ్యాత్మ కీర్తనలు నేర్చుకొనుచున్న"దని రామేశముగారు బదులుచెప్పిరి. ఏదీ ! యొక కీర్తనపాడింపుడని రథాంగపాణిగారు కోరగా, విజయలక్ష్మి తండ్రిగారు పాడుమని సంజ్ఞచేయగ గంతమెత్తి నిర్భయముగ నొకకీర్తన పాడెను. రామచంద్రయ్యగారు మరియొక కీర్తన పాడించిరి. ఆ రెండును మిక్కిలి శ్రావ్యముగ విజయలక్ష్మి కంఠమెత్తి పాడెను. ఈపిల్ల చదువుకొన్నదాయని, రథాంగపాణిగారి పురోహితుడు ప్రశ్నించెను. అప్పుడు దక్షిణామూర్తి శాస్త్రిగారందుకొని, "చదువుకొన్నదాయని మెల్లగ నడుగుచున్నారా ? బాలికా పాఠశాలలో నాలుగవతరగతిలోనో, యైదవతరగతిలోనో చదువుచున్నది. విశేషించి తెనుగులోను సంస్కృతములోను, కొన్ని కావ్యములు జదివినది" యనిచెప్పిరి. ఏమి ? కావ్యములు జదివినదా ? ఏవి ? రెండుమూడు పద్యములో, శ్లోకములో చదివించుడు విందము"అని రథాంగపాణిగారు విస్మయముతో నడిగిరి. అంతట దక్షిణామూర్తి శాస్త్రిగారు అమ్మా ! విజయలక్ష్మి ! అమరములోని శ్లోకములొకటి రెండు చదువుతల్లీ !" యని హెచ్చరించిరి. వెంటనే విజయలక్ష్మి "సర్వజ్ఞస్సుగతోబుద్ధో"యను శ్లోకమును జదివెను. ఈపేళ్లేవరివమ్మా యని దక్షిణామూర్తి శాస్త్రిగారడుగ "బుద్ధదేవుని పేళ్లని" బాలిక ప్రత్యుత్తరమిచ్చెను. మరియొక శ్లోకము జదువుమని రామచంద్రయ్యగారు కోరగా, విజయలక్ష్మి "అరవింద మశోకంచ, చూతంచ నవమల్లికా, నీలోత్పలంచ, పంచైతే పంచబాణ స్యసాయకాః" యను శ్లోకము జదివెను.

దానియర్థము జెప్పుమని శాస్త్రిగారడిగిరి. "తామరపువ్వు, అశోకపుష్పము, మామిడిపువ్వు, మల్లిపువ్వు, నల్లగలువపువ్వు నను నీ యైదును. మన్మథుని బాణములని దీనియర్థము" అని విజయలక్ష్మి చెప్పెను. తెనుగుపద్యమొకటి జదువుమని రథాంగపాణిగారు కోరగా విజయలక్ష్మి తనకు మిక్కిలి యిష్టమైన కుచేలోపాఖ్యానములోని "విద్రుమోష్ఠి యొకర్తు వింజామరలువీవ" యను పద్యమును మిక్కిలి శ్రావ్యముగ, రాగవరుసతో జదివెను. దానితాత్పర్యము చెప్పుమని సేతుపురావు గారడుగగా విజయలక్ష్మి యిట్లు జెప్పెను "శ్రీ కృష్ణమూర్తి దర్శనమునకు కుచేలుడు వెళ్లునప్పటి కా కృష్ణ భగవానుడు రుక్మిణి తొడపై శిరసుపెట్టుకొని, సత్యభామ తొడలపై బాదములు చాపుకొని పండుకొనియుండెను. ఒకభార్య వింజామరులు వీచుచుండెను. మరియొకతె తమలపాకులు చుట్టి యిచ్చుచుండెను. ఒకతె నిలువుటద్దము జూపుచుండెను. ఈ విధముగా భార్యలందరు స్వామికుపచారము చేయుచుండిరని దీని భావము"అని సహజమధుర భాషణములతో తాత్పర్యముజెప్పి సభాసదులను రజింపజేసెను. సంస్కృత కావ్యములుగూడ చదివినదని చెప్పినారే ! ఒకటి, రెండుశ్లోకములనుగూడ చదివి యర్థము చెప్పుమనుడని రథాంగపాణి గారడిగిరి. అడుగగా దక్షిణామూర్తి శాస్త్రిగారు, "విజయలక్ష్మీ! రఘువంశములోని శ్లోకమొకటి చదివి, యర్థము చెప్పుమమ్మా" యని సెలవిచ్చిరి. ఇచ్చుటయు విజయలక్ష్మి నిర్భయముగ శ్లో. నమేహ్రియా శంసతికించి దీప్సితం, అను శ్లోకము జదివి తాత్పర్యము ఈ క్రింది విధముగ జెప్పెను. దిలీప మహారాజు భార్య సుదక్షిణాదేవి గర్భవతియై యున్న సందర్భములోని శ్లోక మిది. ఆమెకు నేమేమి కోరిక లున్నవో తీర్చుటకా మహారాజు నిశ్చయించుకొనెను. కాని సిగ్గుచేత నామె తన కోరికలు జెప్పనందున మహారాజామె చెలికత్తెలయొద్దకు బోయి, యామె గోరికలేవో మీరు కనుగొని నాకు చెప్పుడని పలుమా రడిగెనని దీని భావము. తరువాత శాస్త్రిగారు అమ్మా . కుమార సంభవములోని శ్లోకము గూడ నొకటి జదివి భావము చెప్పుమని కోరిరి. విజయలక్ష్మి గురువుగారి కోరిక నమసరించి, "ఇద్ధ మారాధ్య మానోపి, క్లిశ్నాతి భువనత్రయం" అను శ్లోకమందుకొని భావ మీ క్రింది విధముగ జెప్పెను. తారకాసురుని బాధపడలేక, దేవతలు బ్రహ్మదేవుని యొద్దకు బోయి మొరపెట్టుకొన్న సందర్భములోనిదీ శ్లోకము. బ్రహ్మదేవా ! తారకాసురునకే సౌకర్యములుగావలెనో యవి యన్నియు, మేము జేయుచున్నాము. వాని నీ విధముగ మే మారాధించుచున్నను, వాడు మూడు లోకములను బాధపెట్టుచున్నాడు. తిరిగి యపకారము జేసినపుడే దుర్జనుడు లొంగునుగాని యుపకారములు చేసినచో లొంగడని భావము.

సంగీత సాహిత్య పరీక్షలైన దరువాత, బాలికకు లోకజ్ఞాన మేమాత్ర మున్నదో తెలుసుకొనుటకై సేతుపురావుగారి

క్రింది ప్రశ్న మడిగిరి. "అమ్మాయీ, ప్రస్తుతము మన దేశ మేలుచున్న కుంభినీవా రెవరు? ఎచటనుండి వచ్చిరి?" బాలికా పాఠశాలలో జదువుచున్నది గావున విజయలక్ష్మి తడవుకొన కుండ నీ క్రింది ప్రత్యుత్తర మిచ్చెను. కుంభినీవా రనగా కంపెనీ వారన్నమాట. ఆ మాట తెలియక మనవారు కుంభినీవా రను చుందురు. వర్తకము కొరకై వా రింగ్లాండునుండి మన దేశము వచ్చి, యాక్రమించుకొని యేలుచున్నారు. ఈ ప్రత్యుత్తరము వినగానే "బావగారూ, మేము ప్రస్తుతము సెలవు పుచ్చుకొందుము. మాకు అనుజ్ఞ దయచేయుడు. నే నింటికి వెళ్లి మా యాడువాండ్రతో మాటాడి మీకు జాబు వ్రాసెదను. కట్నములు, కానుకలు, మే మేమియు గోరము. సెలవు" అని రథాంగపాణిగారు లేచిరి. వారితో సేతువురావుగారును, పురోహితుడును గూడ లేచిరి. వారిని వీథి గుమ్మము వరకు సాగనంపి లోపలకు వచ్చి "శాస్త్రిగారూ మీ శిష్యురాలు, వా రడిగిన ప్రశ్నల కన్నింటికి బాగుగ సమాధానము చెప్పినది. రథాంగపాణిగారు మాకు కట్నములు కానుకలు నక్కరలేదని చెప్పుటచే మన సంబంధము వారికి నచ్చినదేమోనని నే నూహించుచున్నాను. ఇంతకు దైవఘటన మెట్లున్నదో తెలియదుగదా? సరే శాస్త్రిగారూ, సాయంకాల మైనది. మీకు సంధ్యావందనమునకు వేళ య్యైనది. నాకు సెలవొసంగుడు." అనుచు రామేశముగారు లోనికి బోయిరి. రథాంగపాణిగారు రేలంగి వెళ్లి భార్యయైన భ్రమరాంబతో నీవిధముగ పెళ్లికూతురు చూపుల విషయమై చెప్పిరి. "నేను పెండ్లికూతును జూచి వచ్చితిని. ఆ పిల్లపేరు విజయలక్ష్మి. అది నీకు కోడలైన పక్షమున నీ పొగ రణగునులే." "నా పొగరున కేమిగాని, పెండ్లికూతు రెట్లున్నదో చెప్పండి" అని భ్రమరాంబ హెచ్చరించెను. అనుటయు రథాంగపాణిగారు మరల నీ క్రింది విధముగా ప్రసంగించిరి. "పెండ్లికూతురు మిక్కిలి లక్షణమైనది. పిల్ల పచ్చగా దబ్బపండువలె నున్నది. దాని మొగముమీద లక్ష్మి తాండవమాడుచున్నది. మొగము కలకల లాడుచుండును. అది యున్నచోట సిరి కాపుర ముండును. పిల్లంటే పిల్ల కాదు. అది చదువుల సరస్వతి. ఆధ్యాత్మ—కీర్తనలు రెండు పాడినది. కంఠమెంతో విన సొంపుగా నున్నది. ఒక సంగీతమే గాదు. గ్రంథములు గూడ చదువుకొన్నది. నీవలె విద్యరాని మొద్దు గాదు. తెనుగు పుస్తకములు, సంస్కృత పుస్తకములు గూడ నామె చదువుకొన్నది. ఒక శాస్త్రిగారిని పెట్టి, ఆమెకు తండ్రిగారు చదువు చెప్పించుచున్నారు. కూతునకు విద్య చెప్పించుటలో రామేశముగారికి మిక్కిలి సరదా. ఆమె తెనుగు పద్యములు, సంస్కృత శ్లోకములు చదివి యర్థముజెప్పి మమ్ము సంతోష పెట్టినది. ఆ పిల్ల నీ యింట నుండెనా నీ కెంతో కాలక్షేప మగును. భారత భాగవతములు జదివి నీకు వినిపించగలదు. భారత భాగవతములే గాదు, ఇంకను మరికొన్ని గ్రంథములు చదివి నీకు వినిపించి నీ చెవుల తుప్పు వదలించును.

"ఆపిల్ల నా కన్నివిధములంచేత నచ్చినది. నీవుగూడ చూడ దలచుకొన్న పక్షమున పోయి యొకసారి చూచిరా. పిల్ల నీకు గూడ నచ్చిన పక్షమున తాంబూలములు పుచ్చుకొని ముహూర్తము నిశ్చయము చేసుకొనవచ్చును. పని గట్టుకుని పెండ్లికూతురు చూపులకై నీవుగూడ వెళ్లిన బాగుండునా?" అనుటయు భ్రమరాంబ యిట్లనియె. "ఈ పనికై ప్రత్యేకముగా వెళ్లినట్లు వెళ్లక మరియొక పనిమీద వెళ్లినట్లు వెళ్లి పిల్లను జూచి వచ్చెదను. ఆపని యేమనగా నేను పుట్టిన తరువాత, అంతర్వేదియాత్ర ఎన్నడూ చేయలేదు. ఈ సంవత్సర మంతర్వేది వెళ్లవలెనని యున్నది. ఈ యాత్ర మీరు చేయించ గలిగితిరా యంతర్వేది వెళ్లునపుడో, వచ్చునపుడో నేను గూడ సేతువురావుగారి యింట బసచేసి పెండ్లికూతును చూచి వచ్చెదను. నరసింహస్వామివారి యుత్సవము ప్రతి సంవత్సరము మాఘ మాసములో జరుగును. మాఘ శుద్ధ దశమినాడు కళ్యాణము. ఇది వైశాఖ మాసము. ఇవి కళ్యాణ దినములు గావు. అయినను యాత్ర నెప్పుడు వీలైన నప్పుడే జేయ వచ్చును. పెద్ద తిరుపతి, కాశీ, రామేశ్వరములు వెళ్లువారు తమ కెప్పుడు వీలైనప్పుడు వెళ్లుటలేదా? అట్లే నంతర్వేది గూడ వెళ్లవచ్చును. పెద్దబ్బాయి సెలవులకొరకు వచ్చి యిక్కడ ఉన్నాడుగదా? వానిని సాయమిచ్చి నన్ను బంపుడు. పెండ్లికూతును వాడుగూడ చూచి వచ్చును. పిల్ల పిల్లవానిని, పిల్లవాడు పిల్లను చూచుట మంచిదికదా?" అనవుడు రథాంగపాణిగారు "నీవు గడుసుదానవే? మంచి ఎత్తు ఎత్తినావు. 'ఏకక్రియా ద్వ్యర్థకరీ' యని సామెత గలదు. ఒక పని వలన రెండు కార్యము లగునని దీని యర్థము. పెండ్లికూతురు చూపులు, తీర్థయాత్రగూడ నీ కిందులో సమకూడును. సరే, రేపు పంచమినాడు మంచిదే. ఆరోజున నీవు పెద్దపిల్లవానిని తీసుకొని వెళ్లుము" వైశాఖ శుద్ధ పంచమినాడు భ్రమరాంబ పెద్దకుమారుని దీసుకొని, ఖర్చుల నిమిత్తము భర్త యిచ్చిన పది రూపాయలను మూటగట్టుకొని బయలుదేరి నరసాపురము వెళ్లెను. ముందుగా సేతువురావుగారి యింట బసచేయక తిరిగి వచ్చునపుడు వా రింటికి వెళ్ల వచ్చునని నిశ్చయించి ఆ మధ్యాహ్న మొక సత్రములో వంట జేసికొని దిని పిమ్మట నావ యెక్కుటకు గోదావరి యొడ్డునకు దల్లియు కొడుకును వెళ్లిరి. నరసాపురమునుండి రాజోలు వరకును, మరియు నంతర్వేది వరకును నావలు ప్రతిదినము నదిమీద పోవుచుండును. భ్రమరాంబయు కుమారుడును నావ నెక్కిరి. సూర్యాస్తమయ మగు నప్పటికి నావ యంతర్వేది రేవులో దిగెను. అప్పుడు వారు గ్రామములోనికి వెళ్లి ఆ దినమును, మరునాడును, వండుకొనుటకు స్థల మొక గృహస్థు నడిగిరి. ఆ గృహస్థుడు దినమునకు నాలుగణాలు చొప్పున నద్దె నిర్ణయించుకొని ఒకగది నిచ్చెను. ఆ గదిలో వారు వండుకొని, ఆ రాత్రి భుజించిరి. ఆ మరునా డుదయమున మాతా పుత్రులు గోదావరి స్నానముచేసి దేవాలయమునకు పోయిరి. అంతర్వేదిలో ప్రధాన దైవము నరసింహస్వామివారు. శివాలయము గూడ గలదు. ఆ దేవునిపేరు నీలకంఠేశ్వరస్వామివారు. ఆయన క్షేత్ర పాలకుడు. అంతర్వేది

కుగ్రామము. నరసింహస్వామివారి తిరునాళ్లలో నానా భాగముల నుండి వేలకొలది జనులు వత్తురు, గావున గ్రామము జనాకీర్ణమై సందడి గలిగియుండును. ఇతర సమయములలో నిశ్శబ్దముగా నుండును. భ్రమరాంబ స్నానమైన తరువాత, నీలకంఠేశ్వరస్వామివారి యాలయమునకు వెళ్లి స్వామి కభిషేకము, చేయింపదలచెను. ఇరువురు బ్రాహ్మణులు మహాన్యాసపూర్వకముగా దశ శాంతులతో నభిషేకము చేసిరి. వారికి చెరి యొక నర్ధరూపాయియు నిచ్చి, భ్రమరాంబ యచ్చటనుండి నరసింహస్వామివారి, ఆలయమునకు పోయెను. తల్లి, కొడుకులు స్వామివారి దర్శనముచేసి, స్వామికి భోగము చేయింపుమని యర్చకునకు రెండు రూపాయల నిచ్చిరి. అర్చకుడు సొమ్ము తీసుకొని వారి బస యెచ్చటనో కనుగొని సాయంకాలమున స్వామి ప్రసాదము బసకు పంపుదునని చెప్పిరి. పిమ్మట వారు బసకు పోయి వండుకొని భుజించిరి. ఎండ చల్లబడిన తరువాత నాలుగు గడియల ప్రొద్దువేళ భ్రమరాంబ గుర్రాలక్క గుడికి వెళ్లెను. ఆ దేవతను గూర్చి యంతర్వేది నివాసు లిట్లు చెప్పుదురు. ఆ దేవత నరసింహస్వామివారి చెల్లెలట. ఆ దేవున కేటేట కళ్యాణ మెందుకని గుర్రాలక్క మూతి విరుచుకొనెనట. విరుచుకొన్న మూతి వంకరగ నట్లే యుండిపోయెనట. ఎవరి మూతియైన వంకరగ నున్న పక్షమున, గుర్రాలక్క మూతివలె నున్నదని ప్రజలు సామెతగ బలుకుట గలదు. ఆ గుడిలో భ్రమరాంభ యరటిపండ్లు, పసుపు కుంకుమ నిచ్చి, మ్రొక్కి సాయంకాలమున కింటికి వచ్చెను. ఆ మరునాడు మాతా పుత్రులు పెందలకడ నిద్ర మేల్కొని వసిష్ఠపాయ సముద్రములో గలియుచోట ననగా—సాగరసంగమ స్థానమున—స్నానముజేసి బసకుపోయి, యా మధ్యాహ్నమున బయలుదేరి నరసాపురము వెళ్లి సేతువురావుగారింట దిగిరి. సేతువురావుగారి దల్లియు, భార్యయు వారి నాదరించి గౌరవించిరి. పిమ్మట సేతువురావుగారు కూడ వచ్చి వారు దన యింట బస చేసినందుకు మిక్కిలి సంతసించిరి. ప్రసంగవశమున భ్రమరాంబ సేతువురావుగారి తల్లితో "మేము వచ్చినవారము రానే వచ్చినాముగదా ? యొకసారి రామేశముగారి కూతురును జూచి వెళ్లవలెనని యున్నది. అది వీలుపడునా ?" యని యడిగెను. "వీలుపడకేమి ? నేను రేపు దాని కేర్పాటు జేసెదనులే" అని సమాధానము జెప్పి కొడుకుతో నామాట మెల్లగ జెప్పెను. సేతువురావుగారు భోజనముచేసి రామేశముగా రింటికి వెళ్లి "రథాంగపాణిగారి భార్య భ్రమరాంబ వచ్చి మా యింట బసచేసి యున్నది. మీ యమ్మాయిని చూడ గోరుచున్నది. వీలుపడునా" యని యడిగిరి. పడకేమి రేపు చూడవచ్చునని సమాధానము చెప్పిరి.

ఆ మరునా డుదయమున కనకదుర్గమ్మ సేతువురావుగారింటికిబోయి భ్రమరాంబను జూచి తమ యింటికి భోజనమునకు రమ్మని కోరెను. "వదినగారూ, కతికితే యతకదన్న మాట మీ రెరుగుదురు గదా ? ఏదో వియ్యమంద దలచుకొన్నాము గనుక భోజనము నిమిత్తము బలవంత పెట్టవద్దు. మా యబ్బాయి గూడ వచ్చినాడు. సేతువురావుగారు మాకు వేలువిడిచిన పినమామగారి కుమారుడు. ఇది మాకు పరాయి చోటుగాదు. ఈపూట నిచట భోజనముచేసి మధ్యాహ్నము పిల్లను జూచుటకు మీ యింటికి వచ్చెదము" ఆమాట విని కనకదుర్గమ్మ సరే ! అట్లే చేయుడు అని వెడలిపోయెను. ఆ మధ్యాహ్నము జాము ప్రొద్దువేళ మాతా పుత్రులు రామేశముగా రింటికి వెళ్లిరి. వారు వత్తురని పెందలకడ కచేరీ నుండి వచ్చి కొన్ని కోతమామిడిపండ్లను తెప్పించి ముక్కలు క్రింద గోయించి వెండి పళ్లెరములలో పెట్టి యుంచిరి. రామేశముగా రల్లున కెదురుగ బోయి దోడ్కొనివచ్చి తివాసి మీద కూర్చుండబెట్టిరి. కనకదుర్గమ్మ భ్రమరాంబ కెదురుగ బోయి, లోపలకు దోడ్కొనిబోయి గౌరవించి మామిడికాయ ముక్కలు దినుమని కోరి మరియొక పళ్లెములో కొన్ని ముక్కలుంచి కాదలచిన యల్లునకు సావడిలోనికి బంపెను. అతడు వాటిని స్వల్పముగ దిని కూర్చుండగా "అబ్బాయీ మా యమ్మగారు నిన్ను జూతురట. ఒకసారి లోనికి రమ్మ" అని రామేశముగారు కోరిరి. అట్లే యని లోనికి బోయి ఒక కుర్చీమీద గూర్చుండెను. అంతట రత్నమ్మగారు లోపలినుండి వచ్చి "విజయలక్ష్మి" అధ్యాత్మ కీర్తన యొకటి పాడుమమ్మా, యని చెప్పెను. విజయలక్ష్మి వెంటనే పాడక సిగ్గుచే దల వంచుకొని యూరక గూర్చుండెను. అప్పుడు భ్రమరాంబ "అమ్మాయీ, సిగ్గుపడకమ్మా ! మేము పరాయివాండ్రము గాము. పాడవచ్చునమ్మా, పాడుమనెను. ఆ మాటలకు తోడుగా రత్నమ్మగారును, కనకదుర్గమ్మయు పాడమని బాలికను హెచ్చరించినందున విజయలక్ష్మి యొక కీర్తన పాడెను. పిమ్మట రామేశముగారు వచ్చి, కొన్ని పద్యములు గూడ చదువమని కోరినందున కొన్ని పద్యములను గూడ విజయలక్ష్మి చదివెను. బాలిక రూపముతోను, విద్యాసంపత్తి తోడను, భ్రమరాంబయు నందనుడును సంతుష్టులై సెలవు గైకొని సేతువురావుగారి బసకు పోయిరి. ఆ మరుచటి దినమున వారు బయలుదేరి రేలంగి వెళ్లిరి.

తొమ్మిదవ ప్రకరణము

ఇంటికి వెళ్లిన తరువాత రథాంగపాణిగారు భార్యను బిలిచి యాత్రా విశేషములను, పెండ్లికూతురు చూపులను గురించి ప్రశ్నించిరి. అప్పుడు భ్రమరాంబ యిట్లు చెప్పెను. "మేము తిన్నగ నరసాపురము వెళ్లి నావ యెక్కి యంతర్వేది జేరితిమి. అక్కడ నున్న దేవాలయము లన్నింటిని జూచితిమి. నీలకంఠేశ్వరస్వామి వారి కభిషేకము చేయించితిని. నరసింహస్వామివారికి భోగము జేయించితిని. స్వామివారి ప్రసాదము స్వీకరించితిని. పులియోరెము, దధ్యోదనము, చక్కెరపొంగలి దెచ్చి యా రాత్రి మా కిచ్చిరి. అవి భక్షించితిమి. అవి మిక్కిలి రుచిగ నున్నవి. తిరిగి వచ్చునపుడు నరసాపురములో సేతువురావుగారింట బస చేసితిమి. వారు మమ్ము మిక్కిలి గౌరవించిరి. పిమ్మట రామేశముగా రింటికి వెళ్లి పిల్లను

జూచితిమి. ఆ పిల్ల విషయమై మీరు చెప్పిన మాటలు నిజమే. పిల్ల యప్సరసలా గున్నది. దాని మొగమున లక్ష్మీకళ యుట్టిపడుచున్నది. శరీరము సువర్ణచ్ఛాయ గలది. కట్నమీయకపోయినను సరే! వారి పిల్లను మనము జేసికొనవలసినదే. అది మన విశ్వనాథమున కీడు జోడుగ నున్నది. ఆమెకు పదునొకండవ సంవత్సరమని తల్లిదండ్రులు చెప్పినారు. అది నిజమేనని నా నమ్మకము. కొన్ని పాటలు, పద్యములు పాడినది. అవి ఎంతో హాయిగా పాడినది. పిల్లవాడు గూడ బాలిక తనకు నచ్చినదని చెప్పినాడు. అంటుమామిడిపండ్ల ముక్కలు మాకు వారు ఫలహారముగ నిచ్చిరి. మేము భోజనము మాత్రము వారింట చేయకుండ వచ్చితిమి. రామేశముగారి భార్య కనకదుర్గమ్మ మంచిఘామేదా. బంధు మర్యాద మిక్కిలి బాగుగ నెరుగును. రామేశముగారి తల్లి రత్నమ్మగారు కూడ, మిక్కిలి ఎన్నికయైన యిల్లాలట. ఆమె పుట్టిన ఇల్లు మంచిది. గాదెవారి యాడుపడుచుట. ఇక ఆలస్యము చేయక మీరు తాంబూలములు పుచ్చుకొని వచ్చుటకు ప్రయత్నము చేయవచ్చును. ఆలస్య మమృతం విషం అన్నారు పెద్దలు. జాగుచేసిన పక్షమున సంబంధము దాటిపోవచ్చును. దాటిపోయినచో మరియొక సంబంధము దొరుకకపోదు గాని, యిటువంటి పిల్ల దొరుకదు.'' ఆ వృత్తాంతము విని రథాంగపాణిగారు తాంబూలములు పుచ్చుకొనుటకు యెవరినైన బంపెదనని చెప్పి యప్పుడే తన యన్నగారైన శేషశాయిగారి యొద్దకు బోయి యిట్లు జెప్పిరి, "అన్నయ్యా, ఆచంట రామేశముగారి కుమార్తె విజయలక్ష్మిని మన విశ్వనాథమునకిచ్చి వివాహము చేయదలచినారు. అది మంచి సంబంధము. తాంబూలములు పుచ్చుకొనుటకై యెవరైన వెళ్లవలెను. ఎవరిని పంపుదునా యని యాలోచించుచున్నాను. నా బావమరది పార్థసారథి యున్నాడు. వానిని మన పురోహితుడు వేమూరి విశ్వనాథ దీక్షితులను బంపిన బాగుండునా? మీ సెలవేమిటి? యని యడుగుటయు చాల బాగున్నది. త్వరగ బంపుమని శేషశాయిగారు సెలవిచ్చిరి. తరువాత నిడదవోలు జాబు వ్రాసి బావమరదిని బిలిపించిరి. ఆయన వచ్చిన తరువాత మంచి ముహూర్తము జూచి, యాతని, దీక్షితులుగారిని నరసాపురము వెళ్లి తాంబూలములు పుచ్చుకొని రమ్మని బంపిరి. దీక్షితులుగారు స్మార్తమునందు మిక్కిలి ప్రజ్ఞావంతులు, వేదము సంహిత యంతయు వల్లించినవారు. వా రిరువురును కొన్ని యరటిపండ్లను, పసుపు కుంకుమయు దీసికొని నరసాపురము వెళ్లి సేతుపురావుగారింట బసచేసి తమ రాక రామేశముగారికి తెలియపరచిరి. ఆమరునాడు శుభదిన మగుటచే నప్పుడు తాంబూలములు పుచ్చుకొనుట మంచిదని రామేశముగారు సేతుపురావుగారిని మరికొందరు బంధుమిత్రులను దక్షిణామూర్తి శాస్త్రిగారు మొదలగు కొందరు పండితులను యాహ్వానించి రావించి పార్థసారథిని, దీక్షితులుగారిని రప్పించి గౌరవించిరి. అప్పుడు బంధుమిత్రుల యెదుట రామేశముగారిట్లు చెప్పిరి—"అయ్యా, నా కుమార్తె విజయలక్ష్మిని రేలంగి గ్రామ నివాసులైన విన్నకోట రథాంగపాణిగారి జ్యేష్ఠకుమారుడు విశ్వనాథమునకిచ్చి వివాహము చేయదలచుకొన్నాను. ఈయన పెండ్లికుమారుని మేనమామ తల్లాప్రగడ పార్థసారథిగారు. రెండవవారు రథాంగపాణిగారి పురోహితుడు వేమూరి విశ్వనాథ దీక్షితులుగారు. వారు తాంబూలములు పుచ్చుకొనుటకు వచ్చినారు. ఇదిగో నే నిప్పుడే తాంబూలము లిచ్చుచున్నాను", అని పార్థసారథిగారి కొక తాంబూలమును, దీక్షితులుగారి కొక తాంబూలమును రామేశముగా రిచ్చిరి. తరువాత వివాదములు లేకుండ కట్నములు, కానుకలు, లాంఛనములు మొదలైనవాటి మాట తేలినదా యని సేతుపురావుగా రడిగిరి. అందుకు పార్థసారథి యిట్లు బదులు చెప్పెను—"మేము కట్నము నిర్ణయించుకొన దలచుకొనలేదని మా బావగారు రథాంగపాణిగారు స్పష్టముగ చెప్పమన్నారు. పిల్ల నచ్చిన పక్షమున వేరే కట్నము లెందుకని మా బావగారి యభిప్రాయము. కావున మా కెంతమాత్రము కట్న మీయనక్కరలేదు. వారి పిల్లకు వారే మిచ్చుకొన్నను మా కాక్షేపణ లేదు" ఆ మాటలు విని రామేశముగా రిట్లనిరి: "అయ్యా! పెండ్లికుమారునకు నేవిధమైన కట్నము నక్కరలేదట. రథాంగపాణిగారు మంచి సాంప్రదాయకులు, గౌరవనీయులు నగుటచే వారి గౌరవమునకు దగినట్లు చెప్పినారు. కట్నములకై ప్రాకులాడుట నీచులపని గాని గౌరవనీయుల పని గాదు. అయినను నేనీ నడుమ సరిపల్లెలో గొన్న రెండెకరముల యీనాము భూమి మా పిల్ల పేర దస్తావేజు వ్రాసి యిచ్చెదను. ఇదిగాక వా రడుగకపోయినను వరునకు వరదక్షిణక్రింద నూటపదియారు రూపాయలు రొక్కమును వెండి చెంబులును, జలతారు పట్టు పంచలు నిచ్చి, యాడుపడుచు యొక్కయు, వియ్యపురాలు యొక్కయు, లాంఛనముల క్రింద నూరు రూపాయల నిచ్చెదను" అని పలికి పార్థసారథిగారి నుద్దేశించి, "అయ్యా వివాహ మే మాసమున జరిగించిన మీ కనుకూలముగ నుండునో యా మాసమున మీరు ముహూర్త నిశ్చయముజేసి మాకు తెలియపరచినను సరే, లేదా మేమే నిశ్చయించి మీకు పంపెదము. ఆషాఢ, భాద్రపద మాసములు శూన్య మాసములు గదా? శ్రావణమాసము మంచిదే గాని, వర్షములవల్ల మన మిరువురము గూడ బాధపడుదుము. ఏమండి? దక్షిణామూర్తి శాస్త్రిగారు"యని యడిగిరి. అప్పుడు శాస్త్రిగారు, "అయ్యా! అది దక్షిణాయనము. అప్పుడు శుభకార్యములు జరిగించుట ప్రశస్తముగాదు. ఇదిగో ధర్మశాస్త్ర వాక్యము వినుడు: "ఉదగయనే సర్వరాత్రే అపూర్వమాన వక్షే వివాహోప నయనాది కార్యాణి సమాచరేత్!" ఉత్తరాయణమందన్ని ఋతువులయందు శుక్లపక్షమున వివాహాది శుభకార్యములు చేయవలెనని దీని యర్థము. ఆ పలుకులు విని విశ్వనాథ దీక్షితులుగారు సరే, "ఇక మాఘ మాసములోనే వివాహము కావలసి యున్నదని, తేలినది" యని పలికిరి. "ఎట్లయినను మాకు సమ్మతమే"నని రామేశముగారు పలికిరి. ప్రక్క గదిలో నున్న రత్నమ్మగారా మాట విని, యంతదాక మన పిల్ల నుంచకూడదేమో యని సందలించిరి. భయము లేదమ్మా యని పార్థసారథి బదులు చెప్పెను. దీక్షితులుగారు, శాస్త్రి

గారు నట్లే చెప్పిరి. అనంతరమున రామేశముగారు శాస్త్రిగారి నుద్దేశించి యిట్లనిరి : "అయ్యా, మా యమ్మాయి వివాహములో నా కుమారున కుపనయనము చేయవలెనని యున్నది. ఉపనయన యోగ్యమైన కాలమేదో చెప్పుడు" అనవుడు శాస్త్రిగారు "ధర్మశాస్త్ర వాక్యములు చెప్పెదను వినుడు : గర్భాష్టమేషు బ్రాహ్మణ ముపనయేత ! గర్భైకాదశేషు రాజా న ముపనయేత, గర్భద్వాదశేషు వైశ్య ముపనయేత; అని ద్విజులకు విధు లేర్పడినవి. కడుపులో పడినది మొదలుకొని లెక్క చూచి, బ్రాహ్మణ బాలున కుపనయనము నెనిమిదవ యేట చేయవలెను. అలాగే పదునొకండవయేట క్షత్రియ బాలునకును, పండ్రెండవ యేట వైశ్య బాలునకును, నుపనయనము చేయవలసినదని, మన ధర్మశాస్త్ర కర్తలు విధించినారు. అటుపైని మీ వీలునుబట్టి చేసుకొనవచ్చును. ఆపద్ధర్మము క్రింద బ్రాహ్మణబాలుని పదియారేండ్ల వరకు వడుగు చేయకుండ నుంచవచ్చును, క్షత్రియబాలుని నిరువది యేండ్లవరకు నుంచవచ్చును, వైశ్యబాలు నిరువది నాలుగేండ్ల వరకు నుంచవచ్చును" పిమ్మట పార్థసారథియు, దీక్షితులుగారును సెలవిమ్మని యడుగ రామేశముగారు వారి నారాత్రి భోజనముచేసి వెళ్లుమని బలవంతపెట్టిరి. అట్లే యని వా రుండిరి. ఆ రాత్రి విందునకు సేతుపురావుగారిని, దక్షిణామూర్తిశాస్త్రిగారిని, మరికొందరు మిత్రులను గూడ రామేశముగారు పిలిచిరి. పిండివంటలతో విందుచేసి భోజనానంతరమున రామేశముగారు పార్థసారథికి, దీక్షితులుగారికిని మేలు జరీ రెక్కచాపులు తెప్పించి బహుమాన మొసంగిరి. ఆ రాత్రి వా రిరువురును సేతుపురావుగా రింట పండుకొని మరునా డుదయమున బయలుదేరి రేలంగి వెళ్లిరి.

రథాంగపాణిగారు వివాహ మే మాసములో జేయదగునని జ్యోతిష్కులను బిలిపించి యాలోచించిరి. అశ్వయుజ కార్తీక మాసములందు మూఢమి యుండుటచే నవి పనికిరావయ్యెను. అందుచేత మాఘ మాసమే వివాహయోగ్యమగు కాలమని వారు నిర్ణయించిరి. ఆ మాసములో సర్వదోష రహితమైన సుముహూర్తములు రెండు కుదిరెను. ఒకటి శుద్ధ పంచమినాడు కుదిరెను. రెండవది శుద్ధ దశమినాడు కుదిరెను. దశమినా డంతర్వేది తీర్థ మగుటచే బంధువు లనేకు లా తీర్థమునకు బోవుదురని, పంచమినాడే వివాహము నిశ్చయించిరి. ఆదినమున సాయంకాలము నాలుగు గడియల రాత్రియైన తరువాత సుముహూర్తము నిశ్చయింపబడెను. రథాంగపాణిగారు తమ నిశ్చయమును జాబువ్రాసి రామేశముగారికి తెలియనరచిరి. రామేశముగారు తమకా ముహూర్తము సమ్మతమే యని ప్రత్యుత్తర మిచ్చిరి. అంతట నుభయులు పెండ్లి పనులు చేయ నారంభించిరి. రామచంద్రయ్యగారు భార్యాసమేతులై పెండ్లి పనులలో సాయము జేయుటకై రామేశముగా రింటికి వచ్చిరి. రత్నమ్మగారి చెల్లెలు, రామేశముగారి పినతల్లియైన జోగమ్మ కూడ మంచిలి నుండి నరసాపురము వెళ్లెను. ఈ జోగమ్మకు నిరువదేండ్ల లోపుగనే భర్తృవియోగ మగుటచే దనయొక్క కుమార్తెను దోడుకొని పుట్టినింట మంచిలిలోనే కాలక్షేపము చేయుచుండెను. ఆ పిల్లకు మేనమామలే వివాహాది కార్యములు జేసిరి. కూతురు కాపురమునకు వెళ్లిన తరువాత గూడ జోగమ్మ పుట్టినింటనే యుండి బంధువుల యింట నేదైన శుభాశుభములు జరిగినపుడు వారికి సాయము జేయుటకు వెళ్లుచుండెను. రామేశముగారికి నక్కచెల్లెండ్రు లేకపోవుటచే దన పినతల్లి కూతురైన శ్యామలాంబయే తనకు జెల్లెలని భావించుకొని విజయదశమి, సంక్రాంతి మొదలగు పండుగలకు నామెను దోడ్కొని వచ్చి చీరలు కట్టబెట్టి బంపుచుండును. అందుచేత నామె గూడ పెండ్లి పనులలో దోడుపడుటకు వచ్చెను. వీరుగాక నరసాపురములో నిరుగు పొరుగు పడతులు గూడ వచ్చి కనకదుర్గమ్మకు పనులయందు దోడుపడుచుండిరి. దక్షిణామూర్తి శాస్త్రిగారు విజయలక్ష్మికి కుమార సంభవములో నాలుగవ సర్గ విడిచిపెట్టి యైదవ సర్గ జెప్పిరి. పూర్వాచార పరాయణులైన పండితులు కుమారసంభవములో నాలుగవ సర్గలో మన్మథుని కొరకు రతి దుఃఖించుట యుండును గనుక కరుణరస ప్రధానమైన యాసర్గ జెప్పరు. అట్లే రఘువంశమందలి యష్టమసర్గలో నజమహారాజు భార్యయైన యిందుమతీదేవి కొరకు విలపించుట వర్ణింపబడినందున యాసర్గ గూడ శిష్యులకు జెప్పరు. కుమారసంభవములో నైదవ సర్గ చదువుచుండగానే శాస్త్రిగారు విజయలక్ష్మికి భర్తృహరి నీతి శతకములోని మూర్ఖ పద్ధతియు, విద్వత్పద్ధతియు జెప్పి యా శ్లోకములకు నేనుగు లక్ష్మణకవి జేసిన తెనుగు పద్యములు గూడ నర్థ సమేతముగ జెప్పిరి. రామేశముగారు కూతురు వివాహమునకు భోగము మేళము పెట్టవలెనా ? లేదా యని, శాస్త్రిగారితో నాలోచించిరి. అందుకు శాస్త్రిగారిట్లు బదులు చెప్పిరి— "పంతులుగారూ, భోగము మేళము పెట్టుట నా కిష్టములేదండి. నిష్కారణముగ నూరు రూపాయలు దానిక్రింద వ్యయపడును. ఆ సొమ్ము పండిత సత్కారము క్రింద వినియోగించిన మిక్కిలి బాగుండును" రామేశముగారు క్రమముగ దొడ్డిలో వంట పందిరి భోజనములు చేయుటకు పందిళ్లు విశాలముగ వేయించి, వీధిలో గొప్ప పందిరి యొకటి వేయించిరి. ఆ పందిరికి పైని తానులు దెప్పించి చాందినీ గట్టించి, దానిమీద రంగు కాగితములతో చిత్ర విచిత్రములైన పూవులు చేయించి అంటించిరి. పందిరికి రెండు ప్రక్కలను వెదురుబద్దలతో లాజులు గట్టించి చిత్ర విచిత్రములైన పనులను జేయించిరి.

విజయలక్ష్మి కళ్యాణమునకు సమస్త ప్రయత్నములు నిర్విఘ్నముగ విరివిగ జరిగెను. సుముహూర్తము సమీపించెను. వివాహము సోమవారమునాడు జరుపుటకు నిశ్చయింపబడెను. రామేశముగారు నరసాపురము, భీమవరము తాలూకాలలో నున్న తన మిత్రులకు మంచి పాలు, పెరుగు, కూరలు పంపించి వివాహమునకు రమ్మని వ్రాసిరి. రథాంగపాణిగారు గూడ బంధువులను పిలచుటకు తన బావమరదిని బంపి వారిని రావించిరి.

పెండ్లి రెండు దినము లుండగనే బంధువు లందరు వచ్చిరి. అట్లే రామేశముగా రింటికి గూడ రావలసిన చుట్టము లందరు వచ్చిరి. ఆదివారమునాటి సాయంకాలమునకే వత్తు మనియు పల్లకీ, భజంత్రీలను నరసాపురములోనే కుదుర్చు మనియు రథాంగపాణిగారు రామేశముగారికి వ్రాసిరి. రథాంగ పాణిగారు కుమారుని వివాహమునకు భోగము మేళ ముండ వలెనా లేదా యని తమ యన్నగారైన శేషశాయితోను, బావ మరదియైన పార్థసారథితోను నాలోచించిరి. భోగము మేళము లేని పెండ్లి శోభస్కరముగా నుండదని శేషశాయిగారు సెల విచ్చిరి. మేళములేని యూరేగింపు సరదాగా నుండదని పార్థ సారథి చెప్పెను. భోగమువాండ్లు మంగళ దేవతలు, వాండ్రు లేని పెండ్లి సెంతమాత్రము శోభించదని భ్రమరాంబ చెప్పెను. విశ్వనాథరావు మేళము వద్దని తండ్రితో గట్టిగ జెప్పెను. పేరిందేవి బాబయ్యా! భోగము మేళము పెట్టని పక్షమున మనము పేదవాండ్రమని రామేశముగారు భావింపవచ్చును. విన్న కోటవారు దేశ ప్రఖ్యాతి వడసినవారు. మన దర్జాకు మేళ ముండితీరవలెనండి యని తలుపుచాటున నిలిచి శేషశాయిగారి భార్య శ్రీ మహాలక్ష్మమ్మ సన్న సన్నముగా తన యభిప్రా యమును వెల్లడించెను. చాలమందికి మేళమంటే నిష్టమని, రథాంగపాణిగారు మేళము పెట్టుటకు నిశ్చయించిరి. ఎవరి మేళము కుదుర్చవలెను, దానిని గుదుర్చుట కెవరిని బంపవలె నని, తరువాత చర్చించిరి. అప్పుడు పార్థసారథి యిట్లనియెను. బావగారూ! భోగము మేళముల విషయమై పూర్ణమైన భోగట్టా తెలిసిన పురుషు డొక డున్నాడు. వాడు నాకు దూరపు బంధువుడు. వానిపేరు బోడపాటి భోగరాజు. ఎక్కడెక్కడ మంచి మేళము లున్నవో వానికి దెలిసినట్లు మరియొకరికి దెలియదు. వాడు ప్రస్తుత మత్తిలిలోనున్నాడు. వానికి వర్త మాన మంపి బిలిపించెదను. మీరు వానితో మాటలాడుడు'', అని చెప్పి భోగరాజును రమ్మని అత్తిలి వర్తమానము జేసెను. సాయంకాలమునకు భోగరాజు వచ్చి పడెను. భోజనానంతరమున రథాంగపాణిగారు తమ యింట వివాహమునకు మంచి భోగము మేళము నొకదానిని గుదుర్చుమని భోగరాజు నడిగిరి. అప్పుడు భోగరాజు, ''బావగారూ! దువ్వలో మంచి మేళ మొకటి యున్నది. అది చిత్తజల్లు శ్రీహరి మేళము. దాని కిద్దరు కుమార్తె లున్నారు. పెద్దదానిపేరు పద్మావతి, రెండవదాని పేరు చంద్రకళ. ఈ ఇద్దరు నాట్యములోను, గానములోను, మంచి యభినయములోను మన ప్రాంతములో మిక్కిలి పేరుపొందినవాండ్రు. ఆ మేళము నూరు రూపాయలకు తక్కువకు రాదు. దినమునకు అయిదు రూపాయలు బత్తె మీయవలెను. బత్తెము రామేశముగారే యిచ్చుకొందురుగదా? మేళము చూచి వచ్చినవా రందరు సంతోషించుదురు గాని మూతి విరువరు. శ్రీహరి కుమార్తెలు గొల్ల వేషము, భామ వేషము గూడ కట్టుదురు. వారి గానము విని తీరవలెను. శ్లోకములు, పద్మావతి చదువునపుడే వినవలెను. కారువా మిక్కిలి బాగుగా కట్టగలరు. రెండవది త్యాగరాజ కృతులు సొగసుగా పాడగలదు. మీ సెలవైన పక్షమున శ్రీహరి మేళము గుదుర్చుకొని వచ్చెదను. మీ సెలవేమిటి?'' అనవుడు రథాంగ పాణిగా రిట్లనిరి— ''సామాన్యముగా భోగము మేళము ముప్పాతిక రూపాయిలకో ఎనుబది రూపాయిలకో కుదురునుగదా? ఈ మేళమున కింత ఎక్కువ ఏమి?'' అని అడుగగా వెంటనే భోగరాజు ఇట్లు చెప్పెను: ''అంత వెల ఎందుకనగా మనవి చేయుచున్నాను, వినుడు: శ్రీహరి డబ్బుగలది. అందుచేత చిన్న బేరములు ఒప్పుకొనదు. అది సార్థక నామధేయురాలు. శ్రీ అనగా సంపద. పడుచుదనములో నది యనేక ప్రాపకుల సంపద హరించినది. దాని యదృష్టముచేత దాని కూతులు స్ఫురద్రూపవతులు, విద్యావతులు. వాండ్రు కులవృత్తిచేతను, మేళములకు వెళ్లియు విశేషముగా ధన మార్జించుచున్నారు. అందుచేత బెట్టుసరిగా మాటలాడుదురు. నేను దేశములో సుమారేబది యరువది మేళము లెరుగుదును. అన్ని మేళ ములలోను నిది ప్రశస్తమైనది. ఈ చుట్టుప్రక్కల పెద్ద మనుష్యులు తమ యింట శుభకార్యము లైనప్పుడు మేళము కుదుర్చుమని నాకే వర్తమాన మంపుదురు. ఐదు రోజులు మేళముమీది పెత్తనము నాకే వప్పజెప్పుదురు. మేజువాణి చేయించుట భాగవతము గట్టించుట నేనే చేయించుచుందును. మేళములోని సానులు, నామాట జవదాటరు. కాబట్టి మీరు ఆలోచించి సెలవివ్వండి'' అని తన ప్రజ్ఞా విశేషములు భోగ రాజు చెప్పుకొనగ విని, రథాంగపాణిగారు, విస్మయమొంది సరే నీవు చెప్పినట్లు నూరు రూపాయిలకు భోగము మేళము దువ్వ మేళము గుదుర్చుకొనిరా బయానా క్రింద రెండు రూపా యిలు దీసుకొని వెళ్లి చవితి ఆదివారమునాడు మన మిక్కడ నుండి బయలుదేరుదుము. అప్పటికి మేళము సిద్ధముగ నుండ వలెను. మనతోగూడ వాండ్రు బయలుదేరి రావలెను. అని నతనికి రెండు రూపాయల నిచ్చి బంపిరి. భోగరాజు వెళ్లగానే రథాంగపాణిగారు పార్థసారథిని జూచి ''ఏమోయీ! పార్థసారథీ! భోగరాజు చరిత్ర చిత్రముగ నున్నది. భోగముసాను లందరు తన వశమే యనుచున్నాడు. జన్మముచేత స్వచ్ఛమైన నియో గియై పుట్టి వృత్తిచేత నీచుడు వలె గనపడుచున్నాడు. వీని చరిత్రము నాకు కొంత వినవలెనని యున్నది. ఎరిగినంత వరకు చెప్పుము'' అని యడుగుటయు, వెంటనే పార్థసారథి భోగరాజు పురాణము నీ విధముగ జెప్పెను. 'బావగారూ! ఈతని చరిత్ర చిత్రమైనదే. ఈతని తండ్రి నరసరాజుగారు. ఆయన నివాసస్థానము కోవూరు. నా కితడు మేనమామ మను మడు. నరసరాజుగారికి సాలుకు వేయి రూపాయలు వచ్చెడివి. తండ్రిగారు వీనికి విద్యాబుద్ధులు చెప్పించవలెనని మిక్కిలి ప్రయత్నించి కొంతకాలము రాజమహేంద్రవరములో నుంచిరి. వీ డక్కడ బడికి వెళ్లక జీతము గొరకు తండ్రి బంపిన సొమ్ము పోకుల క్రింద పాడుజేసి దుష్ట సహవాసముజేసి పాడగుచుండుటచే నరసరాజుగారు చదువు మానిపించి వీని నింటివద్ద నుంచిరి. అక్కడగూడ వీడు చుట్టలు కాల్చుట, చీట్లపేక యాడుట, ముండల వెంట దిరుగుట మొదలైన

పాడు పనులు జేయ నారంభించెను. అట్లు గొంతకాలము జరుగగా నరసరాజుగారికి మరణకాల మాసన్న మయ్యెను.

అప్పటికి వీని భార్య గాపురమునకు వచ్చెను. వీడు తల్లికి, భార్యకు అన్నము పెట్టని పరమ దౌర్భాగ్యుడుగా మారెనని గ్రహించి కొడుకుభార్య కై దెకరముల భూమియు, దన భార్య కై దెకరముల భూమియు జెందునట్లు మరణశాసనము వ్రాసి నరసరాజుగారు మృతినొందిరి. పితృ మరణానంతరమున శేషించిన భూమి వీని స్వాధీన మయ్యెను. దొమ్మేరు, కుమారదేవము మొదలగు స్థలములలో వీనికి గల భూములు రత్నగర్భలు. వీడు దూరని భోగముకొంప లేదు. మన ప్రాంతముల వీడు కన్నెరికము చేయని పడుచు భోగముది లేదు. క్రమక్రమముగా భూము లన్నియు నమ్మివేసెను. డబ్బు కక్కురితిచే, నూరు రూపాయలు బదు లిచ్చినవారికి వీ డైదు వందలకు నోటు వ్రాసి యిచ్చెడివాడు. నూటికి వడ్డి రూపాయి, ఎనిమిదణాలు. వాయిదా దాటిన పక్షమున మూడు రూపాయలు గూడ గలదు. తుదకు వీని కన్నములేకపోగ భార్యయు, జననియు, దమనకు నరసరాజుగారిచ్చిన భూముల మీద వచ్చు నాదాయముతో తాము దిని వీని కింత ధర్మ పిండము వేయుచున్నారు. వీని ప్రయోజకత్వమున వీడు తల్లిని దిట్టని దినము, భార్యను కొట్టని దినము లేదు. భార్య మహా పతివ్రత, భూదేవత యని చెప్పవచ్చును. ఇప్పుడు వీడు చేయునట్టి పని గొప్పవారి యిండ్లలో జరుగు వివాహములకు భోగము మేళములు కుదుర్చుటయే. ప్రతివారికి మేళములు గుదిర్చి, మేళముతో గూడ తానును బోయి నైదు దినములు పెండ్లివారింట హాయిగా భోజనముచేసి మేళము గట్టినపుడు ముందు తానే గూర్చుండి కృతులు పాడమని పురమాయించుచు, నూరేగింపులలో తానే మేళము ముందర నిలిచి వడుపుచు కాలక్షేపము చేయుచున్నాడు. తల్లి పోయినపుడు వాడు దువ్వలోనే యుండి ఎన్ని వర్తమానము లంపినను రాక నాల్గవ రోజుననో ఏడవ రోజుననో వచ్చి, ఖర్మ సరిగ జేయక నింత గుంట పులగము వేసినట్లు కడదేర్చినాడు. తల్లి పోవునపుడు తన భూమి గూడ కోడలికే వ్రాసి యిచ్చి, పుత్రవాత్సల్యముచేత కోడలిని పిలిచి, "అమ్మాయీ! నీవు భూదేవతవు. పూర్వ జన్మమందు నీవు చేసిన పాపముచేత నిర్భాగ్యుడైన భోగరాజు గాడు నీకు భర్తగా దాపురించినాడు. వాడా కలి గొని యింటికి వచ్చినపుడు విసుగుకొనక, కసరుకొనక, దెప్పక ఏదో యింత నన్నము పడవేయుచుండుము. తల్లీ! పరమ పతివ్రతలకు గలుగు నుత్తమ గతులు నీకు లభించును. ఎట్టి దుర్మార్గుడైనను భర్తయే నాడు దానికి దైవము. భర్త సేవ జేసిననాడు దానికి వేరే వ్రతములు, తీర్థయాత్రలు నవసరములేదు. అని చెప్పి యామె ప్రాణములు విడచెను. ఆమె చెప్పిన ప్రకారమే భార్య వానికి సేవ జేయుచున్నది. తల్లి భార్య పేర వ్రాసి యిచ్చిన భూమి తనకు వ్రాసి యిమ్మనిభార్యను పిడనుదినము బాధించుచున్నాడట. ఈమె కొచ్చెర్లకోటవారి యాడపడుచు. వా రీమెను సౌఖ్యముగా రక్షింపగలరు గాని, యత్తవారిల్లు విడిచి పుట్టినింటికి బోయిన పక్షమున భర్త ఎప్పుడైన నన్నాతురుడై యింటికి వచ్చిన పక్షమున వానికి మంచి తీర్థమైన నిచ్చెడి దిక్కుండదని, ఇల్లు విడిచి వెళ్లక నామె యచ్చటనే యున్నది. వీనికి బోడపాటి భోగరాజను పేరుపోయి "భోగమువాండ్ర భోగరాజని" పేరు వచ్చినది. వీని మాట వచ్చినపుడు లోకు లీపేరే వాడుదురు. వాని ఎదుట ఈ పేరు వాడినను వానికి సిగ్గులేదు. అదియొక పౌరుషనామముగానో, బిరుదుగానో వాడు భావించి గర్వించుచున్నాడు. వానికి పెద్ద గిరజా యున్నది. చూచినారు కదూ? దాని కిప్పటికిని సంపంగి నూనెయే రాయుచుండును. వీడు సొమ్ము పుష్కలముగా నున్నపు డొకమారు నిరువది రూపాయలు బెట్టి పన్నీరు గొని దానితో స్నానముచేసి దేహము నిండ మంచి గంధము బూసికొని నైదు రూపాయలు బెట్టి మల్లెపువ్వులు గొని నవి పాన్పుమీద పరచుకొని పండు వెన్నెలలో బండుకొని దానిమీద చంద్రకళయు, తానును నిద్రించిరట. ఇది వాని వృత్తాంతము?

పదియవ ప్రకరణము

రథాంగపాణిగారు తన కుమారుని వివాహమునకు రావలసిన దని ముందుగానే వర్తమాన మంపిరి. చాలమంది బంధుగులు శుక్రవారమునాటికే చేరిరి. వేశ్యలు గూడ భోగరాజు ప్రయత్నము వలన శుక్రవారము నాటికే రేలంగి చేరిరి. శనివారము నాడు పెందలకడె భోజనములుచేసి రథాంగపాణిగారు పరివారమును వెంటబెట్టుకొని యత్తిలి వెళ్లిరి. అత్తిలి గ్రామములో నిడదవోలు వెళ్లదలుచుకొన్న యొక రహదారీ పడవ వారికి దొరకెను. ఆ పడవ గుత్తకు బుచ్చుకొని, పెండ్లివారందరు దానిలో నెక్కిరి. భోగరాజు వేశ్య లందులో కూర్చుండుటకు వీలు లేదని, రథాంగపాణిగారి నొడంబరచి వారల కొరకు ప్రత్యేకముగ నొక నావ గుత్తకు బుచ్చుకొనెను. తన బంధువులతో గలసి వేశ్యలు కూరుచుండుట సమంజసము గాదని శేషశాయి గారు రథాంగపాణిగారు, భోగరాజుయొక్క నాలోచన కొప్పుకొనిరి. భోగరాజు గూడ వేరు పడవలో భోగమువాండ్రతో గూరుచున్న పక్షమున, తన సరదా తీరునట్లు వాండ్రతో ముచ్చట లాడవచ్చునని సంతోషించెను. రహదారీ పడవయు, నావయు, చవితి ఆదివారమునాడు ఉదయమున నిడదవోలు చేరెను. ఆ పగలు నిడదవోలులో వంటలు చేయించుకొని, భోజనములు చేసి, సాయంకాలము పడవల నెక్కి నరసాపురము వెళ్లదలచిరి. అంతలో భోగరాజున కొక యాలోచన తోచి, రథాంగపాణిగారితో నిట్లని చెప్పెను. "అయ్యా! పంతులుగారూ! మీ హోదాకు తగినట్లు మన మొక నగారా నౌబతు మేళము తీసుకొని వెళ్లిన బాగుండును. నే నెరిగిన మేళము యీ గ్రామములో నున్నది. అది దూదేకుల ఖాసిం సాహెబు మేళము. అది తీసుకొని వెళ్లితిమా, మన యింటి పెండ్లి జమీందారుల యింట పెండ్లిలాగుండును. సెలవైన పక్షమున నిప్పుడే కుదిర్చెదను. రథాంగపాణిగారు, శేషశాయి

గారితో కొంచ మాలోచించి సరే కుదుర్చుకొని రమ్మని భోగరాజును బంపిరి. భోగరాజును వెంటనే బయలుదేరి గ్రామము లోనికి వెళ్లి ఖాసింసాహెబును వెంట బెట్టుకొని వచ్చెను. రథాంగాపాణిగారు ఖాసింసాహెబుతో మాటలాడి నిరువది రూపాయలకు మేళమున కొప్పుకొనిరి. దినమునకు రెండు రూపాయలు వారికి బత్తెము నిర్ణయింపబడెను. బయానా పుచ్చుకొని, ఖాసిం సాహెబు యింటికి వెళ్లి, మేళము తీసికొని వచ్చెను. నౌబతు సామాను రహదారీ పడవ టాపుమీద పెట్టించిరి. సాయంకాలము మరల భోజనముచేసి పెండ్లివా రందరు పడవ లెక్కిరి. భోగరాజు వేశ్యలు కష్టపడకుండ తమ బస నుండి బుట్టలతో నన్నము మొదలైన పదార్థము లన్నియు తెచ్చి, నావలోనే వారలకు బెట్టెను. నౌబతుమేళముతో రహదారీ పడవయు, వేశ్యలతో నావయు, సాయంకాలమొనిమిది గంటలకు విడదవోలులో బయలుదేరెను. భోగరాజు రాత్రి యంతయు వేశ్యలతో చీట్లపేకయాడి ఆనందముతో గాలము పుచ్చెను. రథాంగపాణిగారికి దూరబంధువుడైన బంధకవి పాపయ్యావధానిగారు కూడ వివాహమునకు దయచేసిరి. ఈయన పద్ధతి నియోగి. ఈయన నివాసస్థానము పిప్పర. కొంచెము పరిచయముండుటచేత రథాంగపాణిగారు శుభలేఖ పాపయ్యావధానిగారికూడ వ్రాయించిరి. అది యందుకొని యవధానిగారు పిలిచినదే చాలునని తనదేవతార్చన సామగ్రిని తీసికొని పెండ్లివారు బయలుదేరునాటికి రేలంగిజేరి వారివెంటబడెను. రథాంగపాణిగారు విశ్వనాథ దీక్షితులుగారిని బిలిచి యిట్లనియెను— "ఈయన పద్ధతినియోగియని చెప్పుకొనుచున్నారు. అదియేమోనా కించుక చెప్పగలరా" అనుటయు విశ్వనాథదీక్షితులుగారిట్లుచెప్పిరి: "అయ్యా, పంతులుగారు! కొన్ని సంవత్సరముల క్రిందట నందిరాజు లక్ష్మీనారాయణ దీక్షితులుగారను నొకనియోగిబ్రాహ్మణుడు మచిలీపట్టణములో నుండి వైదికులతో నేదో పట్టింపుకలిగి, పద్ధతి నియోగమారంభించెను. వైదిక బద్ధతిగ నియోగులు నడుచుకోవలెనని వారు శాసించిరి. మొదట బ్రహ్మ క్షత్రియ వైశ్యులనెడు మూడువర్ణముల వారికి షట్కర్మలుచేసికో వలసినదని ధర్మశాస్త్రములోన్నది. షట్కర్మలేవనగా యజన, యాజనాధ్యయనా ధ్యాపకములు. యజనమనగ యజ్ఞముచేయుట, యాజనమనగ యజ్ఞము చేయించుట; అధ్యయమనగ వేదముచదువుకొనుట, అధ్యాపకమనగా వేదముపాఠముచెప్పుట. ఈ నాలుగునుగాక, దాన, ప్రతి గ్రహములని మరిరెండుగలవు. ఈయారునుకలిసి షట్కర్మలయినవి. ఈ కర్మములలో బ్రాహ్మణులు ముఖ్యముగ నందు వైదికులు నన్నిటి చేయుచున్నారు. క్షత్రియులు తీరికలేకనో, నీచమని యెంచియో, పూర్వమునుండియు కొన్ని కర్మలుచేసి కొన్ని మానుకొనిరి. యజ్ఞములు చేయుచుండిరి గాని చేయించుట మానిరి. వేదములు చదువుచుండిరిగాని, పాఠములు చెప్పుటమానిరి. దానము లిచ్చుచుండిరి గాని, పుచ్చుకొనుట మానిరి. అట్లే వైశ్యులుగూడ క్రయ విక్రయ వ్యాపార నిమగ్నులై మూడుకర్మలేగాక తక్కినవాటినికూడ మానిరి. ఇకనీ కర్మలను బట్టుకొని ప్రేలాడుచుండినవారు బ్రాహ్మణులొక్కరే. ఆ బ్రాహ్మణులలో వైదికులు, నియోగులునని రెండు తెగలు గలవుగదా ? నియోగులు రాజులదగ్గర మంత్రులై, సేనాపతులై 'యథారాజా తథాప్రజా' యన్నట్లు రాజులయాచారమునే యవలంచించిరి. పేళ్లుగూడ రాజులపేళ్లనే బెట్టుకొనజొచ్చిరి. చూడుడు మీా నియోగులలో రామరాజు, వెంకట్రాజు, సుబ్బరాజానను పేళ్లెందరికిలేవు. అదిగాక క్షత్రియులవలెనే నియోగులుకూడ మీాసములుపెట్టుకొనిరి గాని తీయించుటమానిరి. కర్మచేయు బ్రాహ్మణులు మీాసము లుంచుకొనగూడదు. మీాసములుంచుకొనుట శాస్త్రవిరుద్ధము. అదిగాక మీాలో మరికొందరు వెమల యాచారముకూడ నవలంబించిరి. మీాలో కొందరి నామధేయములు చూడుడు.

నరసింహరాయుడు, వైకుంఠరాయడు, ప్రకాశరాయడు, తిరుపతిరాయడు మొదలైనవి గలవుగదా ? వెలమలవలెనే మీావారుగూడ మీాసములుపెంచి శీవిగనుందురు. ఇక నీయారు కర్మలను పట్టుకొని ప్రాకులాడువారు వైదికులొక్కరే. శుభాశుభములైన కర్మలు వారువచ్చియే నియోగుల యింట చేయించవలెను. ఆ కారణమున వైదికులకు దేశములో నెక్కువ ప్రపకు్తలు గలిగియుండెను. అది మీావారిలో కొందరికి గిట్టదయ్యెను. మనమేల వేదము చదువుకొనగూడదు. మనమేల స్మార్త కర్మలు చేయించకూడదు. మనమేల వైదికుల నాశ్రయించి పూజింపవలెనను నహంభావము కొందరికి గలిగెను. అటివారు మీాసములను గొరిగించి కొంత వేదాధ్యయనము చేసి కొన్ని స్మార్తకర్మలు నేర్చుకొని తమ గృహమునందు, తమ బంధువుల గృహములందు వైదికులను బిలువకుండ శుభాశుభ కర్మలుచేసి చేయించుకొన నారంభించిరి. ఇదేపద్ధతి నియోగము. అది యిష్టమున్నవారు దానినవలంబించి పద్ధతి నియోగులనిపించుకొనుచున్నారు. వీరిలో కొందరవధానములు, యజ్ఞములుకూడ జేసినవారుకలరు. వీరెచ్చటికిపోయినను యగ్నిహోత్రములు చేపికొని స్వయంపాకము చేసుకుని తినుచుందురు. ఈ పాపయ్యావధానిగారిని వివావాహమునకు దీసికొని పోవుట బొక్కసాలో కొరకంచు పెట్టుకొనిపోవుట. ఏమన యగ్నిహోత్రములకు వంటకు వేరుగానొక బసకావలెను. ఇందునిమిత్తమై రామేశముగారిని బాధింపవలెను. పాపము రామేశముగారు ఎన్నింటికని బాధపడుదురు. మనకుబసలు మొదలైన వేర్పాటు చేయుటయే కష్టము. ఈ లాటివిగూడ వారినెత్తిన పెట్టిన పక్షమున వారిమనసునకు కష్టముగనుండదా?" ఈ మాటలు విని రథాంగపాణిగారు దీక్షితులుగారితో మెల్లగనిట్లనిరి—"అయ్యా భయములేదు, రామేశముగారికి వైదికాచారమన్న కొంత యిష్టముగలదు. ఇదియొక బాధగావారు ఎంచుకొనరు." ఈ విధముగా రథాంగపాణిగారును, విశ్వనాథ దీక్షితులుగారును రెండవవారు వినకుండ మాట్లాడుకొనునప్పటికి కోడికూసెను. మరి పది నిముషములకు కాకులుకూయ నారంభించెను. పడవలు పాలకొల్లు రేవులోకి వచ్చినవని సరంగు రథాంగపాణిగారితో మనవిచేసెను. వీరువచ్చుచున్నారనివిని, తన గుమాస్తాను, నిద్దరు

చాకలివాండ్రను గడచినరాత్రియే రామేశముగారు పాలకొల్లు రేవువద్దకు బంపిరి. పెండ్లివారిరాకగ్రహించి గుమాస్తాయొక చాకలివానిని పెండ్లివారు వచ్చినారని రామేశముగారితో చెప్పుటకు పంపెను. క్రమముగా సూర్యోదయ మగునప్పటికి పడవలు నరసాపురము రేవుచేరెను. రామేశముగారిని, తమ పురోహితుడైన చిలుకూరి శేషయ్య దీక్షితులుగారిని మిత్రులైన సేతువు రావుగారు మొదలగు కొందరు పెద్దమనుష్యులను మరికొందరు వైదిక శిఖామణులను పల్లకి భజంత్రీలను నరసాపురములోనే గుదుర్చుమని రథాంగపాణిగారు వ్రాసినందున వారిని వెంటబెట్టుకొని రామేశముగారు పెండ్లివారి నెదుర్కొనిరి. రామేశముగారికి దేశములో మిక్కిలి పలుకుబడి యుండుటచే మొగలితుర్రు రాజుగారి పేరవ్రాసి ప్రశస్తమైన ముత్యాలజాలరిగల పల్లకీ యొకటి దెప్పించియుంచిరి. ఇదిగాక రెండుమూడు సవారీలను బోయెలను సిద్ధముగా నుంచిరి. నౌబతుమేళము రహదారీ పడవటాపుమీద మ్రోగుచుండుటచే నందులో పెండ్లివారుండట దెలిసికొని, రామేశముగారు పడవ కెదురుగా నిలువబడిరి. క్రమముగా శేషశాయిగారు, రథాంగపాణిగారు, దీక్షితులుగారు పడవదిగిరి. సేతువురావుగారు మొదలగువారు, శేషశాయిగారిని రథాంగపాణిగారిని గౌరవించి పలుకరించిరి. రామేశముగారు పెండ్లికుమారుని తీసికొనిపోయి, మొగలితుర్రువారు పంపిన పల్లకీలో కూర్చుండుమని చెప్పిరి. విశ్వనాథమట్లనే చేసెను. సిద్ధముగనున్న, రెండు మేనాలలో నొకదానియందు శేషశాయిగారిని, రెండవదానియందు రథాంగపాణిగారిని రామేశముగారు కూర్చుండబెట్టిరి. ముందువారిని విడిదిలోదింపి తరువాత శేషశాయిగారి భార్యను, రథాంగపాణిగారి భార్యను నా మేనాలలోనే నెక్కించి దీసికొని రావలసినదని రామేశముగారు గుమాస్తాతో చెప్పిరి. అతడట్లుచేసెను. రామేశముగారు తన యింటికి మిక్కిలి దూరములేని విశాలమైన నొకగృహము విడిదిక్రింద దీసికొని, వీథిలోను ముందరవాకిలిలోను పందిళ్లువేయించి, తోరణములు గట్టించి చేయవలసిన శృంగారమంతయు చేయించిరి. తక్కిన స్త్రీలకు బంధువులకు పడవలరేవునుండి ఒంటెద్దు బండ్లు కుదిర్చి వాటిమీద వారిని విడిదికి పంపిరి. భోగరాజు వేశ్యలకుగూడ రెండుబండ్లు కుదిర్చి, వారినిగూడ వారి నిమిత్తమై నేర్పరుపబడిన బసలో దింపెను.

పిమ్మట విడిదిలో స్నాతకవ్రత మారంభమయ్యెను. రామేశముగారు సకళత్రముగా, సపరివారముగా నచటికి వెళ్లి కావలసిన వస్తువులెల్ల పెండ్లివారికి సత్వరముగా నందజేసిరి. రథాంగపాణిగారును, భార్యయైన భ్రమరాంబయు పీటలమీద గూర్చుండి విశ్వనాథమునకు స్నాతకవ్రతము చేయించిరి. విశ్వనాథము చెప్పులజోడు తొడుగుకొని, తాటియాకుల గొడుగువైచుకొని, కఱ్ఱ చేతబట్టుకొని, కాశీయాత్ర లాంఛనము, శిష్టాచార ప్రకారము చేసెను. అప్పుడు రామేశముగారి కుమారుడనంతపద్మనాభరావు విశ్వనాథము గెడ్డముక్రింద బెల్లపుముక్కబెట్టి కాశీయాత్ర వెళ్లవద్దని బావగారిని బ్రతిమాలి యామువ్చుటగూడదీర్చి, తల్లిని, పితామహుని సంతోషపెట్టెను. రథాంగపాణిగారు స్నాతకమునకు వచ్చిన బ్రాహ్మణోత్తములను తగినట్లు సత్కరించిరి. స్నాతక వ్రతానంతరమున, పెండ్లివారందరు రామేశముగారింటికే వెళ్లి భోజనములు చేసిరి. భోగరాజు భోగమువాండ్రమాట మరువక బుట్టలతో అన్న భక్ష్యములు పంపెను. పాపయ్యావధానిగారికి రామేశముగారు విడిదికి దగ్గరగానున్న నొకయిల్లు బసగనేర్పరచి వారికి గావలసిన సమస్త వస్తువులు బంపిరి. అవధానిగారక్కడ పద్ధతి నియోగి చేయవలసిన క్రమప్రకారము యథావిధిగా నగ్ని హోత్రములు చేసికొని వంటచేసుకొని భుజించిరి. రామేశముగారు భజంత్రీలకు ఒత్తెముక్రింద బియ్యము కొలిపించి, నియమించుకొన్న ప్రకారము రొక్కమిచ్చి పంపిరి.

[తరువాత కథను కవిగారు వ్రాయలేదు]

ఉ. చాపముగాన హార్యమును జక్రిని బాణముగాగ, నారిగాఁ
బాప దొరన్గొనర్చి తలపంద్రిపురంబులఁ గాల్చవే మహో
ద్దీపిత తీవ్రకోపమున దేవతలెల్ల నుతింప నాటి విల్
పాపుపు "చైన" మీదఁ దెగఁ బాపఁగదే శరభాంకలింగమా.

—శరభాంకుడు.

(అత్యవసర పరిస్థితినిబట్టి పాఠము మార్పుచేయబడినది)

మహారాజ వాగ్గేయకారులు
స్వాతి తిరునాళ్

శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావు

సంగీత సంప్రదాయ ప్రదర్శినియందు వాగ్గేయకారుల జీవిత "చరిత్రలో 43 కులశేఖర పెరుమాళ్" (స్వాతి తిరునాళ్)ను గురించి ఇట్లున్నది :—

"కిరీటపతి తిరువనంతపురం పరిపాలించిన మహారాజా. ఈ కేరళ దేశాధిపతి సంస్కృత, ఆంధ్ర, హూణ, కేరళ, హిందూస్థాన్యాద్యనేక భాషలు నేర్చిన సమర్థులు. సంగీతమందు విశేష ప్రతిభ గలవారు. అనేక రక్తి రాగ, దేశీయ రాగములలో గేయకల్పనా చాతుర్యములు వెలయ, సంస్కృత సాహిత్య రూపములైన చౌక వర్ణములు, సంఖ్యలేని కీర్తనములు "పద్మనాభ" ముద్రతో రచించిన మహాత్ములు. సంస్కృతమందు చంపు మొదలైన బహు కావ్యములను రచించియున్నారు. తెనుగున చౌకవర్ణ పదములు జేసిరి. కేరళ భాషయందును బహుకృతులు జేసియున్నారు. (వీరి మలయాళ శైలి బహు సరళముగా, వ్యవహారికభాషలోని ప్రయోగములతో జనరంజకముగా నున్నది.) ఈ పద్మనాభదాసులు శ్రీ పద్మనాభ పాదారవిందైక్యమంది రమారమి యేబది ఏండ్లగుచున్నది." 1847 న వీరు స్వర్గస్థులైరి.

శ్రీ స్వాతి తిరునాళ్ క్రీ. శ. 1813 ఏప్రెల్ 16 వ తేదీన తిరువాంకూరు రాణి గౌరి లక్ష్మీబాయి గర్భమున జన్మించిరి. చేరరాజ వంశమును నిలబెట్టిన ఈ బిడ్డను చూచి సంస్థాన ప్రజలు ఆబాలగోపాలము పరమానందభరితులైరి. స్వాతి నక్షత్రమునందు పుట్టిన ఈ శిశువునకు స్వాతి తిరునాళ్ రామవర్మ మహారాజా అను నామకరణము చేసిరి. ఇతడు అంశపురుషుడన్నందుకు ఒక నిదర్శన మున్నది. ఈ బిడ్డ జనన కాలమున తిరువాంకూరు అడవులలో ఒక తెల్ల ఏనుగు సంస్థానమువారికి అకస్మాత్తుగా లభించుటచేత ఈ రాచకొడుకు దేవేంద్రుని అనుగ్రహమును పొంది రాజ్యపరిపాలనమును దక్షతతో కొనసాగించు ననుటకు ఇది అద్భుత శకునమని ప్రజలు మరింత తృప్తినొందిరి.

నెలలు నిండని ఈ శిశువునకు 1813 జులై 29 న సింహాసనముపై తల్లి ఒడిలో సైనిక మర్యాదలతో రాజ్యాభిషేకము జరిగింది. "శ్రీ పద్మనాభస్వామి పాదమువద్ద, ఈస్టు ఇండియా కంపెనీ వారి కృపా పాత్రునిగా నా పుత్రుని ఈ సంస్థానపు గద్దెపై స్థాపించుచున్నాను" అని రాజమాత గంభీరంగా ప్రకటించింది. అందుకే ఇతనికి 'గర్భశ్రీమాన్' అన్న బిరుదము సార్థక నామమయినది. మరి రెండు సంవత్సరములకు రాణి గౌరి లక్ష్మీబాయికి మరొక పుత్రుడు జన్మించెను. ఆ వెంటనే ఆమె మరణించెను. ఈ రాచబిడ్డలను కాపాడుట కని, పినతల్లి పార్వతీబాయిని "గార్డియను" గ బ్రిటిషు వారు నియమించిరి.

స్వాతి తిరునాళ్ బాల్యమునుండి కావ్యరచన, చిత్రకళ, నాట్యము మొదలగు లలిత కళలందు మేల్మి యయిన అభిరుచిని చూపెట్టిరి. అన్నిటికంటెను ముఖ్యముగా అతి బాల్యమునందే సంగీతమునందు సహజమైన అభిరుచి కనబరచిరి. దానికి తగ్గట్టుగానే ఆనాటి మహావిద్వాంసులవద్ద సంగీతమును, నాట్యమును బాగుగా అభ్యసించుటకు ఏర్పాట్లు జరిగినవి. చిన్నతనమునందే సంస్కృతము, మలయాళము, ఇంగ్లీషు మొదలగు భాషలను విద్వాంసులవద్ద నేర్చుకున్నారు. ఏడెనిమిది సంవత్సరముల వయసులోనే పారశీకం, హిందుస్థానీ, అరబ్బీ, తమిళం, తెలుగు, మహారాష్ట్రము, కన్నడము వగైరా భాషలందు అసాధారణమైన పరిచయము గడించుకొనిరి. సంస్కృతభాషయందు మీరిన అభిమానము, వ్యుత్పన్నతగల ఈ రాజుకు భారతీయ భాషలను నేర్చుకొనుట బహు సులభమయినది. పదహారవ ఏడు వచ్చుసరికి సంస్కృతభాషయందు కావ్యరచనాశక్తి, సంగీతమున ప్రౌఢ కల్పనగల పాండిత్యము అలవడినవి. అనేక వాద్యములందు ప్రవేశ ముండినది. వయోలిన్ వాద్యమును మొట్టమొదటి రోజులలో అభ్యసించి కర్ణాట సంగీత ప్రదర్శనకు వీలుగా నుండు "పట్లు" ఇవి యని నిర్ధరించునట్లు సాధించినవారిలో ముఖ్యులు ముత్తుస్వామి దీక్షితులవారి తమ్ములు బాలుస్వామి దీక్షితులు, దీక్షితులవారి ప్రియ శిష్యులు వడివేలు. తంజావూరు చతుష్టయమని ఖ్యాతి గాంచిన పొన్నయ్య, చిన్నయ్య, వడివేలు, శివానందం భరత

శాస్త్ర నిపుణులు. వడివేలు పిళ్లెగారు తిరువాంకూరు సంస్థానమునందు ఆస్థాన విద్వాంసులుగ నియమింపబడిరి. వారి చెలియలు భరతనాట్య కోవిదురాలు రుక్మిణి. వారి నాట్యములను చూచి, పదముల తాళపు రుచులందు మునిగి తేలిన స్వాతి తిరునాళ్ మహారాజు తాను రచించిన కీర్తనలందును, వర్ణముల చిట్టస్వరముల రచన లందును, తాళపు విన్యాసములు ప్రస్ఫుటంగా నాట్యభంగిమలకు అనుగుణ్యముగా అమర్చిరి.

తిరువాంకూరు సంస్థానమునకు తగిన దివానులను నియమించి అతి దక్షతతో నడిపించి స్వాతి తిరునాళ్ మహారాజు ఆ రోజులలో బ్రిటిష్ రెసిడెంట్ల మన్ననలు పొందిరి. వీరి రాజ్యపాలనలో ప్రజలు సుభిక్షము నొంది హాయిగా నుండిరి. ప్రజలందరికీ ఉచితముగా పాఠశాలల ద్వారా విద్యా వ్యాప్తికి తగు ఏర్పాట్లు గావించిరి. రాజు పదమూడవఏట మదరాసు గవర్నరు తిరువాన్కూరు వచ్చిరి. నాటి గవర్నరును రాచ ఠీవితో గౌరవించిరట. చేతిని కొంత గట్టిగ నొక్కిన అది సరిపడని గవర్నరు "ఆంగ్లేయుల చేతుల నంత గట్టిగా నొక్కుట అంత యుక్తముగాదు.సుమా" అన్నాడట. "మా సంస్థానమును నిలబెట్టుటకు అండగా నున్న ఏకైక హస్తమును కదా గట్టిగా పట్టుకోవలయును !" అని సమాధానమిచ్చి గవర్నరు హృదయమును మహారాజు తృప్తిపరచిరట.

దేవబ్రాహ్మణ విశ్వాసము, పాపభీతి, పారమార్థిక దృష్టి గల స్వాతి తిరునాళ్ ఏలుబడిలో లంచగొండితనానికి తావులేదు. ఎంతటివారి కయిన పదవీభ్రష్టత్వము తప్పెడిది కాదు. రోజూ కొన్ని గంటలసేపు రాజ్యపాలనా వ్యవహారముల కని కూర్చొనేవారు. ఉత్సాహపరులయు, తెలివితేటలు గల్గి, సంస్థానము మేలుకయి యత్నించు యువకులకు స్వయంగా ఉద్యోగములిచ్చి మంచి పోషణ నిచ్చేవారు. ముందాలోచనగల ఈ రాజ్యపాలనా ధురంధరుని ఏలుబడిలో పెద్ద మార్పులు వచ్చినవి. **Nayar brigade** అను తమ సైనిక దళము దుస్తులను మార్పించి సరియయిన తర్ఫీదు నిప్పించిరి. అశ్వదళాన్ని ఆధునిక రీతులలో తయారు చేయించిరి. తిరువనంతపురం మ్యూజియం, ఉద్యాన వనములు వీరు ప్రారంభించినవే. వీరి గోశాలయందు భారతదేశములోని వేర్వేరు ప్రాంతపు ఆవులు, ఆంబోతు లుండెడివి. వైద్యసహాయం, విద్యావ్యాప్తి, విజ్ఞాన పరిశోధన విరివిగా కొనసాగునట్లు తమ సంస్థానమునందు విరివిగా ఏర్పాట్లు చేయించిరి. **Horsley** అను ఆంగ్ల ఇంజనీయరును పిలిపించి రోడయురు ఆనకట్టను, వర్కాలే సొరంగమును నిర్మించిరి. ప్రభుత్వ ప్రచురణాలయమును స్థాపించిరి. దక్షిణ తిరువాంకూరులో ప్రజలు క్షామ బాధితులని తెలుసుకొని 1844 సంవత్సరమున తమ గిడ్డంగులలోని నిల్వ ధాన్యమును చౌకగా అమ్మించిరి. దంతముతో తమ స్వారికని అద్భుతమయిన రథాన్ని తామే ఊహించి నిర్మింపచేసిరి. నేటికిని రాజుల మెరవణి ఈ దివ్యరథమునందే సాగుచున్నది.

వీరి దైవభక్తి అంతులేనిది. తమ ఆత్మను శ్రీ అనంత పద్మనాభ స్వామికి అంకితముచేసిరన్న అతిశయోక్తి కానేరదు. మదమెక్కిన పట్టపుటేనుగును సైనికదళముల నటుంచి తమ కంటిచూపుతో అణగియుండునట్లు చేసిరట. వీరి ఉపాసనా బలము అసామాన్యమయినది. వారు కోపించిన, అన్నమాట ఇక జరిగితీరునట. తమ సంస్థానపు ఒక పెద్ద ఉద్యోగిని గర్హించుచూ "నీకేమి మతిపోయినదా" అన్నవెంటనే అన్నంత పని జరిగి అతడు మతిభ్రష్టు డయ్యెనట. లక్షలకొలదిగా పద్మనాభస్వామి ఆలయమునకు విరాళములనిచ్చిరి. తమ రాజభవనములకు 'రంగవిలాసము', 'పుట్టన్‌మాలిక' అను సుందిరములను జోడించిరి. పద్మనాభస్వామి ఆలయమునకు చుట్టు దీపములను వెలిగించుటకని చట్రమును కట్టించిరి— దీనినే 'విళక్కుమంటపం' అందురు. చివరకు బ్రిటిషు పరిపాలకుల చొరవలు, దివానులు చేయుచున్నాగములు వీరిని రానురాను విసిగించినందున తమ మనస్సును పూర్తిగా ఆధ్యాత్మిక విషయములకు మరల్చిరి. ప్రజలకు వీరియందు భయ భక్తులు ఎక్కువగుచుండెనేగాని, తక్కువకాలేదు. తుదకు 1847లో 35 సంవత్సరములు నిండకనే స్వర్గస్థులైరి.

వీరిరచనలందు ముఖ్యముగా రెండు భాగములున్నవి. ఒకటి సాహిత్య సంపదకు తాము సమర్పించుకొన్న కావ్యరచనలు. రెండవది సంగీతరచనలు. కావ్యములలో 'భక్తిమంజరి', శ్యానందూర పురవర్ణన ప్రబంధము, పద్మనాభ శతకము, అజామిళోపాఖ్యానము, కుచేలోపాఖ్యానము, 'నవరత్నమాల' ముఖ్యమయినవి. వీటియందు భక్తిమంజరి ఉత్కృష్టమయిన రచన. "తస్మై నమో దేవనమోస్తు విశ్వగురవే శ్రీ పద్మనాభాయతే" అను పది పద్యములకు అనేక విద్వాంసుల వ్యాఖ్యలు వాటి మహిమను చాటగలవు. పౌరాణిక గాథలను, భక్తిరస ప్రభావమును, తనయిష్ట దైవము పద్మనాభస్వామి వర్ణన, 'భక్తి మంజరి'లోని విశేషములు. నారాయణ భట్టపాదుల 'నారాయణీయ' కావ్యమును శ్రీమద్భాగవతమును జీర్ణించుకొన్న ఈ భక్తుని కావ్యములు భక్తిరసమునకు చక్కని లక్ష్యములని చెప్పవచ్చును. చంపు కావ్యముల లాంటి శ్యానందురపుర వర్ణన ప్రబంధము కొన్ని భాగములు నుండి రోజూ పద్మనాభ స్వామి దేవాలయమునకు మహారాజు వేంచేసినప్పుడు పఠింప బడుచున్నవి.

మహారాజ వాగ్గేయకారులు స్వాతి తిరునాళ్

ఇకవీరి సంగీత రచనలను గురించిన కొన్ని ముఖ్యాంశములను పరిశీలింతము. ముత్తుస్వామిదీక్షితుల శిష్యులు, త్యాగయ్యగారి శిష్యులు వీరి సంస్థానమునందు గౌరవములను రాజాదరణను పొంది తమ గురువుల కీర్తనలను రాజాగారికి వినిపించుచుండిరి. స్వాతి తిరునాళ్ కీర్తనలందు కొన్నిటిని తచ్చూరు శింగరాచార్యులవారు, సంగీత సంప్రదాయ ప్రదర్శిని మొదలుగాగల ప్రాచీనగ్రంథములందు అచ్చువేసిరి. కాని ఇప్పుడు మూడుదశాబ్దాలుగా కీ. శే. ముత్తయ్య భాగవతార్ తరువాత ప్రఖ్యాత గాయకోత్తములు శ్రీ శెమ్మంగుడి శ్రీనివాసయ్యరుగారు మరుగుపడిపోవుచున్న ఈ కీర్తనలను సముద్ధరించి సంగీత ప్రపంచమునకు గొప్పసేవ చేసిరి. వీరికి ఆధారముగా పనికివచ్చిన సంగీత గ్రంథము "బాలామృతము" అన్నది, దీనిని 1917సం.న విద్వాన్ శ్రీ రంగనాథయ్యరు సస్వరముగా అచ్చొత్తించిరి.

స్వాతితిరునాళ్ మహారాజు చేసినవి సుమారు మూడు వందల కీర్తనలున్నవి. వారి ఈసంగీత రచనలందు ఎన్నోరకములున్నవి. కీర్తనలు, తానవర్ణములు (సరసి జనాభ— కాంభోజి, చలమేల— శంకరాభరణము— చాలా ప్రసిద్ధములు). పదవర్ణములు, స్వరజతులు, జతిస్వరము ఉత్సవప్రబంధ కీర్తనలు, నవరాత్రి కీర్తనలు, ధ్రుపదో, టప్పా, ఖ్యాలో 'భావయామి' లాంటి రాగమాలికలు, దశావతార రాగమాలిక, మణిప్రవాళ కీర్తనలు, సంస్కృతము, మళయాళము, కన్నడము, తెలుగు, హిందీ భాషలు గలవి,— హిందీ భజన్లు, తిల్లానాలు, సంస్కృత భక్తిగేయాలు రచించిరి. వీరిపదాలలో 'పలపుదాచ వశమా'— అఠాణా, రాగపదము, జావళులలో 'ఇటు సాహసము' (సైంధవి) చాల ప్రసిద్ధములయినవి. 'విశ్వేశ్వరు'అను ధనశ్రీరాగపు 'టప్పా'ను నేడు సింధు భైరవిలో మామూలు భజన్‌లాగు పాడుచున్నారు. 'అలసర పరితాపము' అను మళయాళ పదము (సురటిరాగము) సుప్రసిద్ధము. వర్ణములందు నాట్యపు అడుగుల రీతులకయి చక్కని నడకతో కూర్చిన స్వర విస్తారమును గమనించ వలయును. కాంభోజి రాగమునందు 'రాసవిలాస,' శంకరాభరణమునందు 'నృత్యతి నృత్యతి', అఠాణాలో శ్రీ కుమార నగరాలయే, చారుకేశిలో కృపయాపాలయ—, లాంటి కీర్తనలను పరిశీలించిన వీరి సంగీత ధోరణి స్వతంత్రముగా నడచిననూ, త్యాగయ్య దీక్షితుల పోకడలనుకూడ అంవర్చు కొన్నవని చెప్పవచ్చును. చక్కని రక్తి నొనగూర్చు తాళవరసలు, భక్తి శృంగార రసముల కనువయిన రాగసంపద వీరి రచనలందు గమనింపతగినవి. ముఖ్యముగా వీరి రచనలు ప్రసిద్ధ రాగములందే ఎక్కువగా ఉన్ననూ సాళంగనాట, లలితపంచమం, ద్విజావంతి, ఘంటా, మోహనకల్యాణి, సైంధవి మొదలగు అపూర్వ రాగములందు కీర్తనలను చేసిరి. కానడా రాగము, లోని ధ్రుపద్, 'స్మరజనక శుభచరితా' అను బేహారాగకీర్తన వీరి అభిరుచులను చాటగలవు. జయదేవులు, నారాయణతీర్థులు, ముత్తుస్వామి దీక్షితులు మొదలగు అగ్రశ్రేణి వాగ్గేయకారుల సంస్కృత గేయరచనలతోబాటు స్వాతితిరునాళ్ కీర్తనలను జతచేయవచ్చు ననుటలో అతిశయోక్తిలేదు. తిరువాంకూరులోని వివిధ క్షేత్రాటనమునుచేసి ఆయా దేవతలమీద కీర్తనలు చేసిరి. వీరి సంగీతశైలిని గురించి కీ. శే. టి. వి. సుబ్బారావుగా రన్నమాటలు చిరస్మరణీయములు.

The kirtanas combine the many excellences of Tyagaraja and Dikshitar. In the employment of Sanskrit: in the abundance ofSahitya, in the beauties Swarakshara and Swarasthana value where the Swara and sylleble coincide, in the miongling of Swara and Sollukatba (మృదంగపు కొనుపింపు జాతులు) he bears great affinity to Dikshitar: in the structure of Kirtana his Compositions resemble those of Tyagaraja in the identity of Dhatu anupallavi with that of the second half of the Charana. The songs have the same sparkling liveliness of spirit and movement as is found in the kirtanas of Tyagaraja in contrast with the massive dignity of Dikshitar's music''

స్వాతితిరునాళ్ కీర్తనల సంస్కృత రచన, మాటలకూర్పు, స్వరాక్షరముల ప్రయోగములు, వర్ణములందు చిట్ట స్వరములకు నడుమవచ్చు కొనుపింపు జాతులు— దీక్షితుల వారి కీర్తనాశైలిని బోలియున్నవి. కాని అనుపల్లవి వలెనే చరణము తుదిపంక్తులు అమరియుండు సంగీతరచన రక్తిని హాయినిచ్చు ఎత్తుగడ, సర్వలఘు, మధ్యమ కాలము నందలి నడక త్యాగయ్యగారి మార్గమును అవలంబించినవి. అని కీ. శే. టి. వి. సుబ్బారావుగారు అభిప్రాయపడియున్నారు. 'సన్తః పరీక్ష్యాన్యతర ద్భజంతే' అన్న సూక్తిని నిష్పక్షపాతముగా వర్తింపజేసి స్వాతితిరునాళ్ కీర్తనలందు మేల్మియయిన సంగీత రచనలు గల కీర్తనలను, వర్ణములను, పదములను, గాయకులు పాడి వినిపింపజేయుట అవసరము. ఇట్టి నిష్పాక్షిక మయిన పరిశీలనలేకుండుటచేత త్రిమూర్తుల కీర్తన అందుకూడ మేలయిన కీర్తనలు మరుగుపడి, సౌలభ్యమను ఒక కారణంతో— రెండవ తరము, మూడవతరము కీర్తనలే

తరచుగా పాడుట సంగీతరసికతకు తీరనినష్టము కలుగజేయుచున్నది. పెద్ద విద్వాంసులు కచ్చేరీలందు పెద్దకీర్తనలు అన్నలు రెండుకూడ వినుఅవకాశములు అరుదయిపోకుండా కచ్చేరీలు ఏర్పాట్లుచేయు సంస్థల అధికారులు, రసికజనము దీక్షబూని ప్రయత్నింపకున్న కర్ణాటక సంగీతపు ఘనతకు క్షీణదశవచ్చి, ముప్పువిర్పడునని పాఠకులకు వినయపూర్వకముగ చెప్పుకొనవలసి యున్నది.

ఇటీవల ముప్పది సంవత్సరముల తరువాత ఈ కీర్తనలు ఎక్కువగా ప్రచారములోనికి రావడమువలన ఆ కీర్తనలు నిజంగా ప్రాచీనమయినవా అన్న సందేహము రావడము సహజమే. వర్ణాలు స్వరజతులు మొదటినుండి వాడుకలోనుండినవి. పదము, జావళిమాటకూడ అంతే. 'కీర్తనలు' ఇటీవల ఎక్కువగా వాడుకలోనికి వచ్చుటకుగాను, ఆ కీర్తనల రూపమును చక్కదిద్ది ప్రాచీనమయిన వర్ణమట్టులకు అందచందముల నమర్చి మంచి స్వరూపమును పొందునట్లు చేసినవారు కే. శే. ముత్తయ్య భాగవతార్. కచ్చేరీ అనుభవమునకు పేరుగాంచిన శ్రీ శెమ్మంగుడి శ్రీనివాసయ్యరుగారు కచ్చేరీలందు పాడుటవలన ప్రజలకు ఈ కీర్తనలందు మంచి అభిరుచి ఆకర్షణ కలిగినవి. ఈ కీర్తనలు ఎంతో ప్రాచీన మనుటకు సందేహములేదు. ప్రొఫెసరు. సాంబమూర్తిగారు స్వాతితిరునాళ్ మహారాజులవారిని గురించిన బిబ్లియాగ్రఫీ పట్టీలో ఇచ్చిన తెలుగున అచ్చయిన క్రింది పుస్తకముల జాబితాను చూచిన చాలును వీటిప్రాచీనత రుజువగును.

1. సంగీత సర్వార్థసార సంగ్రహము ఏప్రెల్ 15,1959
2. గాయక పారిజాతము } తచ్చూరు 1877—
3. గాయక లోచనము } శింగరాచార్యులు 1902
4. గాయక సిద్ధాంజనము. 1905.
5. సంప్రదాయ ప్రదర్శిని 1904.

కీర్తనలమాట ఎట్లున్నా వీరి వర్ణములు, పదములు లేని భరతనాట్య ప్రదర్శన లుండవు. వీరిహిందీ, సంస్కృత భజనావళుల సాహిత్యమునకు అందమయిన మట్లను, హిందూస్థానీ కర్ణాటక ప్రాంతములందుండు ఇరురకముల గాయకులూ పాడుటకు వీలగు సామాన్య రాగములందు అమర్చిన, జాతీయైక్యతకు గాయకులు తమ ఉడుతభక్తి 'సేవచేసినట్లగును.

తిరువాంకూరు ప్రభుత్వమువారు 1950 సంవత్సరమున ప్రచురించిన "శ్రీ స్వాతితిరునాళ్ మహారాజా సెంటనరీ సొవినీరు" తప్పక పాఠకులు చదువవలయును. అందలి వ్యాసములను (ముఖ్యముగా) ఆధారముగ చేసుకొని, ఈ నాలుగు ముక్కలను వ్రాయుట మయినది.

క. తన మొగము తనకు నగపడ
దనువుగ నద్దమునగాక యటులగుట మహా
ఘను కవియైనను నోరుచే
తన తెలిసికొనంగఁ దగును తన తప్పొప్పుల్.

గీ. నెమ్మి మెఱగను కృతిని గుణమ్ములెల్ల
నగపడం జేయుఁ బగనైన నన్ని దోష
ములటుగావున నా రెంటి మొనయుకతన
కృతి విమర్శకులగు వారు హితులు కవికి.

—కాకొండ.

శ్రీ బ్రౌను ప్రశస్తి

శ్రీ భట్రాజు రామన్న[1]

క. శ్రీ సి. పీ. బ్రౌన్రాజా
భాసుర కవిరాజ భోజ పర సౌందర్య
త్రాసిత వాసవ తనుజా
భూసుర సుర భూజ శౌర్య భూషిత భుజా!

క. కంజనయనా మనోజా
రంజిత విద్వత్సమాజ రాజత్తేజః
ఖంజీకృత దినరాజా
భంజిత దుర్హృత్సమాజ బ్రౌన్నృపరాజా!

క. శరణాగత జనభరణా
భరణాకరవాల భుజగభర్త్రీకృతవి
స్ఫురదరి రాట్రాణా బ్రౌన్
ధరణీ తరుణీ రమణ యుదారగుణగణీ!

క. సీ. పీ బ్రౌన్మహీపాలా
గోపీ వస్త్రాపహరణ కోవిద దివ్య
శ్రీపాద పద్మభక్తి
వ్యాపార జనావకీర్ణ వరగుణజాలా!

క. జన్య జిత నిఖిల రిపురా
జన్య సుధీమాన్య జనరాజపతి సమ సౌ
జన్యా! సీ. పీ. బ్రౌన్నృప
ధన్య యశోగణ్యా సర్వదాతి వదాన్యా!

---

1. భట్రాజురామన్న బ్రాహ్మణులు. చెన్నపురివాసులు. బ్రౌనుదొర ఆస్థాన పండితులలో ఒకరు. ఈ బ్రౌను ప్రశస్తిని 1853 జనవరి 28 న వ్రాసిరి. బ్రౌను లేఖలలో ఫిబ్రవరిలో 18 దానిలో ఇది ఉన్నది. —భా. సం.]

క. శ్రీ రమణీరమణ లస
త్సారతరాంశభవుఁ డార్య సన్నుత చరితుం
డారూఢ యశస్కుఁడు బ్రౌన్
భూరమణుడు నన్ను కరుణఁ బ్రోచు ననిశమున్

శా. ఆ పాండిత్యము నావచోమధురిమంబా సుప్రసన్నత్వమా
రూపంబా కవితా రసజ్ఞతయు నాశ్రుత్యంత దృగ్వైభవం
బా పుణ్యాంచిత శీల మా వితరణం బా దీనరక్షాకళా
నైపుణ్యంబును బ్రౌన్మహీపతికి నెన్నంగల్గె భూమండలిన్[2]

మ. వినుఁడీ సజ్జనులార! మీరలిక సీ. పీ. బ్రౌన్మహీపాలునిం
గని మీదీనత నెల్ల బాపికొని సౌఖ్యస్ఫూర్తి శోభిల్లు డ
జ్జన నాథోత్తము డన్న కర్ణ శిబిభోజాది క్షమాపాల కీ
ర్తిని కాయర్క విధూకృతాత్మ వరకీర్తి శ్లాఘ్యుఁడౌనే కదా

ఉ. నీదు సుదర్శనంబిలవసీపక దుర్గతి దైత్యహంత, నీ
శ్రీ దిలకింప దీనజనబృందము ప్రోచెడుతల్లి, నీ కృపా
మేదుర దృక్స్రి సారమెలమిన్ బుధతాప విదారకంబుగా
శ్రీద యితుండు వీదగుట చిత్రమె బ్రౌన్నృప మండలేశ్వరా

క. జనవరియను నెల నిరువది
యెనిమిదియవునాడు వ్రాసియిచ్చిన విజ్ఞా
పనమును చిత్తమ్మున నిడి
యనఘా ననుఁ బ్రోవవలయు సత్యను కంపన్

దండకము

శ్రీ మన్మహారాజరాజ త్రస్తాపాతపాతా పితారాతి మూర్తీ! హరి
త్సుందరీ మల్లికా శేఖరీ భూతకీర్తీ! కృపాపాంగ దృక్సంగదూరీ
భవన్నమ్రలోకాఖిలార్తీ! త్రిలోకీరవీందుస్తనద్వంద్వ దేదీప్య
మానోరు హారాయితా నన్యసామాన్యచంచన్మణీ! కోవిద
గ్రామణీ! దీన చింతామణీ! సర్వవిద్యా ప్రపంచ జ్ఞాతా
భోజ పీ. పీ బ్రవున్ రాజరాజా!

---

2. ఈ పద్యములో శ్రుత్యంతదృగ్వైభవములన్నచోట రెండర్థములు విచారింపవలెను. —భా. సం.]

శ్రీ బ్రౌను ప్రశస్తి

శా. లోకాలోక ధరా ధరాంతర మహీలోకంబు నందీ నర
శ్రేష్ఠా కృత్యంబున కీవు దీక్షసలుపంగా నాదుదౌర్గత్యమో
హో! కారుణ్యసమగ్ర! నన్ను భవదీయోద్యత్కృపా పాంగ వీ
క్షా కల్యాణ పరంపరం బారయనీకల్లే చెబ్రౌన్ భూవరా!

సీ. కాన మత్ప్రార్థనం బౌనని దయతోడి
చిత్తంబునకుఁ దెచ్చియుత్తమాఢ్య!
వ్రాఁతయు నాంధ్రగీర్వాణ సాహితియు నాం
ధ్రవ్యాకృతియునుఁ దత్కవిత తెఱగు
నివి కొంత కొంతపట్టెఱుఁగుదు వీనిలో
బరికించి నాకెద్ది బాగటంచు
మానసంబున దోఁచు మానధనాగ్రగ
ణ్యా యట్టిపనినాకు నమరనొసగి

క. కరుణఁ బ్రోవుము నన్ను సాగరగభీర
మేరు ధీరమనోభవా కారహీర
శారదా శారదాభ్రమందార కుంద
చందనాంచిత కీర్తి బ్రౌన్ చక్రవర్తి.

చ. వెలవెలఁ బోవుచున్నయది వేలుపుగిడ్డి, నిలింపశాఖ యా
కుల పడనేమి కారణమొకో యిది నారద; వాసవా! రస
న్వెలసిన బ్రౌన్మహీపతి యవేల వదాన్యత దారువొందఁగా
దలఁచి యలభ్యమాట జమిదద్దయుఁ దద్దశబొందె వీనికిన్.

ఉ. చెన్నపురీ నివాసుఁడును చింతితకేశవ పాదపంకజుం
డున్నత భూసురాన్వయ సముద్భవుఁ డున్నగు భట్టురాజరా
మన్నను నే 'సలాము' నిడి యంచిత భక్తి నొసంగి నట్టి యీ
విన్నప మాలకించినను వేగరుణింపుము బ్రౌనృపాగ్రణీ.

సద్గమయంలో

సతీశ్

జీవితంలో అనుభవాలు తాళం చెవుల లాంటివి. మామూలు తాళంచెవులకీ, వీటికీ చాలా వ్యత్యాసాలున్నా, కొన్ని పోలికలు గూడా ఉన్నయ్. మామూలు తాళంచేతులు, తాళం కనిపిస్తే, సాధారణంగా తాళానికి సరిపడ్డవయితేనే పనిచేస్తయ్. ఒక్కొక్కప్పుడు వేరొక తాళానికి గూడా పనిచేయటం కద్దు. కాని జీవితానుభావాలు తీసే తాళాలు, తెరిచే ద్వారాలు, ఆ ద్వారాలున్న గదులు, గదులలో ఉన్న అంధకారం అన్నీ వేరు. ఒక్కొక్క అనుభవంతో, అసలు అక్కడ అంతకుముందు, ఒక గదిగాని, తలుపులుగానీ, దానికి వేసిన తాళంగానీ ఉన్నట్లు అనిపించదు. కాని, ఆ అనుభవంతో తీయబడ్డ తాళాలూ, తెరవబడ్డ ద్వారాలూ, వాటికి లోపలగా గుప్తంగా ఉన్న గదులు, అందులో ఉన్న అంధకారంలోకి మన ఆలోచనారస్మి వెళ్లేటప్పటికే, ఒక్కసారి వెలుగులోనించి చీకట్లోకి వెళ్ళినపుడు కలిగిన అనుభవాలే కలుగుతుంటయ్. సాదృశ్యంగా ఉన్న తాళంచెవులతోటి యింకో తాళాలు వూడివచ్చినట్లు ఒక్కొక్క అనుభవంతో, వేరొక ద్వారం మనకీ, మన ఆలోచనలకీ అందని తాళం తెరుచుకుంటుంది.

ఎక్కడో, ఎవరికోగాని, అసాధారణంగా గాని జరగని సంఘటన, సాధారణంగా జరిగిందని చెప్పుకోవటమేగాని చూడని సంఘటన అతని జీవితంలోనే జరిగింది. ఆ దౌర్భాగ్యుడు, ఆ దురదృష్టవంతుడూ అతనే అయ్యాడు. అతని జీవితంలో దురదృష్టమూ దౌర్భాగ్యమూ రెండూ ఉన్నయ్యో లేదో తెలియనివాళ్లెవరూ, అతను దురదృష్టవంతుడు అని అనుకోలేదు. తన దురదృష్టం ఎంతటిదో అతనూ అనుకోలేదు ఎప్పుడూ. కాని ఆ జరిగిన పెద్ద అనుభవంతో, కొద్దిపాటి జ్ఞానం మాత్రం వచ్చింది. ఆ అనుభవం తెరచిన గుప్త ద్వారంలో నించి లోపలికి వెళ్లి అంధకారమయమైన ఆ గదిలోకి తన ఆలోచనల్ని, తెలివితేటల్ని వెంట తీసుకొని వెళ్లినా, అవి అతనికి పూర్తిగా కావలసినంత కాంతి యివ్వలేకపోయినయ్. కాని పూర్తిగా అంధకారం మాత్రం లేదు.

ఆ సంఘటన జరిగి కూడా చాలా నెలలైంది. అయినా అది అప్పుడే జరిగినట్లు, దానినించి ఎప్పుడూ తేరుకొని, అది మరిచిపోగలిగినట్లు అతనికి అనిపించకపోవటం గూడా జరిగింది. నిజంగా ఎక్కడో కథల్లో జరిగేలాంటిదే. పేపర్లో ఎక్కడో జరిగినట్లు చూసేలాంటిదే అయినా అది జరిగింది. తనకే జరిగింది. అదే ఆశ్చర్యాన్ని కలిగించింది ప్రసాదరావుకి.

మర్నాడు ఆఫీసరు క్యాంపు వెళ్తాడు. అతను అసలే మతిమరుపు మనిషి. హెడ్ గుమాస్తా వెంకటేశ్వర్రావు, నమ్మదగని మనిషి. అది అందరితోపాటు ఆఫీసరుకు కూడా తెలుసు. అందుచేత అతన్ని నమ్మి, ముఖ్యమైన కాగితాలు, డబ్బు కూడా పెట్టే ఆ బీరువా తాళంచెవి అతనికి యివ్వనూ లేదు. తను మరిచిపోయి, వెతుక్కుంటూ యిబ్బంది పడనూ లేదు. ఎప్పుడూ తాళంచెవి మరిచిపోయి యిబ్బందిపడి ఆఖరికి ఎక్కడో దొరికి, బ్రహ్మాండంగా సంతోషించి, హడావుడిగా సగం మరిచిపోయి క్యాంపు వెళుతాడు అతని ఆఫీసరు. కాని, యీమధ్య ఆ చికాకు అంతా సమర్థుడూ, బాధ్యత తెలిసినవాడూ, నమ్మకమైనవాడూ అయిన ప్రసాదరావుకి, అతను సర్వీసులో తక్కువైనా, యిచ్చి తను నిశ్చింతగా, మతిమరుపులేని ప్రసాదరావు అన్నీ అమర్చిపెడితే తేలిగ్గా క్యాంపు వెళ్తాడు. మళ్లీ వచ్చి ప్రమోషను యిస్తాలే అన్నట్లు ప్రసాదరావు వైపు చూసి. అప్పటికే ఒకసారి ప్రసాదరావు నమ్మకం సమర్థత అన్నీ చూశాడు ఆఫీసరు. అయినా తిరిగి వచ్చిన వెంటనే ప్రమోషను యివ్వలేదు. ప్రసాదరావు యీసారి యింకా అతన్ని సంతోషపెట్టాలనుకున్నాడు. అట్లా ఎంతో చేస్తేగాని ప్రమోషను రాదు. ఆవిషయం అతనికి తెలుసు. అయినా, జాగ్రత్త అయినవాడూ, మతిమరుపు లేనివాడూ అయిన ప్రసాదరావుకి గూడా మతిమరుపు వచ్చింది. తాళంచెవి తనకి యివ్వటం రెండోసారే అయినందువల్ల తను అతి జాగ్రత్తకోసం ప్రయత్నించటం వల్ల మతిమరుపు రానేవచ్చింది.

తనకు మతిమరుపు వచ్చిందని, ఆఫీసరు యింకో అరగంటలో బయలుదేరుతా డనగానే జేబులు చూసుకున్న ప్రసాదరావుకి తెలిసి వచ్చింది. ఎప్పుడూ, అన్నీ జేబుల్లోనే ఉంచుకునే అతను, క్రితం రాత్రి సినిమాకు వెళ్తూ అలమారులో పెట్టాడు. ఇంకో అరగంట కంటే టైము లేదు. తక్కినవన్నీ ఆఫీసరు వెళ్లటానికి రెడీగానే ఉన్నయ్. లతను ఇంతకు ముందు ఎప్పుడూ, ఆఫీసరుచేత అసమర్థుడూ, మతిమరుపు మనిషి అనిపించుకోలేదు. ఎప్పుడూ, అనిపించుకోడు. అందులో యిప్పుడు అనిపించుకుంటే, తను అనుకుంటున్న, ఆఫీసరు యిచ్చేటట్లు కనబడ్డ ఆ ప్రమోషను కాస్తా ఆగిపోతుంది.

ఆఫీసరుకు తెలియుట మెందుకు, పది నిమిషాల్లో తిరిగి వచ్చెయ్యవచ్చు కదా అని, ప్రక్క గుమాస్తాతో చెప్పి ఇంకో గుమాస్తా సైకిలు తీసుకుని బయలుదేరాడు. అయినా ఈలోపల ఆఫీసరు పిలుస్తాడేమోననే భయం. బండికి బయలుదేరటానికి అరగంట కంటే టైంలేదు. తను తాళంచెవి మరచిపోయినట్లు ఆఫీసరుకు తెలియగూడదు. తెలిస్తే తనమీద ఉన్న నమ్మకానికి తనకు వచ్చే ప్రమోషనుకూ దెబ్బ. స్టెనో టైపిస్టు కంటె స్టెనోగ్రాఫరుకు యిచ్చే యిరవై రూపాయలు, తనకి

వాలా ఎక్కువే. ఇరవై రూపాయల విలువ అతనికి బాగా తెలుసు.

సైకిలు, ఊపిరాడకుండా గాలిపీలుస్తూనే, త్వరగా తొక్కాడు. పది నిముషాలలో తాళంచెవి తీసుకొని, ఆఫీసరు పిలిచేలోగా వెళ్ళిపోవాలి. ఆఫీసరుకు యీ సంగతి తెలియకుండా ఉండేట్లు, తను ఆఫీసరు పిలిచేలోగా తిరిగి వెళ్ళగలిగేట్లు చెయ్యమని మనస్సులో భగవంతుని ఎన్నో నమస్కారాలు గూడా పెట్టుకున్నాడు. ఆఫీసరు పిలిచేటప్పటికి తాళంచెవితో హాజరు కాకపోతే, నూరు నోములూ, ఒక్క రంకుతో పోయినట్లు, యింతకుముందు ఉన్న మంచి, సమర్థత అన్నీ ఒక్క నిముషంలో పోతయ్. వాటితోపాటు వస్తుందనే ప్రమోషను గూడా చంకపెట్టుకుపోతయ్. ఆ విషయం అతనికి పూర్తిగా తెలుసు. అసలు ఆఫీసర్లే అంత, ఎంత సమర్థవంతంగా ఎంత గొడ్డు చాకిరీ చేసినా, ఒక్క తప్పు కనిపిస్తే చాలు, ఆ ఒక్క తప్పుతోటే మిగతాదంతా తుడిచేస్తారు.

అతను ఆయాసంతోటి, ఆతృతతోటీ, మనస్సులో ఉన్న భయ సంకోచాలవల్ల కలిగిన ఉద్వేగంతోటీ తలుపు తట్టాడు. తలుపు వెంటనే తెరుచుకోలేదు.. కొంచెం గట్టిగానే తలుపుమీద కొట్టాడు. దూరంగా ఎక్కడో, ఆఫీసరు తనకోసమే గంట కొట్టినట్లు తను కొట్టిన తలుపు చప్పుడే వినిపించింది. లోపల్నించి 'ఎవరూ' అని సన్నని, కీచుపోతున్న గొంతుక వినిపించింది. అతనికి విపరీతంగా కోపం వచ్చింది. శకుంతలమీద. బాగా కోపంగానే కేకవేశాడు తనే నని చెప్పటానికి. అప్పుడే ఆఫీసరు తనమీద కేకలు వేస్తున్నాడు. తను యింకా యిక్కడే ఉన్నాడు. అయినా తలుపు తెరుచుకోలేదు. శకుంతల యింత మొద్దు ఎందుకయిందా అనుకున్నాడు. తలుపులు పగలతన్నే అంత కోపం వచ్చింది. అయినా తన్నలేదు. అతని దృష్టి ఆఫీసరు మీదికి, ఆఫీసులో బీరువా మీదికీ, దాంటో ఉన్న అవసరమైన కాగితాలూ, డబ్బు మీదికీ పోయింది. ఆడబ్బూ, కాగితాలూ లేకపోతే ఆఫీసరు వెళ్ళడు, తనకి ప్రమోషను రాదు. తను సమయానికి కనబడకపోతే పోలీసులు వస్తారు తనకోసం. వస్తుందనుకున్న అదృష్టం పోతుంది. అవకాశం 'కోసం, అసూయతో కాచుకొనివున్న వెంకటేశ్వర్రావు శకునిరావు ఆఫీసర్ని బుట్టలో వేసుకోవటానికి ప్రయత్నిస్తాడు.

తలుపు గడియ నిశ్శబ్దంగా ఊడి, తలుపు ఒకటి చిన్నగా తెరుచుకుంటున్నది. నెమ్మదిగా తెరుచుకోబోయే తలుపుని తానే గట్టిగా, త్వరగా నెట్టాడు. శకుంతల ముఖంలో నెత్తురుచుక్క లేకపోవటం, భయంతో పాలిపోవటం గూడా అతను గమనించలేదు. "ఏంచేస్తున్నావ్" అంటూనే అల మారు వైపుకి వెళ్ళాడు. అలమారు తీసి తాళంచెవి తీసుకుంటుండగా గదిలోనించి ఎవరో బైటికి పరుగెత్తుతున్నంత వడిగా నడిచి వెళ్తున్నట్లనిపించి వెనక్కు తిరిగి చూశాడు. తలుపుదగ్గర శకుంతల యింకా అట్లాగే నిలబడింది. బైట నించి లోపలికి చొచ్చుకువచ్చే మిట్టమధ్యాహ్నపు వెలుతురులో లోపలినించి బైటికి చొచ్చుకుపోతున్న గోపాలరావు స్పష్టంగా కనిపించాడు.

అతను వెనక్కి పూర్తిగా తిరిగి నిలుచున్నాడు. అతనికి పూర్తిగా అర్థమైంది తలుపు త్వరగా ఎందుకు తెరుచుకో లేదో. నిర్విణ్ణుడైన అతను నిశ్చేష్టితుడై నిలబడిపోయాడు. ఆతృతతోనూ, ఆవేశంతోనూ, ఆగ్రహంతోనూ, ఆరాటపడుతున్న అతని మనస్సున, దానికి ఇంకో లోతుగా ఎక్కడో కృంగిపోయిఉన్న హృదయానికో, దేనికో అశనిపాతంలాంటి ఆ ఆఘాతం తగిలింది. తగిలి అతని సర్వావయవాలనీ నిశ్చేష్టితం చేసింది. మనస్సు నిర్విణ్ణమై పోయింది. హృదయం అచేతనమై పోయింది. ఎటు చూస్తున్నా గూడా ఎవరికీ, చివరికి అతనికి గూడా తెలియనంతగా కళ్ళకెదురుగా దృష్టి ఉన్నా ఎటో, ఏదో లోకాలని చూస్తున్నట్లు ఉండిపోయాడు.

అచేతనమైన అతని చేతులోనించి, తాళంచెవి జారిపడి, ఆఫీసరు కోసం ఆఫీసులో బీరువా తీయటం మానేసి, అక్కడ తెరవవలసిన ఆ టైములో ప్రసాదరావు ఇంతకుముందు ఎప్పుడూ తీయని, అసలు ప్రసాదరావుకి తన అస్తిత్వం గూడా తెలియకుండా ఉన్న యింకో గది తాళం తెరిచి తన పని అయిపోయినట్లు వూరుకుంది.

ఎక్కడ ఉన్నదో గూడా తెలియకుండా ఉన్న ఆయోమయంలో నించి మాయామయంలోకి వచ్చి పడ్డాడు. క్రిందపడ్డవెంటనే కీకా అంటూ కీకారణ్యంగా ఉన్న ప్రపంచంలో పడి శిశువు తన అస్తిత్వాన్ని తల్లికి గుర్తుచేసినట్లు, తాళంచెవి ప్రసాదరావుకి కర్తవ్యం నిర్ణయావసరం గల చేతన స్థితిలోకి లాక్కొచ్చింది. ఎదురుగా తల వొంచుకుని నిలబడ్డ శకుంతల, దూరంగా ప్రయాణానికి సిద్ధమై తనకోసం కోపంగా చూస్తున్న ఆఫీసరు, శకుంతలకీ తనకీ మధ్యగా ఉన్న ఖాళీ జాగాలో పడిఉన్న తాళంచెవి, దానికోసం పరుగెత్తుకు వచ్చే పోలీసులు దానికోసమే ఎదురుచూస్తున్న ఆఫీసరూ, అందరూ ఒక్క వరుసలో కనిపించారు.

వంగి తాళంచెవి తీసుకొని, గట్టిగా నిట్టూర్చి, తన కేమీ కానట్టు నిలుచునిఉన్న శకుంతలవైపు చూడకుండా, ఎవరికో ఎందుకో చెబుతున్నట్లు చెప్పాడు. "ఒక అరగంటలో అంతా సర్ది రెడీగా ఉండు. బండి తీసుకొస్తా" అని చెప్పి కర్తవ్య నిర్ణయంచేసి, వేరొక కర్తవ్యం కోసం, కర్తవ్యం తప్ప ఇంకేమీ అప్పుడు లేనట్లు, ఇంతకుముందు ఏమైనా ఉన్నా అవేమీ మిగలనట్లు నడిచి వెళ్ళిపోయాడు.

యాంత్రికంగా అక్కడి బాధ్యత నిర్వర్తించి, యిక్కడి బాధ్యత గూడా పూర్తిచేయటానికి బండి తీసుకువచ్చాడు. తను చెప్పినట్లు ఏమీ సర్ది రెడీగా లేదు. సర్దటానికి గూడా క్లుప్తమైన సంసారం కావటంవల్ల, ఏమీ లేదు. అతను వచ్చేటప్పటికి శకుంతల అంతకుముందు నిలుచున్నట్లు గాక, కొంత గది లోపలిగా, గోడప్రక్కగా ఒదిగి కూర్చొని ఉంది. అతను

తన బట్టలూ అవీ సర్దుకోవటం చూసి, ఆమె గూడా లేచి తన బట్టలు తన పెట్టెలోకి సర్దుకుంది. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఒకరు యింకోరి వైపు చూడలేదు. యాంత్రికంగా పనులు చేసేశారు.

అతను బండివాణ్ణి పిలిచి, అవి లోపల పెట్టమని అక్కడికి మూడో యింట్లో ఉన్న ఒక ముసిలాయనకి కొంత డబ్బూ, తాళంచెవి యిచ్చి వచ్చాడు. అతని ప్రశ్నలకి అన్నిటికీ సమాధానం చెప్పలేదు. రెండో యిల్లు తాళం వేసిఉంది. లేకపోతే ఎట్లా ఉండేదో. ఎదటివాళ్ళు వేసే ప్రశ్నలకి సమాధానం చెప్పటానికి యిష్టంలేనప్పుడు ఒక చిన్న పద్ధతి ఉంది పని త్వరగా తెముల్చుకోటానికి. వాళ్ళు అడిగే మొదటి ప్రశ్నకే ఒకమాట సమాధానం చెప్పటమో, రెండో ప్రశ్న అడిగే లోపల మొదటి దానికే పూర్తిగా వూకట్టటమో చేస్తే కొంత సరిపోతుంది. ఈలోపల మనం వెళ్ళిన పనిని గురించి చెప్పి తిరిగి రావచ్చు. అతను అల్లాగే చేశాడు. అద్దె డబ్బు, చిల్లర బాకీలు వగైరా అన్నీ చెప్పి డబ్బు యిచ్చి వచ్చాడు.

బండి స్టేషనుకు పోనివ్వమని తాను ముందుగా నడిచాడు. స్టేషను వూరికి దూరం. అయినా నడుస్తూనే ఉన్నాడు. బండివాడు "మీరు కూడా ఎక్కరాదా బాబూ" అని అన్నాడు. బండి ఒకటి రెండుసార్లు ఆపాడు గూడా. "అక్కర్లేదు, పదవోయ్" అని బండికంటె ముందుగా నడిచాడు. ఒక్కసారి గూడా వెనక్కి తిరిగి చూడలేదు.

స్టేషనులో రైలు వచ్చి ఆగింది. పోర్టరుకి ఆమె సామాను చూపెట్టి, అది ఆడవాళ్ల పెట్టెలో పెట్టమని, తన సామాను మగవాళ్ల పెట్టెలో పెట్టమని పురమాయించి టిక్కెట్లు కొనుక్కురావటానికి ఆడావుడిగా వెళ్లాడు. అతను వెళ్లిన దిక్కుకి ఆమె చూసింది. అతను వెనక్కి తిరిగి చూడలేదు. పోర్టరు కేకతో ఆమె తన సామాను వెంట వెళ్లింది.

బండి బయలుదేరబోతుం దనగా, అతను ఆమె ఎక్కిన పెట్టె దగ్గరికి వచ్చాడు. ఆమె కూర్చున్న చోటుకి ఎదురుగా ఏదో బెడ్డింగు పడేసి ఉంది. మౌనంగా ఆమెవేపు గూడా చూడకుండా, ఆ బెడ్డింగుమీద టిక్కెట్టూ, కొంత డబ్బూ ఉంచాడు. ఆమె వెంటనే తీసుకోలేదు. బండి బయల్దేరింది. తనవైపు చూడని అతనివైపు, బండి యిక కనబడకుండగా చేస్తూఉండగా ఒకసారి చూసింది శకుంతల. ప్రక్కవాళ్ళు ఎవరో, ఏదో అడుగుతున్నారు. ఆమె సమాధానం చెప్పలేదు. గాలికి ప్రక్కకి ఒరిగే నోట్లూ, వాటితోపాటూ ఉన్న టిక్కెట్టూ ఆమె చేతికి అందిచ్చారు. ఆమె మౌనంగా అందుకొంది.

కొంచెం వింతగా చూస్తూ ఉన్న చుట్టుపక్కల కూర్చున్నవాళ్ళ కాస్సేపట్లో, ఎంత ప్రశ్నించినా ఏమీ మాట్లాడని, ఆమె సంగతి వదిలేసి, ఎవరి పనిలో వాళ్ళు మునిగిపోయారు. ఆమె అనే మనిషి అసలు ఆ స్టేషనులోనే ఎక్కనట్లుగా భావించేసి.

2

ఆతర్వాత రోజుల్లో చాలా జరిగింది. ప్రసాదరావు బెజవాడలో ఇంకో కంపెనీలో, ఉద్యోగంలో ప్రవేశించాడు. అతనికి ఉద్యోగం దొరకటం, దాంట్లో తన సమర్థతని చూపెట్టి, సమర్థుడు అనే పేరు తెచ్చుకోవటం కష్టంకాలేదు. కాని తనకి సమర్థతలేని విషయం గురించి, ఆ విషయంలో సమర్థత అంటే ఏమిటో, ఎట్లా ఉంటుందో అనే విషయాన్ని గురించి ఆలోచించాడు. తెలుసుకోవటానికి దొరికిన పుస్తకమల్లా చదివాడు గూడా.

తన జీవితచరిత్ర సంతటినీ, తన ఆలోచనాంశాన్నీ గూడా పూర్తిగా మార్చివేసిన ఆ సంఘటనవల్ల దానివల్ల వచ్చిన అనుభవంతో, పరిజ్ఞానంతో, తనకి తెలియని, తెలుసుకుందామని ఎప్పుడూ అనిపించని విషయాల్ని గురించి, ఆలోచించసాగాడు. ఆలోచించి తర్కించ ప్రయత్నించాడు. ఆఫీసు—పని—హోటలు—గది—పుస్తకాల మధ్య మాత్రం శరీరం యాంత్రికంగా కావలసినచోట కావలసినవిధంగా పనిచేస్తున్నా, మిగతా సమయాల్లో మనస్సు మాత్రం అతనికి కావలసిన అంశాల్ని వెతుక్కుంటూ ఎటో వెళ్లి విషయసేకరణ చేసి వస్తుండేది. హృదయం దాని స్థానంలో ఉన్నదా, లేదా అని అనిపించేటంత లోపలికి, అగాథంలోకి వెళ్లిపోయింది. కాని దానితో యిప్పుడు అతనికి ఎక్కువగా పని లేకపోవటంవల్ల దాని విషయమై అతనికి ఎక్కువగా గుర్తు ఉగలలేదు గూడా.

అతన్ని తరచు సమాధానంకోసం వేధిస్తూ ఎప్పుడూ ఆలోచనని వీడకుండా రెండు ప్రశ్నలు ఎదుర్కొంటుండేవి. అందులో మొదటి ప్రశ్న ఆరోజు శకుంతలని తను ఎందుకు చంపివెయ్యలేదు ? కనీసం ఎందుకు ఏమీ చెయ్యలేదు ? తను చదివిన పుస్తకాల్లో అట్లాంటి సందర్భంలో ఆమెనీ, గోపాలరావునీ కలిపిగానీ, విడివిడిగా గానీ చంపటమో, చంపి తనుచచ్చిపోవటమో, లేక చంపలేక తను చచ్చిపోవటమో జరిగేటట్లు, జరిగిఉండవలసినట్లు అంతకంటె జరగటానికి అవకాశం లేనట్టు ఉంది. కొన్నింటిలో మాత్రం క్షమించి వూరుకున్నట్లు గూడా ఉంది. కాని అది సత్యదూరంగా, అసంగత కల్పనగా అనిపించింది. కాని, తను చంపనూ లేదు, చచ్చిపోనూ లేదు. ఆరోజు అంత గంభీరంగా ఎట్లా ఉండగలిగాడో, అంత స్థైర్యంగా ఎట్లా యాంత్రికంగా పనిచెయ్యగలిగాడో, ఎట్లా నిర్ణయం తీసుకోగలిగాడో గూడా యిప్పుడు తిరిగి పర్యాలోచించటానికి గూడా వీలులేనంత అద్భుతంగా ఉంది.

అతనికి చాలారోజుల ఆలోచన తర్వాత దానికి సమాధానం దొరికింది. దొరికిన సమాధానం సరిగ్గానే ఉంది గూడా. తన బాల్యం, తన జీవితమే దానికి సమాధానం చెప్పింది. తను మధ్యతరగతి అని చెప్పుకొంటూ చెప్పుకోబడుతూ ఉండే బీద తరగతికి చెందినవాడు. ఆ తరగతిలో ఉన్న వాళ్లకి గౌరవంగా

బ్రతకటం ముఖ్యం. ఆ గౌరవం పోకుండా చూసుకోవటం ముఖ్యం. అది పోకుండా చూసుకోవటానికి యింటి గుట్టు ముఖ్యం. తన తండ్రి తెచ్చే కొద్ది సంపాదనతోటి గడవక, చాలక చాల రోజులు రోజంతటికి కలిపి ఒక భోజనమే చేసి గడపవలసి వచ్చేది. చిరగనిది, బజారుకు వేసుకెళ్లటానికి పనికి వచ్చేదీ, ఒక్కటే చొక్కా ఉండేది. జీవితంలో తమ హైన్యం యితరులకి కనబడకుండా ఉండాలనే తాపత్రయం, ఎదురుగా ఉండి నేను మిమ్మల్ని విడిచి ఎట్లా వెళ్లను అని దైన్యంగా చూసే దారిద్ర్యం, ఎట్లా మార్పు వస్తుందో తెలియక పోయినా, మార్పువచ్చే అవకాశాలు ఏవీ కనిపించకపోయినా, ముందెప్పుడో మార్పు వస్తుంది అనే భవిష్యత్తుమీద అర్థంలేని ఆశ, నమ్మకమూ తప్ప ఇంకేమీ ఉండేవికావు. మరొకటి గూడా ఉండేది. అది కర్తవ్యం. భోజనం లేకపోయినా, గుట్టు రట్టు లేకుండా కర్తవ్యం మాత్రం ఎప్పుడూ నెరవేరుస్తూ ఉండేవాళ్లు. తనుస్కూలుకీ, తండ్రి సంపాదనకీ అట్లాగే బాధ్యత మీద వేసుకుని బరువుగా కర్తవ్యంలోకి సాగిపోతూ ఉండేవాళ్లు. అదే తమ గౌరవానికి కారణం. ఆ గౌరవం అంటే నలుగురి చేతా మంచి అనిపించుకోవటం ఎవ్వరిచేతా వేలెత్తి చూపించుకునేట్లు ఉండకపోవటం. దానివల్ల ఏమీ కలిసిరాకపోయినా అది లేకపోయినందువల్ల వచ్చే నష్టాలు ఎక్కువగా తెలిసిన వాళ్లు గనుక దానికోసమే ప్రాకులాడుతూ ఉండేవాళ్లు.

తండ్రి మిగతావాటి అన్నిటితోపాటు తనకు సంక్రమింప చేసింది, బాధ్యత, కర్తవ్యం యీ రెండూ. వాటిని ఆధారం చేసుకొని గౌరవం తెచ్చుకోవటం. తండ్రి అవే నేర్పాడు. తండ్రి దగ్గర్నించి, చూసి అవి నేర్చుకున్నాడు. వాటికి తండ్రికి మనస్సులో ధన్యవాదాలు చెప్పాడు. వాటితోనే జాగ్రతా బజారునపడ్డ గౌరవం ప్రతిష్టల్ని లోపలికి యీడ్చుకొనివచ్చి కాపాడుకున్నాడు. చిన్నప్పటినించీ అయిన అలవాటువల్లనే ఆరోజు అంత స్థైర్యంగా ఉండగలిగాడు. యాంత్రికంగా పనిచెయ్య గలిగాడు.

కాని ఆ సంఘటన తలుచుకున్నప్పుడల్లా ఇప్పుడు ఉద్రేకం వస్తున్నది. అప్పుడు మనస్సు అచేతనమై పోయింది. ఎందుకో అర్థంకాలేదు. ఇటీవలనే తను తెలుసుకున్న మనస్సు, హృదయం అనే రెండింటినీ గురించి కూడా అప్పుడప్పుడూ ఆలోచిస్తున్నాడు. ఇంతకుముందు అవి లేవని కాదు. ఇంతగా తెలిసి లేవు. అనూహ్యమైన ఆ ఆఘాతానికి తట్టుకోలేకనో, లేక ఆ కర్కశాఘాతం, ఆవ్యచింతలో ఉండగా తగలడం చేతనో లేక ఆఫీసరూ, ప్రమోషనుతోనూ నిండిన అన్యచింతనో, తగిలిన ఆఘాతపు తాకుడుకు జరిగిన సంఘర్షణ వల్లనో, ఎందుచేత వచ్చిందో గూడా మనస్సుకి అప్పుడు ఆ జడత్వం యిప్పటికి ఎంత ఆలోచించినా నిర్దిష్టమైన సమాధానం రాలేదు. దీని విషయమై తను ఎక్కువ కృషి కూడా చెయ్యలేదు.

అతన్ని పట్టుకొని పీడిస్తున్న మరొక సందేహం, శకుంతల అట్లా ఎందుకు చేసింది ? ఎన్నాళ్లనించి చేస్తున్నది? తన కళ్లు ఎందుకు మూసుకుపోయినయ్ ? ఆఫీసు పనిలో నైపుణ్యం, సమర్థత ప్రదర్శించే తను ఎందుకు గ్రహించ లేకపోయాడు. అతనికి దానికీ ఒక రకమైన సమాధానం దొరికింది. తన జీవిత దృక్పథమే వేరు ? తన వూహాలే వేరు చిన్నతనంనించీ తను గుట్టుగా అనుభవించిన దారిద్ర్యం నించి దూరం కావటానికీ కృషి చేశాడు. తన కుటుంబాన్ని ఆ దారిద్ర్య బాధనించి కాస్త తేరుకోవటానికి అవకాశం కల్పించే లాగా ప్రయత్నం చేశాడు. దానికోసమే కష్టించి పని చేశాడు. నిజానికి కొంత ఫలితం పొందాడు గూడా. తనూ, తన కుటుంబం యిప్పుడు యిబ్బంది పడటంలేదు. తను సంపాదించే సంపాదనలో దాదాపు సగానికి సగం పంపి తండ్రికి సాయపడుతున్నాడు. అయినా శకుంతల గానీ, తనుగానీ జీవితావసరాలకు ఎప్పుడూ యిబ్బంది పడలేదు. తన దగ్గర పొదుపు జాగ్రత్త రెండూ ఉన్నయ్. శకుంతల దగ్గర అవి కాస్త తక్కువ. తను ఆ విషయం తెలియచెప్పటానికి ప్రయత్నం చేశాడు. శకుంతల నేర్చుకోవటానికి ప్రయత్నించేటట్లే కనిపించేది. అయినా నేర్చుకోలేక పోయింది. ఆమెగూడా జీవితావసరాలన్ను మించిన అవసరాలు ఉన్నయ్యని ఎప్పుడూ చెప్పనూ లేదు. అందుచేత శకుంతలని తను కట్టుబడ్డ జీవిత నియమాలకు, ఆదర్శాలకూ అవసరంగా పూర్తిగా, మార్పే అవకాశం గాని, పూర్తి అవసరంగాని అతనికి కనబడలేదు.

తన ప్రశ్నకి సమాధానంకోసం శకుంతలతో తన మొట్టమొదటి పరిచయం నుంచీ, ఆ సంఘటన జరిగేవరకు గడచిన రెండు సంవత్సరాల వైవాహిక జీవితం అంతా వెతికాడు. గాలించాడు కూడా. శకుంతలని తను మొట్టమొదట పెళ్లిచూపులు చూడటానికి వెళ్లినప్పుడు చూశాడు. శకుంతల తనకు నచ్చి నట్లు ఏమీ కనబడలేదు. తన దృష్టి తనకు కాబోయే భార్య ఎట్లా ఉంటే నచ్చుతుందో అనే విషయంమీదికి వెళ్లలేదు. తన ఉద్యోగం, వ్యక్తిగతమైన వినయవిధేయతలూ, కుటుంబ మర్యాద చూసి వచ్చిన, శకుంతల వాళ్ల నాన్న యిస్తామన్న కట్నం మాత్రం నచ్చింది. కొంచెం డబ్బు ఎక్కువ మొత్తంగా అవసరంగా ఉండి, అంత మొత్తం యిచ్చేవాళ్లు తక్కువ అనే విషయం తెలిసిన తన తండ్రికీ, తనకీ గూడా శకుంతలా వాళ్ల తండ్రి ఔదార్యం మంచితనం, యిస్తామన్న డబ్బుతో పాటు బాగా నచ్చినయ్. అందుచేత శకుంతల గూడా నచ్చింది. అతనికి అప్పుడు తోచలేదు, యిప్పుడు తోచింది. శకుంతలకి తను నచ్చాడో లేదోనని ! అప్పుడు కనుక్కొండే అవకాశం కల్పించేదాకా సమాజం మారలేదు. నచ్చకపోతే ఎందుకు చేసుకుంటుంది. తనలో ఏం నచ్చిందో ఎప్పుడూ అడగలేదు. తనకు శకుంతలలో ఏం నచ్చిందో ఎప్పుడూ చెప్పలేదు గనుక. కాని యిప్పు డర్థమైంది శకుంతలకి తను నచ్చాడో లేదో. ఇప్పుడు అడగక్కర్లేదు. అడగకుండానే తెలిసింది.

శకుంతలని తను ప్రేమించాడు గూడా. ఆ విషయం తనకి చాలాకాలం క్రితమే తెలుసు. శకుంతలా వాళ్లు యిచ్చిన కట్నంలో ఎక్కువగా ఖర్చుపెట్టకుండా, చాలా కొద్దిమొత్తంతో తన పెళ్లి ముగించి వెంటనే తన చెల్లెలి పెళ్లి గూడా

చేశాడు తండ్రి. దాంతో బాధ్యత గూడా తీరింది. తీరదు అనుకున్న బరువుతోపాటు. తనకు చాలా సంతోషమైంది. శకుంతలా వాళ్ళు ఆ కట్నం యివ్వకపోతే, యింత కట్నం యిచ్చాం సొమ్మేం పెడతారు అని అడిగిఉన్నట్లయితే చెల్లెలి పెళ్ళి అయిఉండేదికాదు. శకుంతల గూడా ఎప్పుడూ ఆ విషయం ప్రస్తావించనూ లేదు. తనకు సొమ్ము పెట్టలేదని బాధ పడ్డట్లు గూడా కనిపించలేదు. తనకి సొమ్ము పెట్టకుండా ఆ డబ్బుతో చెల్లెలి పెళ్ళి చేశారని మాటవరసకైనా దెప్పి పొడవనూ లేదు. అతనికి రెట్టింపు సంతోషం అయింది. తనకి ఎప్పుడూ సుఖం చేకూర్చటానికే ప్రయత్నిస్తున్నట్లు కనబడేది. తను ఆఫీసరు వదలక యింటికి ఆలస్యంగా వస్తే బాధ పడేది వేళకు తిండీ, తిప్పలు గూడా అమరటంలేదని. అతనికి యివన్నీ గుర్తు ఉన్నయ్. అతనికి శకుంతలమీద నిజంగానే ప్రేమ ఉన్నట్లు అనిపించింది.

ఆమెకు గూడా తనమీద ప్రేమ ఉన్నట్లు కనిపించింది. అదంతా అప్పుడు అనుకునేవాడు. ఇప్పుడు అర్థమైంది. ఆమె ప్రేమ ఎటువైపు ఉన్నదో, ఆమె దృష్టి ఎటువైపు లగ్నమైందో. అసలు ఆరోజైనా అకస్మాత్తుగా బైటపడింది గాని, అసలు ఎన్ని రోజుల నుంచి జరుగుతున్నదో ఆ నాటకం ? ఎన్ని రోజుల క్రితమే తన పరువు తీసిందో, బజార్లో ఎప్పుడు పడేసిందో, తనకి తెలియదు. తను వూహించలేదు. ఎవరూ చెప్పలేదు. తను గ్రహించలేదు.

అతను జీవితంలో మొదటిసారిగా శకుంతల అట్లా చెయ్యటానికి గల కారణాలు ఏమిటి ? తనలో లేనిదీ, గోపాలరావులో ఉన్నదీ ఏమిటో ఆలోచించటం మొదలుపెట్టాడు.

3

అతనికి తెలిసింది. తను అసమర్థుడూ, అప్రయోజకుడూ, దరిద్రుడూ, ఒట్టి వాజమ్మ. తనకి ఉంగరాల జుట్టు లేదు. విశాలమైన ఛాతీ లేదు. అది బైటికి కనపడేట్లు చెయ్యటానికి అవసరమై ఒక్కటే యాభై రూపాయల దాకా మింగేదిగా ఉండే టెరలిన్ షర్టు లేదు. ఆడవాళ్ళ ఎదురుగా కూర్చుని, తీరిగ్గా జీవితమంతా చెయ్యవలసిన పని అదే అయినట్లు, అదే ఆనందంగా చేస్తున్నట్లుగా మాట్లాడేటంత తీరికా, సావకాశమూ లేవు. తనదగ్గర నిత్య దారిద్ర్యమూ, కర్తవ్యమూ, బాధ్యత, విశ్వాసమూ, భవిష్యత్తు మీద ఆశ, భవిష్యత్తులో ఉండే అవసరాల జ్ఞానం, దానికి కావలసిన పొదుపు, జాగ్రత్త యివన్నీ ఉన్నయ్. కాని యివేవీ శకుంతలకు పనికిరాకపోయినయ్. అక్కర్లేకపోయినయ్.

శకుంతల వీటన్నిటిని గురించి ఎప్పుడైనా ఆలోచించి ఉంటుందా అనిపించింది. తను శకుంతలని గురించి, శకుంతల యీవిధంగా చేస్తుందనే దాని అవకాశాల్ని గురించీ ఆలోచించలేదు. శకుంతల వీటిని గురించి ఎప్పుడూ ఆలోచించి ఉండదు.

తను యీ ఏకాంత నిరామయ జీవితంలో చాలా పుస్తకాలు చదివాడు. ఆడవాళ్ళు అట్లా ఎందుకు చేస్తారో, శకుంతలలు ఎందుకు అవుతారో అనేదాన్ని తెలుసుకుందామని. కొంత ప్రత్యక్షానుభవంతో తెలిసింది. కొంత పుస్తకాలలో అర్థమైంది. మరికొంత అర్థంకాదు. ఆ అర్థంకానిది ఎప్పటికీ అర్థంకాదనిపించింది. మరికొంత గాదు యింకెంతో తెలుసుకోవలసినది ఉన్నది అనిపించింది. అప్పుడు ఇంకా ప్రయత్నం చెయ్యకుండా, తెలివిగా తెలిసిన దాన్ని అర్థమైనదాన్ని క్రోడీకరించుకున్నాడు.

ఆడవాళ్ళకు సువ్యవస్థితమైన, గౌరవమైన కుటుంబ జీవితంమీద కంటే మనస్సుని ఉద్రేకపరిచే, తాత్కాలిక అనుభవాలమీద ప్రేమ ఎక్కువ. ఆ అనుభవాల కోసం అర్రులుచాచి వాటి అనుభూతులు పొందటంలో మగవాళ్ళ కంటె ఒక్క మెట్టు పైగా ఉంటారు. ఆ అనుభవం కోసం వాళ్ళు తమ మీద ఉంచిన విశ్వాసాన్ని గూడా మిగతా గౌరవాభిమానాలతో పాటు, నిస్సంకోచంగా ఏకాంతంలో ఉక్కగా ఉన్నప్పుడు పై బట్ట తీసిపారేసేటంత తేలిగ్గా తీసి పారేస్తారు. ఆ ఉద్రేకంతో తమకే పిగ్గు కలిగించేటంతగా ఉండే నగ్నత, బయటివాళ్ళ దృష్టిలో కనిపించే న్యూనత, యీ రెంటినీ గూడా మరిచి పోవటానికి వీలులేని జీవిత వాస్తవికత, వీటిని గురించి ఎప్పుడూ ఆలోచించరు. ఆలోచన వచ్చినా గుప్తంగా ఉంచుతున్నాం, యీ విషయం బైటవాళ్ళకి ఎట్లా తెలుస్తుంది అనే ధైర్యమైన సమాధానం క్రింద కప్పేసి, ఆ అనుభవంకోసం కనిపించే అవకాశాల వెంట పరుగెత్తుతూనే ఉంటారు.

అందుకే తను ఉంచిన విశ్వాసాన్ని శకుంతల తోసేసింది. తన ప్రేమని తన్ని పారేసింది. కామానికి, మోహానికీ దూరమైన పరస్పర సానుభూతితో ఉద్భవించి ఏ దెబ్బలకీ చెడకుండా ఉండే తన స్వచ్ఛమైన ప్రేమ, తన్నిపారేసింది. బాధ్యతలులేని వాళ్ళలాగా, కేవలం జీవితంలో ఆనందం అనుభవించటానికే పుట్టాము, ఆ ఆనందం ఎక్కడ దొరుకుతుందో చూసుకోవటం, దాన్ని పొందటం కోసం చేసే ప్రయత్నమే జీవిత పరమార్థం, పొందటమే సార్థకత అని అనుకోవటానికి, అనుకొని అట్లా ఉండటానికి తనకి అవకాశం లేదు. తను పుట్టి జీవిస్తున్న తరగతిలో ఉన్న మరి ఎవ్వరికీ అవకాశం లేదు. వాళ్ళలో ప్రతివారికీ బాధ్యతలు ఎక్కువ, జీవితంలో అవకాశాలు, కాలమూ తక్కువ. వాళ్ళ భార్యలు అట్లాంటి వాళ్ళ జీవితంతో ముడిపడలేరు. వాళ్ళు గూడా ఆ తరగతిలోనించే వస్తారు. ఆ అసంతృప్తికరమైన వాతావరణంలోనే పుట్టి పెరుగుతారు. కాని మొగుళ్ళ దగ్గరకు వెళ్ళిన వెంటనే, తాము అప్పటిదాకా పెరిగిన అసంతృప్త జీవితాల్లోనించి, తృప్తి ఆనందంలో పడి, ఒక్కసారిగా గాలిలో తేలిపోయి, వనసీమల్లో విహరించే ఆనందమయమైన జీవితం ఉంటుందని, వీలువెంట చూసే సినిమాలలోనించీ, తరచుగా చూసే పత్రికలలో బొమ్మలలో ఉండే సన్నివేశాలు చూసీ భవిష్యత్తులో గనుక వాస్తవికతకు దూరంగా ఉండే ఊహామందిరాలు కట్టుకుని, దాంట్లోనించి ఎకాఎకి శోభనపు గదుల్లోకి అడుగు పెడ్తారు. మళ్ళీ ఆ వాస్తవికతను గుర్తుచేసే అత్తవారిళ్ళకు వస్తారు. అక్కడా అసంతృప్తి బ్రతుకే అయ్యేటప్పటికి, ఆ సంఘర్షణకి తట్టుకోలేక, తృప్తికోసం ప్రాకులాడుతారేమో ననిపించింది.

ఈ ఊహలతోనే ఉండే అతనికి ప్రతి స్త్రీ ఆ తృప్తి కోసం వెతుక్కుంటున్నట్లు, అవకాశం కోసం ఎదురు చూస్తున్నట్లు కనిపించేది. అతను ప్రతి స్త్రీని చూచినప్పుడల్లా మొగుళ్లు యిచ్చినది, బరువుగా కనిపించేది, పెద్ద అవసరం ఉన్నట్లు కనిపించనిది, జార్చేసినా యిబ్బంది లేదు అనిపించేది అయిన విశ్వాసాన్ని వీథిలోకి తెచ్చి, అది పుచ్చుకొని తృప్తి యివ్వగలిగిన ధార్మికుల కోసం వీథిలో నిలబడి ఉన్నారా అనుకునేవాడు. అనుకొని అనుకొని, ఆ నిర్ణయానికి వచ్చేశాడు, వాళ్లు అంటే అందుకోసమే నిలబడి ఉన్నారు అని.

అధార్మికులు గూడా అతనికి తరుచు కనిపిస్తూనే ఉన్నారు. శకుంతలలకి కొదవలేనంతవరకూ, గోపాలరావులకి కొదవ ఎందుకుంటుంది. శకుంతలలు లేకపోతే గోపాలరావుల అవసరంలేదు. శకుంతలలు ఉన్నంతవరకు ఒక్కొక్క శకుంతలకు ఎంతోమంది గోపాలరావులు. ఉన్న తీరికతోటి జుట్టు నొక్కులు త్రిప్పి, తను సంపాదించే డబ్బుతో, తనకి కష్టంఏమిటో తెలియకుండా వచ్చిన, తనను అవసరమైనదానికంటె ఎక్కువగా ఉన్న డబ్బుతో సౌష్టవమైన శరీరాలు పెంచి, వాటిని చక్కగా కనిపించేలాగాకప్పి. బాధ్యతా రహితంగా, ఉత్సాహకరంగా బజార్లవెంట, అందులో శకుంతలలు ఉన్న బజార్లవెంట యీడ్చుకొంటూ, ఆశలకీ, గౌరవాలకీ మధ్యగా సతమతమౌతూ, వాటికి ఎదురుగా ఉన్న గాజుగోడలోనించి రెండవవైపు కనిపించే, తృప్తి ఆకర్షణవేపు అదేధ్యానంతో చూస్తూ అసంతృప్తితో జీవితాలు గడుపుతూ ఉండే శకుంతలలని, నీకు తృప్తికావాలంటే ఆ గోడ ఛేదించివచ్చెయ్యి, యిది చక్కని అవకాశం అనిచూపెడ్తూ, ఆ అవకాశాలు కల్పిస్తూ తిరుగుతూ ఉంటారు. వాళ్ళతప్పు అంతగాలేదు.

ఆ ఆశాప్రలోభంలో, ఉన్న శకుంతలను, ఊహాజన్యమైన మధురానుభూతుల వాస్తవిక స్వరూపం, దానిలో తృప్తికోసం కాంక్షించే శకుంతలకు, మొగుళ్ళు తమమీదకప్పి నిశ్చింతగా కుటుంబబాధ్యత మీదవేసుకొని వెళ్ళినతరువాత, ఆ కప్పిన విశ్వాసం అనేది ముతకదుప్పటిలాగా, అనాగరక చిహ్నంలాగా, అనవసరమైన పాతకోటులాగా, కనిపిస్తుంది. బైట మొగుళ్ళు ఏం చేస్తున్నారో ఎవరికి తెలుసు, అని స్వంతానికి చెప్పుకునే ధైర్యమైన సమాధానాలతోటి గుట్టుగా ఉంటే ఎవరికి తెలుస్తుంది, అనేవివేకం అడ్డువేసుకునే ధీమాతోటి ముతకదుప్పటి అనుకున్న విశ్వాసాన్ని పారేసి, తృప్తి, తెచ్చుకొని సంతోషపడుతారు.

వాళ్ల దృష్టిలో ఆ ఉంగరాలజుట్టు, విశాలమైన ఛాతీ, అది కనిపించేట్లు కప్పే ఖరీదైన చొక్కాలు, విలాసాలకు డబ్బు, విలాసాలకోసం సమయం ఉన్నవాళ్ళుతప్ప మిగలావాళ్ళు మనుషులుకారు. ఒకవేళ అయినా తృప్తిని యివ్వటానికి పనికిరారు. అందుచేత మొగుళ్ళుగా ఉండటానికి అనర్హులు. అల్లాంటి అనర్హులు భార్యల్ని చేసుకోవటం అనవసరం. చేసుకున్నా తన అనర్హతలుతెలిసి ప్రవర్తించాలి. అట్లాచేస్తే కాస్త దయచూపి వండి, వార్చిపెడతారు.

ఇవే ప్రసాదరావుకి ఆడవాళ్ళని గురించి స్థిరపడ్డ ఊహలు. ఆ ఊహలతో ఆఖరిసారి తన జీవితం మళ్ళీ కొలిచి చూసుకున్నాడు. తను అనర్హుడు. అసమర్థుడు. అప్రయోజకుడూ గూడా. తను విసుగులేని గడియారం, జీవితంలో ఆనందం ఎరుగని అరసికుడు. తను మొగుడుగా ఉండటానికి గానీ, లేక తృప్తి నివ్వటానికిగాని దేనికీ పనికిరాడు. అదే శకుంతల తనకు ప్రత్యక్షంగా చూపెట్టింది. ప్రతి శకుంతలా ప్రతి ప్రసాదరావుకీ చూపెడుతుంది ప్రత్యక్షంగానో పరోక్షంగానో. ప్రతి ఆడదీ ఒక శకుంతల. ఎక్కువ పనీపాటా లేకుండా, యిబ్బందీ కష్టమూ తెలియకుండా, గోముగాను నునుపుగా శరీరాన్ని పెంచి, పై మెరుపులేతప్ప మిగతావేవీ గ్రహించని, బాధ్యత, వివేకం, విచక్షణలేని పనులుచేసే ఆకర్షణీయమైన వింత మృగం. మగవాళ్ళ బలహీనతని సూచించే కొలతబద్ధ, వాళ్ళని కష్టపెట్టే, మోసపుచ్చే, మాయలేడి.

అతనిలో ఆద్వేషం, పదేపదే తర్కించటంవల్ల మారకుండా నిలిచిపోయిన ఊహలూ, అతని ఏకాంతజీవితంలో ప్రశాంతంగాలేని మనస్సులో కరుడుకట్టుకుపోయినయ్. అతను ఆజీవితానికి ఆ ఊహలకి అలవాటుపడి అప్పటికే సంవత్సరం అయింది.

4

ఈ రోజులోనే అతనితో వాళ్ళ ఆఫీసులోనే పని చేస్తున్న నిర్మల తనతో పరిచయం కలుగచేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నట్లు అతనికి అనిపించింది. అతనెప్పుడూ నిర్మలతో పరిచయం కలుగచేసుకోవటానికి ప్రయత్నంచెయ్యలేదు. ఎవ్వరితోనూ అతను పరిచయం కలుగచేసుకోవటానికి ప్రయత్నించలేదు. అందర్నీ చూసినట్లే యాదాలాభంగా నిర్మలవేపు గూడా చూసేవాడు. అంతే— చూసినప్పుడల్లా అతనికి శకుంతలే గుర్తుకువచ్చేది. శకుంతలే అక్కడ కనిపించేది. అతనికి అసహ్యం వేసేది. ఈ శకుంతలగూడా మరొక ప్రసాదరావుని మోసం చేస్తుంది. అనర్హుడని పూర్తిగా తెలిసినాగూడా ఏ ప్రసాదరావునో కట్టుకుంటుంది. అతను భరోసాలో ఉంచిన విశ్వాసాన్ని, అక్కర్లేని పాతకోటుయిచ్చి, యితడిగిరిటె పుచ్చుకునేట్లు ఏ గోపాలరావుకో యిచ్చి, అతనిదగ్గర ఉన్నదీ, అతను ఒక్కడే యివ్వగలడు అనుకునేతృప్తి పుచ్చుకుంటుంది. ఏ ప్రసాదరావు బ్రతుకులోనో నిప్పులుపోస్తుంది. అతని గౌరవం ప్రతిష్ట, గదితుడిచి వీధిలో పారేసినంత తేలిగ్గా బైటపారేస్తుంది. తృప్తి నివ్వటానికితప్ప బాధ్యత పుచ్చుకోవటానికి నేనుకాదు అనేలాంటి గోపాలరావుల్ని పెళ్ళిచేసుకోక, చేసుకోలేక, ఆ గోపాలరావులు దొరక్క, తెలివితక్కువవాడూ, అమాయకుడూ అయిన ఏ ప్రసాదరావునో చేసుకొని వాడితల కొట్టివేయించేస్తుంది. ఆ ప్రసాదరావు మనస్సుని, అతను దేనికోసం

బ్రతుకుతున్నాడో ఆ బాధ్యతనీ, ఆ బాధ్యతకి అవసరమయ్యే అతని గౌరవాన్ని ఎప్పుడూ అర్థంచేసుకోలేదు. చేసుకుందామని ప్రయత్నించదు.

నిర్మల తను రాకముందునించి ఆ ఆఫీసులో పనిచేస్తున్నది. అతను ఆఫీసులో ఎవరెవరు ఎప్పుడుచేరారు వాళ్ళ భోగట్టాలు ఏమిటో ఎప్పుడూ కనుక్కోవటానికి ప్రయత్నించలేదు. తనబాధలో తాను ఉన్నాడు. జీవితం బాధ్యతగనుక, జీవితంకోసం, బాధ్యతకోసం, మళ్ళీ వెంటనే ఉద్యోగంలో చేరాడు. ఎవ్వరికీ ఏ విషయం తెలియకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో, క్రొత్తచోట, క్రమబద్ధమైన జీవితంలో బాధకొంత ఉపశమిస్తుంది అని అతని తండ్రిగూడా చాలా సంతోషించారు, అతను మళ్ళీ వెంటనే ఉద్యోగంలో చేరటంచూసి తనే ఏదో, విధంగా సర్దుకుపోతానని, డబ్బుపూర్తిగా తననే వాడుకొమ్మనీ దారిద్ర్యం, దానివల్లవచ్చే, అవమానం నిరాశ వీటిని దిగమింగినట్లు, యిప్పటిబాధ దిగమింగటానికి వీలులేంది కనుక మరిచిపోవటానికి ప్రయత్నించమనీ, దానికి అవసరమైన వాతావరణం సృష్టించుకొమ్మనీ వ్రాశారు. ఆయన సలహా ఎప్పుడూ స్పష్టమైన మాటల్లో ఉండదు. కానితనకి దానిఅర్థం గ్రాహ్యమే. తన తండ్రి వివేకవంతుడు. అందుచే తనే కొద్ది సంపాదనతో పెద్దకుటుంబాన్ని నిర్వహించుకొచ్చారు. ఆ బాధ్యత అర్థమైన తను భరించరాని ఆ బాధని దిగమింగటానికే ప్రయత్నించి తండ్రికి డబ్బుపంపుతూనే ఉన్నాడు.

తన పనేమిటో తను చూసుకుంటూ, పనిలేకపోతే ఏదో ఒక పుస్తకం చదువుకుంటూ ఆఫీసులో గడుపుతాడు. ఎవ్వరితోనూ పలకరిస్తేతప్ప మాట్లాడడు. మాట్లాడితే అవసరమైనంతవరకు ముక్తసరిగా మాట్లాడుతాడు. ఆఫీసులో కాస్త వయస్సుమళ్ళిన వ్యక్తులు గంభీరమైనవ్యక్తి అనుకున్నారు. కాస్త కుర్రకారు మాత్రం ఆఫీసరు స్టైలోగనుక టెక్కు అనుకున్నారు. అతనికి ఎవరేమనుకుంటున్నారు అనే ఆలోచన ఎప్పుడూలేదు. ఏదైనా జరిగినప్పుడు మాత్రం ఎవరేమనుకుంటారో అనిమాత్రం ఉంటుంది. అందుచేతనే ఎవరూ చెడ్డగా ఏమీ అనుకునేట్లు ప్రవర్తించడు.

నిర్మల వాళ్ళఆఫీసులో టైపిస్టు. అక్కడ అందరికీ పనికాస్త ఎక్కువగానే ఉంటుంది. ఐదుగంటల తర్వాతగూడా తప్పనిసరిగా ఉండవలసిన వాళ్ళుతనూ, హెడ్‌గుమాస్తా, నిర్మలకి గూడా తరచుగా ఉండవలసిన అవసరం వస్తూ ఉంటుంది. ఆమె కలుపుగోలు మనిషి. మగవాళ్ళతో కలిసి పనిచెయ్యటానికి, ఒంటరిగా ఉండటానికి అలవాటుపడింది గనుక మగవాళ్ళమధ్య తిరగ వేర్వని పిల్లలకుండే అనవసరపుసిగ్గూ సంకోచాలులేవు. అవసరమైనంతవరకు నిస్సంకోచంగా మాట్లాడుతుంది. కలుపుగోలుగా ఉందని ఎవరైనా చనువు తనుయిచ్చిన దానికంటే ఎక్కువగా తీసుకోవటానికి ప్రయత్నిస్తే దానిఫలితం వాళ్ళకి వెంటనే తెలిసివస్తుంది. ఆ ఫలితం తెలిసివచ్చినవాళ్ళు ఆఫీసులో యిప్పుడు ఎవ్వరూలేరు. వాళ్ళ తర్వాత ఆఫీసులో పనిచెయ్యటానికి రావటానికి అవకాశంలేకుండా పోయింది. ఆ యిద్దరు మగతా వాళ్ళకి నిర్మలఅంటే పూర్తిగా అర్థమైంది. ఎప్పుడూ ఊహించని భయం యింతకుముందులేని సంకోచం వాళ్ళకి యిప్పుడు, ఆమెతో వ్యవహరించవలసి వచ్చినప్పుడు, ఆప్త మిత్రులులాగా వచ్చి ప్రక్కన నిలచుటకు. అయినా నిర్మల కలుపుగోలుగానే ఉంటుంది. ఎవరితోనూ పెళుసుగా, అహంకారంగా మాట్లాడదు. మాట్లాడే మాటల్లో, చెప్పేసమాధానాల్లో నమ్రత, అభిమానం ఉట్టిపడుతుంటాయ్.

కాని అతనికి నిర్మల ఎప్పుడూ, నిర్మలలాగా, లేక మరొక సాధారణమైన, అతను ఎప్పుడూ ఊహించని నిర్ణయించుకోని సాధారణ స్త్రీలాగా ఎప్పుడూ కనబడలేదు. నిర్మలలో శకుంతలే కనిపించేది. నిర్మలగూడా మరొక శకుంతల, మరొక వంచకురాలు. ఇటీవల అతను కొంచెంగా గ్రహించిన విషయం నిర్మల తన పరిచయంకోసం ప్రయత్నిస్తున్నది అనేది. ఇంతకుముందుగూడా అట్లా ఉండేదేమో తెలియదుగాని యిప్పుడు తెలుస్తున్నది. వాళ్ళ సీట్లుగూడా ఆ మధ్య క్రొత్తగా మార్చిన మార్పులో దగ్గరగా వచ్చినయ్యి. అతని సీటులో మార్పులేదు. ఆమె సీటులో మార్పువచ్చింది. తను ఇంతకుముందు, ఎప్పుడూగూడా ఆఫీసరుగదికి బైటగా కూర్చుంటాడు. ఇంతకుముందు ఆమెసీటు ఆ గదిలోనే మరొకమూల ఉండేది. మిగతావాళ్ళ సీట్లుగూడా మారినయ్యి. అతనికి ఆ విషయం పట్టలేదు. ఆ మార్పు ఎందుకో తెలియదు. అసలు ఆఫీసులో ఒక శకుంతల ఎందుకో తెలియదు. అతనికి అర్థంకాలేదు. నిర్మల తనకి టైపు చెయ్యడంలో వచ్చిన సందేహాలన్ని అడుగుతున్నది. అడగటానికి తరచు మాట్లాడుతున్నది. సందేహాలేకాక యింకా మాట్లాడుతున్నది. అతనికి మతి తిరిగిపోతున్నది. ఆ శకుంతల తననించి దూరంపోదు. ఇంతకుముందు పారిపోయినట్లు పోదలచుకుంటే తనే పారిపోవాలి. శకుంతలలు స్థిరం. వాళ్ళని కదల్చటానికి ఎవరికీ శక్తిలేదు. పోదలచుకుంటే ప్రసాదరావు పోవాలి. పోదల్చుకోపోతే శకుంతలలుచేత వెంటాడ బడాలి. గత్యంతరంలేదు. అంతే.

అతను విసుగ్గా, సహించలేనంతగా, ఇక ఎప్పుడూ ఏ విషయానికీ సమాధానం చెప్పను అన్నట్లు చూస్తాడు. అయినా ఆమె సందేహాలు అడగటటంమానదు. నిర్మలకీ, శకుంతలకీ ఏ విషయంలోనూ, ఎక్కడా పోలికలేదు ఒక్కచనువు తీసుకొని మాట్లాడటంలోతప్ప. ఆ చనువు వాళ్ళు తీసుకోబోవటంలో యిప్పుడు బాధ ఉంది. బాధాకరమైన స్మృతులు ఉన్నయ్. అది అతనికి చాలా యిబ్బందిగా ఉంది. నిర్మలకి అదేమీ పట్టదు కాని సందేహాలతో, ప్రశ్నలతో చికాకుచేస్తుంది. కాని తను సమాధానాలు యివ్వకతప్పదు. అంతా ఆఫీసుపని, అదితప్పదు. అది కర్తవ్యం. అప్పుడప్పుడూ, తనకూ, ఆఫీసుకూ, ప్రసాదరావులకీ, మానవజాతికీ, అన్నిటికీ అపకారంగా తప్పనిసరి అపాయంగా ఉన్న ఆ శకుంతలని గొంతుపిసికి చంపిపారెయ్యాలని

పించేంది. అట్లా ఎందుకు అనిపించేదో తెలియదు. కాని అనిపించినపుడల్లా సంబాళించుకుంటాడు. కాని అప్పుడప్పుడూ ఆ భావంరాకుండా చేసుకోలేక పోతున్నాడు. తను ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కాని ఒకపట్టాన సాధ్యంకావటంలేదు. నిర్మల తనకు చేసిన అపకారం ఏమీలేదు. అపకారం చేసిన శకుంతలని గొంతుపిసికి చంపిపారెయ్యనూలేదు. గొంతుపిసికి చంపిపారేద్దామనే భావమూలేదు. అతను ఆ విపరీత భావం వచ్చినప్పుడు సంబాళించుకుంటున్నాడు. రాకుండా ఎట్లా ఉంటుందో, ఎందుకు వస్తుందోగూడా తెలుసుకోలేకపోతున్నాడు.

అదీ యీ మధ్యనించే ఎక్కువ. అతను ఇంకొంచెం జాగ్రత్తపడ్డాడు. అతని జాగ్రత్త ఎక్కువైనకొద్దీ, నిర్మల ఇంకొంచెం సన్నిహితంగా రావటానికి ప్రయత్నిస్తుండటం, దాంతో అతనికి చికాకు, దానిలోనించి బయలుదేరే ఉద్రేకం, దాన్ని అణచుకుందామనే ఉద్వేగంఒక్కసారే వస్తున్నాయ్. అతనిలో ఏదో గర్జిస్తున్నట్లుంటున్నది. ఆ గర్జనలు వినపడే టప్పటికి అతనికి భయంవేస్తున్నది. ఆ గర్జించే దేదో తనని వశపరుచుకుంటే, తను దానికి వశుడై ఏంచేస్తాడో తెలియదు. ఆ వివేకమే అతనికి యిప్పుడు యింకా బాధాకరంగా ఉంది. ఇంతకు ముందు మనస్సుకి యింతలొంగిపోలేదు. తన హృదయం యిప్పుడు బలహీనమైంది. యింతకుముందు తన మనస్సు యిన్ని ఆలోచనలతో ఎప్పుడూ చికాకుపడలేదు. తనకు వచ్చిన యీ జ్ఞానం, ఆ సంఘటన తనని పూర్తిగా బలహీనుణ్ణి చేసి నయ్య.

తను ఎక్కడో చదివాడు. చదువుతో, జ్ఞానంతో మానసికంగా బలహీనమైన తనలాంటి వాడే, తనకి జరిగిన సంఘటనలాంటిదే జరిగినపుడు, ఏమీ చెయ్యలేకపోయాడు. నిర్వీర్యుడూ నిస్తేజుడూ అయ్యాడు. తనజీవితంలో, తనకు అల్లాంటి సంఘటన జరిగేటప్పటికి తను బొత్తిగా అజ్ఞాని. ఈ విషయాన్ని గురించి ఏమీ తెలియని, ఏమీ చదవనివ్యక్తి. ఎక్కడో చదివిన గుర్తువచ్చింది. ఆట్టే జ్ఞానంలేని వ్యక్తి తనకు జరిగిన సంఘటనలాంటిది జీవితంలో జరిగినప్పుడు, ఆసహచరిని చంపేశాడు. చచ్చిపోయిన తర్వాతగూడా కసితీరక, కసితీరటం కోసం పొడిచి, పొడిచి, ఆశపోయిన ఆ శరీరాన్ని గ్రుచ్చివేశాడు. అప్పటికీ ఆ నెత్తురుచూస్తేగాని ఆవేశం తగ్గలేదు.

కాని తన విషయంలో మాత్రం విపర్యయం కనిపిస్తున్నది. కామశాస్త్ర విషయ పరిజ్ఞానం కలిగిన తర్వాత, కొద్దో గొప్పో చదివినతర్వాత, యిప్పుడు శకుంతలకాని నిర్మల తన దగ్గరికి వస్తేనే తనికి ఉద్రేకం, ఆవేశం కలుగుతున్నయ్. నిద్రాణంగా, అచేతనంగా పడిఉన్న తనమనస్సు హృదయం యిప్పుడు ఎందుకు మేలుకుంటున్నయ్యో, మేలుకొని ఏ పర్యవసానం తీసుకొనన్తయ్యో తనకి తెలియటంలేదు.

అతనికి తెలియంది మరొకటి మిగిలిపోయింది. ఇన్ని ఊహలతోటీ, ఉద్రేకావేశాలతోటీ నిర్మలవైపు వెర్రిగా, విచిత్రంగా చూసేవాడు. కాని అతనికి తనకళ్ళు, తనభావాన్ని వ్యక్తంచేస్తున్నయ్య అనేవిషయం మాత్రం యింకా తెలియదు. అదుపు దాటిపోతానని బెదిరించే హృదయాన్ని అదుపులో పెట్టే ప్రయత్నంలో అతనికి కళ్ళ విషయం గుర్తురాలేదు. చిన్నప్పటినుంచీ, ఎంతగానో శిక్షణయిచ్చిన అతని అవయవాలు అతనికి ఎదురు తిరుగుతయ్యనేది అతను యిప్పటిదాకా ఎప్పుడూ గుర్తించని విషయం.

ఆ రోజు ఆదివారం. ఆఫీసరు మధ్యాహ్నం రమ్మంటే తను వచ్చాడు. అప్పటికే నిర్మలవచ్చి టైపు చేసుకుంటున్నది. హెడ్‌గుమాస్తా, తను ఆఫీసరు పంపితేనే వెళ్తున్నాననీ, కొంచెం సేపట్లో వచ్చేస్తాననీ చెప్పివెళ్ళాడు. ఆఫీసరు లోపల గదిలో, క్రిందటిరోజు వచ్చిన యితర ఆఫీసర్లతో చర్చలు చేస్తున్నారు. అది అయితేగాని తనకి పనిఉండదు. తనకు హెడ్‌గుమాస్తాగూడా వెళ్ళిపోవడం, నిర్మల విసిగించే టైపుమెషిను నిర్మలా కలిసి తనని ఆ సెలవురోజు విసిగించటం అసలు నచ్చలేదు. అసలు అక్కడ ఆ శకుంతల ఉండటం, ఆ శకుంతల మాట్లాడటం, అన్నీ నచ్చని విషయాలే. కాని తను వాటిని ఏమీ చెయ్యలేని విషయాలు. దూరంగా, ఒకమూలగా ఉన్న డ్రాయరు ముందు కుర్చీలాక్కుని నిర్మల తనకి కనబడకుండా ఉండేట్లు, ఆఫీసరు గంటకొడితే వినపడేటంత దూరంలో, తను తెచ్చుకున్న పుస్తకం చదువుకుందామని వెళ్ళి కూర్చున్నాడు. కూర్చొని వుంటే గుర్తువచ్చింది. క్రిందటిరోజునే రావలసిన మనియార్డరు రసీదు తనుచూసి తీసుకోలేదని. పుస్తకం బల్లమీదపెట్టి మామూలుగా ఉత్తరాలు పడవేసే డబ్బాదగ్గరికి వెళ్ళిచూచాడు. కాని దాంట్లో ఏమీలేవు. ఖాళీగా ఉంది. తల పైకెత్తకముందే మాటలు వినిపించినయ్. "అవిగోనండీ ఆ బల్లమీద పెట్టాడు నిన్నటి ఉత్తరాలు" అన్నది నిర్మల.

అతను తలఎత్తి చూశాడు. నిర్మల తనని గమనిస్తున్నదన్నమాట. వెనకగా ఉండి చేస్తున్నపని అదన్నమాట. శకుంతలా అంతే, తనదైనందిన కార్యక్రమంలో ప్రతిదీ చూసి, గమనించి తనకు అనువుగా ఏర్పాటు చేసుకున్నది. ఒక్కసారి ఆమెవైపు తీక్షణంగాచూసి, ఆమె చూపెట్టిన బల్లదగ్గరకువెళ్ళి ఉత్తరాలలో తనరసీదు లేకపోవటం చూసి వెనక్కువెళ్ళి తన పుస్తకం తీసుకొని చదువుకోటానికి కూర్చున్నాడు.

నిర్మల టైపుకొట్టటంలేదు. కావాలని ఆపేసిందో, లేక పనిపూర్తి అయ్యి ఆపిందో తెలియదు. తనుగూడా లేచి వెళ్ళి యిందాకటి ఉత్తరాలు పడేసిఉన్నచోట, చిందరవందరగా ఉన్నవాటినీ, అవి పడివున్న చుట్టుప్రక్కల ప్రదేశాలనీ, అక్కడ పుస్తకాలకిందగా యిరుక్కున్న మరికొన్ని ఉత్తరాలనీ అన్నీ బైటకులాగి చూసి, మిగతా ఫైళ్ళని యథా ప్రకారం సర్ది అతని రసీదు తీసుకొని అతనిదగ్గరకు వచ్చింది. అతను యిదేమీ గమనించలేదు. దగ్గరగావచ్చి అన్నది ఆ రసీదు అం

దిస్తూ, "దీనికోసమా చూస్తున్నారు ఆ ఫైలుక్రింద పడి ఉన్నది."

ప్రసాదరావు తలపైకెత్తి చూశాడు. చేత్తో రసీదు అందుకుంటూ చూశాడు. అతని చూపు అతను అనుకుంటున్నట్లు మామూలుగానే ఉంది. ఆమె అంది "ఏమిటండీ అల్లా చూస్తారు" ఈ మాటలు చాలా సంకోచంగానే అన్నది ఏమీ ధ్వనించకుండా. చిరునవ్వుమాత్రం తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ.

అతనికి ఆమెని తినేసేటంత కోపంవచ్చింది. తనజోలి, తన ఉత్తరాలజోలి, తనచూపు జోలి అన్నీకావాలి. ఆ మాటలు పైకే అన్నాడు. "నా ఉత్తరాలజోలి, నా జోలి, నా చూపుల జోలి మీ కెందుకు."

ఈ సారి ఆమెస్థిమితపడి నవ్వటానికి ప్రయత్నించింది. అన్నది, ఒక్కొక్కప్పుడు మీరు చాలాభయంకరంగా చూస్తారు నావైపు. నిజంగా భయంగూడా వేస్తుంటుంది.

జీవితంలో మొదటిసారి అతనికి తోచింది తన భావాలు బహిర్గత మౌతున్నట్లు. తను ఎంతో శిక్షణ యిచ్చిన అవయవాలు అయినకళ్ళు, తను చిన్నప్పుడు ఎవ్వరికీ, ఎప్పుడూ తన దారిద్ర్యం గూర్చి చెప్పనికళ్ళు, చెప్పవుఅని నమ్మకంగా విశ్వసించిన కళ్ళు, శకుంతలలాగే మోసం చేస్తున్నట్లు. అతనికి వెంటనే చెప్పటానికి ఏమీ తోచలేదు. లోపలినించి వాళ్ళు వచ్చే సూచనలుగానీ, తనని పిలిపించే సూచనలుగానీ, కనీసం హెడ్ గుమాస్తా వచ్చే సూచనగానీ, చివరికి ఆ శకుంతల దగ్గరుంటే వచ్చే అపాయంనించి విముక్తిపొందే సూచనగానీ ఏమీ కనబడలేదు. ఆమె అక్కణ్ణుంచి వెళ్ళిపోతుందేమో ప్రయత్నించటానికి అన్నాడు ముక్తసరిగా "థాంక్సు అండీ".

"మీరే క్షమించండి నన్ను. మీ ఉత్తరాలుతీసి అనవసరంగా మిమ్మల్ని కష్టపెట్టాను" ఆమె ఏమీ తనుడుకన్నట్లుగాకుండా వెంటనే సమాధానం చెప్పింది.

ఈసారి ఆమె ముఖంలోకి వింతగా చూశాడు. తను నంభాళించుకొని మామూలు మనిషి అయ్యాడు. తను సముదాచారంగూడా విస్మరించేటంత ఉద్వేగపడ్డాడు. మొదటనే ధన్యవాదాలు చెప్పిఉండవలసింది. అట్లాఅయితే ఆమె వెంటనే వెళ్ళిపోయేదేమో అనుకున్నాడు. ఆమె తనకి దగ్గరగా ఉండటం బొత్తిగా నచ్చలేదు. అన్నాడు. "ఏదో చికాకులోఉండి అన్నాను క్షమించండి" యీసారి సముదాచారం బాగా పాటించాల ననుకున్నాడు. "అది తెలుస్తూనే ఉంది. అంతచికాకు మనస్సులోనే ఉంచుకుంటే పిచ్చిఎక్కటమో, అసంగతమైన పనులు చెయ్యటమో చేస్తారట. అంత చికాకు మనస్సులోనే పెట్టుకోవటం ఎందుకు. మీరేమీ అభ్యంతరంలేకపోతే, నేను చెయ్యగలిగిందేమైనా ఉంటే చెప్పండి తప్పక చేస్తాను." అన్నది. మంత్రముగ్ధమైన రామచిలుక మాట్లాడినట్లు.

అతనికి శకుంతల కనిపించింది. విశ్వాసానికి అనర్హురాలైన శకుంతలే నిర్మలకూడా. అనవసర విషయాలు మాట్లాడుతున్నట్లు అనిపించింది. "క్షమించండి. అవన్నీ మీకు అనవసరం" అన్నాడు కరుకుగా, కటువుగా.

కాస్త నోరున్న మామ్మగారు, పంపుదగ్గర నీళ్ళు పట్టుకోవటానికి వచ్చిన మిగతా నల్గురుతో అనే మాటల ధోరణిలో అన్నది నిర్మల "నాకు భయం కలిగించేట్లు చూడటం మీకు అవసరమా ఏమిటండీ, అని అడగటం నాకు అనవసరమూనా. బాగుంది వరస"

ఆమె ముఖంమీద వేటిఛాయలూ పూర్తిగా పోకుండా రెండూ కలిసివున్న శుష్కహాసం నిర్లిప్తత, అతను చూడనూ లేదు, చూస్తే అతనికి అర్థంకానూకావు. అతనికి కనిపించింది తన మనస్సులో ఉన్న చికాకు ఒక్కటే. దానితోనే అన్నాడు. "నేను ఎప్పుడూ చూడలేదు, చూడను, నాకేంపని చూడటానికి మీవంక"

ఈసారి ఆమె పకపక నవ్వింది. నవ్వి హ్వాసయం తేలిక చేసుకుంది. అన్నది. "ఆ మాట అంటే నమ్మేవాళ్ళు ఎవరూ ?"

అతనికి ఎవరో వెన్నుచరిచి చెప్పినట్లయింది ఒకపరమ సత్యం. తనమాటనిజంగా నమ్మరు. ఆమె మాటలే నమ్ముతారు. ఆమె తనతో మాట్లాడటానికి చేసిన ప్రయత్నం చూసిన ముసలి హెడ్‌గుమాస్తా చేసిన హెచ్చరిక గుర్తుకు వచ్చింది. అన్నాడు "అయితే యింకేం కానివ్వండి మూడోవాణ్ణి నేను"

అతను అన్నమాటంకు అర్థం ఆమెకు సుకరంగానే బోధపడింది. అంతా తనను గురించి అనుకుంటున్నారు, అని తనకు తెలిసిన విషయం, ఎవరితోనూ సాధారణంగా మాట్లాడని అతనికీ తెలిసింది. తను ఏవో చెప్పి యిప్పటికి యిద్దరికి ఉద్యోగాలు తీయించింది. తను మూడోవాడు అవుతాడన్నమాట. వాళ్ళు ఏం చేశారో, ఏం చేయ్యబోయారో, తనకు వాళ్ళకు, నమ్మకంవున్నవాళ్ళు భగవంతుడికీ తెలుసు. మిగతా ఎవరికీ తెలియదు. తప్పు ఎవరిదైనా దెబ్బతిన్నవాడి మీద జాలి ఎక్కువ ప్రపంచానికి, ఆ తప్పు తన ఎదుటగానీ, తనుకేగానీ జరగకపోతే ఆ విషయం ఆమెకు తెలుసు. ఆమెకళ్ళలో నీళ్ళుతిరిగి కొలకుల్లోకివచ్చి ఆగినయ్. అన్నది.

"మీరు అల్లాగే అనుకుంటున్నారా ? ఏవో అబద్ధాలుచెప్పి ఉద్యోగాలు తీయించేదాన్నని అనుకుంటున్నారా ?"

అతను ఆమెని గురించి అనుకున్నదానికీ, యీ సంభాషణకీ ఏమీ సంబంధంలేదు. ఆమెని గురించి ఎప్పుడూ యీ విషయం ఆలోచించలేదు. యాదాలాభంగా అటుతిరిగిన సంభాషణలో ఆ ప్రసక్తి వచ్చింది. అతను అనుకోలేదు. ఆమెగూడా అనుకోలేదు.

అప్పటికే స్థిమితపడ్డ అతనికి ఆమెమాటల్లోని బాధ కొంత అర్థమైంది. తను అనుకోనివిధంగా, మాటలు బైటికి వచ్చి ఎదటివాళ్ళకి బాధకలిగిస్తున్నయ్యి. అతను జరిగిందానికి

తన బాధ్యతలేదని తెలియచేయుటానికి, ఆ సంభాషణ అంతటితో పూర్తి చేయుటానికి అన్నాడు'' ''అబ్బే నేను ఏమీ అనుకోలేదండీ''. ఆమె అతను అన్నమాట వినిపించుకున్నట్లులేదు. తనమీదపడ్డ నిష్ఠూరాన్ని తొలగించుకోవటానికి, మాటలు బైటకి వస్తున్నట్లు, మాట్లాడింది.

''తప్పునిసరై మీ నలుగురిలోకి వచ్చినా, గౌరవంతో కాలం గడుపుకుందామనుకునే ఆడపిల్లని నాశనం చేద్దామని ప్రయత్నిస్తే ఎవ్వరికీ ఏమీ తప్పుకనబడలేదు. నా పరువు నేను కాపాడుకుందేదానికి నేను ప్రమాదకారి నైనాను. దీనికే యింత రాద్ధాంతమూనూ. అంతేనాఅండీ''

ఆమె వేపు చూడకుండానే ఉన్న ప్రసాదరావుకి యీ మాటలు స్పష్టంగనే వినిపించినయ్. తల పైకెత్తి చూశాడు. ఇందాకటినించీ కొలకుల్లో గూడుకట్టి, మార్గం వెతుక్కుంటూన్న ఆమె ధైన్యం కట్టతెంచుకొని కారుతోఉంది. తన నిస్సహాయతవల్ల వచ్చిన దైన్యం, తనని అపార్థం చేసుకున్న తనచుట్టూ ఉన్న పురుషులకి, తనను సరిగ్గా అర్థం చేసుకోమని చెప్పటానికి అవకాశం దొరకనందువల్ల కలిగిన వేదన, తన అశక్తత అన్నీకలిసి ఆమెముఖంమీద పేరుకుపోయినయ్.

ఆఫీసరు అతనికోసం కొట్టిన గంట వినిపించింది. అతను తొట్రుబాటుతో లోపలికి వెళ్లాడు. వెళ్తూ యీసారి ఆమె ముఖంలోకి ఒక్కసారి చూశాడు. కళ్ళు తుడుచుకొని టైపు మిషనుదగ్గరికివెళ్ళి కూర్చుంది. మిషనుమీద చెయ్యి అడ్డంగా పెట్టి, ఆ చెయ్యిమీద ముఖంఆనించి, మిషనులోకి, ముందు దూకివచ్చే ఆవేశాన్ని ఎదుర్కొని ఆవుతో, ప్రతిసారీ మొదటి సారికంటె ఎక్కువ వేగంతో ముందుకు సాగివచ్చే ఎత్తుగా చదునుగా ఉన్న గుండెలికి, అచేతనంగాఉన్న ఆ టైపు మిషను అంచు, ''ఎందుకు విచారించి ఏం లాభం, మీ బ్రతుకే అంత, వాళ్ళ తత్వమేఅంత'' అని చెప్పేసమాశ్వాసించే సమాధానం వింటున్నది.

తనవేపు చూసేటంత స్వాస్థ్యంలేని నిర్మలనీ, అడుగులచప్పుడుకి ఎవరాఅని తలఎత్తకుండా ఉన్న నిర్మలని, తను పూర్తిగాచేచూస్తూ, అడావుడిగానే క్రిందికి వెళ్ళాడు. అట్లానే తిరిగివచ్చాడు. అప్పటికీ నిర్మల అట్లానేఉంది.

గదిలోనించి పెద్దగా మాట్లాడుకునే మాటలు, బూట్ల చప్పుళ్ళతో నిర్మల తలఎత్తిచూసింది. బైటికివెళ్ళే ఆఫీసర్లకి నమస్కారం చేసింది. తన ఆఫీసరు తల ఊగించి వెళ్ళాడు. తల ఊగించని ప్రసాదరావు గ్రుడ్లు అప్పగించి వాళ్ళ వెనకాలే వెళ్ళాడు. అతనికి యీసారి శకుంతల కనబడలేదు.

5

ఆ రోజురాత్రి అతను యీ సంవత్సరన్నరనించి అలవాటుగా చదువుతున్నట్లు పుస్తకం ఏదీ చదవలేదు. లైటువేసుకొనే మంచంమీద పడుకున్నాడు. మామూలుగా గుర్తుకు వచ్చే శకుంతల గుర్తురాలేదు. జాలిగా కన్నీరు కార్చేనిర్మల, నిరాశ్రయఐనదీ, తనలాగా కనీసం తన బాధ చెప్పుకోటానికి గూడా ఎవరూలేని నిర్మల, టైపుమిషనుమీద తలఉంచి, రోదించే మూగరోదనవినిపించింది. నిర్మలఅన్నమాటలూ గుర్తు వచ్చినయ్. వాటినిగురించే ఆలోచించాడు. ఆలోచించి పడుకోబోయేముందు అనుకొని నిద్రపోయాడు— గౌరవమే ముఖ్యంగా కల నిర్మలలుగూడా ఉన్నారు. శకుంతల అప్పుడు మనస్సులో లేకపోవటంతో నిర్మలఅంటే ప్రసన్నతలోనే నిద్రపట్టింది.

తర్వాత జరిగిన రోజుల్లో అతను ఆలోచించాడు. ఉంగరాల జుట్టువాళ్ళు, విశాలమైన ఛాతీలవాళ్ళు, టెరలిన్ చొక్కాలవాళ్ళు, ట్వీడ్ ప్యాంటులవాళ్ళు ఎప్పుడూ ఉంటారు. వాళ్ళు లఖ్కర్లేనివాళ్ళుగూడా ఉంటారా అనిఅతని అనుమానం. ఆ విషయం తను చదివినపుస్తకాలలో ఎక్కడాలేదు. కాని వాళ్ళ గౌరవాలు లాక్కోకుండా జాగ్రత్తగాఉండి వాళ్ళ బారినించి తప్పించుకునేవాళ్ళు మాత్రం ఉన్నారు. నిర్మల ఏ తరహాకి చెందిందో తనకి తెలియదు. మంచిదోకాదో అంతకంటే తెలియదు. నిర్మలనించి, ఆమె గౌరవం లాక్కోటానికి ప్రయత్నించినవాళ్ళు ఉంగరాలజుట్టువాళ్ళు, విశాలమైన ఛాతీలవాళ్ళు టెరలిన్ చొక్కాలవాళ్ళు అవునోకాదోగూడా తనకు తెలియదు. తనకు తెలిసింది, బాగాతెలిసింది తన విషయమే. తను అట్లా ఉండాలని, ఏ స్త్రీ గౌరవాలు కొల్లగొట్టాలని తను ఎప్పుడూ అనుకోలేదు. కాని అవిలేకపోతే అసమర్థుడూ, అప్రయోజకుడూ, వ్యర్థుడూ అయ్యాడు.

తనకి యింకేవీ తెలియవు. తను గానుగెద్దు, తండ్రిలాగా జీవితాన్ని లాగటం, తండ్రులు కొడుకులకు తాము పొయ్యేటప్పుడు, ఉండగాగూడా ఆకాడి మెడమీదవేసేటట్లు, వేసి వెళ్ళాలనే విషయం తెలును. తనూ బహుశా ఆకాడి, తను కొన్నాళ్ళులాగి తర్వాత తనకొడుకుమీద వదిలివేసిపోతాడుగూడా. మిగతావాటికి తనకి టైంగూడా ఉండదు. పనిలేకుండా తీరిగ్గా ఉన్న కొద్దిటైం ఆఫీసరుకోసం ఎదురుచూస్తూ ఉంటానికీ యితర ఆలోచనలకీ సరిపోతుంది.

కార్యక్రమం మామూలుగానే సాగిపోతున్నది. పోతే నిర్మల అంటే వ్యగ్రభావంలేదు యిప్పుడు. ఆమెతో కొంచెం ఎక్కువగానే మాట్లాడుతున్నాడు. అతనిలోవచ్చిన ఆ కొంచెం మార్పు మిగతావాళ్ళకు గూడా తెలిసింది.

నిర్మల దగ్గరగావస్తే తనకి యిప్పుడు కోపం రావటం లేదు. ఉద్వేగం ప్రకోపిందచటమూలేదు. ఈ మధ్య ఆమె తీసుకునే మరికొంచెం చనువుకి తనలో మార్పుఏమీ కలగటం లేదు. సంతోషంగా ఉందోలేదో తెలియటంలేదుగాని ఒక్క విషయం మాత్రం తెలుస్తున్నది. శకుంతల యింతకుముందు అంత తఱచుగా గుర్తురావటంలేదు. గుర్తువచ్చినా యింతకు ముందు అంతసేపు మనస్సులో ఉండటంలేదు. తనకుగూడా

బైటికి పంపటానికి యింతకుముందంత ఆలస్యం పట్టటం లేదు.

ఆ స్థానంలో తఱచు నిర్మల చోటుచేసుకుంటున్నది. నిర్మల నిర్మలలాగే, శకుంతలకు ఏమీ సంబంధంలేని నిర్మల లాగే ఉంటున్నది. ఆ చోటులనుఇచ్చాడో తనే శకుంతలని మన స్సులోనించి బైటికి పంపివేసినంత త్వరగా నిర్మలను పంప కుండా తాత్సారం చేస్తున్నాడో, లేక ప్రయత్నంచేసి విఫలత పొందాడోగూడా అతనికి పూర్తిగా తెలియటంలేదు. అతనికి శకుంతలలా, నిర్మలగూడా తనజీవితానికి అక్కర్లేదు అని చేసుకున్న నిర్ణయం ఎక్కడా కనబడలేదు. తనలోవచ్చే యీ వింతమార్పు తనకు అర్థంకావటంలేదు. అర్థంచేసుకోవటం సాధ్యమయ్యే పనిగాకూడా కనబడటంలేదు. తనకు అర్థంకానివి చాలా మిగిలి ఉన్నాయ్. వాటిల్లో యిదిఒకటి.

తనకు అర్థమైన విషయం యీ మార్పువల్ల తనలో ఏదో, పూర్తిగా కొరతబడ్డ, ఆ పడ్డకొరత ఏమిటో తెలియని చోట, కొంత శాంతిపొందుతున్నాడు. ఆ శాంతి ప్రలోభం చేత నేమో తనజీవితానికి నిర్మలగూడా అక్కర్లేదు, అనుకోలేక పోతున్నాడు. నిర్మలగూడా శకుంతలే, శకుంతలే అవుతుంది అనుకున్న విషయంలో కొంతమార్పు వచ్చింది గనుక నేమో ఆమెని దూరంచెయ్యలేక పోతున్నాడు. రావద్దనలేకపోతున్నాడు.

అప్పటికే నిర్మల అతని గదికి చాలాసార్లు వచ్చింది. తనగది ఎక్కడో, తను ఏంతింటున్నాడో. అన్నీ ఆమెకు తెలుసు. తనసౌఖ్యం, తన ఉత్తరాలజోక్యం ఎప్పుడు కలిగించుకుంది. అయితే ఆమెకి తననిగురించి చాలాతెలిసిఉండాలి. మొట్టమొదట ఆ విషయానికి ఆమెమీద కోపంవచ్చినా యిప్పుడేవీలేవు. నిర్మలతన ఉత్తరాలు చదవలేదు. చూడలేదు. కేవలం తనను గురించి తెలుసుకోవటానికే ప్రయత్నిస్తున్నది. తనుగూడా తన పరిస్థితులు, మిగతావాటిని గురించి కొంత చెబుతున్నాడు. ఆ చెప్పటంలో తనకికొంత శాంతిఉంది. ప్రమాదంలేదు. తన అస మర్థతని గురించి శకుంతల వంచనని గురించీ ఎప్పుడూ చెప్పడు. ఎంతసేపుచెప్పినా తనబాధ్యతలను గురించి చెబుతాడు. బాధ్యతలేని వాళ్ళని నిరతంగా విమర్శిస్తాడు.

తనూ అప్పుడప్పుడు ఆమెయింటికి వెళ్ళాడు. ఆమె గూడా మిగతావాళ్ళకి పట్టని యదార్థమైన విషయాలు ఎన్నిటినో గురించి మాట్లాడుతుంది. అందులో తనికిముందు తెలిసినవి ఉండవు. ఇంటికి వచ్చినతర్వాత ఆ మాటలు, వాటి యాదార్థ్యం గురించి ఆలోచిస్తాడు. ఆమె చెప్పేవిషయాల లాగా, ఆమెచెప్పేపద్ధతి, అన్నీ తనకు బాగుంటున్నాయ్యి. అప్పు డప్పుడు ఆమెనిగురించిగూడా ఆలోచిస్తాడు. ఆమెనిగురించి ఆలోచించటానికి, ఆమెతననిగురించి ఏమీ చెప్పలేదు. తను అడగనూలేదు.

నిర్మల ఎప్పుడో తనగదికి ఏదో విషయమీద వస్తుంది. అది తనకు పూర్తిగా అర్థమౌతున్నది. ఆమెరావటంవల్ల యిప్పుడు తనకు బాధగాని, విసుగుగాని, యిబ్బందిగాని లేకపోవ టంవల్ల కొంత తనబాధనించి విముక్తి, ఊరట కలుగుతున్నది గనుక ఆమెరావటం బాగానేఉంది అనిపిస్తున్నది. మొదట నిర్మల గదికి అంత తరచుగా రావటంగురించి ప్రక్కవాళ్ళు ఏమను కుంటారో అనుకున్నా, యిటీవల ఆ అభిప్రాయం గురించి అంత ఖాతరుచెయ్యటంలేదు. ఎక్కడ తననిగురించి అందరికీ మంచి అభిప్రాయం ఉంది. తరచుగావచ్చే, మగవాడింటికి నిర్భయంగావచ్చే నిర్మలమీదనే మంచి అభిప్రాయం లేక పోవచ్చు. బంగారంలాంటి తనని పాడుచేస్తున్నది అనుకోవచ్చు. పాడుచేసిన శకుంతలని గురించి ఏమనుకున్నారో తెలియదు. పాడు చెయ్యని, తనకి కొంతశాంతి, ఊరటయిచ్చే నిర్మలని గురించి అనుకుంటారనుకునేటప్పటికి అతనికి కొంతబాధ, ఆమెమీద సానుభూతి కలిగింది.

ఆమె రావటంవల్ల తను ఎట్లా హృదయం తేలిక పరుచు కున్నాడో, తనకి తెలిసినప్పుడు, ఆమె యింత నిర్భీతిగా వచ్చి తన హృదయం తేలిక చేసుకుంటుండాలి. అయినా ఆమెవేదనా, బాధ ఏమిటో తనకు పూర్తిగా తెలియదు. తెలుసుకోక పోవటం, సమంజసంకాదు అనిపించింది.

ఆమెకీ తనలాగా అర్థంచేసుకునే స్నేహితులులేరు. ఇన్నాళ్ళనించీ గూడుకట్టుకొని ఉన్నబాధ కొంత తగ్గుతున్నది. ఆమెగూడా అట్లానేఉంది. ఏదో, మనస్సుకు నచ్చిన పిచ్చాపాటీ మాట్లాడుకుంటే మనస్సు ఎంతో తేలికపడుతున్నది. అదిగూడా లేకపోతే, నిర్మల చనువు తీసుకోకుండా ఉన్నప్పటి తనబాధ తనకి గుర్తుఉంది. ఇంతకుముందెవ్వరూ ఆ చనువు తీసుకోవటానికి ప్రయత్నించలేదు. తనుయివ్వడానికి ప్రయత్నించలేదుగూడా. ఎవరైనా సన్నిహితంగా వస్తే తనగురించి అంతా తెలుస్తుం దేమోనని భయంగూడా ఉండేది. ఇప్పుడు అదేమీలేదు. ఆ భయం'ఉండక్కర్లేదు. తనకు తగిన జాగ్రత్తఉంది.

తనకిలా, నిర్మలనిగురించి, ఆమె బాధనిగురించి తెలుసు కుంటే, తను తెలుసుకుంటాడు అని చెపితే, ఆమె హృదయం తేలికపడుతుంది. ఆమె మనస్సుని కొంచెంగా విప్పి లోపల ఎంత బాధఉందో చూపెట్టినప్పుడే ఆమెకి లోపల బాధ వ్యథ ఉన్నయ్ అని తెలిసింది. కానితను ఎక్కువతెలుసుకొని, తనకు ఆమెచేసిన సహాయంలాగే తను ఆమెకు ఎప్పుడూ సహాయం చెయ్యటానికి ప్రయత్నంచెయ్యలేదు. అక్కడతను మానవత్వా నికే, విరుద్ధంగా ప్రవర్తించాడు. స్నేహధర్మానికే విరుద్ధంగా ప్రవర్తించాడు. చాలా విషయాల్లో సమాన భావాలుగలవాళ్ళు గనుకనే తాముకొంచెం దగ్గరగా వచ్చారు. అట్లా దగ్గరగా వచ్చినప్పుడు, ఆ ధర్మానికి ఉచితమైన మర్యాదతో ప్రవర్తించక పోవటం, ధర్మవిరుద్ధం, తనకి యిప్పుడిప్పుడే స్నేహధర్మం గూడా తెలుస్తున్నది. స్నేహమంటే అప్పుయిచ్చి పుచ్చుకోవ టం, మిగతా యిబ్బందుల్లో సాయపడటమేకాదు.

తను నిర్ణయం చేసుకున్న తర్వాత ఆమెతో మాట్లాడ టంలో, ఆమె విషయాలమీద ఆసక్తి చూపెట్టాడు. ఆమె

విచిత్రంగా చూసింది. అదీతనకి తెలిసింది. ఆమెతర్వాత అడక్కుండానే చెప్పింది తనవిషయాలుచాలా. కాని ఆ బాధలు, వ్యథా విన్న తర్వాత అతనికియింకా జాలివేసింది. తను లన్నీలయి వ్యథపొందుతున్నాడు. కాని నిర్మల జీవితంలో యింకాఏమీ కాకుండానే వర్ణనాతీతమైన బాధకీ వ్యథకీ గురిఅవుతున్నది.

ఆమెకి అన్నతమ్ములులేరు. వాళ్ళంతా అప్పచెల్లెళ్ళు. ఉన్న నలుగురిలోనూ వాళ్ళనాన్న యిద్దరికి మాత్రం పెళ్ళి చేయగలిగాడు. అదిగూడా రిటైరైనతరువాత వచ్చిన, డబ్బుతో ఇద్దరు అక్కయ్యల పెళ్ళిజరిగింది. కాని మిగతాయిద్దరికి పెళ్ళి చెయ్యటంకోసం, మిగిలిన ప్రావిడెంటు ఫండుగాని, సంపాదించేటంత ఓపికగాని ఏవీలేవు. అయినా కుటుంబం గడవటం కోసంవచ్చే కొద్ది పెన్షనుతోపాటు, షావుకారుదగ్గర లెఖలు వ్రాసిపెడుతూ కొంతతెచ్చి, యిబ్బందిగానే కాలం గడుపుతున్నాడు. ఇప్పుడు నిర్మల సంపాదనతో కొంత మెరుగుగానే ఉంది.

ఆయన నిర్మల పెళ్ళిచెయ్యగలగడం అసంభవం. బస్తీలో పెరిగింది గనుక స్కూలుఫైనలు ప్యాసయి, టైపు గూడా నేర్చుకున్నది. గనుక, అదికాస్త అక్కరకువచ్చి తనూ నాలుగురాళ్ళుతెచ్చి తండ్రికి కొంత సాయపడుతున్నది. కాని ఆ ఉద్యోగం చెయ్యటంలోగూడా కొంత బాధపడవలసి వస్తున్నది. ప్రతివాడికళ్ళూ తనమీదనే ఉంటయ్. ప్రతివాడూ, వివాహితుడూ, అవివాహితుడూ అనే విచక్షణలేకుండా నా అనే ఎవ్వరూలేని తను, కేవలం తమకోసమే, సిద్ధంగా ఉన్నదనేట్లు చూస్తారు. తను ఏమాత్రం అవకాశం యిచ్చినా తన గౌరవం మాత్రం పుచ్చుకొని, బాధ్యతమాత్రం అఖ్ఖర్లేనట్లు కనిపించారు.

తండ్రికి, తన గౌరవంతోపాటు, బాధ్యతగూడా పుచ్చుకునేవారు ఎవరుదొరికినా అయాచితంగావచ్చే అతనికి, బాధ్యత అప్పగించటానికి అభ్యంతరంలేదు. అల్లాంటి బాధ్యత పుచ్చుకోటానికి ఎవరికి యిష్టంవుందో, ఎవరు సంసిద్ధులో తండ్రి వెతకలేడు. వెతికి అల్లాంటివాణ్ణి పట్టుకోవటం ఆయనకు సాధ్యమయ్యే పనికాదు. అందుచేత అశక్తతతోటి, నిస్సహాయతతోటీ, మౌనమైనఅంగీకారంతోటీ ఆ బాధ్యత దైన్యంగా తన మీదనే పెట్టాడు. ఆయన, లేక ఇంకే తండ్రిగూడా ఆ పరిస్థితుల్లో వయసువచ్చి, పరిస్థితులు అర్థంచేసుకునే కూతురికి ఆ విషయానికి సంబంధించిన ఏ విషయమూ మాటల్లోపెట్టి చెప్పలేడు. ఇంకా తనకూతురి పెళ్ళికోసం ప్రయత్నం చేస్తున్నాననే అంటాడు. కాని ఆ విషయం, అందులో కష్టం తెలుసుకున్నవాళ్ళకి మాత్రం ఆయన మనసులో అంతరార్థం తెలియటానికి కష్టంఉండదు. నిర్మలకు ఆ విషయం బాగానే అర్థమైంది. ఇంకో విషయంగూడా ఆమెకి అర్థమైనట్లు చెప్పింది. తన పెళ్ళిఅయితే తండ్రికి ఆర్థికంగా కొంతబాధ కలుగుతుంది. కాని ఆ విషయమై ఆయనకు ఎక్కువ చింతలేదు. కూతురుకి పెళ్ళిఅయితే, ఆ కూతురు సంపాదించిపెట్టటంకంటె ఎక్కువ సంతోషిస్తాడు. నలుగురిలో గౌరవంగా తలెత్తుకుని తిరగవచ్చు.

అందుచేత తన భవితవ్యం తనే నిర్ణయించుకో వలసిన అవసరం, అంత చిన్నవయస్సులో నిర్మలమీద పడింది. బాధ్యతతోటీ, వివేకమూ, విచేచనారెండూ వస్తయ్. అవివచ్చి తోడు పడ్డ నిర్మల, జాగ్రత్తగా కాలం గడుపుతూఉంది ఏ నిర్ణయం చేసుకున్నదో ఎవ్వరికీ తెలియకుండా. మానవ సహజమైన ఊహలతోటే, వయస్సుకు సహజమైన ఆశలతోటే తల్లి తండ్రీ చెల్లెలూ అనేబాధ్యతతోటీ, జీవితాంతం జాగ్రత్తగా అల్లాగేఉండి కృంగి, కృశించి నశించిపోవటమో, లేకతన బాధ్యత ఒకరి చేతుల్లోపెట్టి, తండ్రిబాధ్యత భగవంతునిమీదనో, తన బాధ్యత తీసుకునే ఉదారుడిమీదనో కొంత ఉంచటానికి ప్రయత్నించటమో ఆమె నిర్ణయం చేసుకోవలసిఉంది.

కాని జాగ్రత్తగా ఉండి, కృశించి, బాధ్యత క్రిందపడి నశించిపోవటం సామాన్యమైన పనికాదు. చుట్టూఉన్న వాతావరణంగూడా, బైట వాతావరణానికి శ్రుతికలిపేటట్లు ఉన్నది. ఎప్పుడో 'ఒకప్పుడు లోపల ఉన్న ఆ స్థైర్యాన్ని తోసేసి ప్రకృతి లోపల ఉన్నా, బైటఉన్నా అంతాఒకటే, అని ఏకంచేస్తుం దేమోనన్న భయంగూడా ఉంది. అట్లా జరగటానికి అవకాశం ఉన్న పరిస్థితుల్లో ఉంటూ, అట్లా జరిగినా సహించి, నలుగురిలో తలెత్తుకొని తిరగలేకపోయినా, బాధ్యతకోసం నాలుగు రాళ్ళు సంపాదిస్తూ ఆ తృప్తిలోపడి జీవించటమో, లేక ఆ యిబ్బందిరాకుండా, తను తనజాగ్రత్తపడటమో ఆమె నిర్ణయించుకోవాలి. ఆమె చేసుకున్న నిర్ణయమేదో ప్రసాదరావుకి పూర్తిగా తెలియకపోయినా, ఆమె యిబ్బందులూ, బాధ్యతలూ అన్నీ ఆమె సంభాషణలో తెలిసినయ్యి. ఆమెనుగురించి అతనికి జాలిఎక్కువైంది. ఆమెయందు గౌరవంగూడా మునుపటికంటె ద్విగుణీకృతం అయింది.

మాటిగాకాక, మాటల్లో వ్యక్తం చేసినట్లు అనిపించిన ఆమె నిర్ణయంగూడా అతనికి కొంత అర్థమైనట్లు తోచింది. తగుమాత్రం పరిచయం యిచ్చినవాళ్ళుగూడా, కలుగజేసుకొని బాధ్యతమాట మాత్రం రానివ్వకుండా, గౌరవం పుచ్చుకోవటం మాత్రం మాట్లాడారట. అట్లా మోడయిపోయే జీవితంగురించి జాలిపెట్టారట. బాధ్యతవిషయం తర్వాత చూసుకుందామన్నారట.

ప్రసాదరావు ఆమెదగ్గర్నుంచి చాలావిన్నాడు. కొంత అర్థం చేసుకున్నాడు. ఎక్కువ ఆలోచించాడు. దానితో ఆమె జీవితమలుపుల్లో మలచబడ్డ యాదార్థ్యం అతనికి కొంత గోచరించింది. తనూ ఒక్కొక్కప్పుడు తనని గురించీ, తన బాధ్యతల గురించి దాచకుండా చెప్పాడు. శకుంతల అతని మనస్సుకి యిప్పుడు రావటం మానేసి చాలాకాలమైంది.

వాళ్ళిద్దరూ చాలా సన్నిహితంగా వచ్చారు. అప్పుడప్పుడు కలిసి సినిమాకుగూడా వెళ్ళేవాళ్ళు. అది కంటబడ్డ మిగతా

గుమస్తాలు, అతని అదృష్టానికి సంతోషించినా, పూర్వపు అనుభవంతో, ప్రసాదరావు అక్కడ పనిచేసే ఆఖరిరోజుల్లో ఉన్నాడని అనుకున్నారు. ఆ ప్రమాదాన్ని గురించి అతనికి చెప్పి, అతన్ని ఆ ప్రమాదంనుంచి తప్పిద్దామని ఒకరిద్దరు అనుకున్నారుగూడా. కాని ప్రసాదరావు ఆ మాత్రం అవకాశం, ఆ విషయాలు నిస్సంకోచంగా మాట్లాడటానికి అవసరమైన చనువు ఎవ్వరికీ యివ్వలేదు. నిర్మలను గురించి యాదాలాభంగా వచ్చిన ప్రసంగాల్లో, ఆమెతత్వంగురించి యింతకుముందు స్థూలంగా చెప్పిన హెడ్ గుమాస్తాగూడా, యిప్పుడు ప్రసాదరావే దానిలో పార్టీ అయ్యేటప్పటికి, నిస్సంకోచంగా చెప్పలేక పోయాడు. చెబుతామని ప్రయత్నించినా అతను ఆ విషయం అంతటితో త్రుంచివేసేవాడు. అందుచేత ఆఫీసులో వాళ్ళంతా జాలిగా, ప్రసాదరావు ఉద్యోగం ఊడిపోయేరోజు ఏరోజు కారోజు వచ్చినట్లు, ఉద్యోగం పోకపోయేటప్పటికి, యింతకుముందు ఎప్పుడో జరగవలసినపని యింకా యింత ఆలస్యమైందేమిటా అన్నట్లు చూసి, మరునటిరోజు జరుగవచ్చుననే తృప్తినిచ్చే సమాధానంతో, మరునటిరోజుకోసం చూస్తూ గడుపుతున్నాడు గూడా.

ఆఫీసులోనూ, బైటాగూడా, ఎంతసన్నిహితంగా వచ్చినా, నిర్మలా ప్రసాదరావూ, తగినంత దూరంగానే ఉండేవాళ్ళు. కాని ప్రసాదరావులో యిప్పుడు యింకొంత మార్పువచ్చింది. అదీ తనకు తెలుస్తూనే ఉంది. అందమైన ఆమెశరీరం, కరుణామయమైన ఆమెజీవితం, బాధ్యతాయుతమైన ఆమె ఊహాలు స్థైర్యం కోల్పోని ఆమెమనస్సు, అన్నీ అతన్ని కొంత ప్రలోభపెడుతూనే ఉన్నయ్. ఇంతకుముందు శకుంతలను పురస్కరించుకుని, ఆడవాళ్ళందర్నీ గురించి ఆలోచించాడు. కాని యిప్పుడు నిర్మలను పురస్కరించుకొని నిర్మలనుగురించే ఆలోచిస్తున్నాడు. ఇప్పుడు నిర్మలతప్ప అతనికి శకుంతలాలేదు, మిగతా ఆడవాళ్ళని గురించిన ఆలోచనలూలేవు. కనీసం నిర్మల జీవితాన్ని బాధ్యత రహితంగా ఊహించిన ఆ యిద్దరు పురుషులోడేళ్ళని గురించి, గోపాలరావుల్ని గురించీ, ఉంగరాలజుట్టు వాళ్ళనిగురించి, విశాలమైన ఛాతీలవాళ్ళని గురించీ, టెరలిన్ చొక్కాలవాళ్ళని గురించిగూడా యిప్పుడేవీ ఊహలు రావటం లేదు.

నిర్మలను గురించి ఏకాంతంలో ఆలోచించినప్పుడల్లా అతనికి ఒక్కసందేహం మిగిలిపోయేది. నిర్మల ఆ యిద్దర్లో ఎవరినైనా ప్రేమించిందా అని. ఈ ప్రశ్న అతన్ని కొంత చికాకు పరిచిందిగూడా.. ప్రేమించి ఉండదు, అని సమాధాన పరుచుకున్నాడు. ప్రేమించి ఉండేవాళ్ళిద్దర్లో ఎవరూ అక్కడ ఉండకుండా ఉండే అవకాశం కలిగేదిగాదు. నిర్మల తనకు యింత సన్నిహితంగా ఉండటానికి అవకాశం అంతకంటే కలిగేదికాదు. ఈ సమాధానం చెప్పుకున్నప్పుడల్లా అతనికి చాలా తేలికగా ఉండేది మనస్సు.

అప్పుడప్పుడు ఆమె తనను ప్రేమిస్తున్నదేమో అనే భావంగూడా వచ్చేది. అది వచ్చినప్పుడల్లా కొంత సందేహాన్ని వెంటబెట్టుకొని వస్తుంది. విశ్వాసాన్ని వెంటపెట్టుకునివస్తే బాగుండు ననుకున్నాడు. అప్పుడు తనదగ్గర లేనట్లు తెలిపిన వన్నీ, యింతకుముందు తనవేనని లిస్టు వ్రాసిపెట్టుకున్న వన్నీ మరొకసారి మననం చేసుకునేవాడు. అప్పటికీ, యిప్పటికి ఆ లేనివి తనదగ్గర లేకుండానే పోయినయ్. ఈ మధ్య క్రొత్తగా వచ్చినట్లు కనబడలేదు. తనికి ఉంగరాలజుట్టు, విశాలమైన ఛాతీ, టెరలిన్ చొక్కా, యివేవీలేవు. దీంతో నిర్మల తనని ప్రేమించటంలేదని నిర్ధారణగా తేలిపోయింది. ఆ విషయం అంత నిర్ధారణగా తేలిపోయినప్పుడు, అతనికి సంతోషంగా, ముందు ఉన్నంత శాంతంగాలేదు. ఆ విషయం తెలుస్తున్నది.

తనదగ్గర లేనివాటినే ఆమె కోరుతున్నదనిగాని, లేకపోతే అవిపూర్తిగా అక్కర్లేదనిగాని, అవి లేకపోవటమే ముఖ్యం అనిగాని ఏ విషయం నిర్ధారణగా తేలలేదు. ఆడవాళ్ళకి అవి ముఖ్యం అనేవిషయంలో అతని అభిప్రాయమూ మారలేదు. ఇంతకుముందు వాళ్ళను ప్రేమించిందోలేదో, అని తెలుసుకొని నిర్ధారణ చేసుకుంటే ప్రేమిస్తే యివన్నీ వాళ్ళకి ఉన్నయ్యోలేవో తెలుసుకోగలిగితే అప్పుడు ఆమె వాటిని చూసే ప్రేమించిందో, అవిలేవని తెలిస్తే లేకపోతే ప్రేమించలేదో తెలుసుకోవచ్చు. ఈ విషయం, యింతకుముందు వాళ్ళ విషయం తెలిస్తే కనీసం ఆరాటపడుతున్న తన మనస్సు తేలికపడుతుంది.

అందుచేతనే ఒకరోజు ప్రసంగంలో ఆ విషయం సూటిగానే అడిగేశాడు. ఆమెలాగా డొంకతిరుగుడు మాట్లాడటం తనకు చేతకాదు. "మీరువాళ్ళలో ఎవరినో ఒకర్ని నిజంగా ప్రేమిస్తే విశ్వసించలేకపోయారా మీ బాధ్యత తప్పక తీసుకుంటారని" అన్నాడు.

ఆమె అతనిముఖంలోకి సూటిగా చూసింది. అయినా ఆ ప్రశ్న ఏం ఉద్దేశించివేశాడో అర్థంకాకపోయినా చెప్పింది "కాలుతుంది అనితెలిశాకగూడా కాలదులేఅనే భరోసాతో నిప్పుపట్టుకోమంటారా. భలేవారేమీరు"

"అయితే మీలో ప్రేమ లేదన్నమాట అన్నారు. లేదు అనే సమాధానం ఆశిస్తున్నట్లు

సద్గమయంతో

"ఊహుఁ నాకులేదు. నాకు తెలిసింది. క్షేమంగా ఉండేది బాధ్యత ఒక్కటే. మీ రనుకునే ప్రేమ నాదగ్గరలేదు. ప్రేమఅనే వ్యామోహంకోసం బాధ్యతగూడా వదిలేసుకునేటంత ప్రేమలేదు." ఆమె ఆవేశంగానే చెప్పింది. అతను మొదటిసారి తనని గురించి తెలుసుకోవాలని ఉత్సాహంచూపించినప్పుడు, ఆ అవకాశం సద్వినియోగం చేసుకుంటున్నాను అనేట్లు, ఆ అవకాశంపోతే మళ్ళీ అల్లాంటి అవకాశం వస్తుందో రాదో అనేట్లు చెప్పింది.

ఆ సమాధానం అతనికి చాలాబాగుంది. తనలో ఉన్నఒక్కగుణం భాసించి, వికసించి, దానిఉత్కృష్టత నిర్మలలో ద్యోతకం అయింది. నిర్మల తనను ప్రేమిస్తున్నది. అనేభావం అతనికి యీసారి సందేహంతోకలిసికాకుండా విడిగానే వచ్చింది. ఏమాటలైతే మనకు అత్యంతానందాన్ని యిస్తాయో అవేమళ్ళీ, మళ్ళీ, వినటానికి ఉత్సహిస్తాము. వస్నుపేరు అన్నా ఆ మాటలు మళ్ళీ వినపడకపోతే, కనీసం ఒకసారి, వీలైతే ఎక్కువసార్లు మనస్సుచేతనైనాసరే చెప్పించుకొని ఆనందపడతాము.

అతను అన్నాడు "అయితే త్యాగశీలమైన ప్రేమ లేదన్నమాట మీలో". అతనేదో పుస్తకాల్లోనించి చదువుతున్నట్లు అనిపించింది. ఆమె వింతగా అతనివేపుచూసి, ఒకసారి నవ్వి అన్నది "అందుకే యిట్లు బ్రతుకుతున్నాను నలుగురిలో తలెత్తుకుని. పోనిద్దురూ ఆ విషయం. ఇంకేమన్నా చెప్పండి."

సాధారణంగా ఆమె ఎక్కువ మాట్లాడుతుంది. కాని ఆరోజు తనే ఎక్కువగా మాట్లాడేటంత ఆనందంలో ఉన్నాడు. అతనికి ఆ విషయం వదల బుద్ధిపుట్టలేదు. తన బ్రతుకుకంతా పరమావధి అయిన బాధ్యతని ప్రేమించేవ్యక్తి, తనలాగా మరొకరు ఉన్నారు. ఆ విషయం తెలిసినప్పుడు కలిగిన తన్మయత్వంలో, అతనికి మరొకటి స్పష్టంగా తెలిసింది. నిర్మల తనలో ఉన్న ఆ ఒక్క విషయం గమనించింది. నిర్మలకు తనదగ్గర లేనివేవీ అఖ్కర్లేదు. తనదగ్గర ఉన్న ఒక్కదానికే విలువ యిచ్చింది. ఇంతకుముందు తను విలువలేవిదీ అని శకుంతలచేత చూపెట్టించుకున్నది, ఎంతో విలువైనదీ, అలభ్యమైనదీ, అందరిదగ్గర దొరకనిదీ అనిచెప్పింది నిర్మల. ఆ విషయం స్పష్టమైన మాటల్లో చెప్పకపోయినా, తనకు మిగతా అర్థముయిన విషయాల్లాగా, యిదీ అర్థమైంది.

అతను మళ్ళీ "స్వయంగా పోషించుకోలేని తల్లిదండ్రుల్ని వదిలిపెట్టి, స్వలాభం చూసుకోవటం బాధ్యతా" అన్నాడు.

ఆ విషయాన్ని గురించి సూటిగా తన అభిప్రాయం వ్యక్తంచెయ్యటానికి సంకోచిస్తున్నట్లూ, అయినా తప్పనిసరి ఐనట్లు ఒకప్రక్కగా తలతిప్పి పాఠం ఒప్పగించినట్లు చెప్పింది "లేదు, వాళ్ళ బాధ్యత, వాళ్ళు నిర్వహించుకోలేని బాధ్యతనించి వాళ్ళని విముక్తుల్ని చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాను. అది స్వలాభం ఎట్లా అవుతుంది. నామీద పడే నిందతోటో, నీలాపనిందతోటో నామూలకంగా వాళ్ళకి అప్రతిష్ట వచ్చి, బ్రతికినన్నాళ్ళు వాళ్ళు నేనుగూడా వ్యథపడటం కంటె యిది బాధ్యతాయుతంగా వ్యవహరించటంకాదూ."

ఇంక ఎక్కువ చెప్పనూలేకపోయింది. అతనివైపు చూడనూలేకపోయింది. తప్పనిసరిఅయి బాధతోచేస్తాడు అనే ఆశతో మగడాక్టరుకు శరీరంఅంతాచూపే ఆడరోగిలాగా, సంకోచంతో కుంచించుకుపోయి, లేచి "వస్తానండి" అనిచెప్పి అతనివైపు చూడకుండానే వెళ్ళిపోయింది. ఎందుకు వెళ్ళిపోతున్నదో తెలియక, ఆగమనలేక, ఆగమంటే ఆగుతుందో లేదో తెలియక, మళ్ళీ వస్తుందోరాదోగూడా ఊహగూడారాక, ఆమె వెళ్ళినవైపుకే చూస్తూ ఉండిపోయాడు.

(సశేషం)

పదలాలిత్యము తర్కశుద్ధియును, శబ్దస్థైర్యమున్ మంగళ
ప్రద భావంబును రాజ్యయోగ్యతయు దోషస్ఫూర్తి రాహిత్యమున్
పదలంకార విశేషముం గలిగి విశ్వప్రాణ సౌభాగ్య సం
పద మైత్రేయిం బోలె గ్రాలవలదా పద్యంబు హృద్యస్థితిన్.

—పెదపాటి సోమయకేదార అంతము.

నన్నయ - నన్నిచోడ కవులు

శ్రీ నిడుదవోలు వేంకటరావు

మన ప్రాచీన సాహిత్య స్వరూపము వేడభివ్యక్తము కావలె నన్నచో మొదట మూల గ్రంథముల నామూలాగ్రముగ పరిశీలించుట మనకు ప్రధాన కర్తవ్యము. ప్రస్తుత సాహిత్య విమర్శలలో నన్నయ నన్నెచోడ కవు లిద్దరును ప్రముఖ స్థానము వహించి యున్నారు. అందును నన్నయ తొమ్మిదివందల యేండ్ల నుండి యందఱి కవులచేత కీర్తితు డైనాడు. ఆతని భారత భాగ మాంధ్రవాఙ్మయ చరిత్రకు శ్రీకారము చుట్టినది. కవిత్రయమునందరి కవులే కాక తక్కినవారును నాతని కవితా గుణములను పేర్కొనిరి. ఈనాడు మనము వాని నైనను సరిగా సంగ్రహించుటలేదు. చూడుఁడు. ఒక యుదాహరణము. శ్రీనాథ మహాకవి నన్నయ కవితా గుణములలో "ఉభయ వాక్ప్రౌఢి" ని నుట్టంకించెను గదా. (భాషింతు నన్నయభట్టు మార్గంబున నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు" కాశీ. 1 అ)

మనము నేడు శ్రీనాథుని కృతులలో "నన్నయ యుభయ వాక్ప్రౌఢి" కి నుదాహరణములు చూపలేదు సరికదా, నన్నయ కవితలో నైన మనమా గుణమును విశదీకరించితిమా, యోజిం పుడు.

శ్రీనాథ మహాకవి నన్నయను పేర్కొనెను. కాన నిట్టివి చూపుటకు మన కవకాశ మున్నది. దానికైన మనము నన్నయ శ్రీనాథుని కృతుల నన్నింటిని కూలంకషముగా పరిశీలింపవలె ననుట నిర్వివాదాంశము. ఆంధ్రవాఙ్మయమున వాదోపవాదములకు రంగస్థలమైన నన్నెచోడకవి కుమారసంభవమున నన్నయ ప్రశంస లేదు—నన్నయ ప్రశంస లేనంత మాత్రమున నన్నెచోడుని కవితారచన మూల మట్టుగా భిన్న మనుట న్యాయమా ? నన్నెచోడునితోబాటు పాల్కురికి సోమనాథకవియు నన్నయను స్మరింపలేదు—కావున వీ రిరువురను వాఙ్మయ చరిత్రకారులు ప్రత్యేకముగ శివకవులు[1] అను వర్గముగా పరిగణించిరి. మఱికొందరు వారి ననుసరించిరి. ఈ ప్రత్యేకతను నిరూపించుట కైన మూలగ్రంథ సమాలోచన మత్యంతావశ్యకము.

అదేమి చిత్రమోగాని నన్నయ నన్నెచోడ కవుల నామము లందే సాదృశ్యము కాననగుచున్నది. వాని సంబంధము మాట తరువాత చర్చింతము. ముందుగా నన్నయ శబ్ద వ్యుత్పత్తిని నెరుంగవలయును.

నన్నయ నారాయణ శబ్దభవమా ?

"ప్రసన్న కథా కలితార్థ యుక్తి" యను గ్రంథమున గ్రంథకర్తలు[2]—2 వ పుటలో నిట్లు వ్రాసియున్నారు.

"పురుషోత్తమాంబుజ భవశ్రీ కంధరులన్న సమాసము లోని వరుస ఛందః పాతిత మందము. బుష్యాత్మకు ఛందోవతారంబున కవినాభావము. అందుకనియే యచ్చటవే బుష్యాత్మ యున్న దనుట నారాయణ శబ్దభవము నన్నియ. అంబుజభవుడు బ్రహ్మ. తిక్కనగారికి కవిబ్రహ్మ యను బిరుదము వచ్చెను. శ్రీకంధరుడు పరమేశ్వరుడు—ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరుడు."

పై వాక్యములలో తక్కిన వానిమాట యటుండ నిండు. నారాయణ శబ్దభవము నన్నియ యనుట యాపాత రమణీయము. నారాయణ శబ్దభవము నన్నియ అగుచో నన్నయ, నారాయణభట్టును గూర్చి వ్రాసిన శాసనములో "నన్ని నారాయణాయః" అని వ్రాసియున్నాడే ! అప్పుడు నన్ని యన్న యర్థమేమి ?

నారాయణ శబ్దభవము నన్నియ యైనచొ నేడు విశ్వనాథ సత్యనారాయణగారిని "సత్య నన్నియ" అని పేర్కొన వచ్చునా ? ఇది శబ్దతత్త్వము తెలియమి. నారాయణ శబ్దము తద్భవమున రెండు రూపములుగా నేర్పడినది. నారయ—నారన—దూబగుంట నారయ—(పంచతంత్ర కర్త) వెలిగందల నారయ (భాగవత ఏకాదశ ద్వాదశస్కంధకర్త) కవు లున్నారు—నారన రూపము గలదు. నారన సూరన అను కవి గలడు. అంతవఱ కెందుకు—పదునాల్గవ శతాబ్దిలోనే సత్యనారాయణ శబ్దమునకు పూర్వ రూపమగు 'సత్తెనారన'[3] అను కవి యున్నాడు. విశేష మేమనగా నతడు రామాయణము వ్రాసిన వాఁడు.

క. రామాయణ కృతకృతియై .....
సత్తె నారన వెలసెన్.

కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక. (1—23)

నన్నియ శబ్దముతో నన్నెచోడుడు కూడ నారాయణ శబ్దభవు డగునా ? ముమ్మాటికిని గాదు. అతడు తద్భవ పద

---

1. "శివకవులు" అను పదము మొదట సూచించినది భారతి ప్రథమ సంపుటము, ప్రథమ సంచిక. (జనవరి 1924)

2. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు.

3. మన పేళ్లు, యింటిపేళ్లు, ఊళ్లపేళ్లు—వీనిని గురించి పరిశోధన చేయదగినది బ్రహ్మాండమైనంత పని గలదు. వీనివలననే వాస్తవముగా తెనుగుజాతి, చరిత్ర, సంస్కృతి, విజ్ఞానము—తేటపడగలదు. ఈనాడు విశ్వవిద్యాలయములు గాని, సాహిత్య అకాడమీలు గాని, భాషాసమితులు గాని యిట్టి పని తల పెట్టనే లేదు ! వారికమైన యిట్టి పరిశ్రమ జరిగినగాని మన ప్రత్యేక వ్యక్తిత్వము ప్రపంచమునకు వెల్లడి కాదు. ఇది ముఖ్యాతి ముఖ్యమైనది. భారతి (1943—1944) లో వీనిని గూర్చి కొంత కదలిక గలిగినది.

వాచ్యుఁడుగాడు దేశిపద వాచ్యుఁడు. నన్నయయు నట్లే. ఇక నీ వ్యుత్పత్తి విషయమును కట్టిపెట్టి నన్నయ నన్నెచోడుల గ్రంథముల చదువగానే స్ఫురించిన విషయముల నిందు తెలుపుచున్నాను. ప్రాజ్ఞులు పరిశీలింతురుగాక.

పద్యముల యెత్తుగడలు

నన్నయ	నన్నెచోడకవి
అనుపమ దివ్యశస్త్రధరులై ఆర. 3.9	అనుపమ దివ్యమూర్తి 1.6 ,, 8.124
గతమద మత్సరుండు ఆది. 3.36	గతమద మత్సరేంద్రియ 1.132 గతమద మత్సరుండు 6.170
తగునిది తగదని యెదలో నగవక ఆది 1.85	తగుఁ దగదని మనమున మును నగవక 10.187
హరుఁ డాదిగా గల్గు నమర గణంబులు ఆర. 4.51	హరు డాదిగ ... 1.9
బలముగలవాని బలువురు బలవిహీను లొక్కటై కూడి నిర్జింతు రుత్సహించి ఆర. 1. 251	క. బలహీనులైన నే మగు బలువురు తమలోనఁ గూడి బలియుని నైనన్ గెలుతురు. 10.192
ఆదిజుఁడైన బ్రహ్మ సభా 2.16	ఆదిజుఁ డాదికర్త. 8.75
అవిరళ భస్మ—ఆది 8.144	అవిరళ నిత్యకర్మ —7.118
అట్టి మహాత్మాతంబులు	అట్టి మహోగ్రకోప 5.97
ఆయతబాహుఁ డాతనికి ఆది 8.47	ఆయత బాహు వీర్య 12.145
ఆహవ భూమిలోన ఆది 8.46	ఆహవ భూమి - 12.36
ఆ లలితాంగిఁ జూచి ఆది 8.152	ఆ లలితాంగి భాషిత-5.24
ఉ. మంచిగ భూరి భూసుర సభా 1.17	ఉ. మంచిగఁ బ్రీతి-10.197
చ. చిరముగ బ్రహ్మకుం ఆది 2.129	చ. చిరముగ నొల్వ 4.77
చ. వలయు నవమాత్యులన్ ఆది 4.25	చ. వలయు జనాళి - 4.44
చ. అరుదుగ దివ్య ఆది 8.283	చ. అరుదుగఁ జంద్ర-3.18
ఉ. దారుణ వజ్ర సభా 2.177	ఉ. దారుణ కార్య -10.189
చ. ప్రకటిత కోప-సభా 2.51	చ. ప్రకటిత మేఘ -8.24
చ. పరమ పతివ్రతన్ సభా 2.255	చ. పరమ పతివ్రతలై -4.42
చ. వినుఁడు ప్రసిద్ధులైన ఆది 4.186	ఉ. విండు ఖలుండు -2.82. (వ్రాతప్రతి) "వీండె, వీండు" అని ముద్రిత పాఠము.
మ. అతులోర్వీసుర. ఆది 2.234	మ. అతులోత్సాహ-12.130
చ. అసదృశ యౌవనంబు ఆది 3.170	చ. అసదృశులైన - 12.60
ఉ. అంగజ రాజ్యలక్ష్మి ఆది 8.146	ఉ. అంగజ రాగసం -8.125
క. త్ర్యంబక నాకు ఆర 2.121	క. త్ర్యంబక నగసుత-8.14
చ. కొలఁది యెఱుంగక ఆది 5.238	చ. కొలఁదికి మీఱు 7.108
ఉ. చారు సువర్ణ ఆది 5.141	ఉ. చారు నిశీథిని - 6.116

నాల్గవ పాదమున సమాన పదములు

నన్నయ	నన్నిచోడకవి
చ. తరుణియ లొప్ప నాడిరి ఆది 8.175	తరుణియ యొక్కర్తు. 8.68
మ. బోరనఁ గీర్తించిరి సంతత స్తుతి పదారావంబు ఆది 2.235	బో రన చనుదెంచె నారద మహాముని 3.82
క. చిఱు దొడవడిఁ బట్టె ఆది 5.256	చిఱుదొడ లమరు - 3.47

ఈ క్రింది పదముల ప్రాసస్థానములు చూడుడు.

చ. అ త్య లఘు తపస్వి నేని ఆది 1.148	అ త్య లఘు పరాక్రముండు 11.96
చ. అ య్యెర నొక డుండు భంబును వహింగని ఆది 1.152	అ య్యెరఁగనిడా యనోడ దురు 6.44
క. మానుగ వచ్చితి నీకును భానునిభా—ఆది 3.108	మానుగఁ గూర్తు - 4.29
సీ. పని యేమి పంచిన ఆది 3.200	పనియే మేనియు -10.136
చ. సం భ్రమ వివశాత్మ ఆది. 3.217	చ. సంభ్రమ గతి వచ్చి-8.61
క. పాయక చీకటి ఆది 5.229	క. పాయక గిరి — 3.13
మ. కో. మానితంబగు ఆది 7.143	క. మానితమగు — 3.62
ఉ. పూని పరాక్రమం బెసఁగ ఆది 8.5	ఉ. పూని మహోగ్రహార-1.46
క. సురగరు డోరగ ఆది 8.100	క. సురగరు డోరగ—4.18
చ. పొలుపుగఁ జూసి ఆది 8.174	చ. పొలుపుగఁ నేచి—6.132

సమాన పదభావముల పద్యములు

నన్నయ

క. దక్షు మఖక్షయ కరు నిట
లాక్షజహూత భక్షు భక్షితానంగు విరూ
పాక్షు మహోక్షధ్వజుఁ బ్ర
త్యక్షము గావించెనుగ్ర తపమునఁ బేర్మిన్.
ఆర 3.49

సీ. చపలాక్షి చూపుల చాడ్పునకెదమెచ్చుఁ
జిక్కని చనుగవఁ జీరఁగోరు
నన్నున కౌఁదీగ యందంబు మది నిల్పు
జఘన చక్రంబుపై జిలుపు దృష్టి
అభిలాష మేర్పడునట్లుండఁగాఁ బల్కు
వేడ్కతో మఱుమాట వినఁగ దివురు
నలిఘన లజ్జావనత యగు నక్కన్య
పైఁబడి లజ్జయుఁ బావఁ గడఁగు
ఆ. వె. నెంత శాంతులయ్యు నెంత జితేంద్రియు
లయ్యు గడు వివిక్తమైనచోట
సతులగోష్ఠి చిత్తచలన మొందుదు రెందుఁ
గాము శక్తి నోర్వఁగలరె జనులు.
ఆది 3.38.

మ. అమలాచార పవిత్ర భూసురవరే
ణ్యాగార పుణ్య ప్రదే
శములం దధ్యయ నారవంబు విధివ
త్స్వాహాస్వధా స్వస్తిశ
బ్దములన్ మంగళతూర్య ఘోషములు
మద్యత్కేతు కాశీర్వినా
దములున్ రమ్య తరంబులయ్యె
ధరణిం దద్రాజ్య సంపత్తితోన్.
ఆది 5.4

నన్నెచోడకవి

క. అక్షయ నిఖిల కళాగమ
దక్షు మహోదారు ధీరుఁ దత్త్వజ్ఞు లల
టాక్ష జనితోగ్ర శిఖి మఖ
భక్షిత పంచేషు దేహుఁ బరమోత్సాహిన్.
1.1[illegible]3

సీ. పులకాంకురంబులు దలలెత్త మేను గం
పింపఁ గోమలిఁ గౌగలింపఁదలఁచు
రాగోత్కటంబు పైరణలేక మానిని
గాయ్యునపైఁ బడి గవయఁజూచు
లలితాంగి యవయవములు చూచి మది దని
వోవక చూడ్కులఁ ద్రావఁగఁజూచు
నధరోష్ఠము దరంగ నంతస్స్మితాంశులు
దళుకొత్త నేమేని బలుకఁ దలఁచు
గీ. తన మహత్త్వంబుఁ దలఁపక తరుణి పొందు
వడయ గిడ్వడి తేకువ వాపఁదలచు
భావజాస్త్రాభిహతి మహాదేవుఁ డొక్క
ప్రేలిమిడి బెంపుసెడి కడు విరలిఁగొనియె.
కుమా. సం. 5.45.

మ. నమదానేక పబృంహితంబు
హయహేషా ఘోషమున్, గీత వా
ద్య మృదుధ్వానము, వేదరావము
భటోద్దండోక్తులన్ భూరివం
చ మహా శబ్దరవంబుఁ గూడి సుమ
హా త్సంక్షోభితాం బోధివా
రమై నా దిగ్బధిరీ కృతంబగుచు
నిత్యంబుం జెలంగుం బురిన్.
కుమా. సం. 7.126.

అర్థాంతర న్యాసములు, జాతీయములు

నన్నయ		నన్నెచోడకవి	
కాముశక్తి నోర్వఁగలరె జనులు	ఆది 3.38	కాము మాయల నెవ్వారు నేవిగారు.	1.104
తోమ్మనఁ జేయుడి నిద్రవోయె	ఆది 6.63	తోమ్మనం జేయుడి నిద్రవోయిరి	11.53
వంట యిల్ కుందెలు సొచ్చె		వేటకానియిల్లు వెలువక కుందెల సొచ్చినట్లు.	12.27
చక్కనై నిలువుము గిట్టి రణంబున.	ఆది 6.294	చక్కనై నిలువు మనుచు	12.87

పదజాలము - తత్సమములు4

నన్నయ		నన్నెచోడకవి	
అచిరాంశువు = మెఱుపు అచిరాంశులతా. ఆర	1.259	దంతయుగం బచిరాంశులు.	1.7
అభిమతములు = కోర్కులు అభిమతములు	ఆది 3.84	అభిమతములు	1.1

4. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రకటించిన నన్నయ—నన్నిచోడ పదకోశములందు తత్సమ పదములు లేకుండుటచే నీ సందర్భమున నది యెంత మాత్రముపయోగకారి కాలేదు. ఇవి అకారాది క్రమము నంతగా ననుసరింపలేదు. ఈ తత్సమములు నిఘంటువున కెక్కవలెను.

అరుణము = రక్తము.	
అరుణమున. అర. 2.260	అరుణధారలు 11.155
అరుణపూరము. ఆది 2.24	12.92
ఆకాశవాణి = దివ్యవాణి	
ఆకాశవాణి. ఆది 4.107	ఆకాశవాణి. 5.118
కర్మేంద్రియములు — కర్మేంద్రియంబులయందు. అర. 2.240	కర్మేంద్రియంబుల గర్వము. 12.220
కౌశికుడు = ఇంద్రుడు.	వినుకౌశిక ! ఇంద్రునికి సంబోధన. 4.44
కౌశికుఁ గౌశిక భీత చిత్తుజు ఆది 4.41	
క్రియాదక్షుఁడు = సామర్థ్యము గలవాడు.	క్రియాతి దక్షుఁడగు దక్షుఁడు 2.92
క్రియాదక్షుఁడు ధౌమ్యుఁడు ఆది 1.85	
కులబ్రాహ్మణుఁడు. ఆది 1.9	కుల విప్రోత్తముఁడు 10.123
ధారుణి	
ధారుణి ప్రజఁ గూర్పఁగా విగతరోష్టుఁడవై ఆది 7.128	ధారుణియుం గప్పుచుఁ ద్రోచి రోలి తొలి కారుంబోలె. 11.138
నందనము=సామాన్యోద్యానము	(పురి) నందనావళుల్ 7.100
నవనందనావళులు. ఆది 8.78	
నరభోజనులు = రాక్షసులు	నర భోజనుఁడ నేను. 12.86
అన్నరభోజనాన్వయము. అర 3.0	
ప్రస్తవము. కార్యము ప్రస్తవమున. సభా 1.65	(పతుల) ప్రస్తవంబు 11.135
భైరవపూజ — భైరవపూజ యొనర్చి. సభా 1.118 1.191	భైరవ యోగీంద్రుల గూర్చి. 8.128
బుద్ధీంద్రియములు.	
బుద్ధీంద్రియముల అర. 2.240	బుద్ధీంద్రియములు. 12.220
శిలోచ్చయము = పర్వతము	శిలోచయోత్తముఁడు 7.136
అద్రి శిలోచ్చయ సంచయంబు అర 1.333	
శరణు—	శరణు నీవ శరణు —4
శరణన్న గాచుచు ఆది 1.8	
విశిష్టుడు = విశేషముగలవాడు పురుషోత్తము డెట్లు విశిష్టుఁడు. అర 2.248	త్రినయనుకంటె విశిష్టుఁడు 10.58

తెలుగు పదములు

ఆలిపోతుఁడు.	ఆలిపోతులును నంటు
ఆలిపోతుఁడు కుఱుచ చేతులు అర. 2.135	రూపులు. 6.37
కలువడగలు.	
కలువడగలు గడు విలసిల్లె. ఆది 6.148	కలువడగలు. 8.5
కెద్దేరనగు = వేఱుచేయుటకు వీలుగానంతగా కలిసిపోవు. శరనిధి నినాదము పురఘోషము కెద్దేరనయి పొలుసగు—వ్రాతప్రతి.	కెద్దేరనై పీనుగులు పడుగుపేకయు బోలెన్. 11.127, 11.194
కీడ్పరించు. ముద్రిత పాఠము	
తఱుసంటి.	తఱుసంటి తన్ను నెఱుగఁడు. 7.49
తఱుసంటి తనము సభా. 2.228	
నడునడ నడుంగి ఆది 2.155	నడునడ నడంగుళు 2.174
పొరయుదు = పొందుదు	
ఉరగ భయము పొరయుదు. ఆది 2.237	పొరయునె. 12.219
పొందుదు — ముద్రిత పాఠము పొరయుదు—వ్రాతప్రతి.	
నడిసను = ప్రసిద్ధికెక్కు యయాతి యనఁగ నడిసను వాఁడన. ఆది. 3.213 జనియెడు వాఁడన్—ముద్రిత పాఠము. నడిసను వాఁడన్—వ్రాతప్రతి.	జనకుండు వా నడిసన్నవాడు. 7.134

తెలుగు పదముల పరిశీలన మింకను నెంతయో గలదు. నన్నయ భారతమున ముద్రిత ప్రతి కన్న వ్రాత ప్రతులలో నన్నెచోడ కవి వాడిన పదములు కాన్పించుచున్నవి. వానిలో కొన్నింటిని మాత్రమే దిక్ప్రదర్శనముగా చూపితిని. అట్టి పరిశీలన జరుగ దగినదని సూచించుటకు మాత్రమే యివి చూపబడినవి.

వ్యాకరణము

ఏకదేశాన్వయములు

ఆ నారాయణ పాండవేయగుణ మాహాత్మ్యముల జ్యోత్స్న. ఆది. 3.21	ఆ తుంగ శృంగ శిలాపూర్ణ సరసి. 1.2

ఇవార్థముపై యివార్థము

శబ్దంబు నట్ల పోలె. ఆది. 3.128	ఉదయించు నట్లపోలె. 3.29

సప్తమిమీద 'ఉంది' శబ్ద లోపము

నూతిలో వెలువడ కోమలిం దిగిచె. ఆది. 6.316	పూర్వాబ్ధిలోవెల్వడి 10.111

ద్రుతద్విత్వము

ధైర్యవృత్తి కిన్నరుదుగ. అర. 1.321	బూరువులు న్మొగి బూన కుండఁగా.

తెంపుధాతువనుప్రయుక్తము

నీటిలోన నుండి నెగయు దెంచె. ఆది 5.173	పేర్చిందు లెగయుదెంచె. 9.133

భావార్థక 'డు' ప్రత్యయము

షడరత్ని ధనుర్ధరుఁడు.... చేయుఁడు. ఆది 7.16	పడి... వారికి బీరముగాగ రజ్జు చెప్పుడునది. 10.151
'డు' ప్రాసస్థానము.	
ఎవ్వనియేని ముఖామృతాంశుబింబంబు. ఆది. 1.36	యెక్కడ యేని వానిగా 8.142

సమాసములు

కలకంఠుఁడు	కలకంఠుఁడు 6.28,
కలకంఠా క్షమియింపుము ఆర. 1.327	12.103, 12.103 లో ప్రాస.

ఉద్రుచు - 'అ' లఘువు

సకల భువన వలయు 'మ్రుదువ' ఆది. 6. 124	బ్రహ్మాండ ఖండ 'మ్రుదువ' 11.8, వియత్తలం 'బ్రదువ' 12.13
దిక్కులద్రువంగ ఆది 2.73	దిక్కులద్రువంగ. 5.68

ఛందస్సు

నన్నయ నన్నెచోడుల ఛందస్సును పరిశీలించి నందున్న పెక్కు సామ్యముల గుపడుచున్నవి. దీనికి ముందు వా రుపయోగించిన వృత్తజాతి ఛందస్సులను మనము తెలిసికొనవలసియున్నది.

నన్నయ	నన్నెచోడకవి
భారత భాగమున 13 ఆశ్వాసములు పై 142 పద్యము లున్నవి. అందరి గద్య పద్య సంఖ్య 4009.	కుమారసంభవమున 12 ఆశ్వాసములు. గద్య పద్య సంఖ్య. 2005.

కావున నన్నయ రచనలో నన్నెచోడకవి రచన సగపాలు.

పద్యములలో సంస్కృత వృత్తములు 589.	సంస్కృత వృత్తములు 515.
ఈ వృత్తములలో చంపకములను ఉత్పలములను నన్నయ హెచ్చుగా వాడియున్నాడు. 424. (240—184)	నన్నెచోడకవి చంపకములను 238 ని, మత్తేభములను 110 ని వాడియున్నాడు. మొత్తము 348.

ఇచట విశేష మేమనగా, నన్నయ రచనలో మత్తేభ గమనమును నెరన ప్రశంసించి యున్నాడు. కాని మత్తేభ వృత్తములను మక్కువగా వాడిన కవి నన్నెచోడకవి. ఎట్లయిన నన్నెచోడుడు కవిరాజు కాదు. కవిరాజ శిఖామణి. ఈ సంస్కృత ఛందస్సులలో కొన్ని వృత్తములకు నన్నయ—నన్నెచోడ కవు లొక్కరీతిగానే యతి స్థానములను పాటించి యున్నారు.

1. మానిని

నన్నయ	నన్నెచోడుడు.
ఏచి తనర్చి తలిర్చిన క్రోవుల నిమ్మగురావుల—(ఆది 4.20)	మానిని రూప చరిత్రలుదార సమం బగుచున్నవి (6.9)
13 వ అక్షరము యతి.	13 వ అక్షరము యతి.

తక్కిన కవులు మూడుచోట్ల యతిని పాటించిరి.

2. కవిరాజవిరాజితము

నన్నయ	నన్నెచోడకవి
చని చని ముందట నాజ్యహవిర్ద్రుత సౌరభ. ఆది. 4.21	మనునిభ చారు చరిత్రుఁ డవిత్రు నమానుష పౌరుషవర్తి జగ—(11-211)
పాదమున కొక్క యతి.	పాదమున కొక్క యతి.

ఇరువురు వాడిన ఛందములు

శార్దూలము	శార్దూలము
మత్తేభము	మత్తేభము
ఉత్పలము	ఉత్పలము
చంపకము	చంపకము
మత్తకోకిల	మత్తకోకిల
కవిరాజ విరాజితము	కవిరాజ విరాజితము
స్రగ్ధర	స్రగ్ధర
మహాస్రగ్ధర	మహాస్రగ్ధర
మాలిని	మాలిని
మానిని	మానిని
వసంత తిలకము	వసంత తిలకము
వనమయూరము	వనమయూరము
లయగ్రాహి	లయగ్రాహి
స్వాగతము	స్వాగతము
తోటకము	తోటకము.

జాత్యుపజాతులు. కందములు, సీసములు.

వీనిని హెచ్చుగా నన్నయ నన్నెచోడులు వాడియున్నారు.

కందములు

నన్నయ—1219	నన్నెచోడుడు—534.
అనగా నన్నయ రచించిన పద్య సంఖ్యలో సరిగా సగము భాగము కందములు.	అనగా నాతని పద్యరచన1410 లో కందములు మూడవ వంతు

సీసములు

నన్నయ నన్నెచోడుల సామ్య పరిశీలనకు ఛందస్సున నిది ప్రధానము. నన్నయ యెన్ని విధముల సీస రచనము గావించి యున్నాడో నన్నెచోడుడును, అన్ని నియమములతో సీసములను రచియించి యున్నాడు.

నన్నయ రచించిన సీసములు.	నన్నెచోడుడు.
251.	186.

నన్నయ - నన్నిచోడకవులు

నన్నయ సీసపద్యముల నొక నియమముతో రచియించెనని తెలుగువారీవర కెఱుగుదురు. కాని నన్నెచోడకవికూడ యట్లనే సీస పద్యములను నియమముతో రచియించెనని చాలమంది యెఱుగక పోవచ్చును. మనకు లభ్యమైన ప్రాచీన పద్య శాసనములలో ధర్మవర శాసనమున సీసపద్య మొక పాదము పోయినను సర్వ ప్రాస నియమముతో నున్నది. అఱిగొఱిగా మన్నను, కందుకూరి శాసన సీసము—ప్రాస నియమముతో నున్నదని గ్రహింపనగును. దీనినిబట్టి నన్నయకు ముందు సీసపద్య రచనమున నియమ మున్నట్లు స్పష్టము. నన్నయయు నీ నియమములను తన సీసపద్యము లన్నిటియందును పాటించియే యున్నాఁడు. నన్నయ వెనుక సోమలదేవి శాసనమున ప్రాస నియమము సీసమున పాటింపబడినది. ప్రస్తుతము నన్నయ నన్నెచోడ కవుల సీస పద్య రచన వివరింతును.

నన్నయ వలెనే నన్నెచోడుడు పదునారు విధములైన సీస పద్యములను రచియించి యున్నాడు. కొన్ని యెడల నన్నెచోడుని గ్రంథమున నా నియమము తప్పినట్లు కానవచ్చు చున్నది. కాని, యిందు విచిత్ర మేదియు లేదు. వందలకొలదిగా ప్రతులు పాఠములు లభించుచున్న నన్నయ భారత భాగమునందే సీస పద్యములలో నిట్టి విపర్యాసములు కానవచ్చుచున్నపుడు, ఏకైక ప్రతి నుండి ప్రత్యంతరములేక, గత్యంతరము కానక, ముద్రించిన ప్రతి యందు స్ఖాలిత్యము లుండుట సంభావ్యమే.

1. సర్వయతి సీసము. సీ. యతి, గీ. యతి } 4— 45 జలశాయి
2. సర్వప్రాస సీసము సీ. ప్రాస, గీ. ప్రాస } 4—109 అరగ్వధార్క

పై రెండు గాక వీనిలో నీ క్రింది భేదములు గలవు.

1. గీతి యొకటవ పాదమున ప్రాసయతి
2. ,, రెండవ ,, ,,
3. ,, మూడవ ,, ,,
4. ,, నాల్గవ ,, ,,
5. ,, యొకటి రెండు పాదముల ,,
6. ,, యొకటి మూడవ ,,
7. ,, యొకటి నాల్గవ ,,
8. ,, రెండవ మూడవ ,,
9. ,, రెండవ నాల్గవ ,,
10. ,, మూడవ నాల్గవ ,,
11. ,, ఒకటి, రెండు మూడు ,,
12. ,, ,, రెండు నాల్గవ ,,
13. ,, ,, మూడు నాల్గవ,
14. ,, రెండు, మూడు నాల్గవ ,,

ఈ భేదములు—భారతి, వృష—అజ్వయుంఐము (లక్ట్రోబరు 1941)లో నీయబడినది. వాని నన్నిటిని మూల ప్రతితో సరిచూడవలసి యున్నది. నన్నయవలె నన్నెచోడుడు సీసపద్య రచనమున నియమము పాటించినవాడు.

యతులు

తెలుగున భాషాశాస్త్రమునకు మూల భూతములగు యతుల విషయమై, నన్నయ, నన్నెచోడుల గ్రంథములలో చేయువలసిన పని చాల యున్నది. అందలి యతి స్థానముల ప్రతి యక్షరము పరిశీలింప దగినది. ఒక్క యుదాహరణము చూపుచున్నాను.

కుమార సంభవమున— మొదటి పద్యమున—

"శ్రీ వాణీంద్రామరేంద్రార్చిత మకుటమణి శ్రేణి"

అని ముద్రితమైనపుడు నేను యతులను గూర్చి పరిశోధించి నన్నెచోడుడు—వలపలగిలక యతి సంప్రదాయము—ననుసరించి — అనగా— రేఫ సంయుక్తాక్షరములో క్రింది హల్లుతో యతివేయుట (ర్వ—వ—ర్చ—చ) నన్నె చోడుడు. 'శ్రీవాణీంద్రా మరేంద్రార్చిత" అనియే యుపయోగించెనని 77 స్థలములలో నట్టి యతిస్థానములను చూపితిని.

నన్నయ యతులను నా రీతిగానే పరిశీలించితిని. వలపగిలక యతినే నన్నయవాడినట్లు నిర్ధారించితిని. ఈ విషయమున నన్నెచోడ, నన్నయలకు పూర్ణముగ సామ్యమే గలదు.

నన్నయ యతులనుగూర్చి యింకను చెప్పవలసినది భారతమంత—

ఇట్టి పనులకు పద పద్యానుక్రమణిక లావశ్యకములు—నన్నెచోడ కవికృతికీవలెనే యట్టిదానిని ప్రకటించితిని—నేడు నన్నయకు నట్టి యనుక్రమణిక సిద్ధముచేయుచున్నాను. స్ఫురించిన విషయములనిందు వ్యాసరూపముగ వందించితిని. కొన్నిచోట్ల చెప్పవలసినవి యింకను చాల యున్నవని పాఠక లోకమునకు తెలుపుటకే పై విషయము వ్రాసితిని.

◆◆◆◆◆◆◆◆◆◆

మ. స్థిరపుణ్యోదయ మేదినీందువదనా సీమంత వీథీలస
ద్గురు ముక్తా ఫలసూత్ర మో? సురుచిరక్షోణీపురంధ్రీ సమా
దరధమ్మిల్ల లతాంత మాలికయొ? భూతస్వీకుచ శ్రీమనో
హార సంవ్యాన మొ నాగసీదగు ప్రవాహాంబాప్వ గోదావరీ!

—వెగదవల్లి పోతయ్య.

చింతకాయల కజ్జాయము

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

> "కలలో వార్తలు విప్పి చెప్పెడు క్రియన్ గాథా పురాణార్థముల్
> దెలుప న్నేర్తురు గాని వేరరు సుమీ తీవ్ర వ్రతాచార శ
> ష్కులులై యుండెడు ముండధారులు సుముక్తుల్ డాయఁగాఁ జింతకా
> యల కజ్జాయము తోయ మింత చదరంబా త త్పరిష్వంగముల్."
>
> (పాండురంగ. 5—214)

ఈ పద్యములోని 'చింతకాయల కజ్జాయము' నకు పండితులీ క్రింది విధముగా అర్థములు చెప్పియున్నారు.

(1) విద్వాన్, శ్రీ పేరి సత్యనారాయణ శాస్త్రిగారును, కవిరత్న శ్రీ ఎవ్. వీరబ్రహ్మ కవిగారును—1951 బి. యే. Part II—తెలుగు 'నోట్సు' లో,—

"చింతకాయల కజ్జాయము తోయము—చింతకాయల మిఠాయి విధమున, ఇంత చదరంబా—ఇంత తేలిక యయినదా ? చింతకాయల పచ్చడి జేర్చి తినుట తేలికపని కావచ్చును గాని, ముక్తికాంతాలింగనము తేలికగ లభించునది కాదని భావము" అన్నారు.

'చింతకాయల మిఠాయి' అశ్రుతపూర్వము. మిఠాయిలో చింతకాయ పచ్చడి చేర్చి తిందు రనుట విడ్డూరము. చింతకాయలతో చేసిన మిఠాయిలో, మరల చింతకాయల పచ్చడి చేర్చి తిందు రనుకొనుట స్వభావ విరుద్ధము. కావున వారి వ్రాత సమంజస మైనది కాదు.

(2) 1952 లో, పాండురంగ మాహాత్మ్యమునకు వ్యాఖ్యానము వ్రాసిన శ్రీ బులుసు వేంకటరమణయ్యగారు,—

"చింత .... తోయము—చింతకాయల కజ్జము వంటిది. చింతకాయల కజ్జాయము ఒకానొక మధురభక్ష్య విశేషము. దానిని తయారుచేయుట మిక్కిలి కష్టము, అట్లే మోక్షమును కష్టతమ మనుట" అన్నారు.

వీరు, 'చింతకాయల కజ్జాయ' మనే మధురభక్ష్య విశేష మొకటి యున్నట్లే కాక, దానిని తయారుచేయుటయు తమకు తెలిసి యున్నట్లు "అది మిక్కిలి కష్టమైన పని" యని కూడా వ్రాసినారు. కాని, ఆ వ్రాత విశ్వసింప దగినది కాదు. ఎందువల్ల ననగా : 'చింతకాయల కజ్జాయ' మను భక్ష్య విశేషము లోకములో లేదు. 'చింతకాయల మిఠాయి' వలెనే, ఈ భక్ష్య విశేషము కూడా వూహా కల్పితమే.

పులుపు తీపికి విరుపు. మధుర పదార్థములో పులుసు చేరినయెడల, ఆ పదార్థముయొక్క మాధుర్యము చెడుటయు, అది భక్షణయోగ్యము కాకపోవుటయు ఘటిల్లును. కనుక చింతకాయలతో కజ్జాయము చేయుదురనుట పొందికలేనిమాట.

మధురవస్తు భక్షణమున మొగము మొత్తినపుడు, చింతకాయ పచ్చడి రవంత నాలుకకు రాచుకొనుట లోకమున గలదు. ఇది యెల్లరు వెరిగిన విషయమే. లోకజ్ఞుడైన మహాకవి కాళిదాసు ఈ విషయమును చెప్పియు న్నాడు.

> "యథా కస్యాపి పిండఖర్జూరై రుద్వేజితస్య
> తింత్రిణ్యా మభిలాషో
> భవేత్ త థాంతః పుర స్త్రీరత్న పరిభోగినః భవత
> ఇయ మభ్యర్థనా."
>
> (శాకుం. 2 అం)

ఇంకను విస్తర మెందుకు : పుల్లని చింతకాయలతో తియ్యని కజ్జాయము చేయుదు రనుట ఉత్తమాట.

అది యట్లుండగా, శ్రీ వేంకటరమణయ్యగారి వ్రాతను బట్టి,—చింతకాయలతో కజ్జాయము—కష్టముమీద—తయారుచేయవచ్చు ననియు, అట్లే తీవ్ర వ్రతాచారముల చేత ముక్తిని సాధింపవచ్చు ననియు నర్థ మేర్పడుచున్నది. ఆ యర్థము పద్యమున సరిపడదు.

ఉగ్ర వ్రతములవలన శరీరములు కృశించి చిక్కిలము లగువే గాని, మోక్షము లభింపదనియు, సన్యాసులు వ్రతాచరణమున ముక్తిని సాధింపవెంచుట—చింతకాయలతో కజ్జాయము చేయబూనుట వంటి దనియు నందున్న యర్థము. అది వ్యర్థ ప్రయత్న మని దాని భావము. కనుక శ్రీ బులుసువారి వ్యాఖ్యానము పద్యభావ విరుద్ధము. అందుకు మూలము 'చింతకాయల కజ్జాయము' తత్త్వమును విచారించి తెలిసికొనకపోవుట.

'చింతకాయల కజ్జాయ' మనునది 'అసంభవ' మను నర్థమునిచ్చు లోకోక్తి. (భక్ష్య విశేషము కాదు.) 'కుందేటి కొమ్ము' 'గగన కుసుమము' ఇత్యాదుల వంటిది. తాళ్లపాక అన్నమయ్య—ఒక సంకీర్తనమున—ప్రయోగించి యున్నాడు.

ఆ సంకీర్తన మిది.—

'ఇందువల్ల నేమి గద్దు యినుపగుగ్గిళ్ళే లే
యుందిరారమణు సేవ యరవైన పదవి.—పల్లవి.

సతులతో నవ్వులు చందమామ గుటకలు
మతి తలపోత లెండమావుల నీళ్లు,
....
పడతుల వేడుకలు పచ్చి వడగండ్ల గుండ్లు
కడు మోవి తీపుచింతకాయ కజ్జము.'' (7—34)

ఇనుపగుగ్గిళ్లు, చందమామ గుటకలు, ఎండమావుల నీళ్లు, వడగండ్ల గుండ్లు, చింతకాయ కజ్జము—అనునవి అన్నీ, 'పట్టేడ—ఉలిక్కి' అను నర్థము నిచ్చు లోకోక్తులే.

కాబట్టి, 'తీవ్ర వ్రతాచరణమున ముక్తిని సాధింప జాచుట, చింతకాయలతో కజ్జాయము చేయబూనుటవలె కానిపని' అని యర్థము చెప్పుట యుచితము.

చింతకాయల కజ్జాయ మొకటి యున్నట్లును, దానిని తయారుచేయుట మిక్కిలి కష్టమైనట్లును చెప్పుట సరి కాదు. కజ్జాయమును కష్టముమీద తయారు చేసినట్లే, మోక్షమును కష్టముమీద సాధింపవచ్చు ననుట ప్రకరణమునకు కేవలము విరుద్ధము.

ఇది నాకు తోచినమాట. సమంజస మగు నో కాదో పండితులు విచారింతురుగాక.

వారము ఎప్పటినుండి ప్రారంభమగును?

శ్రీ మామిడేల రామమూర్తి

తిథి వార నక్షత్ర యోగ కరణము—లను ఐదు అంగములతో గూడినదియే పంచాంగము. పంచాంగమున తిథి తరువాత రెండవదిగా వారము చెప్పబడినది. ఈ వారము ఎప్పటి నుండి ప్రారంభమగును? అనునది ప్రస్తుతాంశము.

జ్యోతిష సిద్ధాంతము ననుసరించి, స్థిరమగు భూమి చుట్టును—చివరినుండి శని, గురు, కుజ, రవి, శుక్ర, బుధ, చంద్ర గ్రహములు క్రమముగాయుండి తిరుగుచున్నవి.

శ్లో. మందామరేజ్య భూపుత్ర సూర్య శుక్ర బుధేందవః'' అని సూర్య సిద్ధాంతము. 60 ఘడియలుగల నొక దినముపై సప్త గ్రహములు మొత్తము 24 పర్యాయములు తిరుగుచున్నవి. కనుక దీనినిబట్టి ఒక్కొక్క గ్రహము ఒక పర్యాయము తిరుగుటకు పట్టుకాలము $2\frac{1}{2}$ ఘడియ లగును. దీనిని ఒక హోరగ చెప్పిరి. కనుక దినమునకు 24 హోరలగును. హోర శబ్దము గ్రీకు భాషనుండి సంస్కృతములోనికి చేరినదని పెద్దల అభిప్రాయము. ఈ హోర శబ్దమునుండి పుట్టినదే నేటి (గంట) Hour! శ్లో. అర్క శుక్ర బుధశ్చంద్ర మందోజీవ కుజా పునః। సార్ధ ద్విఘటిక హోరా ఇత్యేతత్ హోర లక్షణం॥ రవి, శుక్ర, బుధ, చంద్ర మంద జీవ, కుజులు 'వరసగా హోరాధిపత్యము వహించి మూడు పర్యాయములు తిరిగిన (7×3=21 హోరలు) తరువాత కొరవ మూడు హోరలును, నాల్గవ పర్యాయములో మూడు గ్రహములు మాత్రమే అధిపత్యము పొందెదరు. దీనితో 24 హోరలుగల దినము పూర్తియగును! సూర్యోదయముతో మరు దినమున నాల్గవ పర్యాయములోని నాల్గవ గ్రహము మొదటి హోరాధిపత్యము వహించును. అతనిపేరనే ఆ వారము చెల్లును. కనుక ప్రతిదినము సూర్యోదయమునకు ఏ హోర ఆరంభించునో ఆ హోరాధిపతియే అదినాధిపతి. పై చెప్పిన క్రమము ననుసరించి అతనికి 4 వ గ్రహహోరయే మరునటి దినాధిపతి యగును. శ్లో. మందాదధః క్రమేణ స్యుశ్చతుర్థా దివసాధిపాః హోరేశాః సూర్య తనయాదధోధః క్రమ శస్తథా॥ అని సూర్య సిద్ధాంతము. దీనినిబట్టి సూర్యోదయమునకు ప్రారంభించు ప్రథమహోరాధిపతియే వారాధిపతిగ యుండి, మరు దిన సూర్యోదయ సమయమునకు మరల ప్రథమ హోరాధిపత్యమునకు గ్రహము వచ్చునంతవరకు ఆ వారముగనే చెల్లుబడికాగలదు. దీని ననుసరించియే మనపెద్దలు 'ఉదయాత్ ఉదయంవారం' అని సూర్యోదయమునుండి మరునాటి సూర్యోదయమువరకు ఒక వారముగ చెప్పిరి.

వారగణన—మహమ్మదీయుల ఆచారము ప్రకారము సూర్యాస్తమయము నుండియు, పాశ్చాత్యుల ఆచారము ప్రకారము అర్ధరాత్రి (1 గంట A. M) నుండియు; హిందువుల ఆచారము ప్రకారము సూర్యోదయమునుండియు ప్రారంభమగునని తెలియుచున్నది. ఇట్లు వార ప్రారంభమగు కాలమును గురించి మాత్రము ఆచారభేదమున్నట్లు తెలియుచున్నది.

కొందరిచే—మేష, కుంభ, వృశ్చిక, మీన మాసముల యందు సూర్యాస్తమయాదిగానున్నూ, వృషభ, ధను, తుల కర్కాట మాసములయందు అర్ధరాత్రినుండియున్నూ, మిథున, మకర, సింహ, కన్యా మాసములయందు సూర్యోదయము నుండియు వారగణన ప్రారంభమగునని చెప్పబడినది.

ముహూర్త భాగమున చూచు పరచకరహిత విషయమై యున్నూ, జాతా శౌచ, మృతాశౌచ, రజస్వలాదులయందు—మొదలగు ప్రత్యేక సందర్భముల వారగణన విషయమున రాత్రి కాలమును మూడు భాగములుచేసి, అందు మొదటి రెండు భాగములను ఆ దినము క్రిందను, మిగిలిన మూడవ భాగమును పర దినముక్రిందను పరిగణింపబడుచున్నది.

ఆయా దేశములకు వారము ఎప్పుడు ప్రారంభమగునది కచ్చితముగ తెలుసుకొనుటకు నొక పద్ధతి చెప్పబడినది. దీని ననుసరించి లంకా మేరువులకు నొక సూత్రముబట్టగా

ఆ సూత్రము మధ్యరేఖ యనబడును. ఏ దేశమునందు వార ప్రవృత్తి కావలెనో ఆదేశము ఈమధ్యరేఖకు తూర్పు దిశన ఉన్నది లేక, పశ్చిమదిశయందున్నది చూచుకొని, ఆదేశము ఎన్నియోజనముల దూరమున యున్నదో అన్ని పలములుగా నెంచి అందు $\frac{1}{4}$ వ వంతును—మధ్యరేఖకు పశ్చిమమున ఇష్ట దేశమున్న యెడల 15 ఘడియలతో కలపవలయును. యిట్లే తూర్పున యిష్టదేశమున్నయెడల 15 ఘడికలలో తీసివేసి యుంచవలెను. తరువాత ఏ దినమున వార ప్రవృత్తి గావలెనో ఆ దిన అహస్సులో సగమునకు పైన యుంచియున్న మొత్తము తక్కువయైన ఎంత తక్కువయో, లేక ఎంత ఎక్కువయో తేల్చుకొనవలసి యున్నది. అర్థ అహస్సుకంటె తక్కువగాయున్న ఎంత తక్కువయో అంత సూర్యోదయానంతర మున వార ప్రవృత్తియగును. లేక పై కనుగొన్న మొత్తము ఎంత తక్కువగా యున్నదో అంత సూర్యోదయాత్పూర్వమున వార ప్రవృత్తియగును. శ్లో. పాదోన రేఖా పరపూర్వ యోజనైః పవైర్యుతో నాస్తిథయో దినార్థతః। ఊనాధి కాస్తద్వివరోద్భవైః పలైః స్తూర్ధ్వం తథాధో దిన ప్రవేశః'॥ అని ముహూర్త చింతా మణియందు రామ దైవజ్ఞునిచే చెప్పబడినది. ఇట్లే కాలా మృత టీకా కారుడును చెప్పియున్నాడు. శ్లో. వార ప్రవృత్తం మునయోవదంతి సూర్యోదయాద్రావణ రాజ ధాన్యాప్। ఊర్ధ్వం తథాధో ఒవ్య పరత్ర తస్మాచ్చరార్ధ దేశాంతర నాడికాభిః'' అని రత్నమాలా వచనము.

వారగణన విషయమై భద్రాచల దేవస్థాన పంచాంగ కర్తయగు బ్ర. శ్రీ. కావూరి వెంకటప్పయ్య శాస్త్రిగారిచే యీ శోభకృత్ సంవత్సర నూతన పంచాగమున నూతన పద్ధతి ప్రవేశపెట్టబడినది. ఉదాహరణకు:— శోభకృత్ సం॥ చైత్రశుద్ధ ప్రతిపత్ మంగళవారము సాయంత్రము గం. 6—13ల వరకు యుండును. బుధవారము రాత్రి 2—13ల వరకు యుండును, గురువారము రాత్రి 11—2ల వరకును, శుక్రవారమురాత్రి 1—2 వరకును, శనివారము రాత్రి 5—56ల వరకును, ఆదివారమురాత్రి గం 5—55ల వరకును యుండును. వారు తిథి, నక్షత్ర, యోగ, కరణములకు యిన్ని గంటలవరకు యుండునని నిర్ణయించిన విధముగ పంచాగమున ఐదవ అంగము అగు వారమునకు గంటలు నిర్ణయింపకుండుట వలన నొక అంగములోపించుచున్నదని చెప్పి వారమునకు గంటలు నిర్ణయించినారు. సూర్యుడు ఏ గ్రహపరిధిలో వుదయించునో అది మొదలు తిరిగి అగ్రహపరిధిలో అస్తమించువరకు అదిఒక వారమగునని చెప్పినారు. వారముల ప్రమాణమందలి హెచ్చు తగ్గులు సూర్యుడువున్న ఆ దినగ్రహపరిధి విస్తృతిపై ఆధార పడి యున్నదనియు చెప్పినారు. ఈ వారగణనముపద్ధతి శాస్త్ర సిద్ధమైనది యనియు చెప్పియున్నారు. అసలు యీ వారపద్ధతి మొదట హిందువులది కాదని జ్యోతిష్కుల అభిప్రాయమని— భారతీయ జ్యోతిష్కుల శాస్త్రము పుట 137—138న జ్యోతిష శిఖామణులగు శంకర బాలకృష్ణ దీక్షితులచే చర్చించి వ్రాయబడిన కొమ్మరాజు లక్ష్మణరావుగారిచే తెలుపబడినది.

ఇందు పరిశీలించిన వివిధ పద్ధతులనుబట్టి వారము ఎప్పటి నుండి ప్రారంభమగును ? అను సంశయము కల్గుచున్నది. దీని విషయమై అనుభవజ్ఞులగు పెద్దలు, దైవజ్ఞులు తమ అభిప్రాయాలను భారతి పత్రికా ముఖమున తెలుపవలసినదిగా ప్రార్థన.

ఉ. అంబరసీమం దారలు జటాటవి మల్లెవిరుల్, భుజాంతరా
ళంబున హారసంతతు లిలాస్థలిఁ బూవుల వర్షముల్ ప్రసూ
నంబులు సత్కృతాంజలి ననందగి మౌక్తిక తుల్యమాళికం
గాంబు గణంబు లుట్టిపడ నాడెడు శంభుఁడు మిమ్ముఁ బ్రోవుతన్.

—దామరాజు సోమయ భరతము.

క. సొమ్ములలో ముప్పోర్చుఁ జ
గమ్మెల్లను సోదుముట్టగాఁ జేయును శ్లా
ఘ్యమ్మగు వస్తువునగుటను
కమ్మని కనకంబుగాదె కవిత దలంపన్.

—కొక్కొండ.

లేఖలు

అముద్రిత ఆంధ్ర నానార్థ నిఘంటువు

భారతి సంపాదకులకు,

ఆర్యా!

ఏప్రియలు నెల భారతి 83—84 పుటలలో పై నిఘంటువు విమర్శనము ప్రకటితమైనది. అది మార్చి భారతి సంచికలో 68—69—70 పుటలలో నా శీర్షికతోడనే ప్రకటితమైన వ్యాసమును గూర్చినది. ఆ నానార్థ నిఘంటువు మాట యటుండనిండు.'

ప్రస్తుతము లేఖ వ్రాసినవారికి (తుమ్మపూడి కోటేశ్వరరావుగారికి), ఆంధ్ర నిఘంటువులు, వాని స్వరూపము, శబ్దార్థములు భాషా సంప్రదాయ పరిజ్ఞానము శూన్యమని యీ లేఖమూలమున వ్యక్తమగుచున్నది.

"మన భాషలోనున్న నిఘంటుసంఖ్య స్వల్పాతిస్వల్పం, ఉన్నవికూడా అసమగ్రంగా ఉన్నవి. ఈ సూత్రం ప్రతి నిఘంటువుకు పడుతుంది." ఏ భాషలోనైనా నిఘంటువులు, పద్య కావ్యములు, వచనకావ్యములు నాటకములు మొదలగు వానివలె అసంఖ్యాకములుగా నుండునా ?

అసలు నిఘంటువులెన్ని యున్నవో అవి తెలుసుకొండగనే, సంఖ్య స్వల్పాతిస్వల్పం— అనుటయెట్లు ? ఇంతేకాదు. తెలుగున పద్యనిఘంటువులు, పద నిఘంటువులు కూడ నున్నవి. "ఈ సంఖ్య రెండింటికి వర్తించునా ?" ఉన్నవి కూడా అసమగ్రంగా ఎట్లున్నవో ఒక్క నిఘంటువు పేరైనను చెప్పి అందుండి ఒక్క ఉదాహరణమైన చూపించలేదే !

"అముద్రిత కావ్యాలు గ్రంథాలు— అందులో శబ్దాలు నిఘంటువులో కెలా ఎక్కటం"— అని ఒక సందేహ చిహ్నము. ఈ వాక్యమునుబట్టి లేఖాకర్త— నేడు వ్యాప్తిలో నున్న సూర్య రాయాంధ్ర శబ్ద రత్నాకర నిఘంటువులను చూడనేలేదనుట స్పష్టము.

ముద్రితమైన నిఘంటువుల మొగము చూడనప్పుడిక యముద్రితమైన వానిని గూర్చి వీరికేమి తెలియగలదు ?

నిఘంటువులలో,నివి అముద్రితములైనవి ఇవి ముద్రితములైనవి— అన్న పరిజ్ఞానమే లేనప్పుడు, ప్రస్తుత నానార్థ నిఘంటువును గూర్చి యిట్టి వ్రాతలు వ్రాయుటలో అర్థం లేదు.

ఏదో ఒక తాళపత్ర గ్రంథము లభింపగానే దానిని పూర్వాపర సందర్భములు పరిశీలింపకుండ పరిష్కరింపకుండా తక్షణమే అచ్చువేయు తెలివితక్కువ తనమూ కాలమునలేదు.

ఈ లేఖాకర్త పై నిఘంటువున గల దోషములను చూపించి, ఇట్టి గ్రంథము నెవ్వరైన ముద్రింతురేమో యనియు, "తత్ప్రయత్నంలో ఉంటే చాలా పరిష్కరించాల్సి ఉంటుందని" సూచన చేసి యున్నాడు.

"ఇది పరిష్కరణ దుస్సాధ్యంలాగా కనిపిస్తుంది" అని ఇంకొక వాక్యము—

అపరిణతులకు, ఆంధ్రభాషా పరిజ్ఞానహీనులకు నిది దుస్సాధ్యం— తక్కిన వారికి సుసాధ్యమే.

"దీన్నెవరైనా ప్రచురించే ప్రయత్నంలో వుంటేవారి కిదొక సూచన."

మొట్టమొదట యీ నానార్థ నిఘంటువు ముద్రణ విషయమే, పూర్వ వ్యాసమునలేదు. అందున్న విషయము—

"శ్రీతాతా సోమయాజి ప్రణీతమైన ఆంధ్ర నానార్థ నిఘంటువొకటి ముద్రితమైనదని తెలిసినది. ముద్రిత ప్రతిలో 132 పద్యములు మాత్రమే కలవట— అవి కంద గీతములేనట. అట్టి ప్రతిని పరిచూచిన నిది సమగ్రమని చెప్పనగునా చూడవలసి యున్నది."

పూర్వ వ్యాసకర్త 'చూడవలసియున్నది' అన్నాడేకాని తాను చెప్పిన నిఘంటువును ముద్రించుటకు ప్రయత్నము చేయవలెనని యెక్కడను చెప్పియుండలేదే !

ఇక ప్రస్తుత లేఖాకర్త తాను ప్రథమముగా నిన్ని దోషములను చూపిన వాడనని, అందుచే దానిని ముద్రించు వారికి హెచ్చరిక చేయునుబలాటముతో, వ్రాసినట్లును స్పష్టమగుచున్నది. కాని పాపమాతని కున్నది ఉబలాట మాత్రమే, ఉపజ్ఞ పూజ్యము. చూడుడీ క్రిందిదోష నిరూపణము.

1. ఇక ప్రాసలు. ఒక పద్యంలో ప్రాసకూడాలేదు.

"బరహీ యున
బర్హియునన్
బరహియున
బర్హియునన్" అని యొక దోషము.

లేఖా కర్తకు, 'బరిహి' అనునది 'బర్హి' అను శబ్దము రూపాంతరమనియు, దానిని నన్నెచోడకవి కుమార సంభవమున వాడియున్నాడని తెలియదు.

'బరిహికేశ భరంబున' (4—102)

అన్ని పాదములు 'బరిహి' అనిలేక 'బర్హి' నాలుగు పాదము ములు నుండవచ్చును ఇందు ప్రాసదోషమేమి ?

2. శాబ్దికదోషములు.

'ఏ శబ్దములు వచ్చిన (శబ్దంబులు కాబోలు)'' కాని యిచ్చట పూర్వన్యాసము సరిగా చూడక దోషమారోపింప బడినది ''ఏ శబ్దములును వచ్చిన'' అనిపుట 70లో సరిగా నున్నది.

3. హరుల శత్రుల్.

''శత్రుల్'' కాబోలు. (త్రు— తృగా నున్నదనుట) పూర్వపు వ్రాతలలో శత్రువు, శతృవుగా వ్రాసెడివారు. మహా ప్రసిద్ధి చెందిన అప్పకవియే, అప్పకవీయమున ''ధ్రువ శబ్దము ద్రుత శబ్దము వట్రువసుడులుగావు అనగా ధృవ, ధృత— అని వ్రాయకూడదని చెప్పితానే మూడుచోట్ల— ధృవగా వాడినాడు.

దివిషద్వంద్యా— ధృవసన్నుతా (4—

ధృత చక్రధర— ధృవశోభి (4—

తేజశ్శ్రీ— ధృవముగ— ఇచట ధ్రువమనగ యతి చెడునుగదా.

4. వ్యర్థశబ్ద ప్రయోగం పునరుక్తులు.

మానుగ చదివినదీనన్

మానుగ శబ్దార్థములును.... అని యుదాహరణ మీయ బడినది. నన్నయలో 'మానుగ'ల కన్నిటికి ప్రత్యేకార్థము లున్నవి గాబోలు.

5. ఇందులో యతులు తప్పినవని యుదాహరణలు చూపబడినవి కాని యిది కావ్యముకాదు. నిఘంటువు పద్యమైనను అర్థములు మాత్రమే తెలుపును.1

కొన్ని వేదాంత గ్రంథములలో, శాస్త్ర గ్రంథము లలో యతులు పాటింపబడవు. అయినను ప్రస్తుత గ్రంథ మున చాలచోట్ల పాటింపబడినవి.

ఇంతకు నీ గ్రంథము తాళ పత్రములలో నున్నది యున్న ట్లుగా వ్రాయబడినది. అప్పుడందలి విషయములను సరిగా పరిశీలింపకయే విమర్శించుటయెట్లు ?

6. ''మాణవుడన భార్యలేనివానికి పేరున్''

అనియొక పాదమున్నది. ఇందు యతిలేదని లేఖాకర్త. కాని యిది లాక్షణికు లిచ్చినయతి.

'మరుదీమము లేమ కీరవాణి యనంగన్'

దీనికి 'సంభావనవడి' యని పేరు.

7. కురువక మన నేలతాటికూకటియగాను ఇందు 'సూ'చర్ష మెట్లువచ్చినదో అనిశంక.

ఇది వ్రాయసకాని పొరపాటు.

కురువక మన నేంతాటికూకటియునునా.

తెలుగున నానార్థ నిఘంటువుల సంగతియే యెఱుగని లేఖాకర్త యిట్లు వ్రాయుట శోచనీయము.

1. నానార్థ నిఘంటువు అనుపేర నూఱు కంద పద్యములు శ్రీ ఓకుమళ్ల కామేశ్వరరావుగారు భారతి జనవరి 1957లో ప్రకటించి యున్నారు. (పుటలు 68 నుండి 76 వఱకు) ఇది పైడిపాటి లక్ష్మణకవి ప్రణీతము.

మార్చి భారతిలో శివయోగి గారిచ్చిన పద్యములేనియు నీ నిఘంటువులో లేవు. వీని రెండింటిని బరిశీలించితిని.

2. నానార్థ నిఘంటువు అనుపేర, నొక పద్య నిఘంటువు క్రీ. శ. 1950లో వావిళ్లవారు ప్రకటించిరి. ఇందు 128 పద్యములున్నవి. 126 కంధములు ఒక శార్దూలము, రెండు పాదములుగల గీతపద్యములున్నవి. ఇందున్న పద్యము లను నీ అముద్రిత నిఘంటు పద్యములతో సరిపోల్చి చూచితిని. 'భారతి'లో నిచ్చిన పద్యము లిందునులేవు.

3. వీని యన్నింటికన్న మిన్నగా నేడొక నానార్థ నిఘంటువు, బృహత్స్వరూపముతో వెలువడినది. 'జయరామ నిఘంటువు''అని దానిపేరు. ఇందున్న వన్నియు కందపద్యములే ! అవియున్ని అన్నికావు. 10025 పదివేల యిరువదియైదు కందములు— ఈ ఆ ముద్రిత మహా నిఘంటు వింకను ముద్రణ భాగ్యమునందలేదు. దీనియందును ''శివయోగి'' గారు చూపిన పద్యములులేవు ! దీనినిబట్టి ఆనిఘంటువున నున్న 294 పద్యములను మనము జాగరూకతతో పరిశీలింప వలెనని తోచుచున్నది.

వాస్తవికస్థితి యిట్లుండగా లేఖాకర్త యిట్టి లేఖలు వ్రాయుట యసంగతము.

—నిడుదవోలు వేంకట రావు.

---

1. 'భారతి'లో ముద్రితమైన నిఘంటువున ఈ చరణంలో గణాలు సరిపోలేదు. యతిలేదు'' (పుట 70)—గణ విభజనకు సరిపోదు (72 పుట)— ఛందస్సు సరిగాలేదు. (76 పుట)—అని యందలి దోషములు సూచితములైనవి. వావిళ్ల ముద్రణ నిఘంటువులో—

'హేమంబన నుదయకాలముమ్మెత్త యగున్ 127 పద్యము.

నిత్యాది యతిభ్రంశములు కలవు.

ఇట్టి సందర్భములను బట్టి— కొన్ని చోట్ల యతి విపర్యాసములున్నను నవి పాటింపదగినవికావని స్పష్టమగుచున్నది.

ఆర్యా !

తిక్కన ప్రయోగ విశేషములు

తిక్కనగారి ప్రయోగ వైశిష్ట్యమును, భాషారాధన ప్రియులగు పిన్నలకు పరిచయ మొనర్పఁ దలచి శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు ఏప్రిల్ 1963 భారతిలో కొన్ని విశేషము లుగ్గడించినారు. వారి ప్రయత్నమున కమందానందము. కాని కొన్నింట వారి ''విశేషములు'' అనవసరములుగాఁ దోఁచుటచే పాఠకులు వాటినిఁ బరిశీలింప మనవి.

''కొడుకులు సేయు భక్తికట కోటిమడుంగులు
భక్తినాకు నెప్పుడుఁ దగఁ జేయుచుండు''
(ఉద్యో—3—187)

దీనిలోని ''అట'' ప్రయోగ వైశిష్ట్యము నుగ్గడించుచు ''భక్తి— చేయుచుండును = నన్ను సేవించుచుండును, అని యర్థము. భక్తిసేయు = సేవించు (శబ్దపల్లవ క్రియ) అని శ్రీ శాస్త్రిగారు వ్రాసినారు. ఈ విధముగ భావించుట అనుచితమనిన్నీ, అట్టిభావము శబ్దపల్లవ క్రియా దోషానపేక్ష చేతనే సిద్ధించునని నా విన్నపము.

దీనికి మూలము:—

''సర్వేః పుత్రైః ప్రియతరా ద్రౌపదీమే జనార్దన'
(89—44)

ఈ శ్లోకార్థమునే నిర్వచించి, పుత్ర ప్రియతరగా ద్రౌపది యెట్లయ్యెనో, ''భక్తి నాకు నెప్పుడుఁ దగఁ జేయుచుండు'' అన్నదానిలో విశదీకరించినారు తిక్కయజ్వ. కొడుకులు చేయుభక్తికి కోటిరెట్లు భక్తి నాకెప్పుడును తగినట్లు చేయుచుండునని యర్థము సుసంగత మగుచుండ ''శబ్ద పల్లవము''గా దానిని పేర్కొనుట అనవసరము. అదియుగాక శ్రీ శాస్త్రిగారు నాకు శబ్దపల్లవ స్వరూప స్వభావమును గూర్చి సమగ్రస్వరూపవణ చేయుచు 1963 ఫిబ్రవరి భారతిలో కొన్ని యుదాహరణములు సూచించారు.

''ఇతర క్షితీశ సాధారణబుద్ధి''
''ఐదు వదిచేయు''
''ఎకటి చెప్పుచేయు''
''మించి చేయదె నల్లమెకతప్పు''

వీటివలె ''భక్తి నాకు నెప్పుడుఁ దగఁ జేయుచుండు'' ననునది యున్నదా ? ''శబ్ద పల్లవక్రియలలో నరసున్నలు ద్రుతకార్యములుండవని శ్రీ దీపాలవారి తీర్పు.'' అట్టిచో ''జేయు'' తప్పుగదా ! అంతేగాని నాకున్+ఎప్పుడున్+తగన్ అను మూడు వ్యస్త పదముల వ్యవధానము కలదుగదా ! సందర్భమును బట్టి ''సేవించు'' అనునది లభించుచుండగా శబ్దపల్లవ ప్రసక్తి అనవసరమని నా తలంపు. అదియుగాక మధ్య పదములు సమాసఘటితములు కాకపోవుట మరియొక విశేషము. విశిష్ట ప్రయోగముగా సంగీకరించిన సరిపోవుచుండగా శబ్దపల్లవ విచార మెందులకు ? ఆదే వ్యాసమున శ్రీ శాస్త్రిగారే ''పుప్పట్టునిచ్చు'' అను శబ్దపల్లవ క్రియ నుదహరించిరి. దానింబట్టియైన శ్రీ శాస్త్రిగారు పొరబడి రనుమాట నిర్వివాదము.

ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు
(నూజివీడు).

ఆర్యా!


ఏప్రిల్‌నెల ''భారతి''ని చూచితిని. ''మహా వ్యాసకర్తలు''లో నేను జన్మించిన సంవత్సరము 1819 గ (1891 కి బదులు)వేసి నన్ను 144 సంవత్సరాల వమారమి వయస్సు వానినిగా రిజిస్టరు చేయించినది. తథాస్తు, చిరంజీవినై అందరిని ఆశీర్వదిస్తుంటాను.

—దువ్వూరి జగన్నాథశర్మ,
రామచంద్రపురం.

గ మ ని క

కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి పొందినవారిలో తమది నామసామ్యమేకాని, తాము కాదని ''భారత విజయము'' నాటక కర్తలు శ్రీ బులుసు వెంకటేశ్వరులు. విద్వాన్, ఎం. ఎ. గారు తెలుపుచున్నారు. —భా. సం.]

చ. తిరుమలలో ప్రభాత విధిఁ దీఱిచి, నీలగిరిన్ భుజించ్చి, కే
నరగిరి చందనంబలఁది, చల్లని దాహము మంగళాద్రిలో
గురురుచి ద్రావి, రంగపురి కోమలితో పవళించునట్టి యా
నరసునిఁ జేర నీవు మనసా ! హరిపాదము లాశ్రయింపుమా !



మహంత్ ఘాసీదాస్ స్మారకసంగ్రహాలయములోని శాసనం ప్రతి.

అన్నమదేవుడు ప్రతాపరుద్రుని తమ్ముడా?

శ్రీ సుందరలాల్ త్రిపాఠి

నేటివరకు చరిత్రలో నిరూపింపబడిన విషయములను తారు మారు చేయగల ఒక తామ్రశాసనము రాయపూరు నందలి మహంత్‌ఘాసీదాస్ స్మారక సంగ్రహాలయములో కలదు. బస్తరు జిల్లాలోని ఘరియా పండాలులేక పాథీ బ్రాహ్మణులనబడువారివద్దనుండి ఆ తామ్రశాసనము సేకరింపబడినది. రెండు ముక్కలుగానున్న ఆ శాసనము వెడల్పు 30.8 సెం. మీ. పొడవు 17.7 సెం. మీ. బరువు 395 గ్రాములు. రాజముద్రగల భాగము పూర్తిగా లేకపోయినను శాసనము నందలి లిపి, విషయము స్పష్టముగా ఉన్నవి. తామ్ర శాసనము పై భాగము కుడివైపున, క్రిందభాగము రెండు వైపుల చెడి యున్నది. కాని మూల భాగము సురక్షితముగా ఉన్నది. పైవైపు కుడి భాగమున అర్ధచంద్రుడు, తరువాత రాజముద్రగల అరచేయి కలదు. రాజచిహ్నము పూర్తిగా లేదు. కాని ఆ సంగ్రహాలయములోనేకల భైరవదేవుని తామ్ర శాసన సహాయమున దానిని గుర్తింపవచ్చును.

ఆ రాజముద్రలో ఈ క్రింది పంక్తులు చెక్కబడి యున్నవి. "(స్వస్తి శ్రీ బస్) తర మహానగరే శుభస్థానే మహా రాజా (ప్రౌఢ ప్రతాప చక్రవర్తి)

(శ్రీరా) జపాలదేవ (మహారాజా 'గోసాయీ) శ్రీమాన్ కే (సరీ)"

రాజముద్ర మధ్యభాగములో సింహము చెక్కబడి యున్నది.

శాసనములో ఒక వైపున 6 పంక్తులు ఉన్నవి. వానిలో మొదటి మూడు పంక్తులు ఒరియా భాషలోను, మిగతావి హిందీ భాషలోను ఉన్నవి.

1. శ్రీ జగన్నాథ శ్రీ బలభద్ర శ్రీ సుభద్రా సహిత ఎహికింతి నిమిత్యక్ ఎహిసాక్షి శ్రీ రక్షపాల దేవ రాజా చాలకీవంశ రాజ్య పరి
2. యంతే నపాలహండి బ్రహ్మపురా ఘర్ తీనిసయే జయంతే దండ్ నాహి మలేము ఆలి నాహి శరణే మాడ్‌నహి ఏ బోల్ జేనపాల—
3. ఈ తాహర్ సుఅర్ మా గధాబాప్ ఏ బోల్‌కే చంద్రసూర్య అష్టలోకపాల్ ధర్మరాజ్ సాక్షి, వారి ఘరే మేలియా బాంచే"
4. జబ్‌లై శ్రీ చాలకీ వంశ రాజాతబ్‌లై బ్రహ్మ పురా ఛాడనే నాహి ఏబోల్ ఛాడికై సపానలావడి ఆజాయి.
5. తో సుఅర్‌మాయి బాప్‌గాదహ్ అష్టలోకపాల్ ధర్మ రాజ్ సాక్షి వసాల్ సూర్యరవాన్‌కూవ్‌ధా
6. మచ్చతే జహీంకార్ ఎహిరేఖా

ఒరియా హిందీ భాషలలో వ్రాయుటచే రక్షపాల దేవుడు లేక రాజపాలదేవుడను రాజును మరియు ఘరియా బ్రాహ్మణులు తమ తమ భాషలలో ఈ శాసనమును అర్థము చేసుకోగలిగి యుండిరని సూచింపబడుచున్నది. శాసనముయొక్క ముఖ్యార్థము: రాజపాలుని ద్వారా 300 ఘరియా బ్రాహ్మణులకు బ్రహ్మ పురములో నివసించు షరతుపై కొన్ని సౌకర్యములు కలుగ జేయబడినవి. రాజు జగన్నాథ, బలభద్ర, సుభద్రాదులను సాక్షులుగా, తమ చాలకీ వంశీయులు పరిపాలించినంత పర్యంతము 'పాటలా హాండి' నుండి వచ్చి బ్రహ్మపురములో నివాసమేర్పరచుకున్న బ్రాహ్మణుల సంపత్తికి ఎట్టి ముప్పు కలుగదనియు, వారి కెట్టివిధమైన రాజదండన ఉండదని అభయ మిచ్చినాడు. ఈ షరతును తిరస్కరించిన రాజ వంశీయులు సూకర, గార్ధభ సంతానము అగుదురు. చంద్రుడు, సూర్యుడు, అష్టలోకపాలురు, ధర్మరాజు ఈ సంధికి సాక్షులు. పై భావముగల భాగము ఒరియా భాషలో ఉన్నది. బ్రాహ్మణులును, బస్తరులో చాలకీ వంశరాజ్యము ఉన్నంతవరకు, బ్రహ్మపురమును విడువరనియు, విడిచినవారు సూకర, గార్ధభ సంతానము అగుదురనియు శపథము చేసిరి. అష్టలోకపాలురు, ధర్మరాజు దీనికి సాక్షులు. ఈభాగము హిందీభాషలో ఉన్నది.

ఈ శాసనము ఎప్పుడు వ్రాయబడినదో తెలియుటలేదు. బస్తరుకు వచ్చిన రాజవంశములోని మొదటి రాజు అన్నమదేవుడు. ఆతని వంశ పరంపరలోని వాడగు దిక్పాలదేవుని రాణి చందేలువంశ సంజాతయగు అజబ్‌కుమారి. వారి పుత్రుడు రక్షపాలదేవుడు లేక రాజపాలదేవుడు. అతడే ఈ శాసనము వ్రాయించినవాడు. దంత్యేవాడలోని దంత్యేశ్వరి ఆలయములోని దిక్పాలదేవుని సంస్కృత హిందీ మిశ్రమగు శిలా శాసనములో విక్రమ శకము 1760 అనగా క్రీ. శ. 1703 అని

ఉన్నది. దానిలో యువరాజగు రక్షపాలదేవుడు, నవరంగపురమును గెల్చినట్లును, ఒరిస్సారాజాకు మరల రాజ్యమును తిరిగి ఇచ్చివేసినట్లును, జగన్నాథుని విగ్రహమును తన రాజ్యమునకు తెచ్చినట్లును కలదు. ఆ జైత్ర యాత్రానంతరము, దిక్పాలదేవుడు సకుటుంబముగా దంతేవాడకు వచ్చెను. ఈ యాత్ర వి. శ. 1760 చైత్ర శుద్ధ చతుర్దశినాడు ప్రారంభమై, బహుశ తదియనాడు ముగిసెను. ఆ సమయమున కొన్ని వేల దున్నపోతులను, మేకలను బలి యిచ్చుటచే శంఖినీ నదీ ప్రవాహము 5 రోజులవరకు కుంకుమ వర్ణమును పొందెనట.

కావున వి. శ. 1760 ప్రాంతమున రక్షపాలదేవుడు యువావస్థలోనుండి యుండవలెను.

హలుస ప్రాంతముగు ఒరిస్సానుండి వచ్చిన బ్రాహ్మణులు బస్తరు జిల్లాలో చాలకాలమునుండి నివసించుచున్నారు. తామ్ర శాసనమువలన రాజపాలదేవుని రాజ్యకాలములో 300 బ్రాహ్మణ కుటుంబములు, ఒరిస్సా సరిహద్దులోని పాసలా హాండీ గ్రామమునుండి బస్తరువచ్చి బ్రహ్మపురమునందు నివాస మేర్పరచుకొన్న విషయము విదితమగుచున్నది. ఇప్పటికిని బస్తరులో ఒరియా బ్రాహ్మణుల సంఖ్య హెచ్చుగా గలదు. 'బ్రహ్మపురము' బ్రాహ్మణ 'పారా' (గ్రామము) నుండి వచ్చి యుండవచ్చును. ఈ బ్రాహ్మణులలో అనూచానంగా వస్తున్న కథానుసారంగా, ఒరిస్సారాజు అత్యాచారముల బారినుండి వారిని విముక్తులజేసి, రాజపాలదేవుడు బస్తరులో గౌరవ పురస్సరముగా ఉండుటకు ఏర్పాట్లు జేసెను.

బ్రిటిషు శాసన కాలములో బస్తరు రాజవంశపు చరిత్ర సేకరించుటకై యత్నములు జరిగినవి. రెసిడెంటుగానున్న డబ్ల్యూ. వి. గ్రియర్సను అను ఆంగ్లేయుడు ఫారెస్టు డిపార్టుమెంటు ఆఫీసరగు ఖాన్ సాహెబు డాబరును ఇందులకై నియోగించెను. డాబరు నిరంతర పరిశ్రమ గావించి సేకరించిన సామగ్రి బస్తరు కలెక్టరు ఆఫీసులో ఉన్నది. అందు రాజు చాలకీ వంశస్థుడని చెప్పు ఒక పుక్కిటి కథ కూడ కలదు.—"రక్ష పాలదేవుని కాలములో ముస్లిములు రాజ్యముపై దండెత్తి వచ్చిరి. ఆ సమయములో గర్భవతియగు రాణి ఒకానొక చాలుక్య బ్రాహ్మణుని ఆశ్రయించెను. అక్కడ జయపాలదేవుడు లేక దలపతదేవుడు జన్మించెను. "ఇంకొక రూపమున ఈ కథ ఇట్లు కలదు:—"చాలకీ వంశపు ఆ రాణి విపత్కాలమున ఒక బ్రాహ్మణుని ఇంట తలదాచుకొనెను. దండెత్తిన ముస్లిమురాజా ఆ సంగతి గ్రహించి, ఆ బ్రాహ్మణుని ఇంటికి వెళ్ళగా, అతను రాణిని తమ కుటుంబమునకు చెందినదని బొంకెను. వారి బలవంతమున ఆ బ్రాహ్మణుడు ఆమె చేతి భోజనము తినవలసి వచ్చెను. నాటినుండి ఆ బ్రాహ్మణ కుటుంబము కూడా రాజవంశములో చేర్చుకొనబడెను. "అరచేతి భోజనము"ను గ్రహించుటచే చాళుక్యులైరని తాత్పర్యము. ఈ రెండు కథలును ఆధార రహితములైనవి. ఈ కట్టు కథలకు చారిత్రిక సత్యములతో ప్రయోజనములేదు. ఈ సందర్భములో ఒక చారిత్రక విషయమును గురించి చెప్పవలెను. మహమ్మదు ఖాసిం ఫరిష్త తన చారిత్రిక గ్రంథములో ఇట్లు వ్రాసెను: "క్రీ. శ. 1610 లో బస్తరురాజగు 'పురతాబ్‌సా' (ప్రతాపరాజా) తన రాజ్యమునకు వెలుపలగల ఇస్లాము రాజ్యముపై దండెత్తెను. దానిపై కుతుబ్ షా తన సామంతుడగు గొండురాజా అసీరావును ప్రతాపుని ఎదుర్కొనుటకై పంపెను. అసీరావు సందేశముపై మహమ్మదు అమీన్ అను నాతడు గొప్ప సైన్యముతో బస్తరు వచ్చెను. కాని భీషణ వర్షాపాతము వలనను, ఆహార సామగ్రుల లోపమువలనను అతడు తిరిగి పోవలసి వచ్చెను. "ఈ కథ ఆధారముగా గ్రియర్సను" మాడియా గోండ్స్ ఆవ్ బస్తరు' అను తన గ్రంథములో పురతాబ్ సాను ప్రతాపదేవునిగా గ్రహించెను. కాని వంశక్రమమును పరిశీలించిన బస్తరు రాజవంశములో పై పేరుగల వ్యక్తి లేడు. ఫరిష్త గ్రంథములో తప్ప మరెచ్చటను ఈ ఉదంతము ఉటకించబడలేదు.

కుతుబ్‌షా దండయాత్ర ఆధారముగా పై కట్టుకథలు ఏర్పడెనని వూహించుట సత్యదూరముకాదు. రాజవంశములను గురించి ఇట్టి పుక్కిటి కథలకు లెక్కలేదు.

1. తామ్రశాసన శీర్ష భాగములో రాజపాలదేవుని పేరునకు ముందుగా 'ప్రౌఢ ప్రతాప చక్రవర్తి' అను బిరుదుపయోగింపబడినది. ఈ బిరుదును చూడగానే సంగమరాజ వంశీయుడైన విజయనగర రాజగు ప్రౌఢ ప్రతాప దేవరాయని పేరు స్ఫురించును. బహుశ ఈ బిరుదు సంగమ వంశీయుల అనుకరణ మాత్రమేమో? భైరవుదేవుని శిలా శాసనములో కూడ ఇది ప్రయుక్తమైనది.

2. 'రాజపాల దేవమహారాజు' అను పదము తరువాత 'గోసాంయీ' అను విశేషణము ప్రయుక్తమైనది. ఈ విశేషణము లేక బిరుదమునకు జితేంద్రియుడని అర్థము. ఈ బిరుదము సాధారణముగా వైష్ణవుల కుపయోగించుటచే, ఈ రాజు వైష్ణవ సంప్రదాయము వాడని గూడ ఊహింపవచ్చును. సంగమ వంశరాజులు రామకథాకథకులను సువర్ణ రత్నాదులతో బహూకరించినట్లు నిదర్శనములు కలవు. సంగమ వంశరాజగు విరూపాక్షుడు ఎట్టూరు నృసింహాచార్యుని రామకథ విని, అతనిని సమ్మానించినట్లు తెలియుచున్నది......అయితే రాజపాలదేవుడు, అతని పూర్వజుడగు అన్నమదేవుడు సంగమ వంశ సంబంధీకులా?

అన్నమదేవుడు ప్రతాపరుద్రుని తమ్ముడా ?

3. తామ్రశాసనములో చంద్రాకృతిగల త్రికోణములో "(శ్రీ)మాన్ కే (సరీ)" చెక్కబడియున్నది. శక్తిదేవతకు ప్రతి మూర్తియగు శ్రీ మాణిక్యేశ్వరి ఛిందకనాగ వంశీయులకు ఇష్ట దేవత. బస్తరు రాజవంశీయులకు ఇష్టదేవత కూడ శక్తిమాతయగు దంతేశ్వరియే. కావున మాణిక్యేశ్వరియొక్క అపభ్రష్టరూపమే 'శ్రీమాన్ కేసరి' కాగలదు. అదే అర్థములో ఆ పదము ప్రయోగింపబడియుండవచ్చును.

4. దుర్గాశక్తి వాహనమైన సింహము కూడ చెక్కబడి యున్నది.

5. అర్థ చంద్రచిహ్నము ఈ రాజవంశము చంద్ర వంశమని తెల్పుచున్నది.

6. కరతల (చులుక) చిహ్నము చాలుక్య వంశ జన్మ కథను గుర్తుకు దెచ్చుచున్నది. శాసనము రక్షపాలదేవుని చాలకీ వంశస్థునిగా చెప్పుచున్నదిగదా! ఈ 'చాలకీ' పదము 'చాలుక్య'కు అపభ్రష్ట రూపము.

చారిత్రికులు రక్షపాలదేవుని లేక రాజపాలదేవుని పూర్వీకుడైన అన్నమదేవుడు ఓరుగల్లునుండి బస్తరు వచ్చినాడనియు అన్నమదేవుడు ప్రతాపరుద్రదేవుని సోదరుడనియు నిరూపించియున్నారు. (చూ. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము3 పే. 226) కాని వీరి సహోదరత్వము యధార్థముగా కానిపించుటలేదు. ఎందులకనగా:

1. కాకతీయ ప్రతాపరుద్రదేవుని శిలా శాసనములనేకములు. వానిలో ఆతని రాజ్యకాలమునందలిదగు బూరుగగుడ్డయందలి అన్నమనాయనింగారు వేయించిన శిలా శాసనమొకటి. ఈ అన్నమనాయని తండ్రిపేరు అనభీమనాయడు. బస్తరు తర్లి వెళ్ళి రాజ్యము స్థాపించి అన్నమరాజు కాకతీయ ప్రతాపరుద్రుని సహోదరుడని చెప్పబడుచున్నదికదా! శిలా శాసనము వేయించిన అన్నమనాయని తండ్రిపేరు అనభీమనాయడు. ప్రతాపరుద్రుని నాటి శిలా శాసనములలోకాని, మరి యే ఆధారముకాని (నాకు తెలిసినంతమటుకు) ఈ బాంధవ్యమును నిరూపించునది కానిపించుటలేదు.

2. కాకతీయ ప్రతాపరుద్రుడు చతుర్థ వర్ణసంజాతుడు. అన్నమరాజు చతుర్థ వర్ణజు డనుటకు ప్రమాణములేదు.

3. చేబ్రోలులో లభించిన శిలాశాసనము కాకతీయ ప్రతాప రుద్రదేవుడు ఇక్ష్వాకు వంశ జాతుడనియు తెలుపుచున్నది. దంతెవాడలోని శిలాశాసనము అన్నమరాజు పాండుకులోత్పన్నుడని తెలుపుచున్నది.

4. ప్రతాపరుద్రుని అస్తమయము పదునాలుగవ శతాబ్దపు ప్రథమ భాగములో జరిగినది. దంతెవాడలోని దిక్పాలదేవుని శిలా శాసనము క్రీ. శ. 1703 నాటిది. ఇద్దరి మధ్య దాదాపు 400 సం. ల భేదము కలదు. కావున ఈ మధ్య కాలములో 15—16 రాజులుండి యుండవలెను. కాని అన్నమరాజుతో సంబంధించిన దిక్పాల దేవుడు బస్తరు రాజ వంశములో 10 వ వాడు. కావున అన్నమరాజు ప్రతాపరుద్రునికి నూరు సంవత్సరముల తరువాతవాడు కనుక అతను కాకతీయుడు కాజాలడు.

సంగమవంశ రాజులలో రెండవ దేవరాయలు లేక ప్రౌఢ ప్రతాప దేవ రాయల కాలములో అన్నమరాజు అను పేరిట శిలాశాసనములు, తామ్రపట్టములు లభించుచున్నవి. అనెగొందికి హస్తినావతి, హస్తినాపురి, కుంజరకోణము, కుంజరకోణవతి మొదలగు పేర్లు లభించుచున్నవి. బస్తరు రాజ వంశమునకు పాండువంశముతో సంబంధము పైన సూచింపబడినది.

సంగమ వంశీయులు యాదవులని ప్రసిద్ధమైనను, వారి సంస్కృతి, స్థాపత్య, భాస్కర్యాదులు చాళుక్య శైలికి సంబంధించినవే. బస్తరు రాజవంశము చాళుక్య వంశమే. ప్రస్తుత బస్తరు మహారాజు, వారి తాత ముత్తాతలు చౌహాను వంశీయులమని చెప్పుకొనుచున్నారు. చౌహాను, చాళుక్య శబ్దములకు మూల మొకటియై యుండవచ్చును.


ఓరుగల్లు చక్రవర్తియైన ప్రతాపరుద్రదేవుని సోదరుడుగా ప్రసిద్ధి చెందిన అన్నమ దేవరాజు కాకతీయుడుకాక, విజయనగర సంగమ వంశీయుల సంబంధీకుడుగా నిరూపించుటకు హేతుభూతమైన పై తామ్రశాసనము, చారిత్రిక పరిశోధకులకు ఒక క్రొత్త పుంతను చూపుచున్నది. పరిశోధకులు దీనిని గమనింతురుగాక. [వరంగల్ ప్రభుత్వ కళాశాల హిందీ అధ్యాపకులు శ్రీ భీమసేన నిర్మల్‌గారు ఈ వ్యాసమును హిందీనుండి తెలుగు చేశారు.]

శా. వేధం దిట్టఁగ రాదుగాని భువిలో విద్వాంసులం జేయనే
లా, ధీచాతురిఁ జేసి జేసిన గులామాపాటునన్ పోక క్షు
ద్బాధాదుల్ కలిగింపనేల, యదికృత్యంబైన దుర్మార్గులన్
ఛీ, ధాత్రీశులఁ జేయనేఁటి కకటా శ్రీ కాళహస్తీశ్వరా !

మీరు చేసేపని ఏదైనా...

దానిని మీరు భారతదేశాభివృద్ధికి చేస్తున్నారన్నమాట

మీరు, మీ జీవితం, మీరు చేసే పనీ – భారత దేశం పటిష్ఠం కావడానికి, సమర్థతను పెంపొందించుకొనడములో భారతావని నేడు చేస్తున్న ప్రయత్నములో ఒక భాగమే. అసమర్థతకీ, సరిపెట్టుకొని ఊరుకొనడానికి ఇది తరుణముకాదు. మీరు ఏ పనిని చేస్తున్నా సమర్థతతో చేయండి. పని నిలిచిపోవడం, మందగించడం మచ్చుకైనా కనపడరాదు. కృతనిశ్చయులైన మీవంటి లక్షలాది వ్యక్తుల కృషి ఫలితముగానే విజయం సాధించబడుతుంది.



ఇతోధికమైన ఉత్పత్తికీ, పటిష్ఠమైన దేశరక్షణ శక్తికీ

కృతనిశ్చయముతో పనిచేయండి

DA 62/F9

బ్రౌను స్వీయ చరిత్ర

నా తండ్రి డేవిడు బ్రౌను కొంతకాలము కలకత్తాలో క్రైస్తవ కళాశాలకు అధిపతిగా ఉండేవాడు. అప్పటిలో ప్రసిద్ధ మతాచార్యులైన బుకనన్, థాంప్సన్, మార్టిన్, క్యారీ, మార్ష్‌మన్, వార్డు మొదలగు వారందరికీ స్నేహపాత్రుడైనాడు. "హిందూదేశపు క్రైస్తవమత చరిత్ర" అనే గ్రంథమందే కాక నా తల్లి ప్రకటించిన జ్ఞాపక చిత్రణలలోనూ, నా తండ్రిని గూర్చిన ప్రశంసలు పేర్కొనబడినాయి. మా తల్లిదండ్రులకు నేను, మా అన్న, మా తమ్ముడు తప్ప మరి పిల్లలు లేరు. మా తండ్రి మా యిద్దరికీ పెద్ద పెద్ద చదువులు చెప్పించాలని అభిలాష పడ్డాడు. ఇంగ్లీషు అక్షరాలు, చదవడం వ్రాయడం అయిన తరువాత, హీబ్రూ, సిరియను, అరబ్బీ, పారసీ, గ్రీకు, లాటిను భాషలు కొంచెము కొంచెముగా ప్రారంభించేము. కలకత్తా పరిసరాలలో అప్పుడు 'హిందూస్థానీ దేశభాషగా ఉండేది. ఆ భాషను నేను బాగోబహార్ (గులేబకావళి) అనే కథల పుస్తకం ద్వారా నేర్చుకొన్నాను. నా చిన్నతనంలో నిత్య వ్యవహారానికే కాకుండా ఇంగ్లీషులో గొప్ప రచనలను చదవవలెనని నా తండ్రి కోరిక. అప్పటి నా యింగ్లీషు చదువును గురించి నా తండ్రి వ్రాసిన వాక్యాలనే ఉదహరిస్తున్నాను.

"నా రెండో కుమారుడు (బ్రౌను) పేరడైజులాస్టు, డ్రైడను, వర్జిలు—వీనిని చదివి వాటి సారమును అవగాహన చేసికొన్నాడు. కౌపరు వ్రాసిన హోమరు కావ్యాన్ని చదువుతున్నాడు." కాని నేను మరుసటి సంవత్సరమందే స్కాటు రచించిన "లే మార్మియాన్" అనే కావ్యాలను (అవి అప్పుడే క్రొత్తగా ప్రకటితమైనవి) చదివి ఆనందించేను. ఇవేకాక, మూరు, బైరను అను నిద్దరు కవుల రచనలను చవిచూసేను. అయితే యిట్టి ఊహాకల్పితమైన సాహిత్యం నా అభిరుచి కెంతమాత్రం సరిపోలేదు. నా తండ్రి 'షేక్‌స్పియర్' నాటకాలని మాత్రము నన్ను చదవనీయలేదు. పదహారేళ్లు వచ్చేవరకు నాకు ప్రోస్పిరో, టిటానియా, ఒథెల్లో—అనేవి యేవో తెలియవు.

నా బాల్యంలో జరిగిన ఒకటి రెండు సన్నివేశాలుదాహరింప దగినవి ఉన్నాయి. చిన్నప్పటినుంచీ నాకు తప్పొప్పుల పట్టికలను తయారు చేయడము, గ్రంథాలలో చెడిపోయిన భాగాలను పూరించడము అంటే మహా సరదాగా ఉండేది. గ్రంథాలలో ఇతరులకు శుష్కప్రశ్నలుగా, రసహీనంగా ఉండే భోగట్టాలు, ఘట్టాలు నా కెంతో మనోహరంగా కనిపించేవి. అయితే వాటియందే నిమగ్నుడనై ఉండక పుస్తకాలు విధి విరామం లేకుండా చదువుతూ ఉండేవాడను.

నా పధ్నాలుగోయేట 1812 లో మా తండ్రి చనిపోయినాడు. నన్ను ఇంగ్లండుకు తీసికొనివెళ్లి అచ్చట "మదరాసు సివిలు సర్వీసు" పరీక్షకు నన్ను కూర్చోబెట్టినారు. సివిలు సర్వీసు విధానాన్ని నేర్పడానికి ఆ కాలములో లండనులో ఒక ప్రత్యేక కళాశాల ఉన్నది. నేనా కళాశాలలో రెండేండ్లు చదివేను. హిందూస్థానీ భాషా ప్రవీణతకు ఒక బహుమతిని పొందాను. నే నక్కడ గ్రహించినది కొంచెమే. అయినా నేర్చుకున్న విషయాలను జాగరూకతతో నోటుపుస్తకములలో వ్రాసుకొనెడివాడను. కాలేజీ విడిచిపెట్టగానే అక్కడ యువక సంఘములో చేరేను. కాని కాలము మాత్రము వ్యర్థము చేయలేదు. ఈ సమయంలోనే నేను, లాటిను భాషలో గల వర్జిలు, హొరేసు, జ్యూవినల్, లూక్రిషియస్, ఓవిడు, ప్లాటసు మొదలగువానియందే కాక గ్రీకుభాషలోను విద్వత్తు సంపాదించేనంటే, అది అంతా నా స్వయంకృషి అనే చెప్పాలి. నాకు గురువులంటూ వేరే లేరు. పుస్తకాలే గురువులు. ఆనాటికి 'తెలుగు' అనే మాట నేను వినలేదు.

మా యిద్దరన్నదమ్ములకు బెంగాలు సివిలు సర్వీసులోను నాకు మదరాసు సివిలు సర్వీసులోను ఉద్యోగము లైనందున నేను 1817 ఆగస్టు 4 వ తేదీని మదరాసులో ప్రథమంగా అడుగు పెట్టేను. ఓడ దిగిన దగ్గరనుండి నన్ను తెలుగు చదవవలసినదిగా ఆజ్ఞాపించేరు. అసంపూర్ణమైన ఒక వ్యాకరణాన్ని అభ్యాసము కొఱకు పనికిమాలిన రెండు పాఠ్య పుస్తకాలని నా కిచ్చినారు. ఒక నిఘంటువు కూడా లేదు. ఇంగ్లీషు తెలిసిన బ్రాహ్మణులు నాకు ఉపాధ్యాయులు. వారి ఇంగ్లీషుకి వ్యాకరణ పరిజ్ఞానము చాలా తక్కువ.

అప్పుడు మద్రాసులో నా పేరు గలవా రొక రిద్దరు ఉండేవారు. వారిలో విలియమ్ బ్రౌను (కొచ్చిన్) అనే ఆయన ఒకడు. ఇతడు క్రీ. శ. 1837 లో చనిపోయినాడు. 1818 లో అతడు చిన్న పదకోశమును చిన్న వ్యాకరణమును ప్రకటించినాడు. నే నాతనిని కలుసుకున్నప్పుడు తెలుగును గూర్చి యీవిధంగా చెప్పేడు.

"తెలుగుభాషను గింటూ భాష అంటారు. దీనికి వాఙ్మయము అంటూ ఏమీలేదు." అతని మాటలవల్ల నాకు నిరుత్సాహ మెంతమాత్రం కలగలేదు సరికదా, తెలుగును గూర్చి తెలుసుకుందామనే అభిలాష అత్యుత్కటం అయింది. కొంత తెలుగులో పరిజ్ఞానం సంపాదించిన తరువాత ఇంకా చదువుదామంటే మహారాష్ట్రభాష—మరాటీ భాష, ఉద్యోగరీతిగా నేర్చుకోవలసి వచ్చింది. అది అయిన తరువాత, నాకు జ్ఞానార్జన పిపాస దినదినమూ హెచ్చు కాజొచ్చినది. 'కాలేజీ లైబ్ర

రీలో ఉన్న గ్రీకు, హిందూ, పురాణేతిహాసములను గూర్చి సర్ విలియము జోన్సు వ్రాసిన గ్రంథములను, వ్యాసాలను, తదేకధ్యానంతో పఠిస్తూ ఉండేవాడను. వానియందెంత మమత అంటే నేనొక్కొక్కప్పుడు నాకు నియతమైన ఉద్యోగ ధర్మము కూడా నిర్వహించకుండా ఉండేవాడనని చెపితే సరిపోతుంది. కాని యీ చదువువల్ల నాకొక మంచి కలిగింది. ఆయా మత సాంఘిక సిద్ధాంతాలు, వితండవాదాలు నాకెంత మాత్రము నచ్చలేదు. కొన్ని క్లిష్ట సమస్యలను పరిష్కరిద్దామనే ఉత్సాహము కూడా నాకు పోయినది. వీటిని గూర్చి ఆలోచిస్తూ ఉండడమెటువంటిదంటే ఆకాశంలో మేఘాలు, కొన్ని కొన్ని ఆకారాలతో మనకు కనిపిస్తూ వెంటనే అవి అంతర్థానమైన వానిని గూర్చి చర్చించడం వంటిది. ఇట్టి ఊహాప్రపంచం వదలి సత్యము శాశ్వతమునైన పరిజ్ఞానము కలిగించే సాహిత్యం కొరకు నా జీవితం అంకితము చేయడానికి కృతనిశ్చయుడనైనాను.

కొంతకాలమైనవెనుక ఒక ఫ్రెంచి నవల నన్నాకర్షించినది. నాకు ఫ్రెంచి భాష రాదు. అయినా లాటిను భాషా పరిచయమున్నవాడనగుటచేత ఆ భాషను త్వరలో నేర్చుకున్నాను. నలభైయేండ్లయిన తరువాత ఫ్రెంచి తెలుగు నిఘంటు నిర్మాణంలో ఈ భాషాజ్ఞానమెంతో ఉపకరించింది.

షేక్స్పియరు, మిల్టను, కౌపరు, బర్న్సు, స్కాటు, బైరను, మూరు వీరి రచనలవల్ల నాకు కవిత్వ మబ్బినది. ఇంగ్లీషులో చాలాకాలము పద్యరచన చేసేను. కాని వాటిని నేను జాగ్రత్త పెట్టలేదు. సాహిత్యరచనలైన వెనుక, బేయిల్, గిబ్బను గార్ల ననుసరించి చారిత్రక—కాలనిర్ణయముల పరిశోధనకు ప్రారంభించేను. దానికొరకు ఎన్నో గ్రంథాలు కావలసి వచ్చినవి. అప్పుడు కొన్నవాటిలో "ఎన్సైక్లోపిడియా బ్రిటానికా" ఒకటి. ఇది నిరంతరము ప్రవహించే విజ్ఞాన వాహిని. ఈ కాలంలోనే బైబిలును, స్కాటు, ఆడము క్లార్కు వ్యాఖ్యానాలతో చదివితిని.

నా సహాధ్యాయులు చాలామంది కళాశాలలో బహుమతులు పొందిరి. కాని ఏ యొక్కరును భాషలలో ప్రావీణ్యమును సంపాదింపలేకపోయినారు. అందుకని వారియందు నాకు గౌరవం లేదు. కాని ప్రాచీన సాహిత్యమునందపారమైన అభిమానముండేది. ఒకప్పుడు తిరిగి ఆక్స్ఫర్డుకు ఎగిరిపోదామా అన్నంత అభిలాష కల్గింది.

మూడేండ్లు గడిచాయి. 1820 లో నా జీవితంలో మార్పు తెచ్చిన ఒక సంఘటన జరిగినది. అప్పుడే సర్ థామస్ మన్రో మదరాసు గవర్నరుగా వచ్చేరు. సివిలు సర్వీసులో నా గ్రేడు తక్కువగా నున్నందున పెద్ద హోదా నిచ్చే పరీక్షకు తక్కినవారితో నేను హాజరుకావలసి వచ్చినది. మన్రో సమక్షములో పరీక్ష జరిగినది. అతడధికారరీత్యా కొన్ని మాటలు చెప్పి దేశభాషలను ముఖ్యముగా మేము నేర్చుకోవలసిన యావశ్యకతను ఉద్బోధించేరు. ఆ ఉపన్యాసము 'ఆసియాటిక జర్నలు' అనే పత్రికలో ప్రచురితమైనది.

ఆయన మమ్ములను తెలుగువేలు జిల్లాలకు నియమించినారు. అందులో తెలుగు ప్రధానముగా మాట్లాడే కడప జిల్లాలో నన్ను వేసినారు. అయితే అక్కడ కన్నడ, మరాటీ, హిందూస్థానీ భాషలు వ్యవహారములో ఉన్నాయి. నా అధికారి "హన్బరీ" అను నాతడు తెలుగు ధారాళముగా మాటాడగలడు. నా కప్పటికి భాష వచ్చినా మాట్లాడ నేమురాదు. అతనితో పోటీపడి రెండేళ్లలో అతనితో సమానుడనైనాను.

ఇతర దేశీయులు 'తెలింగ' అని వాడు తెలుగు, లేక తెనుగుజాతి నివసించే ప్రదేశము యూరపు ఖండమున నున్న స్పెయిను దేశము కన్నా పెద్దది. ఇది మదరాసుకు ఉత్తరము పశ్చిమముగా వ్యాపించి యున్నది. కొన్ని యింగ్లీషు పుస్తకములలో తెలింగాణా లేక "గోల్కొండ" అని యిది పేర్కొనబడినది. ఇది పెద్ద మండలముగా విభాజ్యమై యున్నది. దేశపటము చూచిన కడప, రాజమండ్రి, కొండపల్లి ఇవి మదరాసు వరకు నున్నవి. ఉత్తరమున విశాఖపట్టణము నుండి గంజాము, కటకము, పూరి జగన్నాథము వరకు నిది వ్యాపించినది. 1858 సంవత్సరమున జనాభా 90 లక్షలు అని కొంతమంది 140 లక్షలని కొంతమంది చెప్పుచున్నారు. ముస్లిములీ ప్రాంతమున 20 లక్షల మంది యున్నారు. తెలుగు భాషలో ప్రాచీన సాహిత్యము, ఎనిమిది వందల ఏండ్ల నుండి కలదు. దానికిని ప్రస్తుత సాహిత్యమునకును, భాషలో భేదమంతగా కనుపడదు. తెలుగు వ్యాకరణము, ఛందస్సును—చాల క్లిష్టములై దుర్బోధ్యములుగా నుండును.

తీరిక సమయాలలో కడపలో నున్నపుడు గ్రీకు, హీబ్రూ, పారసీ చదివేవాడను. తెలుగింకా ప్రారంభించలేదు. కాని రాజకీయ వ్యవహార సంబంధమైన యుత్తర ప్రత్యుత్తరాలు, ఆజ్ఞా పత్రాలు మొదలైనవి తెలుగులోనే జరుగుతూ ఉండేవి. నేనే గుమాస్తాలను తెలుగు హెచ్చుగా ఉపయోగించేటట్లు చేసేడివాడను.

1822 సంవత్సరాంతమున నేను బందరులో సహాయ న్యాయాధిపతిగా నియమితుడనైనాను. అక్కడ తెలుగు తప్ప వేరు భాష ప్రచారములో లేదు. కాని అక్కడకూడా తెలుగు సాహిత్య దృష్టితో చదవలేదు. కోర్టు వ్యవహారములలో ఉన్న పదాలు, పదబంధాలు, స్థానిక పారిభాషిక పదాలు—మాత్రమే ఒక 'జ్ఞాపిక' యందు సంగ్రహించేవాడను. తీరిక సమయాలలో తిరిగి గ్రీకు, పారసీ, ల్యాటిను నాకు పాఠ్యగ్రంథాలు.

1823 నవంబరు పదవ తేదీకి నాకు ఇరవైయైదేళ్లు నిండినవి. 1824 లో నా యిరవై ఆరోయేట సక్రమముగా తెలుగు చదవడం ప్రారంభించేను. అప్పటికి నాకు తెలుగు బాగా వచ్చును. కాని తెలుగు కావ్యాలు మొదలు పెట్టలేదు. నావద్ద ఒక్క తెలుగు పుస్తకము కూడా లేదు. తెలుగు భాషలో నున్న కవుల పేళ్లు కూడా నాకు తెలియవు. అబీడూబియస్ వ్రాసిన "హిందువుల వృత్తాంతము" అనే గ్రంథం ద్వారా 'వేమన' అనే ఒక అనంస్కృత తెలుగు కవిని తెలుసుకున్నాను. మొదటలో వేమన పద్యాలు చదివి, అర్థం

చేసుకొని, వానివి ఇంగ్లీషులోనికి భాషాంతీకరించమని కొంతమంది సలహా యిచ్చేరు. అలాగే చేసియున్నాను. ఆ గ్రంథం ఇంగ్లీషులో స్కాటు వ్రాసిన "మార్మియాన్" అంత ఉన్నది. ఆ వెనుక అంతకంటే గొప్పవారైన కవుల గ్రంథాలు చదవడం మొదలుపెట్టేను. కాని అవి ప్రారంభకుల కంత లాభదాయకములు గావు.

నాకు తెలుగు కావ్యాలు చెప్పే బ్రాహ్మణ పండితులు బాగా చదువుకొన్నవారు. కాని సర్వజ్ఞులమని అహం ఉండేది. మొదటలోనే నాకు, వారికి వివాదము వచ్చి సముద్రమధ్యంలో ఓడ పగిలినంత పని అయింది. నా యుపాధ్యాయులు సూక్ష్మ విచారణ గలిగిన వ్యాకరణాది శాస్త్రాలు ముఖ్యంగా తెలుసుకోవాలని ఆదేశించేరు. ఒకటి గాదు, రెండు గాదు, మూడు పర్యాయములు వారా శాస్త్రాధ్యయన విషయమై నాకు కలిగించిన పాండిత్య భ్రమలకు లోబడక, వారిని ప్రతిఘటించేను. వారికి సామాన్యోపయోగకరమైనవీ, స్వాభావికమైనవీ నిత్య వ్యవహారంలో ఉన్నవీ గిట్టవు. నిజంగా అట్టి వారి శిక్షణక్రిందనే మనము తయారైతే మనకు కలిగే జ్ఞానం అత్యల్పమని నా భావన. వారు నన్ను శ్లోకపద్య రూపంగా ఉన్న నిఘంటువులను కంఠస్థము చేయమన్నారు. కాని నేనా పద్ధతిని నిరసించి అకారాదిగా నుండే ఆంగ్లేయ నిఘంటు పద్ధతిని ప్రారంభించినాను. ఒక పండితుడు తాను కవిత్వము చెప్పగలనని, నన్ను సంస్కృతాంధ్ర ఛందస్సులు చదవమని ప్రోత్సహించెను. నా కప్పటికి సంస్కృత సంబంధము గల గ్రీకు పారసీక చందస్సులు తెలిసి యుండుటచేత ఆ పండితుని యభిప్రాయము వెంటనే గ్రహించేను. ఇంకొక పండితుడు 'నన్నయ భట్టీయం' అనే గ్రంథాన్ని బట్టీ వెయ్యమని, దానిని ఇంగ్లీషులోకి భాషాంతరీకరణము చేయమని కోరినాడు. కాని అంతకు ముందే కాంబెలు తన వ్యాకరణంలో దాన్ని గూర్చి విపులంగా యింగీషులో చెప్పిఉండడముచేత నేనా పని విరమించాను. నావద్ద పండితులు కాంబెలు వ్రాసినది 'సరికాదని మాత్రము ఖండితంగా చెప్పేరు.

నేనేదైనా పట్టుపడితే, ఆ కార్యము ఫలవంతమయ్యేవఱకు, ఆ పట్టు విడువను. నన్నయభట్టీయం దుర్ఘటమైనా, రాత్రిం బగళ్లు పరిశ్రమచేసి, అందలి విషయాలు నా స్వంతంగా చేసుకొన్నాను. ముప్ఫయి యేండ్లకాలం, దానిని పాండిత్యానికి మూలాధారంగా పెట్టుకున్నాను. సంస్కృతంలో సూత్రప్రాయంగా ఉన్న ఆ గ్రంథానికి ఎంతో విపులంగా వివరణలు రచించేను. అందులో యిచ్చిన తెలుగు ఉదాహరణలను బట్టి సంస్కృతమునాకు రాకపోయినా మూలార్థం అవగాహన చేసికోగలిగేను.

ఈలాగ నా వద్దకు వచ్చే పండితుల మూలంగా తెలుగు పాండిత్యము సంపాదించేను. వారికొక్క యింగ్లీషుముక్క రాదు. అదేనాకు కావలసింది. నలభై యేండ్ల క్రిందట జరిగిన యీ సంఘటనలను తలచుకుంటే, వాస్తవంగా నేనింత దీక్షతో తెలుగును సంస్కృత గ్రంథాలను చదివేనా అనినాకే ఆశ్చర్యంవేస్తుంది.

హిందువులు రామాయణమును భాగవతమును పవిత్ర గ్రంథములుగా భావిస్తారు. అర్థము తెలియకపోయినను, అవి పఠించినవారికి, చెప్పిన గురువునకు, వినిన శిష్యునకు పుణ్యము వస్తుందని వారినమ్మకము. ఇంగ్లీషు ప్రొటెస్టెంటు మిషనరీలు వ్రాసిన హిందూమత విషయిక గ్రంథములు నేను చూచాను. నేనీ తరువాత ప్రకటించిన పుస్తకములను బట్టి, విగ్రహారాధన — దేవాలయార్చకులు— మూఢనమ్మకములు— వీనిని గూర్చి నా అభిప్రాయములు తెలుసుకొనగలరు.

నేను తెలుగు కావ్యాలు చదువునాటికి— 1821లో ఎ. డి. కాంబెలు తెలుగు నిఘంటువును, విల్సనుదొరవారి సంస్కృత నిఘంటువును ఉండెడివి. వానిని నేను ఉపయోగించితిని. కాని అవి ఇంగ్లీషులో నున్నవి. నా వద్ద ఉద్యోగిగానున్నయాతడు వృద్ధుడైన కవి. అతడు చాలాకాలము కాశీలో నున్నాడు. కాబట్టి హిందీ అతనికి బాగావచ్చును. అతడు తెలుగువాడే కాబట్టి, హిందీలోను, తెలుగులోను వ్యవహార భాషలో నాకు పద్యములకర్థము చెప్పెడివాడు. నావద్ద నున్న వారందఱికి సంస్కృత వ్యాకరణములు కుణముగా వచ్చును. కాని వానిని వివరించేటప్పుడు తెలుగులో చెప్పడంవారికి కష్టంగా ఉండేది. సంస్కృతంలో చెప్పడం అంటే మంచినీళ్ల ప్రాయము.

పూర్వమువలె, నేను చదివిన కాలంలోను ఉపాధ్యాయులు నీకేమైనా సందేహములున్నవా అని అడిగేవారు. నాకు సందేహము కలుగలేదు, అవగాహన కాలేదు, అని నా ప్రత్యుత్తరము. కాని నేను నా సందేహము లన్నింటిని వేఱుగా వ్రాసుకొనుచుండువాడను. ఇట్టిపని వ్యాకరణము, నిఘంటువులేని భాషలను పాశ్చాత్యులు చదువుచున్నప్పుడు, ముఖ్యముగా చేయదగినది. ఆ సందేహములను ఆయా భాషలమూలమున విమర్శించి మననము చేసినట్లయితే ఆ భాషాతత్వాన్ని మనము సాధించగలము. ఈ కాలంలో దేశభాషలను గూర్చి పరిశ్రమ చేయడమంటే, పనిముట్లులేని కార్మికుని స్థితివంటిది. కాని యిట్టి విషమపరిస్థితులలోనే, బెషీ తమిళభాషకు—గిల్ క్రైస్టు హిందూస్థానీ భాషకు— క్యారీ బంగాళీ భాషకు, హాండ్స్ కన్నడ భాషకు అసమానమైన సేవచేసేరు.

మత్తయి సువార్తను హీబ్రూ మాతృకానుసారంగా 1826లో ప్రకటించిన 'జారెట్టు' అనే ఆయన నన్ను పిలిపించి, దేశభాషలో పరిశ్రమ చేసినందువలన కించిత్తు లాభము లేదని— తెలుగు అభివృద్ధి గురించినాకప్పటికేగల కొన్ని పథకాలను తక్షణమే పరిత్యజించమని, నా ఉత్సాహము కొంతకాలమే ఉంటుందని చాలా బోధచేసేడు. నా చిన్నతనంలోనేను కొంచెము చంచల మనస్కుడుగా ఉండేవాడను. కాని పెద్దవాడనైన కొలదీ నా పట్టుదల పెరిగింది. అందుకని అతని మాటలను పాటింపనేలేదు.

అంతకుముందు సువిమర్శితముగాని భాషలకు నిఘంటువును నిర్మించడం ప్రారంభించేవాడు అపమార్గాన్ని పడక తప్పదు. దీనికొక ఉదాహరణ. నేను తెలుగు భారతాన్ని మొదట 1826లో చదవడం ప్రారంభించేను. ప్రతి పద్యానికి వచనానికి

సంఖ్యలు వేసేను. ఏదైనా ఒక కొత్తపదమువస్తే, నా సహాయ పండితుని అర్థమడిగేవాడిని. ఆతడు తెలుగునగాని సంస్కృతంలోగాని, హిందీలోగాని దాని అర్థము చెప్పేవాడు. నేను ఆ అర్థాలను వ్రాసికొనేవాడిని. నిఘంటువున కెక్కించే వాడిని. కాని ఆ పదమే అనేక పర్యాయములు వచ్చేది. వచ్చినప్పుడల్లా ఒక క్రొత్త అర్థము వ్రాయవలసివచ్చేది. ఇట్లు జరిగినతర్వాతనే నా పండితునితో, ఈ విధంగా చెప్పినఅర్థం చెప్పకుండా అస్పష్టంగానీవు తెలిపితేనే నెట్లా నిర్ధారణచేసేది, అని కఠినముగానే మందలించేను. అతడు. "అయ్యా నేను చెప్పే ప్రతీ మాట మీరు వ్రాస్తూంటే నేనేమి చేయగలను. ఒక్కొక్కపుడ పదం నాకు తెలియకపోవచ్చు. దాని పర్యాయపదం జ్ఞాపకము ఉండకపోవచ్చును. నా నోటిమాట నోటిలో ఉండగానే మీరు దాన్ని గ్రంథస్థంచేసి తరువాత దాన్ని విమర్శించమంటే నా తరమా ?" అని జవాబిచ్చేడు. అతడు గట్టి పండితుడే కాని కావలసినది సూటిగా చెప్పలేడు.

సిబిలియన్ భాషా కావ్యాలవలె, హైందవుల కావ్యాలు, తాళపత్రాలు లేక తాటాకులమీద వ్రాయబడినవి. తాటాకుల మీద గంటములతో శరవేగంగా వారు వ్రాయగలరు. సిరా యెంతమాత్రము ఉపయోగింపరు. అక్షరాలు అచ్చులోవలె ఉంటవి. కాని యీ తాటాకుల రంగు నల్లగాను, బూడిద వర్ణముగాను ఉండడమువల్ల అక్షరాలు స్ఫుటంగా ఉన్నా చక్కగా కంటికి కన్పించవు. ఇవి చదవడంవల్ల కళ్లు పాడవుతాయని నేను యీ తాళపత్ర గ్రంథాలను ఇంగ్లీషు కాగితాలపై ఇండియను సిరాతో స్పష్టముగా వ్రాయించాను. ప్రతి పద్యమునకు అంకె వేశాను.

నావద్ద వ్రాతప్రతులన్నీ తప్పుల కుప్పలు. నావద్ద పండితులా తప్పులను వారికి తోచిన విధంగా సరిదిద్దేవారు. కాని నా కా పద్ధతి నచ్చలేదు. నే నప్పటికే, యూరపు ఖండమున, లాంబియన్, ఇరాస్మస్, హీన్సియస్, కాసుబాన్, కెన్నీకాటు మొదలైన విద్వాంసులు కనిపెట్టిన పాఠభేద నిర్ణయ పద్ధతిని తెలుసుకొన్నాను. మద్రాసు కాలేజీబోర్డువారిరవై యేండ్లకు ముందు కొన్ని తెలుగు తమిళ పద్యకావ్యములను ప్రచురించి యున్నారు. కాని ఆ ప్రచురణలు వ్యర్థములైపోయినవి. వాని కాధారములైన వ్రాత ప్రతులలో నెట్లున్నదో అట్లే ముద్రితములైనవి. మూలమునందలి దోషములు గాని, పాఠములు గాని, సరిచూడ బడలేదు. అప్పటికీ యిటలీ, జర్మనీ దేశాలలో నుండే గ్రంథ పరిష్కరణ విధానము వారికి తెలియలేదు. ఒక కేసులో బహు పాఠభేదముల నుండి ప్రశస్తమగు మూలమును ప్రకటించు పద్ధతి మొదలు కనిపెట్టినది వారే. పరస్పర విరుద్ధములుగా యిచ్చిన వాజ్మూలముల నుండి న్యాయాధిపతి ఏవిధంగా పరిశీలించి, సమన్వయించి తీర్పు చెప్పునో అదేరీతిగా ఒక పరిష్కర్త భిన్న రూపములతో విరుద్ధములుగా నున్న పాఠబేదములను పరిశీలించి నిర్దుష్టమైన పాఠములతో గ్రంథము వెలయింపగలడు.

నా గ్రంథ పరిష్కరణ విధానమును తెలియజేయుటకు మనుచరిత్రను గూర్చి ముందు తెలుపుచున్నాను. మనుచరిత్ర తెలుగు సాహిత్యములో ఉన్నతస్థాయి నున్న ప్రబంధము. మొదట విశేషముగా తప్పులులేని యొక తాళపత్ర ప్రతి సంపాదించి దానిని కాగితములపై వ్రాయించితిని. పేజీ విడిచి పేజీ వ్రాత లేకుండా విడువబడినది. ప్రతి పద్యమునకు సంఖ్య వేసితిని. పద్యములు నాలుగు పాదములుగా విడమర్చి వ్రాయించితిని. ఆపైని దానిని బైండు చేయించితిని. ఆ ప్రతిని దగ్గర నుంచుకొని, యింకను మనుచరిత్రకు గల తాటాకు ప్రతులను సేకరించితిని. పదిహేను ప్రతులు (అందులో కొన్ని అసంపూర్ణములు) సంపాదించి పాఠభేద పరిష్కరణ ప్రారంభించితిని. నా గుమాస్తాకు నేను తయారుచేయించిన ప్రతి నిచ్చితిని. వానికి నెదురుగా నిద్దఱికి—వేఱువేఱుగా నైదాఱు తాళపత్రముల నిచ్చితిని. వీరి ప్రక్కను ముగ్గురు పండితులుండిరి. వారు వ్యాకరణమును, ఛందస్సు, తెలుగు, సంస్కృతము చక్కగా నెఱిగినవారు. తాళపత్రములున్న యిద్దరిలో ఒక్కరు మొదట తమ దగ్గ నున్న ప్రతిలోని పద్యము చదువును. వెంటనే రెండవవాడు తనవద్ద నున్న ప్రతిలోని ఆ పద్యమునే చదువును. ఇట్లు పది లేక పన్నెండుసారులా పద్యమును చదువగానే, అందలి పాఠము లన్నింటిని గుమాస్తా వ్రాతలేని పుటయందు దాయా పద్యముల కెదురుగా వీని నెల్లను నెక్కించును. ఆ తరువాత గ్రంథస్తములైన పాఠముల సామంజస్యమును గూర్చి పండితులు చర్చించి, సరియగు పాఠము నిర్ణయింతురు. ఈపని జరుగుచున్నప్పుడు పరిశుద్ధమైన మూల ప్రతి యొకటి తయారగును. పండితులు తమ నిర్ణయము చెప్పగానే, పరిశుద్ధ ప్రతిలో నా పాఠముతో గ్రంథమూలము లిఖింపబడును. అదియే సంస్కృతమైన ప్రామాణికమైన ప్రతి.* ఈ పాఠభేదములు లిఖించిన ప్రతు లన్నియు కూడ భద్రపఱుపబడును.

హైందవులు తమ వ్రాత ప్రతులను నితరుల కెంత మాత్రమును నెరువీయరు. ఇక వానిని 'అమ్ముట' యన ఏవగించుకొందురు. కాని మనమా వ్రాత ప్రతులను తిరిగి వ్రాయించి భద్రపఱచుచున్నామని తెలిసిన తోడనే వెంటనే సంతోషముతో నెరువిచ్చెదరు. నేనీ తాళపత్ర గ్రంథముల విషయమై మేజస్ట్రేట్ల ద్వారా, ఎక్కడనో దూరమున నున్న పల్లెలకు వ్రాసి వానిని తెప్పించవలసి వచ్చెడిది. కొంత మంది బ్రాహ్మణులు తమ వ్రాత ప్రతులను ఇవ్వమంటే యివ్వమన్నారు. నేను వారితో సగౌరవముతోను, వినయముతోను ఉత్తర ప్రత్యుత్తరములు జరిపేను. అంతటితో వారు సంతోషపూర్వకముగా ఎంత పవిత్రములైనవియైనా వాటిలో ఎంత రహస్య విషయములున్నా ఆ గ్రంథముల నన్నింటిని నాకిచ్చారు. ఇచ్చట డబ్బు పనిచేయదు. మనస్సే ప్రధానము.

ఏదైనా ఒక పదముయొక్క అర్థాన్ని గురించి సందేహము వస్తే పండితులను సంప్రదించేవాడిని. వారు తెలిపిన

---

* ఈ విషయమై అక్టోబరు 1866, లండను క్వార్టర్లీ రివ్యూను చూడదగును. 'డచ్చి విమర్శనా పథకము" అన వ్యాసమున పై విధానము వివరింప బడినది.

వాటి నన్నింటినీ గ్రంథస్థముచేయ నాజ్ఞాపించాను. ఈవిధంగా పద్యాలకు వ్యాఖ్యానము వ్రాసే పద్ధతి ఏర్పడింది.

నేనీ గ్రంథ పరిష్కరణ విధానము నేర్పాటుచేసిన వెనుక నెందరో గొప్ప విద్వాంసుల, కవుల, వైయాకరణుల, విమర్శకుల పరిచయ భాగ్యము లభించింది. నాకు వారి పాండిత్యములో పాతికపాలైనను లేదు. పాపము వారు చాల పేదవారు. కటిక దరిద్రులు. కొందరు భిక్షుకులవలె ఉండేవారు. నేను నా నౌకరుల కిచ్చే తక్కువ జీత మిచ్చినాను. పరమానందముతో వారు నా పనిలో చేరి నన్ను కృతార్థుని చేశారు.

బహుళంగా ప్రచారంలో ఉండే కొన్ని కావ్యాలలో అర్థముకాని ఘట్టాలుంటాయి. వాటికి వ్యాఖ్యానాలు వ్రాయించేను. ఏదైనా పదం అర్థము కానప్పుడు నా నిఘంటువు చూడవలసినదిగా హెచ్చరించేను. నేనూ క్రొత్త పని చేరుస్తూ ఉండేవాణ్ణి. అందుచేత నా నిఘంటువు దిన దినము పెరిగి పెద్దదవుతూ వచ్చింది.

"రామస్తవరాజం" అనే వేదాంత గ్రంథంలో శరీరము ఒక పట్టణముగాను, అక్కడనున్న ప్రజానీకము ఆత్మగాను వర్ణితమై యుంది. ఇది అంతరార్థ కథా సంబంధం గలది. బనియను వ్రాసినది 'మాన్‌సోల్' అనే గ్రంథంలో ఇదే విధంగా ఉన్నది. 1833 లో ఆ గ్రంథంనుండి ఒక ఘట్టాన్ని ఆ గ్రంథ సంపాదకుడు తీసికొనివచ్చి నన్ను వ్యాఖ్యానించమని కోరేడు. పాఠము సరిగ్గా లేనందున, దానికి వ్యాఖ్యానము ప్రకటింపవద్దని చెప్పేను. కాని అత డట్లా చేయలేదు. వారము రోజులు పోయాక సంపాదకుడు స్వయముగా వ్రాసిన వ్యాఖ్యానం పట్టుకొని వచ్చేడు. నేను దాన్ని చూచి నిర్మొగమాటంగా, "'ఇది కల్పన, గ్రంథము చదివేవారు, చప్పున ఈ వాఖ్యానము కూట సృష్టి అంటారు. అని చెప్పి వేసేను. అతడు నవ్వి, "అట్లాగా! అయితే పాఠకులే అర్థం చేసికొంటారు" అన్నాడు.

సంస్కృత కావ్యాలన్నింటికి వ్యాఖ్యానా లున్నాయి. కాని, తెలుగులో రెండింటికి మాత్రమే అట్టివి ఉన్నట్లు తెలుసుకొన్నాను. ఈ రెండైనా, వ్యాఖ్యాతయొక్క విమర్శ జ్ఞానాన్ని ప్రకటించడానికి తప్ప, ప్రారంభకుడికి సహాయకారులుగా ఉండడానికి పనికిరావు.

నే నీ విషయమై పట్టుదలతో పని చేసి, ఇరవై సంవత్సరాలలో పేరు పొందిన తెలుగు కావ్యా లన్నింటికి వ్యాఖ్యానాలు టీకలు వ్రాయించేను. నా నిఘంటువుయొక్క ఉపోద్ఘాతంలో వీని పట్టిక చేర్చియున్నాను.

నేను క్రొత్తగా రచియింప జేసిన ఈ వ్యాఖ్యానాలను చదివిన వారందరూ చాల సంతోషించి నన్ను అభినందించేరు. ఇవి తెలుగు సారస్వతాన్ని ప్రకాశింపజేసేవిగా భావించేరు.

నేనే పనుల్లో విజయంపొందేనో వాటినే ఇక్కడ పేర్కొన్నాను. కొన్ని సందర్భాలలో అపజయమునూ పొందేను. కాని వినువు కల్గించే వానిని చెప్పదలచుకోలేదు.

జీవద్భాషను బోధించేవి పుస్తకాలుకావు. నిత్యమూ ప్రజా వ్యవహారములోనుండే భాషే దాన్ని బోధిస్తుంది. పోలీసు ఆఫీసులో వాడుకలోనున్న భాష నేనూ వాడుతున్నాను. ఇంతకంటె మంచి బడి యుండబోదు. న్యాయ స్థానాలలో నేను పండితుడు మొదలు పామరునివరకు సమస్తమైన వారితో మాటలాడవలసి వచ్చేది.—ముద్దాయి, సాక్షి, ఖైదీ, స్వదేశీయ న్యాయాధికారి, చదువురాని నౌఖరు వీరందరూ నాకు ఒక విధంగా ఉపాధ్యాయులే.

తెలుగు దేశానికి రాజధానియైన బందరు—(మచిలీపట్టణము) లో నేను మూడు సంవత్సరములు న్యాయాధిపతిగా వ్యవహరించేను. అక్కడ నేను సంస్కృతాంధ్ర గ్రంథముల వ్రాత ప్రతులు చాలా సంపాదించేను. వాని సంపాదన నా కొక 'పిచ్చి'గా పరిణమించిందంటే అతిశయోక్తికాదు. అక్కడ నేను ఒక్క దమ్మిడీ నిలవ చేయలేదు. నా వద్ద ఎప్పుడూ ఇరవైమంది బ్రాహ్మణులు, శూద్రులు—వీటిని గురించి పని చేసేవారు—వారి కందరకు జీతము లేర్పాటు చేసేను. ప్రాచీన కావ్యాలు కాగితాలమీద వ్రాయడము, సప్రామాణికములైన పాఠములతో వాని సంస్కరించడము, పదానుక్రమణికలు తయారు చేయడము, వ్యాఖ్యానాలు వ్రాయడము వారి పని.

కాలేజీ బోర్డులో సభ్యుడైన రిచర్డు క్లార్కు కోరికపై "తెలుగు ఛందస్సు"ను గూర్చి యొక గ్రంథము వ్రాసి 1827 లో ముద్రించేను. దీనిలో సంస్కృతచ్ఛందస్సుకు తెలుగు ఛందస్సుకూ ఉండే సంబంధము కూడా సూచితమైంది. 1828 లో వేమన పద్యములు ముద్రించేను.

ఇంగ్లీషుభాషా నిఘంటువును తెలుగు చేయడానికి నే నెన్నో ప్రయత్నాలుచేసి, చివరకు 1832 లో ఇంగ్లీషు—తెలుగు నిఘంటువు చిత్తుప్రతి పూర్తి చేసేను. ఇంగ్లీషు పదాలకు సరియైన అర్థాలు తెలుసుకోవడానికి నేను పూర్వము చదివిన షేక్స్పియరు మొదలైన ఆంగ్లేయ కవుల రచనలు చాలా తోడ్పడ్డాయి. ఈ నిఘంటువువల్ల హిందూ దేశములో ఉన్న ప్రజలకు ఆంగ్లేయ భాషా సాహిత్య జ్ఞానము అందుబాటులో ఉంటుందనే నా ఆశయం. నే నెన్నడూ ఒక ప్రత్యేక జాతి కోసము పరిశ్రమ చెయ్యలేదు.

1832 లోనే "సెంటులూకా సువార్తను—అపోస్తలుల కార్యములు" అనే బైబిలు భాగాలను తెలుగులో ననువదించేను. దీన్ని బ్రిటిషు రాష్ట్రేతర బైబిలు సంఘమువారు తమ 36 వ నివేదికలో "ప్రతిదేశములో బైబిలు" అను శీర్షిక క్రింద సముచితముగా పేర్కొన్నారు.

ఈ సంవత్సరంలోనే నేను మచిలీపట్నములో ఒక అచ్చాఫీసును నెలకొల్పడానికి ప్రయత్నము చేసేను. కాని, నేను నియమించిన ఇంగ్లీషువాడు నన్ను మోసగించినందున ఆ పని విరమించ కొన్నాను. ఆ కాలములో తెలుగు ముద్రణము చాల కష్టమైన కార్యము. ఆ భాషలో 'ర' కారము 'ఱ' కారము రెండు ఉన్నాయి. వీని సంయుక్తాక్షరముల ముద్రణము కష ము

గానే యుండెను. ఈ సంకటము తొలగించడానికి నేను క్రొత్త చిహ్నములు కనిపెట్టేను. క్ర అని ఇట్లు వ్రాయడానికి బదులు క అని ఒక చిహ్నము—పలపల గిలకకు బదులు 'ౕ' వంటి గురుతు ఉపయోగములోనికి తెచ్చేను. వీనివల్ల తెలుగు ముద్రణ యెంతో సులభ సాధ్యమైంది.

తెలుగు ముద్రణ విషయములలో నేనెన్నో మార్పులు తెచ్చేను. పేజీలకు అంకెలు వేయడం, అచ్చులో ఉచితమైన విభాగము చేయడం ఒక అశ్వాసముగాని, భాగముగాని పూర్తి కాగానే ఆ పుట విడిచి, వేరు పుటలో క్రొత్త భాగము ప్రారంభించడం మొదలైనవి. వీనిని తరువాతి వారనుసరించినందులకు నా కెంతో సంతోషమైంది. 1860—70 మధ్య ప్రకటిత మైన తెలుగు పుస్తకములలో ఇవన్నీ పాటింపబడ్డాయి.

హైందవులు తమ జాతీయ కావ్యాలను అత్యుత్సాహముతో పఠిస్తారు. కాని ఆ గ్రంథము లచ్చు వేయడం అనగానే అది ఒక పాప కార్యముగా వారు భావిస్తారు. ఒక పుస్తక విక్రేత గ్రంథముల వ్యాపారం సాగించి, గ్రంథాలు ప్రకటిస్తేగాని సాహిత్యం అభివృద్ధి చెందనేరదు. ఈ నా ఉపదేశాన్ని గ్రహించిన కొందరు 1866 నాటికి తెలుగు గ్రంథ ముద్రణము—ఉన్నత స్థాయికి తెచ్చేరు. బంగాళా దేశంలో ఇప్పటికి నలభై యేండ్ల నాటినుండి, తమిళమున నంతకుముందునుండి గ్రంథ ముద్రణము ప్రచారములో నున్నది.

వీనిని వ్రాయుచున్నప్పుడు గ్రంథమునకు సంబంధించి మరియొక పని విషయ మిక్కడ చెప్పవలసి ఉన్నది.

1827 లో నేను హైందవ శిల్ప శాస్త్రమున విగ్రహముల "సమ విభక్తావయవ పద్ధతిని" గూర్చి ఒక వ్యాసము వ్రాసేను. ఇది 1828 లో ఏష్యాటిక జర్నలులో ప్రకటితమైంది. (పుట 596) ఆ సంపుటంలోనే నేను, సహగమనము చేస్తూ ఉన్న నొక స్త్రీని అట్టి కార్యము చేయకుండా సంరక్షించే నన్న విషయముదాహరింపబడింది.

1834 వ సంవత్సరంలో మూడేండ్లు దీర్ఘకాలపు సెలవును తీసికొని నా స్వదేశమునకు వెళ్లేను. అచ్చట నా కారోగ్యము బాగా ఉండేది. స్నేహితులను చూడడం, విందులు విహారాలు వీనితో కాలము గడచిపోయినా, నా సారస్వత సేవ మాత్రం మానలేదు. నిఘంటువు సాఫు వ్రాయడం, తెలుగు వ్యాకరణం రచించడం అనే రెండు పనులు పూర్తి చేసేను.

ఇంగ్లండులో సెలవులో ఉన్నప్పుడు మరి రెండు పనులు చేసేను. డ్రైడను చేసిన మార్పులతో షేక్స్పియరు 'టెంపెస్టు' నాటకము ప్రదర్శించడము తప్పని ముఖ్యపాత్రధారియైన 'మెక్రెడీ'కి లేఖ వ్రాసేను. పారంపర్యంగా వస్తూన్న సంప్రదాయం సరికాకపోయినా మార్చలేనని అతడు జవాబు వ్రాసేడు. కాని, నేరి రెండు సంవత్సరాల కాతడే డ్రైడను మార్పులను తిరస్కరించి ప్రదర్శించినందుకు ప్రజలు హర్షించేరు. నా సూచన ఆమోదం చేసినందుకు నేనూ సంతోషించాను.

బ్రిటిషు మ్యూజియంలోను, ఆక్సుఫర్డులోని బోడ్లేను లైబ్రరీలోను ఉన్న లాటిను భాషా కావ్యాలను, వ్రాతప్రతులను సంప్రతించుటయందు, ఆ యా అధికారులకు నేను సహాయము చేసేను. ఆ సమయమందే ఇండియా ఆఫీసు లైబ్రరీలో చెలా, చెదరుగా నున్న తెలుగు, కన్నడ గ్రంథాల పట్టికను విల్సనుదొర కోరికపైని (కేటలాగు) తయారు చేసేను. గౌరవనీయులైన కంపెనీ డైరెక్టర్లు నా పనికి చాల మెచ్చుకున్నారు. నా సూచన ననుసరించి లండనుఇండియా ఆఫీసులోనున్న తెలుగు కన్నడ గ్రంథాలను 1844 లో మద్రాసు పంపేరు. నేనూ వానికి మరి కొన్నింటిని చేర్చి కాలేజీ లైబ్రరీలో భద్రపరచినాను.

1838 లో నేను తిరిగి మద్రాసు వచ్చేను. ఆ సంవత్సరంలో తెలుగు సారస్వతాన్ని గూర్చిన దీర్ఘ వ్యాసము ఒకటీ, జంగములగూర్చి వారి వాఙ్మయాన్ని గూర్చి మరియొక పెద్ద వ్యాసము అచ్చు వేసేను. ఇంకా మదరాసు జర్నలు ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్సు అనే పత్రికలో పడిన చిల్లర వ్యాసాలను ముద్రించేను. పత్రికల్లో అప్పుడప్పుడు ప్రచురితమైనవాటిని వేరుగా ప్రకటించేను. ఇవి కొన్ని విద్యా విషయికాలు. కొన్ని హిందువుల ఆచారాలను గూర్చినవి. మరికొన్ని తాత్కాలికముగ ప్రజాకర్షణీయములైన విషయాలకు సంబంధించినవి. నా వ్రాతలను నేను బాగా పరీక్షించుకొని, అవి ముద్రణార్హములని తోచినప్పుడే వానిని ముద్రిస్తాను. ఇది నా నియమం.

నావద్దనున్న ఒక జంగము కవిత్వం చెప్పేవాడు. నేను రచించిన లూకాసువార్త చదివి ఆనందించేడు. వచనంగా నేను వ్రాసిన దానిని పద్యములుగా అతడు వ్రాసేడు. అది 1854 లో ముద్రితమైంది.

నేను వ్రాసిన తెలుగు వ్యాకరణం 1840 లో ముద్రితమైన దగ్గరనుండి ప్రచారంలోకి వచ్చింది. నా కంటెముందు తెలుగు వ్యాకరణాన్ని ఇంగ్లీషులో రచించిన 'కాంబెలు' పరిశ్రమ కొనియాడడమేకాక, సగౌరంగా ఒక ఉత్తరమువ్రాసి చక్కగా బైండు చేయబడిన ప్రతిని పంపేను. అతడు నన్ను ప్రశంసించేడు. ఆ వెనుకా కొద్ది కాలానికే కాంబెలు వ్యాకరణము మూల పడింది.

నే నెక్కడ పని చేసినా, బాలురకు తెలుగు, హిందూస్థానీ విద్యాభ్యాసము నిమిత్తము ఉచిత పాఠశాలలను నెలకొల్పేవాడను. ఆ యా ప్రాంతమువారినే ఉపాధ్యాయులుగా నియమించేవాడను. 1821 లో కడపలో రెండింటిని, 1823 లో బందరులో రెండింటిని స్థాపించేను.

1844 లో మదరాసులో ఒక ఉచిత పాఠశాల పెట్టేను. అందులో 80 మంది ఇంగ్లీషు, తెలుగు, తమిళ విద్యార్థులుండేవారు. ఇది ఏడేండ్లు నడిచినది. కాని, దాని యాజమాన్యము మరియొకరికి అప్పగించేను. కాని అది సరిగా నడవలేదు. తరువాత క్రైస్తవ మిషనరీలకుదాని నప్పగించేను.

1838 లో నన్ను పారసీక భాషాంతరీకరణకర్తగా నియమించేందుకు కాలేజీ బోర్డులో నన్నొక సభ్యునిగా నెన్నుకొన్నారు.

కాలేజీలో పరీక్షాధికారి పదవి నా కుండేది. తక్కిన సభ్యులపథ కపే పేరు. కాలేజీ బోర్డు అధ్యక్షుడు పరీక్షకు హాజరైనవారి నందరిని ప్యాసు చేయుటమేగాక, వారిని అభినందించేవాడు కూడా. అక్కడ పనిలేదు, పాటులేదు. అన్నీ బహుమతులు! అన్నీ ప్రశంసలు! ఈ కాలేజీ వ్యవహారాలు నివేదికల కెక్కిన తరువాత తక్కిన ఉద్యోగులు దీనిని విమర్శింప మొదలుపెట్టేరు. నేనున్నూ ఈ విధానాన్ని తీవ్రంగా విమర్శించేను. విద్యార్థులను తగిన రీతిగా పరీక్షింపవలెనని పట్టుపట్టేను. కొందరు నా వ్యాకరణంలోను నిఘంటువులోను వాడిన తెలుగు చాలా కష్టమన్నారు. కొందరు అతి సులభ మన్నారు. కాని వీనిని నేను లక్ష్యపెట్టలేదు. పరీక్షా సమయంలో దేశీయులైన తెలుగు పండితులు పరీక్షకు ఇంగ్లీషువారితోపాటు ప్రక్క నుండవలెనని ప్రతిపాదించేను. కొంతమంది ప్రతిఘటించినా నా ప్రతిపాదన నెగ్గింది. నేను పరీక్షకు వెళ్లే విద్యార్థులను ప్రతి బుధవారం నా వద్దకు రమ్మని చెప్పి వారి సందేహాలను తీర్చి స్పష్టమైన జ్ఞానమును సంపాదించాలని వారి కాదేశము చేస్తూవుండేవాణ్ణి. పరీక్షలలో కృతార్థత చెందడమే ప్రధానము కాదని భాష బాగా నేర్చుకోవాలని నా ఆశయం.

కాలేజీ పరీక్షలు బహిరంగముగా జరుగుతున్నప్పటికీ కొన్ని కారణాలవల్ల అవి రహస్యము లైనాయి. నేను చేసిన మార్పులవల్ల పరిస్థితులు చక్కబడ్డాయి.

1829 లో నేను 'వేమన' 500 ప్రతులు ప్రకటించేను. వేమన బ్రాహ్మణులను హేళన చేయుటచేతను, వారిని విమర్శించడముచేతను కాలేజీబోర్డులో బ్రాహ్మణుల ప్రాభవం హెచ్చి వానిలో 450 ప్రతులను ఒకమూల పడేసి పెట్టారు. అది విస్మృతప్రాయమైనది. పది యేండ్లయిన తరువాత, అది చిత్తు కాగితాల క్రింద ఉపయోగిస్తున్నారని తెలిసింది. వెంటనే దానిని పునర్ముద్రణము చేసేను. ఇంగ్లీషు తెలుగు కూడా ఉండడమువల్ల ఈ రెండు భాషలలో చదువు ప్రారంభం చేసేవారికిది చాలా ఉపయోగపడ్డది. అది నా ప్రథమ ప్రయత్నమైనా దానిని కాలాక్రమాన్ని సవరిస్తూ ఉండేవాడను.

ఆ రోజుల్లో కొంతమంది తెలుగు, తమిళ విద్యార్థులు పారసీ భాష చదివేవారుకారు. నేను పారసీ భాషా పరీక్షకుడను కాబట్టి వారివారి దేశభాషలే నేర్చుకోవాలిగాని, పరభాషయైన పారసీ నేర్చుకోగూడదని శాసించేను. చివరకు కాలేజీ బోర్డు వారు పారసీ భాష నెత్తివేసేరు.

హైందవుం కాలనిర్ణయ సిద్ధాంతాలను గూర్చి పరిశీలన ప్రారంభించేను. నే నిచ్చటికి వచ్చేనాటికీ, పూర్వము సర్వేయరు జనరలుగా నున్న మెకంజీ, అనేకవేల గ్రామ వృత్తాంతములను సంగ్రహించి భద్రపరచి యుంచేడు. వానిలో కాల నిర్ణయాన్ని గూర్చి తెలుగులో కన్నడములో కొన్ని సూచనలు గల గ్రంథా లున్నవి: అవి ఒక గుట్టగా పడిఉన్నాయి. టైలరు అనే ఒక చదువురాని ఆంగ్లేయుడు దాని కొక కేటలాగు తయారు చేసేడు. ఆ వ్రాతప్రతులు చాలా విలువగలవని కొంత మంది చదువుకున్నవారు గ్రహించేరు. కాని ఆ భాష వారికి అవగతం కాలేదు. విద్వాంసులు కొందరు కాల నిర్ణయాలను గూర్చి సలహా లిచ్చేరు. కాని ఏవిధంగా దాన్ని సాధించడమో వారు తెలుపలేదు. చిట్టచివరకు నేనే కొన్ని సంపుటాలను తీసుకుని సాజాత్యముగా ఉండే భాషా సాంకేతికాలవల్ల అర్థం గ్రహించి కాలనిర్ణయానికి కొన్ని సూత్రాలు కనిపెట్టేను. ప్రతి సంపుటములో శాలివాహనశక కాలానికి సరియైన యింగ్లీషు తేదీలను సూచించడానికి నా కైదేండ్లు పట్టింది. ఈ వ్రాత ప్రతులయందున్న విషయాలు తొమ్మిది వందల యేండ్ల నాటివి. అది ఇంగ్లండులో 'ఆల్‌ఫ్రెడు' పాలించిన కాలము.

సక్రమ పద్ధతిని హిందూ ముస్లిముల కాల నిర్ణయ సిద్ధాంత పథకాలను ఎనిమిది శతాబ్దాలకు తయారు చేసేను. ఇవి డెబ్బది పుటలలో ముద్రితము లైనవి. నేనీ సిద్ధాంతాలను స్థిరీకరించడానికి సంస్కృతం, తెలుగు, కన్నడములలో నున్న 40 సంపుటాలు ఆ మూలాగ్రంగా పరిశీలించేను. తెలుగు వ్యాకరణం తరువాత నన్ను హెచ్చుగా చిక్కులు పెట్టినవీ పథకాలే. దీనిని చాలా తక్కువమంది మాత్రమే చదువుతారు. చదివినవారి సందేహాలను యిది తప్పక తీరుస్తుంది.

ఆవెనుక ఎఫిమెరిస్ (సంవాద పంచాంగము) అనుదానిని సమకూర్చేను. ఇది ఇంగ్లీషు, హిందూ ముస్లిముల క్యాలెండరుల ననుసరించి క్రీ. శ. 1751 నుండి 1850 వరకు గల సంవత్సరములకు తేదీ వారముల సంవాదములను తెలుపును. ఇందారువందల పుట లున్నాయి. ఒక్కొక్క పుటలో రెండు నెలల వివరా లున్నాయి. కంపెనీ ప్రభుత్వమువారు దీని నచ్చు వేయించేరు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోను దీనిని వాడుతున్నారు.

బైబిలు సంఘమువారు బైబిలుకు తెలుగు అనువాదము ప్రకటించడానికి నిశ్చయించేరు. కాని వారిలో ఏ ఒక్కరికీ తెలుగు రాకపోవడంవల్ల నేను కొన్ని భాగాలు మచ్చుకు అనువాదంచేసి వారికి పంపేను. అప్పుడా సంఘానికి అధ్యక్షుడిలా నాపేర వ్రాసేడు.

"బైబిలుకు తెలుగు అనువాదం చేసేటప్పుడు ఏ ఇంగ్లీషు మూలాన్ని అనుసరిస్తారో తెలియదు. హీబ్రూ భాషలోని బైబిలు పాఠాలు కొన్ని ఇంగ్లీషు మూలంలో ఉన్నవి. గ్రీకుభాషలోని బైబిలు పాఠాలు మరి కొన్నింటిలో ఉన్నవి. ఈ రెండింటిని గూర్చి జరిగినవి, జరుగుతూఉన్న వివాదాలకు అంతంలేకుండా ఉంది. పరిస్థితు లీవిధంగా ఉన్నవి కాబట్టి మీరే మూల గ్రంథం పరిశీలించి బైబిలు తెలుగు అనువాదం చేయించి తెలుగు దేశంలో క్రైస్తవమత ప్రతిష్ఠాపకులనే కీర్తి పొందండి. ఈపని మీరు తప్ప మరి యెవ్వరూ చేయలేరని నా నమ్మకం."

ఈపని నేను చేయవలసి వచ్చినప్పుడు మొదట బైబిలుకు అంతకుముందు సంస్కృతం, బంగాళీ, తమిళం, మరాటీ

కన్నడం; భాషానువాదాలను పరిశీలించేను. గ్రీకు, లాటిన్ బైబిలు గ్రంథాల్ని చదివేను. కొన్ని సులభంగానే ఉన్నాయి. కాని కొన్ని గడ్డుగా ఉన్నాయి.

బైబిలును ఇతర దేశభాషల్లోకి అనువాదం చేయడమంటే అది గడ్డితో యిటికలను తయారుచేయడం లాంటిది. కొన్ని ముఖ్య ఘట్టాలలో మూలంలో ఉన్న పదాలకు తెలుగులో అర్థం చెప్పాలంటే దానికి తగిన పదాలే ఆ భాషలో లేవు. క్రొత్త నిబంధనలో ఉన్న వచనాలవల్ల, మూల గ్రంథంలోనే ఉండే రసభావాలు వ్యక్తం కాలేదంటే అనువాదంలో వానిని తీసుకురావడం దుర్ఘటం.

అనువాదాలు చేస్తామని ప్రగల్భాలు పలికేవా రందరూ భాషాపరిజ్ఞానంలేనివారనే చెప్పాలి. వారొక పది సంవత్సరాలు పరిశ్రమచేసినట్లయితే బుద్ధిమంతు లవుతారు. ఇట్టివా రంత టితో నూరుకోరు. ఇతరుల అనువాదాలమీద తీర్పులు కూడా చెపుతూ ఉంటారు. దీనిని గూర్చి కాశీలో పూర్వమున్న "బయర్పు" అనే మిషనరీ లేఖ చూడవచ్చును.

కేవలము వచనం ఉండే భాగాల్లో ఇట్టివి ఉంటే ఇసయాదేవిడు కీర్తనలను ఇంగ్లీషు నుండి తెలుగు వచనంలోకి అనువాదం చెయ్యాలంటే అది సున్నితమైన శిల్పాన్ని సుత్తితో మోదినట్లుగాను తీగను గొడ్డలితో త్రుంచినట్లుగాను ఉంటుంది.

ఆ వెనుక నవి కాలేజీ లైబ్రరీకి తరలింపబడ్డాయి. అక్కడనే ఇండియా ఆఫీసునుండి నేను తెచ్చిన తాళపత్ర గ్రంథాలు ఉన్నవి. వీని కేటలాగులు తయారుచేయడానికి పండితులను నియమించేను. సంస్కృత గ్రంథాలు సంస్కృతము లోను, తెలుగు గ్రంథాలు తెలుగులోను వ్రాయబడ్డాయి.

1847 లో క్రైస్తవ దర్శని—క్రిష్టియన్ అబ్జర్వర్ అనే పత్రికలో ఒక వ్యాసము వ్రాసేను. 'బాలం' అను నాతని హిబ్రూ భాషలో 666 సంఖ్యకు గల సంబంధమును గూర్చిన యొక క్షుద్ర కథకు అది జవాబు.

1850 లో ఇల్లిసు, బ్లాక్‌బర్న్, మన్రోలు సమకూర్చిన 'మిరాశీ హక్కులు' అనే గ్రంథాన్ని సంస్కరించి ప్రచారములోనికి తెచ్చేను. దానిని 1852 లో అచ్చు వేసేరు.

మెకంజీ సంపుటాలలో హైదరు, టిప్పుసుల్తానుల గురించి మరాటీ భాషలో వ్రాయబడ్డ చిత్రమైన పుస్తకం చూచి దాన్ని ఆంగ్లేయ భాషలోనికి భాషాంతరీకరించేను. చరిత్రాత్మకమైన వ్యాఖ్యానము కూడా వ్రాసేను. 1849 లో అది అచ్చయింది. తిరిగి దానిని సంస్కరించి దానికి ద్వితీయ ముద్రణ ప్రతి సిద్ధము చేసేను.

'నిస్తార రత్నాకరము' అనే క్రైస్తవ గ్రంథాన్ని నేను ముద్రించేను. అది అంతకుముం దొకసారి ముద్రితమైందట. కాని ప్రతులు లభింపలేదు. ఇది తెలుగు పద్యాలతో ఉన్న క్రైస్తవమత గ్రంథం. కవిత్వ మంత మంచిదికాదు. హిందువులమీది ఆరోపణలను తీసివేసి గ్రంథం సంస్కరించి 3000 ప్రతులను 1852 లో ముద్రించేను. వీనిని ఎస్. పి. సి. కె (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ క్రిష్టియను నాలెడ్జి) వారికి అందజేసేను. మన ప్రవక్తలు విగ్రహారాధనను ఖండింప కుండానే మతబోధన చేసినప్పుడు మన మెందుకు నవీన కాలంలో పట్టి పని చేయరాదు, అని నా ఆదేశం.

1830 ఫిబ్రవరి నెలలో ఒక మదరాసు పత్రికలో నేను వర్తక వ్యాపారములను గూర్చి యొక వ్యాసము వ్రాసేను. అందులో హైందవులకు ముఖ్యంగా వాడుకొను వస్తువులేవి కావలయునో ఆ పట్టిక నిచ్చాను. వాని వివరములు తెల్పేను. దీనిని ఒక బంగాళా దేశపత్రిక కాపీ చేసింది. ఇరవై ఏండ్లయిన తరువాత ఒక అమెరికను గ్రంథములో నేను వ్రాసిన దానిని చూసేను. అంతదూరం అది వెళ్లినందుకు నా కెంతో సంతోషం కల్గించింది.

నా తీరిక సమయాల్లో నవీన ఐరోపాఖండ చరిత్ర చదవాలనిపించింది. దీనికోసం నేను ఇంగ్లీషు, ఫ్రెంచి చరిత్రలు చదివి నోట్సు తీసుకున్నాను. అప్పట్లో తత్త్వశాస్త్రం గురించి ప్రకటితమైన గ్రంథాలు వైజ్ఞానికంగా క్రొత్తగా కనిపెట్టిన సంగతులు కూడా సన్నాకర్షించేయి. వీనిని గూర్చి ఇంగ్లీషు, లాటిను ఫ్రెంచి పుస్తకాలన్నీ చూసేను. ప్రొఫెసరు విల్సనుగారు నన్ను హైందవుల యోగశాస్త్రాన్ని గూర్చి వ్రాయమన్నారు. దానిని వారు హిందూ అధిభౌతిక శాస్త్ర మన్నారు. దానిని గూర్చి సంస్కృతములో ఉన్న గ్రంథాలను తెప్పించి చదివేను. కాని యే రెండు గ్రంథాలు ఒకదానితో ఒకటి సమన్వయం కాలేదు. దీనికొక గురువును కూడా ఏర్పాటు చేసుకొన్నాను. కాని, దానివల్ల లాభం లేకపోయింది. అవి నాకు బాగా అవగాహన కాకపోవడంవల్ల ఆపని విరమించేను.

లండను వెస్టు మినిస్టరులో ఇండియా లైబ్రరీలో ఉన్న ప్రశస్త హిందూస్తానీ కవి సౌదాకావ్యం యొక్క వ్రాత ప్రతి తెప్పించి దాని కొక పరిష్కృతమైన ప్రతి తయారు చేసేను.

1844 వ సంవత్సర ప్రారంభంలో నా తెలుగు—ఇంగ్లీషు నిఘంటువు ముద్రించవలసినదిగా పెక్కుమంది కోరడంచేత ఆ సంవత్సర మధ్యంలో ముద్రణ మొదలు పెట్టేను. కాని చాలాచోట్ల దానిని సంస్కరింపవలసిన ఆవశ్యకత కనబడ్డది. ఇందులో నూటి కెక్కువగా తెలుగు కవుల గ్రంథాలలో ప్రయోగా లున్నాయి. వాటిని సరిచూచి అవి ఆయా స్థలాలలో ఎక్కించాలి. నేను బ్రాహ్మణులనే వ్రాయసకాండ్రుగా నియమించేను. కంపోజిటర్లకు పని ఆలస్యం కాకుండా ఎప్పటికప్పు డందించే యేర్పాట్లు చేసేను. నిఘంటులోను, వ్యాకరణములోను కూడా, నేను వ్రాసిన ప్రతి విషయమును సప్రమాణముగా నిరూపించేను.

దీనితో నా యింగ్లీషు తెలుగు నిఘంటువు ముద్రణ ప్రారంభించేను. కాని ముందుగా దాని నంతటినీ సరిదిద్దేను. 1845 ఫిబ్రవరిలో ముద్రణ ప్రారంభమైంది. రాయలు

ఆక్టోవా సైజులో 1300 పుటలతో, 1853 మార్చికి గ్రంథము పూర్తియైంది. ఈతోవుగా తెలుగు—ఇంగ్లీషు నిఘంటువు కూడా పూర్తి అయింది. అది మొదటిదానితో సమానముగా ఉంది. ఒక కవి ప్రయోగ మేదైనా నేను సూచిస్తే అది మరికొన్నిచోట్ల కూడా ఉపయోగపడేది. నాతో పనిచేసేవారు—బ్రాహ్మణ పండితులు కూడా నాకు బైబిలు, షేక్స్పియరు, మిల్టను—కంఠతః వచ్చునని ప్రశంసించేవారు. ఒక్కొక్క పుటలో, పది నుండి యిరవై వరకు తెలుగు కావ్యాల నుండి ప్రయోగాలు యిచ్చేను. వీనిని నేనే స్వయంగా వ్రాసుకొనేవాణ్ణి. వాటిలో అచ్చుప్రతిలో వ్రాయడం మాత్రమే నావద్ద నున్నవారు చేసే పని. వారు చదువుకున్నవారైనా, ఒక్క కవి ప్రయోగము కూడా నాకు తెలుపలేక పోయేరు.

తరువాత మిశ్రభాషా నిఘంటు ముద్రణ మొదలు పెట్టేను. దీనిలో నవీనమైన యితర భాషా పదాలు ముఖ్యంగా అరబీ పదాలు చేర్చబడ్డాయి. ఇందులో తెలుగు అక్షరములనే వాడేరు. దాని వెనుక "జిల్లా నిఘంటువు" ప్రకటించేను. ఇది ఇంగ్లీషు భాషలో, జిల్లాలలో వాడుకలో నున్న రెవిన్యూ పదాలు, పారిభాషకపదాలు, వీని అర్థములతోనూ ఉన్నది. నేను చేసిన పనుల్లో ఇది చాలా చిన్నది. తీవ్ర విమర్శనకు పాలైంది. కాని యీ పదాలనే విల్సను దొర 1855 లో ప్రకటించిన రెవిన్యూ జ్యూడిషియల్ పదకోశమున సంగ్రహించేడు. కాని అతని గ్రంథము యెంతో సంస్కారం పొందాలి.

ఇట్టి గ్రంథాలు ప్రచురించడములో నా ఉద్దేశ మిది—తెలుగువారి కుపయోగపడవలెననే కాని, యింగ్లీషువారి కొఱకు కాదు. హిందువులకు జ్ఞానాభివృద్ధి కల్గించడమే నా ముఖ్యాశయం, ప్రధానాశయం. నా ఆశయము సఫలీకృతము కావడమునకు వారములో ఆఱు రోజులు ప్రతిదినము 5 గంటల నుండి పది గంటల వరకు పనిచేయడం నా కలవాటు.

ఏదైనా నా గ్రంథం అచ్చు ముగియగానే నేను వెంటనే సంస్కరించడము ప్రారంభిస్తాను. నేను నిఘంటు ముద్రించేటప్పుడునూ, బైబిలు సంస్కరించేటప్పుడునూ పండితులు వ్యాఖ్యానములు అనుక్రమణికలు వ్రాస్తూ ఉండేవారు. నావద్ద యిరువదిమంది పండితులు పనిచేసేవారు. ఆ కాలములో నేనున్న గృహమును "బ్రౌను కళాశాల" అనేవారు.

కొంతమంది తెలుగువారు యింగ్లీషు భాషా శిక్షణ యిమ్మని ప్రత్యేకముగా కోరేవారికి పిల్గ్రిమ్స్ ప్రోగ్రెస్, రాబిన్సను క్రూసో, బైబిలు మొదలైనవి చెప్పుటే కాక, చరిత్ర, భూగోళము మొదలైనవానిని కూడా నేర్పేను.

1845 లో నేను సేకరించిన సంస్కృతాంధ్ర గ్రంథముల వ్రాత ప్రతులు సంఖ్య పెరుగుతూ ఉండడము గమనించి వానిని మద్రాసు లిటరరీ సొసయిటీవారికి యిచ్చివేసేను. 1847 లో వారు నన్ను గూర్చి తమ పత్రికలో వ్రాసేరు.

1846 మధ్యకాలంలో పోస్టుమాస్టరు జనరలు పదవి ఖాళీ అయ్యింది. అప్పుడే తెలుగుభాషాంతరీకరణకర్తగా ఉన్న మారిసు దొర తన పనికి రాజీనామా యివ్వడము జరిగింది. ఆ రెండు పనులకు కంపెనీ ప్రభుత్వంవారు నన్నే నియమించేరు. పారసీ భాషాంతరీకరణ కర్త పదవితో కలిపి నాకు రోజుకు 10 గినీల చొప్పున జీతము వచ్చేది.

ఇంక జీతమూ, భత్యమూ లేని పనులూ కూడా నిర్వహించేవాణ్ణి. విద్యాసంఘ సభ్యుడుగాను, మద్రాసు బ్యాంకు డైరెక్టరుగాను, మద్రాసు ప్రాచ్య లిఖిత భాండాగారము క్యూరేటరుగాను, పరీక్షాధికార సంఘసభ్యుడునుగాను పనులు చేసేను.

ఈస్టిండియా కంపెనీ రాజకీయోద్యోగుల వృత్తాంతం లండనులో ప్రకటితమైంది. అందునేను చేసిన యుద్యోగాలు మరియొకరి కంటకట్టేరు. 1866లో ఓరియంట్ అనే ఫ్రెంచి పత్రిక నా జీవితమును గూర్చి విశేషములు ప్రకటించింది, గాని అవి సరిగ్గాలేవు.

క్రీ. శ. 1700 ప్రాంతంలో ఫ్రెంచి మిషనరీలు ఫ్రెంచి తమిళ నిఘంటువును, ఫ్రెంచి తెలుగు నిఘంటువును తయారుచేసేరు. వారీభాషను 'తెలింగ' లేకబడగ అని వ్యవహరించేరు. ఆ వ్రాత జిలుగుగా ఉన్నది. ఆ గ్రంథకర్తలు తమ పేళ్లను తెలిపేరు. వారు ఒక వేయింటికి పైగా వ్యవహారములోనున్న పదాలను చాల శ్రమచేసి కూర్చేరు. కాని దానిని తిరిగి నేను 1855 లో ఇంగ్లండు వెళే వరకు చూడడము తటస్థించలేదు.

ఈ స్వీయ చరిత్రలో నేను ప్రభుత్వపక్షాన్ని, తెలుగు, పారసీ, హిందూస్థానీ భాషలను గూర్చి చేసినపనులను తెలుపలేదు. ఏమంటే నాకువారు జీతమిచ్చి పనిచేయించేరు, నా క్రింది వారు నాకు తోడ్పడ్డారు.

నేను రచించిన తెలుగు వ్యాకరణం మొదటి ముద్రణ ప్రతు లొక్కసారిగా అమ్ముడుపోయేయి. దానిని పెంపుడు చేసి, 1857వ సంవత్సరంలో తిరిగి ముద్రించేను.. మూడవ ముద్రణ కొఱకు వెంటనే దాన్ని సంస్కరించియుంచేను.

ఈ తరువాత తెలుగుభాషలో వ్రాయబడ్డ కొన్ని వ్యాకరణములు ప్రకటితములైనాయి. అని నా వ్యాకరణం కంటె చిన్నవిగా ఉండడమేగాక సులభంగావున్నవని కొందఱు తెలిపేరు. కాని వ్యాకరణములో నేర్చుకోవలసిన విశేషాలను విడిచిపెట్టుట యెట్టిదంటే, భూగోళశాస్త్ర రచయిత, పట్టణాలు, నదులు, సరిహద్దులు విడిచిపెట్టిన రీతి అని తెలుసుకోవాలి.

ప్రస్తుతం తెలుగు విద్యార్థులుపయోగించు పుస్తకాలు, విషయగ్రహణమునకు లాభదాయకాలు కాకపోవడం చేత నేను కొన్ని మార్గోపదేశికలను (గైడ్సు) రచించాను. అవి సాధారణ వ్యవహార భాషనుండి కవిప్రయుక్తమైన గ్రాంథిక భాషవరకూ నేర్చుకోడానికి వీలుగా సమకూర్చబడ్డాయి.

నేను కొన్ని రీడరులను (వాచక పుస్తకములను) ప్రకటించేను. అందు మొదటిదానిలో కథలు, ఉత్తరాలు, కేసులు ఉంటాయి. వానిలో పాత్రలు స్వాభావికముగా నుండేవే.

రెండవతరగతి రీడర్లలో, ఆంగ్లేయ భాషాంతరీకరణము లున్నాయి. మూడవదానిలో వ్యాకరణాంశాలు, చిన్నపదకోశమూ ఉన్నవి.

ఉత్తరాలు, కొన్ని దస్తావేజులు ఉన్న రెండోవాచక పుస్తకాన్ని ముద్రించడానికి ఒక ప్రతిని సిద్ధంచేసి మద్రాసు లైబ్రరీలో ఉంచేను. నా తరువాతివారు దానిలో కొన్నింటిని ముద్రిస్తారని ఆశిస్తున్నాను. మొదటి వాచకం తమిళం కన్నడం, మళయాళ భాషలలో అనువదించబడాలి. దేశీయులు దానిని సునాయాసంగా చేయగలరు. నేనే ఆపని చేదామని మొదలుపెట్టేను. కాని యింతటితో నా ఆరోగ్యం చెడిపోయింది. ఇంగ్లీషు నేర్చుకునే స్వదేశీయుల కది ఎంతో ఉపయోగపడు తుంది.

జగన్నాథ క్షేత్రానికి పశ్చిమంగా ఉన్న ఒరియాలేక ఓఢ్రదేశంనుండి ఒక బ్రాహ్మణబాలుడు తన్ను పోషించమని అర్జీ పెట్టుకున్నాడు. అతడు సంస్కృతము చదువుతున్నాడు. నేనతణ్ణి తెలుగు వాచకాన్ని ఓఢ్రభాషలోనికి అనువదించ మన్నాను. అది 1851లో పూర్తిఅయింది.

బడి పుస్తకాల్లో నేను కూర్చిన తరువాతి పుస్తకం 'వాక్యావళి'. పియర్‌సన్ బంగాళా వ్యాకరణాన్ని అనుసరించి నది. ఇందులో ఇంగ్లీషు వ్యాకరణాంశాలు గ్రహించడానికి కొన్ని అభ్యాసాలున్నాయి. ఇది స్వదేశీయులకీ, విదేశీయులకీకూడా ఉపకరిస్తుంది. తెలుగు, హిందూస్థాని, తమిళ భాషల్లో ప్రకటితమైంది. ఈ రచనలన్నింటిలోను నేను విధివిరామం లేకుండా పనిచేసేను. ఏ క్లిష్టమైన ప్రశ్నకు జవాబులు వ్రాయకుండా ఉండలేదు.

వార్సుఆఫ్‌ది రాజాస్ (రాజుల యుద్ధము) అనే తెలుగు వచన గ్రంథాన్ని ఇంగ్లీషు అనువాదంతో ప్రకటించేను. ఇది 1750—1800 ప్రాంతంలో బళ్లారి జిల్లాలో జరిగిన ఒక చారిత్రక సన్నివేశానికి సంబంధించినది.

బైబిలులో ఉన్న కీర్తనలు అనేభాగాన్ని ప్రకటించేను. సంస్కృత శ్లోకాలలో ఇమిడియ్యున్న లోకోక్తులన్నింటిని సేకరించి, వానిని తెలుగులిపిలో ముద్రించేను. సంస్కృత శ్లోకాలతో ఉండే సెంటుపాల్ జీవితాన్ని, సంస్కృత భాగవత మును తెలుగులిపిలో అచ్చువేయించేను.

తెలుగులో వాడుకగా చెప్పుకునే కథల సంపుటి ప్రక టించేను. గ్రామస్థుల తగాయిదాలు— వ్యవహారాలను తెలిపే పుస్తకాన్ని ఇంగ్లీషు అనువాదంలో ముద్రించేను. నేను ఇం గ్లండు వెళ్లిపోయినతరువాత నేను ప్రకటించిన వాని నన్నింటిని అధికారులు, పఠనీయ గ్రంథాలుగా నిర్ణయించి ప్రచారం లోకి తెచ్చారు.

బైబిలుయొక్క తెలుగు అనువాదాన్ని సంస్కరించడం ప్రారంభించేను. నా యింగ్లీషు— తెలుగు నిఘంటువు సంస్కర ణం అప్పుడు జరుగుతుండడముచేత, బైబిలులో ప్రతిదానికి సరియైన అర్థము తెలుసుకోవడానికి వీలైంది.

గ్రంథ ముద్రణవల్ల యెంతలాభము కలుగుతుందో, ఆ విషయం తెలుగువారికి ప్రబోధించడానికి నా సాయశక్తుల తంటాలు పడ్డాను. ఇరవైయేళ్లయిన తరువాత, నా ప్రతి ధాన్ని వారనుసరించినందుకు నా మనస్సున కెంతో హాయికల్గిం చింది.

ఈ పనులు నేను మొదలుపెట్టేసరికి, తెలుగు సాహిత్య దీపం, మిణుకుమిణుకు మంటూ ఆరిపోయేస్థితిలో ఉంది. 1813లో స్థాపింపబడిన మద్రాసుకాలేజి స్వల్పంగా తోడ్ప డ్డది. కాని కంపెనీ అధికారులు పండితులు వ్యర్థంగా ఉపకార వేతనాలు పొందుతున్నారని భావించేరు. అది తెలిసికొని నేనూ నా పండితులు చాలా విచారించేము.

ముద్రణ కనిపెట్టకపూర్వము, ఐరోపాఖండంలో గ్రీకు లాటిను ప్రాచీన కావ్యాల పరిస్థితి ఎంతహీనముగా ఉండేదో తెలుగులోకూడా, పూర్వకావ్యాల స్థితి అంత దయనీయంగా ఉండేది, నా సమక్షంలో ఆ కావ్యాలు, అనేక వ్రాతప్రతుల సహాయంతో, పరిష్కరింపబడిన పాఠాలతో, చక్కగా సంస్క రింపబడిన తరువాత, వాటియొక్క విశిష్టత లోకానికి వెల్లడి అయింది. ఇవి ముద్రితమైనాయి. వీనితో తెలుగు లిపితో సంస్కృత కావ్యాలు కూడా అచ్చయినాయి. ఈ లాంటి సౌకర్యాలచేత, ఇక తెలుగు భాష— హిందూదేశ భాషల్లో నేర్చుకోడానికి చాల కష్టమైనది, క్లిష్టమైనదీ అనే అపోహ ఎంతమాత్రము ఉండదు.

ఒకభాష— సాహిత్యాన్ని ఉద్ధరించడమంటే అది అత్యంతమూదుర్ఘటమైన కార్యం. అందులోనూ ఒక పాశ్చాత్యుడు పూనుకుంటే చెప్పవలసిన దేముంది?

ప్రస్తుతం, తెలుగులో ఒక వారపత్రిక ఉన్నది. తెలుగువారు తమిళులు నడుపుచున్న ముద్రాక్షరశాలలు వెలిసేయి. హైందవులు చివరకు గ్రంథముద్రణ చాలా లాభదాయక వ్యాపారమని గ్రహించేరు. కొంతమంది గ్రంథ ప్రచురణకర్తలకు నా పుస్తకాలు విలువగలవిగా తోచినను, వానివలన నా కొక దమ్మిడీ కూడా లభించలేదు. ఆ పైన కొన్ని పుస్తకాలవల్ల నా స్వంత సొమ్ముకూడా పూర్తిగా ఖర్చయి పోయింది. కాని గ్రంథాలవల్ల ధనసంపాదన నా దృష్టికాదు. నేను ప్రథమంగా ఒకభాషను గూర్చి చేసిన పరిశ్రమ ఫలవంత మైందని తెలుసుకొని ఎంతో ఆనందము పొందేను.

ఇంగ్లీషుభాషలో బోధన విధానముల ప్రవేశపెట్టడము హైందవులకెంత మాత్రము సరిపోదు. వారు దాన్ని ఏవగించు కొంటారు. ఈ యింగ్లీషు భాషాబోధనే దేశంలో స్థిరపడితే, ఇక హిందూమతం పూర్తిగా పేరు మాసిపోతుందని వారి అభి ప్రాయం.

మదరాసు విశ్వవిద్యాలయంవారు, క్రైస్తవ మతాన్ని గూర్చి చెప్పారు. కాని జ్యోతిషశాస్త్రం, భూగోళశాస్త్రం మొద లైన వానిని గూర్చి శిక్షణ యిస్తారు. ఇవి కొన్ని మూఢ నమ్మకా లను తొలగిస్తాయి. ఆ విధంగానే, శరీరావయవ శాస్త్రం, (అనాటమీ) బోధనవల్ల శుష్కవేదాంత వాదం వ్యాప్తిలో ఉండదు.

ఏష్యాటిక్ సొసాయిటీ జర్నలులో సర్ విలియము

జోన్సు అనే మహనీయుడు తన కాలంలో పాశ్చాత్యులను గూర్చి యిల్లా వ్రాసేడు.

"ఉపకార వేతనం పొందుతూ, ప్రపంచంతో సంబంధం పెట్టుకోకుండా జీవితమంతా సారస్వత సేవకే అంకితం చేసే విద్వాంసుడు, య్యూరోపీయులలో ఉండడనే చెప్పాలి. ఇక్కడ ప్రతివ్యక్తికి కావలసినది వ్యవహారము. రాజకీయంగానో, లేక, సైన్యంలోనో ఏదో ఉద్యోగ సంపాదన— అందతికి ప్రభుత్వ శాఖలలో పనిచేయడం— అధికారం చెలాయించడం. రాజకార్యాల్లోనే నిమగ్నులై ఉండడం— ఇదేతప్ప, ఏ స్వల్పకాలమైనా చదువు, సంస్కారం కోసము వినియోగించు పద్ధతేలేదు."

పై అంశాలవల్ల రాజకీయోద్యోగులు కొంతమంది కొంతకాలము, విద్యాభివృద్ధి, జ్ఞానాభివృద్ధికి పరిశ్రమ చేయడం మంచిదని తెలుస్తుంది. ఇది తక్కిన ఉద్యోగులను ప్రోత్సహిస్తుంది. నేడు హిందూదేశానికి సంబంధించిన సివిలుసర్వీసు పరీక్షలు క్రమపద్ధతిని నడుస్తున్నవి. లేకపోయినట్టయితే— సర్ థామస్‌మన్రో, సర్ జె. మాల్కాం, సర్‌హెన్రీ పాట్టింగర్ మొదలగు యువకుల్లోనిక్షిప్తమై ఉన్న ప్రతిభ వ్యక్తమయ్యేదే కాదు.

ఇండియాలో విరామం లేకపోవడం అభిరుచి లేకపోవడంగా భావిస్తారు. నా కెప్పుడూ విరామంగావే ఉండేది. షేక్స్పియరు, ఆక్సవెల్, నాటకం 2వ అంకం మొదటి రంగంలో యిలా చెప్పేడు.

"Oft expectaton fails, and most oft there, where most it Promises: and oft it hits where hope is coldest, and despair most sits.

1853లో యేభై అయిదోయేట నాకు పక్షవాతం వచ్చింది. డాక్టర్లు నన్ను మద్రాసుకు 400 మైళ్ల దూరంలో నీలగిరి కొండల మధ్యనున్న ఉదకమండలము పంపేరు. అక్కడ వాతావరణం నా ఆరోగ్యాన్ని చక్కపఱచింది. అక్కడ ఉండే ఒక క్రైస్తవ కుటుంబము వారు నన్నెంతో ఆదరభిమానాలతో చూసేరు. వారిదైవభక్తి— వినమ్రత నా హృదయానికి శాంతి సమకూర్చేయి. ఉల్లాసం, ఉత్సాహం కలిగినా డాక్టరులు గ్రంథపఠనం మాత్రము వద్దన్నారు. ఇక్కడ "రివరెండు డాక్టరు బెర్నుహార్డు స్కిమిడ్" అనే వృద్ధుని పరిచయం గల్గింది. ఆతడంతకు చాలాకాలంక్రితము తమిళములో మూడు క్రైస్తవమత గ్రంథాలు ప్రచురించేడు. పెంటుథామస్ జీవితాన్ని తమిళంలో ప్రకటించేడు. వానిని పునర్ముద్రణం చేయడానికి సంకల్పించేడు, గాని ధనాభావంవల్ల విరమించేడని విని, నేను, ఆ పుస్తకాలు ఒక్కొక్కటి 3000 ప్రతులు ముద్రించడానికి యేర్పాటు చేసేను. అవి పీఠికతోగూడ— మద్రాసు క్రిస్టియను హెరాల్డు అనే పత్రికలో సమీక్షింప బడ్డాయి. (13 సెప్టెంబరు 1854)

1857—60 మధ్య తెలుగు బైబిలు పూర్తిగా మదరాములో అచ్చయింది. ముఖపత్రంమీద అది గార్డను అండ్ ప్రిట్‌చెట్ అనే యిద్దరు 1815—40 ప్రాంతాలలో తయారుచేసిన భాషాంతరీకరణాన్నిబట్టి ముద్రితమైనది అని వ్రాసేరు. కాని యిది సరికాదు. ఆ అనువాదంలో ఉన్న శైలి చూస్తే నేను తయారుచేసిన అనువాదంలో పుటలు యథామాతృకంగా ముద్రితమై యున్నాయని తెలుస్తుంది. దీన్నిచూచి 1859లో వార్డ్లా—హా అనే క్రైస్తవ మిషనరీలు, నా అనువాదాన్ని అచ్చువేసేరు.

నేను ముప్ఫయియేండ్లుగా యిక్కడ ఉన్నప్పటికి హైందవ సంఘముతో సంపర్కం కలిగించుకోలేదు. వారి ఉత్సవాల్లో, విందులలో పాల్గొనలేదు. నాతో పనిచేసేవారితో తప్ప తక్కిన హైందవులతో నాకేమాత్రం సంబంధంలేదు. నేను ప్రత్యక్షంగా బ్రాహ్మణ మతవిరోధినని— దేశీయులెవ్వరు నావద్దకు వచ్చేవారుకారు. నేను వేమనపద్యాలను ప్రకటించడము, జంగమ సాహిత్యాన్ని ప్రచారము చేయడమూ దీనికి కారణాలు.

నేనెన్నో గ్రంథాలు ముద్రించేను. కానివాని అన్నింటిలోను సంస్కారము చేయవలసినవి చాలా ఉన్నవని గ్రహించేను. ఈ చిన్న జీవితస్మృతులను చదివిన కొంతమంది నేను చెప్పవలసినదంతా చెప్పేనని అన్నారు. కానిమనకు తెలిసినదెంత !

"Sique sui memores alio fecere merendo."

షేక్స్పియరు యిలా అన్నాడు (ఆక్స్‌వెల్, 2—1.)

He that of greatest works is finisher oft does them by the weakest minister.

ఈ చరిత్ర యింతవఱకు వ్రాసిన తరువాత నాకు బెంగుళూరు, శ్రీరంగపట్టణం మొదలైన స్థలాలని మఱొకమారు చూడాలని వెళ్లేను. తిరిగివచ్చిన దగ్గఱనుంచి నా ఆరోగ్యం చెడిపోయింది. ముఖ్యంగా నిద్రపట్టడంలేదు. నాకు సోదరీమణులవంటి వారింగ్లండుకు నన్ను రమ్మన్నారు. డాక్టర్లుకూడా జబ్బు ముదరకముందే ఇంగ్లండువెళ్లిపోతే బాగుంటుందని సలహాయిచ్చారు. నేనిక్కడ చేయవలసిన పనులు ముగించుకొని, ఏప్రిల్ 1855లో రెండవసారి పదిహేడేండ్ల ఉద్యోగ పరిమితి పూర్తిచేసి హిందూదేశమునకు వీడ్కోలు చెప్పేను.

మద్రాసు కాలేజీవారు నేను సంపాదించిన వ్రాత ప్రతుల నన్నింటినీ తీసుకొంటామని నన్ను ఒక కేటలాగు చేయమన్నారు. కాని అందులో కొన్ని జిలుగు వ్రాతలలో ఉండడముచేత నా ఆరోగ్య పరిస్థితి ననుసరించి ఆ పని చేయలేదు. వానినిగూర్చి నివేదికను పంపడానికి ఒక సంఘాన్ని నియమించేరు. వ్రాత ప్రతులన్నీ కోర్టు పత్రాలవలె చాలా విలువగలవి. దీన్ని గ్రహించలేక, ఆ సంఘమువారు, ఈ వ్రాత ప్రతులు ముద్రితాలైనాయని, వీనిని భద్రపఱచవలసిన ఆవశ్యకత లేదని, తక్కిన పుస్తక భాండాగారాలకు పంపవలసిన

దని సిఫార్సు చేసేరు. నేను దానిని చాల ధైర్యంతో ప్రతిఘటించేను. అవి తిరిగి ప్రాచీన గ్రంథాల్ని ముద్రించేటప్పుడు సంప్రతించడమునకు ముఖ్యమైన ఆధారమని ప్రకటించేను. దానితో వారాసని మానుకొన్నారు. 1857—62లో కేటలాగ్ రైసోని అనే పేరుతో వానివివరాలు ప్రకటించేరు. దాని ఉపోద్ఘాతంలో డి. యఫ్. కార్మికలు నేను చేసిన సేవను ప్రశంసించేడు. కాని వీనిలో సంస్కృతగ్రంథ వివరణాన్ని ప్రొఫెసరు బూలరు తీవ్రంగా విమర్శించేడు. చూడండి. "మద్రాసు జనరల్ఆఫ్ లిటరేచర్"జూలై 1864.

నేను తిరిగివచ్చేక ఇంగ్లండులో రెండేళ్ళకే నా ఆరోగ్యం కుదుట బడ్డది. నా దృష్టి చక్కగా ఉంది. హిందూదేశ శీతోష్ణస్థితి ప్రభావం నామీద ఏమీలేదని నన్ను చూచిన వారందఱూ అన్నారు. కాని నా డెబ్భయ్యో యేట తిరిగి నాకుపక్షవాతం వచ్చింది. ఇప్పట తీవ్రమైన శీతల పరిస్థితి నాకు యిబ్బంది కలిగించలేదు. తెలుగు చదవడం తిరిగి ప్రారంభించేను. నా తీరిక సమయాల్లోనూ లండనులో ఉన్నప్పుడు నా కిదేపని. నా నిఘంటువులకు, వ్యాకరణానికి ఎన్నో క్రొత్తవిషయాలు చేర్చేను. వానివల్ల అవి రెండింతలుగా పెరిగేయి. నేను నిఘంటువు మొదలుపెట్టినప్పుడు కవి ప్రయోగాలు వ్రాతప్రతుల పాఠాలను ఆధారంగా చేసుకొని యిచ్చేను. కానినేను యింగ్లండు వచ్చేముందు వానిలో కొన్ని ముద్రితాలయినాయి. అందుచేత వానిని తిరిగి ముద్రిత పాఠాలతో పదిహేనేండ్లు పరిశీలించేను. ఇప్పుడా నిఘంటువు చాలా ఉపయోగకరమని విద్వాంసులు లాదరిస్తారని నా నమ్మకం.

విల్సను దొర సమకూర్చిన రెవిన్యూ న్యాయపద కోశానికి నేను ఎన్నో సవరణలు వివరణలు చేసేను. ఇంకా తీరిక ఉన్నప్పుడు ఇంగ్లీషు నిఘంటువునకు క్రొత్తపదాల అనుబంధం తయారుచేసేను. సామ్యూయల్ జాన్సన్ నిఘంటువును తీసికొని, వానిమధ్య కాగితాలను అతికించి, అతని గ్రంథంలోలేని ప్రయోగాలను వానిలో వ్రాసేను. ప్రాచీన నవీన గ్రంథాలను పరిశోధించిన టాడే, వెబ్స్టరు, క్రెయిగ్ అనే నిఘంటు నిర్మాణకర్తలు విస్మరించిన వానినన్నింటిని సంగ్రహించేను. ఇంతేకాక ఫ్లెమింగు, టిబ్బిను అనే ఫ్రెంచి నిఘంటువులకు నూటికి పైగా క్రొత్తపదాలు చేర్చేను.

లండను విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసరుగా నుండమని ఆహ్వానం వచ్చింది. నా కంటె సమర్థులున్నా నా మిత్రుల ప్రోత్సాహంచేత నేను దానిని అంగీకరించేను. ఉన్నత విద్యాభ్యాసంకోసం చాలా కాలము ఉండడానికి యువకు లంగీకరించరు. కాబట్టి ప్రొఫెసరుకేపని అంతా ఉంటుంది. 1863 హిందూదేశపు సివిల్‌సర్వీసు పోటీపరీక్షలు ప్రథమంగా యేర్పాటైనప్పుడు నన్నే తెలుగు పరీక్షకుడుగా ఉండమని ప్రభుత్వమువారు కోరేరు. కాని నేను 1869 నుండి మాత్రము పరీక్షకుడుగా ఉన్నాను. ఆ పరీక్షకు నిర్ణీతమైన పుస్తకాలు నేను రచించినవే.

"మిరియమ్ బి— అనే పదహారేళ్ల యువతి తనకు సంస్కృతభాష నేర్పమని నన్ను కోరింది. ఆమెకు దేవనాగరి అక్షరాలు నేర్పేను. ఆమె వేగంగానే సంస్కృతంలో ప్రవీణత సంపాదించింది. రెండేళ్లయాక ఆమెను బంగాళీభాష చదవమని ప్రోత్సహించేను.

"హైందవుల పరిస్థితి"ని గూర్చి నే నొక యుపన్యాసము వ్రాసేను. అది పన్నెండు పట్టణాల్లో ప్రచారంలోకి వచ్చింది. తక్కినచోట్ల యింకా అది వ్యాప్తిలో ఉంటూన్నది.

'హైందవ కాలనిర్ణయం' అనే పుస్తకాన్ని విపులీకరించాను. అది 1863 లో ప్రకటితమైంది. నా పుస్తకము ఏదైనా అచ్చయినవెంటనే దానికి మార్పులు, చేర్పులు నేను చేస్తూనే ఉంటాను. ఒక్కొక్కప్పుడు ప్రాథమికంగా పటుత్వం లేకుండా వ్రాసిన గ్రంథాలకు కూడా విలువవస్తుంది. నేను 1837లో ప్రకటించిన— "సంస్కృత ఛందస్సు." జర్మను దేశములో "గోల్డుస్టక్కరు" అనే యువకుని చేతిలో పడ్డది. అతనికి సంస్కృత భాషయందభిరుచి కల్గించింది నా పుస్తకమేనట. అతడు పెద్ద విద్వాంసుడై లండను విశ్వవిద్యాలయంలో సంస్కృత ప్రొఫెసరుగా ఉన్నప్పుడు, నన్ను కలిసికొని, పై వృత్తాంతమంతా చెప్పేడు. అంతేకాక అది సంస్కృతము నేర్చుకొనేవారికి చాలా ఉపయోగకరమైనదనీ దాన్ని సంస్కరించి పునర్ముద్రణం చేయుమని ప్రోత్సహించేడు. నేనున్నూ ఆ ఛందో గ్రంథాన్ని పరిష్కరించి 1869లో ముద్రించేను.

తాను చేయబోయేపనికన్న చేసినపని గూర్చి చెప్పుకోవడం ఉచితమే, అని సామ్యూయల్ జాన్సన్ అన్నాడు. చూడండి (బాస్వెలు—24 అధ్యాయము)

ఇందులో నేను వ్రాసిన విషయాల్ని, యింతవఱకు, ఎవ్వరూ ఆక్షేపించలేదు కాబట్టి నేను వినమ్రతతో మనుష్యుడు తనను గూర్చి తాను తెలిసికొన్న సత్యం చెప్పటం సరియైనది అన్న వెస్లీ వాక్యాన్ని స్మరిస్తూ దీనిని ముగిస్తున్నాను.

హెలెనా—యిల్లా (షేక్స్పియరు—ఆక్స్‌వెన్)

Our remedies oft in ourselves do lie which we ascribe to heaven: the fated sky gives us free scope, only doth back-ward pull our slow designs when we ourselves are dull.

—అనువాదకుడు ఒకరు.

శ్రీ సి. పి. బ్రౌను 1798–1884 (చార్లెసు ఫిలిప్ బ్రౌను) గురించి పరిచయ వాక్య మనవసరము. ఆయనపేరు తెలియని తెలుగు సాహిత్య ప్రియుడులేడు. తెలుగు సాహిత్యానికి చేసిన సేవ మనము తీర్చలేని ఋణము. ఆయన స్వీయచరిత్ర ఇంగ్లీషున మొదట 1866 లోను, తరువాత 1895 లోనూ అచ్చయినది. తెలుగులోకి అనువదింపబడి అచ్చవుట ఇదే ప్రథమం.—(సం.భా)

భారత విబంధ విధానము

'పరిశీలక్'

1962 అక్టోబరు 20వ తేదీన కమ్యూనిస్టుచైనా సైన్యాలు భారత ఉత్తర సరిహద్దులను భంగపరచి, ముందుకు చొచ్చుకురావడంతో, వైదేశిక దృష్టి రీత్యా భారతదేశం పెట్టుకుంటూ వచ్చిన భ్రమలు కొన్ని తొలగిపోయాయి. "నవీన ప్రపంచంలో మనం యధార్థ పరిస్థితులకు దూరంగా ఉన్నాము. స్వయం కల్పితమైన ఒక కృత్రిమ వాతావరణంలో నివసించాము. చైనా దురాక్రమణ భారత ప్రభుత్వాన్ని, ప్రజలను నిశ్చేష్టులుగా చేసింది" అని ఆరోజున ప్రధాని శ్రీ నెహ్రూ భారత ప్రజానీకానికి చెప్పుకోవలసి వచ్చింది.

కమ్యూనిస్టు చైనా సైన్యాలు భారత సరిహద్దుల్లో ముందుకు చొచ్చుకొని వచ్చిన కొలది, ఆయుధ బలంలోను, సరిహద్దు స్థావరాలలో చైనాది పైచేయిగా ఉందని తెలుసుకున్నకొలది, ఒక్కొక్కటిగా మన సైనిక స్థావరాలు శత్రువు వశమౌతూ వచ్చిన కొలది, భారత దేశపు దృక్పథంలో పెద్ద మార్పు సంభవించింది. నెహ్రూ ప్రభుత్వం అనుసరిస్తున్న విబంధ విధానం (నాన్—ఎలైన్‌మెంట్) ప్రయోజనమేమిటన్న ప్రశ్నలు వినవచ్చాయి. ఏ విబంధ విధానంకింద పరాయి దేశాలనుంచి ఆయుధ సహాయం పొందడం తగదని భావించామో, ఆ విధానపు ముసుగులోనే, ఆ భావనకు స్వస్తి చెప్పి, అటు పశ్చిమ రాజ్యాలను, ఇటు కమ్యూనిస్టు రాజ్యాలను కూడా ఆయుధ సహాయం చేయమని భారత ప్రభుత్వం అభ్యర్థించింది. అమెరికానుంచి, బ్రిటన్‌నుంచి, తదితర పశ్చిమ రాజ్యాల నుంచి హుటాహుటిని అశేషంగా వచ్చిన ఆయుధ సహాయాన్ని చేపట్టి, సైనిక స్తోమతను పెంచింది. భవిష్యత్తులో చైనా దురాక్రమణను ఎదుర్కొనడానికి అవసరమైన సర్వ సైనిక సహాయ స్వీకరణకు సంసిద్ధతను ప్రకటించింది. విదేశ సైనిక నిపుణుల బృందాలను ఆహ్వానించింది.

భారత సైనిక బృందాలను, మంత్రులను, అధికారులను పశ్చిమ దేశాలతో సమాలోచనలకు పంపించింది. విబంధ విధానపు మూల సూత్రాల ప్రకారం కమ్యూనిస్టు దేశాలకు కూడా సైనిక సహాయానికి భారత దేశపు విజ్ఞప్తులు వెళ్లాయి. కాని, పశ్చిమ దేశాలనుంచి లభించినట్టుగా, సమయానికి అవసరమైన ఆయుధ సహాయం, కమ్యూనిస్టు దేశాలనుంచి ధారాళంగా లభించలేదు. కమ్యూనిస్టు చైనాకు వ్యతిరేకంగా ఇతర కమ్యూనిస్టు రాజ్యాలు భారత దేశానికి అండగా నిలబడవనేది అనుభవ పూర్వకంగా ధ్రువపడింది. మొత్తంమీద చెప్పుకోవాలంటే కమ్యూనిస్టు చైనా దురాక్రమణ సాగించిన సమయంలో భారతదేశం పూర్తిగా పశ్చిమ రాజ్య కూటంవైపు మొగ్గు చూపింది. పశ్చిమ రాజ్యాలు కూడా భారత దేశాన్ని పూర్తిగా ఆదుకున్నవి. ఈ పరిణామాన్ని గమనించిన మీదటనే "లండన్ టైమ్సు" పత్రిక ఢిల్లీ విలేఖరి కింది విధంగా వ్రాశాడు:—

"అక్టోబరు 20న చైనా దండయాత్ర ఆరంభమైన నాటినుంచి భారతదేశం విచారకరమైన నవ ప్రపంచంలో తన స్థాన మేమిటో తెలుసుకొనడానికి ప్రయత్నిస్తున్నది. ఇందుకు సంబంధించిన పునరాలోచనలు ఇంకా ఆరంభం కాలేదుకాని, ఇంత కాలంగా అంతర్జాతీయ రంగంలో తనకు తానై భారత దేశం సృష్టించుకున్న విచిత్రమైన స్థానాన్ని, ప్రతిపత్తిని అది తిరిగి ఆక్రమించలేదనేది స్పష్టంగా కనిపిస్తోంది. వైదేశిక నీతిలో భారతదేశం ఇంతవరకూ అనుసరిస్తూ వచ్చిన విబంధ విధాన కాండ ఇక ముగిసినట్టే. భారత దేశంలో ఇప్పుడున్న ఉద్రిక్త పరిస్థితులనుబట్టి, దీనివల్ల ఆదేశానికి నష్టం లేకపోవచ్చు."

కమ్యూనిస్టు చైనా దురాక్రమణ ఫలితంగా కేవలం భారత భూభాగాలకు మాత్రమేకాక, భారత వైదేశిక నీతికి కూడా తిరుగులేని దెబ్బ తగిలిందని చెప్పుకోవచ్చు. అయితే ఇలాంటి పరిణామం ఎందుకు సంభవించింది?

"ఒకదేశం వైదేశిక విధానమనేది దాని చరిత్ర, దాని స్వప్రయోజనాలు, దాని అవకాశాలు మొదలైన వాటితో రూపొందుతుంది. ఈ అంశాలన్నీ ఆ యాకాలపు వ్యక్తుల ద్వారా ప్రతిబింబిస్తాయి. వ్యక్తులే విధాన నిర్ణేతలుగా ఉంటారు. అలాంటి వ్యక్తులు ఉదాత్తులుగా ఉండాలి" (లూయీఫిషర్. రష్యా, అమెరికా అండ్ ది వరల్డ్) భారత దేశానికి సంబంధించినంతవరకు దాని చరిత్రనుబట్టి, ఇరుగు పొరుగు రాజ్యాలతో స్నేహ సంబంధాలను కలిగి ఉండడ మనేది దాని వైదేశిక నీతికి మూల సూత్రం కావాలి. అలాగే దాని స్వప్రయోజనాలనుబట్టి చూచినా, ముందుగా ఆసియా ఖండంలో అది తన స్థానాన్ని బలపరచుకోవాలి. అందుకు తగిన అవకాశాలు చారిత్రకంగాను, భౌగోళికంగాను భారత దేశానికి ఉన్నాయి. పూర్వ చరిత్ర సంగతి ఎలా ఉన్నా, గత రెండు శతాబ్దాలలోను, బ్రిటిష్ పాలక వర్గాల నాయకత్వంకింద ఆ అవకాశాలను వినియోగించుకొని ప్రముఖ పాత్రను నిర్వహిస్తూ వచ్చింది. బ్రిటిష్ పాలనలో భారత సైన్యాలు రెండు రకాలుగా కీలకమైన పాత్రను నిర్వహించాయి. ఒకటి, అంతర్గతమైనది. రెండు బహిర్గతమైనది. భారత ఖండాన్ని మరొకరు ఆక్రమించకుండా భౌగోళికమైన భద్రతను సమకూర్చిన పాత్ర అంతర్గతమైనది. తూర్పున చైనా—జపాన్‌లు, పశ్చిమాన టర్కీ సామ్రాజ్యం, ఉత్తరాన రష్యా సామ్రాజ్యానికి మధ్యవున్న ఆసియా ఖండంలో బ్రిటిష్‌వారి ఆధ్వర్యానవున్న పాత భారత సైన్యం బలిష్టమైనదిగా ఉండేది. బ్రిటిష్‌వారి కాలంలోనే చైనా, టర్కీలు బలహీనమై పోయాయి. చివరి కాలంలోకాని, జపాన్‌నుంచి

దురాక్రమణ ప్రమాదం సంభవించలేదు. కాగా, ఒక్క రష్యా నుంచి మాత్రమే దురాక్రమణ ప్రమాదమనేది సంభవించే అవకాశం కనిపించింది. దానిని నిరోధించడానికే బ్రిటిష్‌వారు టిబెట్, నేపాల్, ఆఫ్ఘనిస్థాన్, పర్షియా వగైరా బఫర్ రాజ్యాలను సృష్టించారు. సైనిక సన్నాహాలను కూడా ఆ భాగాలలోనే కేంద్రీకరించి భారత ఖండానికి బహిర్గతమైన ప్రమాదం రాకుండా చేశారు. బ్రిటిష్‌వారు తమ నౌకా బలంతో సముద్ర మార్గాల నుంచి కూడా ప్రమాదం రాకుండా కాపాడారు. ఈ విధంగా "బ్రిటిష్ సామ్రాజ్యవాదం" సమకూర్చిన రక్షణ వలయంలో ఆసియాలో రక రకాల రాజకీయ పరిణామాలు సంభవించాయి. ఆసియా ఖండానికి, ఆసియా రాజ్యాలకు ప్రపంచంలో ఒక ప్రత్యేకత లభించింది. అందుకు భారతదేశం కీలకంగాను, నాయకురాలుగాను రూపొందింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి ఈ పరిస్థితులలో మార్పు వచ్చింది. బర్మా వేరు రాజ్యమైంది. భారత్—పాకిస్థాన్‌లు విడిపోయాయి. సింహళం స్వతంత్ర్యమైంది. ఉత్తర సరిహద్దున రష్యాతోపాటు చైనా కూడా బలంకలిగిన రాజ్యంగా అవతరించింది. బ్రిటిష్‌వారు ఏర్పరచిన రక్షణవలయం పోయింది. బ్రిటిష్ నౌకాబలం అండలేదు. అయినప్పటికి స్వతంత్ర భారత ప్రభుత్వం మాత్రం బ్రిటిష్‌వారు సృష్టించిన అంతర్జాతీయ ప్రతిపత్తిని, జాతీయమైన కీర్తి ప్రతిష్టలకు జోడించి, బ్రిటిష్ ప్రభుత్వం నాటి భౌగోళికమైన బాధ్యతలను స్వీకరించింది. బ్రిటిష్ సామ్రాజ్య వాదపు "సైనికబలం" స్థానే భారతీయ జాతీయ వాదపు "నైతిక బలం" ప్రాబల్యంతో ఆసియా ఖండ నాయకత్వాన్ని స్వీకరించి, అంతర్జాతీయ దృష్టితో వ్యవహరించడం ప్రారంభించింది. అందుకు అనువైన విధానాలను రూపొందించింది. 1946 మార్చిలో కాంగ్రెసు కార్యవర్గం "పాత సామ్రాజ్య వాదం ఇంకా కొనసాగుతూనే వుంది. దీనికితోడు కొత్త సామ్రాజ్యం పెరుగుతూవుంది" అంటూ తీర్మానించింది. "వలస ప్రాంతాలను ఇంకా తమకింద వుంచుకొనడానికి జరిగే ప్రయత్నాలతోపాటు" "కొత్తగా ఉపగ్రహరాజ్యాలు సృష్టించడాన్ని" కూడా ఖండించింది. ఆ తర్వాత ఒక సంవత్సరానికి భారతప్రభుత్వ నాయకుడుగా విదేశాంగ మంత్రిగా శ్రీ నెహ్రూ సెప్టెంబరు 27వ తేదీన పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రసంగిస్తూ "ఒకరిపై ఒకరు కక్షకట్టుకొని, పక్షాలు నిర్మించుకుంటున్న అగ్రరాజ్యాల అధికార రాజకీయాలకు దూరంగా వుంటూ భారత ప్రభుత్వం స్వతంత్ర విధానాలను అనుసరించదలుస్తున్నది."అని ప్రకటించారు. దీనితోసామ్రాజ్య వాద ఖండన, వలస రాజ్య విధానానికి వ్యతిరేకత, అధికార రాజకీయాలకు నిలయమైన అగ్రరాజ్యాల పాక్షిక రాజకీయాలకు దూరంగా వుండడమనేది భారత వైదేశిక నీతికి పునాది అయింది. జాతీయోద్యమంద్వారా కలిగిన అనుభవంతో రూపొందిన ఈ విధానానికి నైతికమైన బలంకూడా అప్పటి పరిస్థితులను బట్టి తోడుఅయింది. ఆసియా ఖండంలో అప్పటికివున్న జాతీయోద్యమాల ప్రభావంవల్ల ఈ విధానానికి ప్రసిద్ధి వచ్చింది. ఆ కాలంలోనే సోవియట్‌రష్యా భారత స్వాతంత్ర్య సంసిద్ధిని నిరసించింది. భారత వైదేశిక నీతిని శంకించింది. ఐక్యరాజ్య సమితిలో భారత ప్రతినిధులు అమెరికాకు అనుకూలంగా ఓటుచేస్తున్నారని నిందించింది. భారతదేశంకూడా సోవియట్ రష్యాను విమర్శించింది. అది సామ్రాజ్య విస్తరణ విధానాలను అనుసరిస్తున్నదని ప్రకటించింది. ఆ విధంగా సుమారు 1950 వరకు భారత "విబంధ విధానం"లో సోవియట్‌రష్యా వ్యతిరేక ధోరణి కానవచ్చింది.

కాని ఆ తర్వాత భారత ప్రభుత్వ వైఖరిలో విచిత్రమైన మార్పువచ్చింది. ఇందుకు జాతీయమైన కారణాలు, అంతర్జాతీయ పరిణామాలు వున్నాయి. జాతీయమైన కారణాలలో హిందూ — ముస్లిం తీవ్రవిభేదాలు. కమ్యూనిస్టుల విధ్వంస చర్యలు, కాశ్మీర్ వివాదంపట్ల పశ్చిమరాజ్యాల వ్యతిరేక వైఖరి ప్రధానమైనవి. అంతర్జాతీయ పరిణామాలలో, కమ్యూనిజాన్ని నిరోధించడానికి అమెరికా విదేశాంగమంత్రి శ్రీ డల్లెస్ నాయకత్వాన రక్షణ వలయాల ఏర్పాటు, అందులో చేరడానికి భారత్ విముఖత్వం, పాకిస్థాన్ సుముఖత్వం, పాకిస్థాన్‌కు అమెరికా సైనిక సహాయం, హిమాలయాలకు ఆవల కమ్యూనిస్టుచైనా ప్రభుత్వం స్థిరపడడం, అణ్వస్త్రాల అభివృద్ధి, ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం వగైరాలు వున్నాయి. 1959 వరకు అంటే కమ్యూనిస్టుచైనా దురాక్రమణ ప్రమాదం ప్రత్యక్షంగా కానవచ్చేవరకు ఈ జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు భారతదేశాన్ని ఎదుర్కొన్నాయి. ఈ కాలంలోనే కాశ్మీర్ వివాద సందర్భంలో భద్రతా సంఘం పాకిస్థాన్‌కు అనుకూలంగా, పశ్చిమరాజ్యాల అభిప్రాయానుసారం తీర్మానాలు చేయకుండా సోవియట్ రష్యా "వీటో" అధికార ప్రయోగం భారతదేశానికి అవసరమైంది. అమెరికా నుంచి పాకిస్థాన్ పొందేసైనిక సహాయానికి వ్యతిరేకంగా సోవియట్‌రష్యా అండదండలు భారతదేశానికి కావలసి వచ్చింది. ఈ విధమైన స్వప్రయోజనాలను కాంక్షించి భారతదేశం అనుసరించిన సోవియట్ అనుకూల విధానాలను శ్రీ లూయీ ఫిషర్ "దిస్ ఈజ్ అవర్ వరల్డ్" అనే గ్రంథంలో ఇలా చిత్రించాడు:—

"ఈ కాలంలో దేశంలో కమ్యూనిస్టులను అణచివేయడం, కాశ్మీర్ వివాదంద్వారా పెరిగిపోతున్న హిందూ ముస్లిం ద్వేషాలను తగ్గించడం శ్రీ నెహ్రూకు అవసరమైంది. అందుకు ఆయన సోవియట్ రష్యాను వినియోగించుకున్నాడు. ఆయన అంతర్జాతీయంగా అనుసరించిన విధానాలుకూడా మాస్కోకు సంతృప్తి కలిగించాయి. పశ్చిమజర్మనీ ఆయుధ ధారణ ప్రయత్నాన్ని శ్రీ నెహ్రూ ఖండించాడు. కాని కమ్యూనిస్టుల ఆధ్వర్యాన తూర్పుజర్మనీ ఆయుధధారణను ఆయన విమర్శించలేదు. ఆగ్నేయఆసియాలో "సీటో" కూటమి నిర్మాణాన్ని ఖండించాడు కాని సోవియట్—చైనా సైనిక సంధిని కాదనలేదు. "నాటో" వ్యవస్థను గురించి నిశితంగా ప్రసంగిస్తాడు— కాని తూర్పు ఐరోపా సైనిక వ్యవస్థ ఏర్పాటును గురించి మాట్లాడడు. అణ్వస్త్ర బలం రష్యాకు

హెచ్చుగా కలదని, అమెరికా ఇంకా ప్రయోగ పరిశీలనల దశలో వుందని శ్రీ నెహ్రూకు తెలుసు. కాని అమెరికాకు పరోక్షంగా నష్టంకలిగే విధంగా అణ్వస్త్ర విధ్వంసనను ఆయన ప్రబోధిస్తాడు. అన్నిరకాల సామ్రాజ్య వాదాలను ఆయన ఖండిస్తాడు. కాని తూర్పు ఐరోపాలోని సోవియట్ సామ్రాజ్య విస్తరణ ఆయన కంటికి కనిపించదు. ఈ విధంగా కళ్లముందు జరిగిన వాస్తవికమైన పరిణామాలను, యుద్ధానంతరం సంభవించిన ప్రముఖ అంతర్జాతీయ సంఘటనలను ఒక రాజకీయ వేత్త కానక పోవడం అనేది శాంతి సాధనకు చిక్కులు కలిగించింది.'' భారతదేశాన్ని పశ్చిమరాజ్యాలు శకించేట్టు చేసింది. చివరకు హంగేరీలో ప్రజావిప్లవాన్ని సోవియట్‌రష్యా అణచివేయడాన్ని శ్రీ నెహ్రూ ఖండించక పోవడంతో భారతదేశం విబంధ విధానపు ముసుగుతో కమ్యూనిస్టు కూటంలో చేరి పోయిందనే నమ్మకాన్ని ధృవపరచింది. ఈ కాలంలోనే శ్రీ కృష్ణ మీనన్ భారత ప్రతినిధిగా తెరమీదకువచ్చి, బిరుసుతనంగా దురుసుతనంగా ప్రసంగాలు చేసి, భారతదేశం కమ్యూనిస్టుల ''ప్రచ్ఛన్న ప్రతినిధి'' అని బుజువు చేశాడు. ఈవిధంగా 1962 వరకు భారత విబంధ విధానంలో పాశ్చాత్య రాజ్యాల వ్యతిరేక ధోరణి ప్రస్ఫుటమైంది.

ఈవిధంగా భారత ''విబంధ విధానం'' సోవియట్ అనుకూల వైఖరిలో ఉంటున్న కాలంలోనే భారత ఉత్తర సరిహద్దులలో ప్రధానమైన మార్పులు సంభవించాయి. సోవియట్ రష్యాతో పోటీగా ఆసియాలో ప్రధానమైన శక్తిగా కమ్యూనిస్టు చైనా స్థిరపడింది. 1950—51 నుంచి అంటే టిబెట్‌లో చైనా సైన్యాలు ప్రవేశించేనాటికే ఈ సంగతి భారత ప్రభుత్వానికి తెలుసు. ఈ సంగతి 1959 లో ప్రధాని శ్రీ నెహ్రూ స్వయంగా చెప్పుకున్నారు. ''1950 నుంచి లేదా టిబెట్‌లో చైనా సైన్యాలు ప్రవేశించిన 1951 నుంచి చైనా విస్తరణ సమస్య అనేది మా పరిశీలనలోవుంది. ఈ సమస్య ఈ ఏడాది, లేదా గత ఏడాది హటాత్తుగా మా ముందుకు వచ్చినదికాదు'', అని లోకసభలో ప్రకటించారు. ''ఇంతవరకూ అనుసరించిన విధానంకాక, మరొకటి అనుసరించి వుంటే ఆనాడే ఈ ప్రమాదం ఏర్పడేది'' అని కూడా చెప్పడాన్నిబట్టి కమ్యూనిస్టు చైనాను సంతృప్తి పరచడం ద్వారా సరిహద్దులలో శాంతి సాధనకు నెహ్రూ ప్రభుత్వం ప్రయత్నించిందని చెప్పుకోవలసి ఉంటుంది. అంటే విబంధ విధానం పేరుతో కమ్యూనిస్టు చైనాను సంతృప్తి పరచడానికి కూడా భారత ప్రభుత్వం ప్రయత్నించిందన్నమాట. రష్యాతో స్నేహం ద్వారా కమ్యూనిస్టు చైనాను సంతృప్తి పరచడం, టిబెట్‌ను చైనాకు కట్టబెట్టడం, కొరియా యుద్ధంలో చైనా తరఫున మధ్యవర్తిగా వ్యవహరించడం, ఇండో—చైనా కల్లోలాలలో చైనా వాదనకు ప్రాతినిధ్యం వహించడం, చివరకు ఐక్యరాజ్య సమితిలో చైనాకు సభ్యత్వ మివ్వాలనడం వగైరాలన్నీ ఈ ఉద్దేశ్యంతోనే కొనసాగించిందన్నమాట. ఈ విధానాలన్నీ ''విబంధ విధానం'' అనే ముసుగు కిందనే సాగించింది. ఈ విధంగా ఒక వైపున రష్యాను బలపరచడంద్వారా పశ్చిమ రాజ్యాల వ్యతిరేకతను, మరొకవైపున చైనాను సమర్థించడం ద్వారా ఆసియా రాజ్యాల సానుభూతిని గత పదేళ్లలోను భారతదేశం కోల్పోయింది. అంతర్జాతీయంగా ఏకాకి అయింది. ఎవ్వరు మిత్రులో, ఎవ్వరు శత్రువులో నిర్ణయించుకొనలేని స్థితిలో ఉండిపోయింది.

పూర్వంవున్న నైతిక బలం పోయింది. రాజకీయమైన పలుకుబడి, ప్రతిష్ఠవున్నా, దానివల్ల దేశానికి భద్రత లేదని ధృవపడింది. పొరుగున ఒకరుకాదు, ఇద్దరు (పాకిస్తాన్—చైనా) శత్రువులు తయారైనారు. మిత్రులుగా విశ్వసించదగినవారు కనుచూపుమేర దూరంలో లేరు. చివరకు నేపాల్ కూడా దూరమైపోయింది. సైనిక బలం ఉన్నా, అది అవసర సమయంలో నిరుపయోగమని బుజువు అయింది. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే గత పదేండ్లుగా విబంధ విధానం అమలులో జరిగిన లోపాలవల్ల భారతదేశం ''నిస్సహాయురాలు'' అయిపోయింది. ప్రధాని పండిట్ నెహ్రూకు అంతర్జాతీయ నాయకత్వస్థాయి తగ్గింది. అగ్ర రాజ్యాల మధ్య శాంతి దౌత్యం చేయగల స్థితి పోయింది. విబంధ విధానాన్ని మార్చుకొనడం కాకపోయినా, ఆ విధానాన్ని అమలు పరచే తీరును మార్పు చేయవలసిన తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజకీయంగాను, సైనికంగాను, నైతికంగాను దేశాన్ని పటిష్ఠంచేసి, పునరుజ్జీవింపజేసి, తద్వారా తన నాయకత్వాన్ని నిలబెట్టుకొనవలసిన అవసరం ఏర్పడింది. ఇదెంతవరకు సాధ్యం? ఎప్పటికి సంభవమనే ప్రశ్నలకు సమాధానం మనమీద ఆధారపడి లేదన్నట్టుగా ప్రధాని నెహ్రూ ఇప్పటికీ వ్యవహరించడాన్ని బట్టి అసలు ''విబంధ విధానమే'' తప్పు అనే భావాలు కింది కారణాలవల్ల దేశంలో ప్రబలడం ప్రారంభించాయి.

(1) మనకు శత్రువులైనవారు ఇద్దరు (పాకిస్తాన్—చైనా) మిత్రులై మనమీద కత్తి కట్టారు. ఇద్దరు శత్రువులను ఒకే దఫా ఎదుర్కొనడం అసాధ్యం. కనుక వీరిని చీలదీయాలి. అందుకు అవకాశాలు ఉన్నాయి. కాశ్మీర్ వివాద పరిష్కారం ద్వారా, పశ్చిమ రాజ్యాల స్నేహ సంబంధాల ద్వారా పాకిస్తాన్‌తో అవసరమైన రాజకీయ మిత్రత్వాన్ని సాధించవచ్చు. కాని, ఇందుకు అవసరమైనంతగా ప్రయత్నాలు భారతదేశం ద్వారా జరగడంలేదు. కమ్యూనిస్టు చైనాను విశ్వసించినంతగా, సోవియట్ రష్యా స్నేహాన్ని వాంఛిస్తున్నంతగా, సోదర దేశమైన పాకిస్తాన్‌ను మంచి చేసుకొనడానికి ప్రధాని నెహ్రూ గట్టి ప్రయత్నం చేయడంలేదు. ముస్లింలీగుతో వివాదపడినప్పుడు సత్వర దేశ స్వాతంత్ర్య సాధనకుగాను బెంగాల్‌లో, పంజాబులో సరిహద్దు రాష్ట్రంలో, బెలూచిస్థాన్‌లో చివరకు అస్సాంలోని ఒక జిల్లాలో ''ప్లెబిసైట్''కు అంగీకరించిన కాంగ్రెసు పార్టీ నాయకత్వం కాశ్మీర్ వివాదాన్ని శాశ్వత ప్రమాదకారి గా కొనసాగనివ్వడంలో దూర దృష్టిని చూపడం లేదని చెప్పవలసి ఉంటుంది.

(2) మనకు శాశ్వతమైన శత్రువు ఎవ్వరు అనే విషయంలో ప్రధాని నెహ్రూ అంచనాలు సమకాలీన చరిత్రకు విరుద్ధంగా ఉన్నాయి. భావధోరణి రీత్యా కమ్యూనిజం, రాజకీయాల దృష్ట్యా (జాతీయం—అంతర్జాతీయం) కమ్యూనిస్టు రాజ్యాలు ప్రజా స్వామిక రాజ్యా లన్నింటికీ పరమ శత్రువులు.

కాని, ప్రధాని నెహ్రూ భావన ఇదికాదు. మత ప్రేరితమైన పాకిస్తాన్ భారత్‌కు పరమ శత్రువు అని ఆయన భావిస్తున్నారు. **Secular** తత్వంగల భారత్‌కు ఈ విషయంలో **Secular approch** లేకపోవడం శోచనీయం. రాజకీయంగా ప్రజాస్వామిక లక్ష్యాలు కలవని చెప్పుకుంటూనే, ఆ భావనను పరమ శత్రువుగా (సిద్ధాంతరీత్యా)పరిగణించే రష్యా, చైనాలకు మిత్రులుగా చెలామణి కాదలచడం కూడా ఆశ్చర్యకరం. సిద్ధాంత దృష్ట్యా చూచినా, రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా చూచినా, పాకిస్తాన్—రష్యా—చైనాలపట్ల ప్రధాని నెహ్రూకు గల భావాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. భారత శాశ్వత శ్రేయస్సుకు అనువుగాలేవు.

(3) శత్రువు దెబ్బతీయక పూర్వం వున్న పరిస్థితిలో పనికి వచ్చిన విధానం, శత్రువు దెబ్బ తీసిన తర్వాత పనికిరాదు. ఇది అనుభవానికి సంబంధించిన అంశం. పాకిస్తాన్ మనకు శాశ్వత శత్రువు అనుకొని విబంధ విధానాన్ని అనుసరించారు. అప్పుడే రష్యా—చైనాలను మిత్రులని స్వీకరించారు. కాని, చైనా కూడా శత్రువేనని ఇప్పుడు తెలుసుకున్న తర్వాత అమలు జరుగవలసిన "విబంధ విధానం"తో ఎవ్వరికోసం—ఎవ్వరి మిత్రత్వంకోసం విబంధంగా వ్యవహరించాలి? బహుశా సోవియట్ రష్యా మిత్రత్వంకోసం అని భావించవలసి ఉంటుంది. ప్రధాని నెహ్రూ అలాగే భావిస్తున్నట్లు తోస్తున్నది. సోవియట్ రష్యా ద్వారా కమ్యూనిస్టు చైనాను ఆకట్టవచ్చునన్న అంచనా తప్పు కావడంతో, చైనా—రష్యాల చీలిక ద్వారా కమ్యూనిస్టు చైనాను ఏకాకి చేయవచ్చుననే భ్రాంతిలో ప్రధాని నెహ్రూ ఉన్నట్లు స్పష్టం అవుతున్నది. అందుకే ఇంకా సోవియట్ రష్యా స్నేహం కోసం ఆయన తాపత్రయ పడుతున్నారు. కాని చైనా—రష్యాల మధ్య స్నేహం ద్వారా సాధించలేని ఫలితాన్ని చీలిక ద్వారా సాధించవచ్చునని భావించడం పరస్పర విరుద్ధంగావుంది. **Political judgement** తప్పు అని మరొకమారు రుజువు చేస్తున్నది. "**Ideology** లకు **Co-existance** లేదు" అని రష్యాప్రధాని శ్రీ కృశ్చేవ్ చేస్తున్న ప్రకటనలనుబట్టి కమ్యూనిస్టు భావ ప్రేరితమైన చైనా—రష్యాలమధ్య "చీలిక" అనేది నామమాత్రమేకాని, శాశ్వతం కాదని గుర్తించవలసి ఉంటుంది. ఇలాంటి గుర్తింపు ఉన్నప్పుడు "విబంధ విధానము" అనేదే ఇక అనవసరమని స్పష్టమౌతున్నది.

అసలు విబంధ విధాన మనేది అగ్ర రాజ్యాలు కూటాలు నిర్మించి, ప్రపంచానికి ప్రచ్ఛన్న యుద్ధ ప్రమాదాన్ని పెంచినప్పుడు రూపొందినది. అగ్రరాజ్యాలు తమ ఇష్టానిష్టాలూ, వాని వ్యూహాల సమయా సమయాలనుబట్టి విబంధ విధానం అనుసరించే రాజ్యాలను "ఆట బొమ్మలు"గా వినియోగించుకున్నాయి. ఈనాడు ఈ అగ్ర రాజ్యాలు, అవి నిర్మించిన కూటాల స్వరూపంలోను, స్వభావంలోను మార్పు వచ్చింది. ప్రచ్ఛన్న యుద్ధ ప్రమాదంస్థానే అంతర్ వైరుధ్యాలు పెరిగాయి. (ఉదాహరణ—అమెరికా—ఫ్రాంసుల మధ్య; చైనా—రష్యాలమధ్య) కనుకనే అగ్రరాజ్య కూటాలమధ్య ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అవసరమైన, అనుసరణీయమైన విబంధ విధానం అగ్రరాజ్య కూటాలలో అంతర్ వైరుధ్యాల కాలంలో అనవసరమనిపించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎక్కడి కక్కడ, ఎవ్వరికి వారు తమ దేశాల స్వప్రయోజనాలను కాపాడు కొనవలసిన అవసరంలో నున్నారు. అటు అమెరికా, బ్రిటన్‌లకు, ఇటు రష్యా, చైనాలకు ఈ సంకట స్థితి తప్పలేదు. అగ్రరాజ్యాల స్థితే ఇలా ఉన్నప్పుడు ఆ దేశాల ఆగ్రహానుగ్రహాలనుబట్టి కొనసాగే "విబంధ విధానం'. ఎలా ఆచరణ యోగ్యమౌతుంది? ఇంకా ఎందుకు అనుసరణీయమౌతుంది? అనుసరణీయం, ఆచరణ యోగ్యమైనది, స్వదేశ రక్షణ, జాతిభద్రత. ఈ దృష్ట్యా చూచినప్పుడు భారత వైదేశిక నీతి ఎలా ఉండాలో వేరుగా చెప్పవలసిన అవసరంలేదు.

దేశరక్షణ, జాతి భద్రత అనేవి భారత వైదేశిక నీతికి, ఇకనుంచి మూల సూత్రాలు కావాలనుకున్నప్పుడు, దేశం రక్షణకు అనువైన జాతి భద్రతకు తగిన సైనిక బలాన్ని సమీకరించుకొనడం తక్షణ కర్తవ్యం కావాలి. సైనిక బలాన్ని సమకూర్చుకొనడంలో పశ్చిమ రాజ్యాల సహాయ సహకారాలను పొందడం మినహా మరొక మార్గంలేదు. ఈ విషయంలో విబంధ విధానమనే దానికి అవకాశమేలేదు. ఒకవేళ పూర్వానికి వలెనే ఇప్పుడు కూడా విబంధ విధానం ప్రకారం సోవియట్ రష్యానుంచి ఆయుధ సహాయం పొందడానికి ప్రధాని శ్రీ నెహ్రూ ప్రయత్నించదలిస్తే, రష్యా ఆయుధ సహాయాన్నిపొంది, పరాభవం పాలైన క్యూబా గుణపాఠాన్ని కూడా గుర్తుంచుకొనడం సముచితం కాగలదు. అంతేకాదు. ఇండొనీసియా పరిణామాలను కూడా గమనించడం అవసరం కాగలదు. ఆయుధ సహాయ మనేదానిని తన "అధికార రాజకీయాలకు" ఒక పాచికగా క్యూబా విషయంలో సోవియట్ రష్యా వినియోగించింది. ఆయుధ సహాయమనే దానిని రాజకీయంగా తన పలుకుబడిని పెంచడానికి ఒక సాధనగా ఇండొనీసియాలో ప్రయోగించింది. మొత్తంమీద చూస్తే, కమ్యూనిజం విస్తరణ అనేది సోవియట్ రష్యా అంతర్జాతీయ లక్ష్యంగావుంది. ఆ లక్ష్య సాధనకు ఎన్ని రకాల వ్యూహాలనైనా అది పన్నగలదు. అందులో కొన్నింటికి అంగీకరించని మరొక కమ్యూనిస్టు రాజ్యం చైనా. అదే భారత దేశానికి ప్రత్యక్ష శత్రువు. కమ్యూనిజం విస్తరణ పద్ధతులకు సంబంధించి చైనా—రష్యాల మధ్య వచ్చిన వివాదంలో, రష్యా ఆయుధ సహాయాన్ని స్వీకరించిన కారణంగా, భారతదేశం మరింతగా చైనా ప్రతిఘటనను, దురాక్రమణను ఎదుర్కొనవలసిన ప్రమాదం కూడా ఉంటుంది. ఇంతకాలంగా అగ్ర రాజ్య కూటాలమధ్య "తటస్థంగా' ఉండి, అనుభవించిన బాధలు, పొందిన నష్టాలు చాలక, ఇకనుంచి చైనా—రష్యాల "పద్ధతుల పోటీ"లో "పావు"గా మారి భారతదేశం కొత్త బాధలను అనుభవించడానికి సిద్ధపడడం దేశ రక్షణకు, జాతి భద్రతకు శ్రేయస్కరంకాదు.

ఒక కమ్యూనిస్టుదేశం మరొక కమ్యూనిస్టుదేశంతో పోరాడడానికి వీలుగా మనకి ఆయుధ సహాయాన్ని చేయదని తెలుసుకున్న తర్వాత, దేశ రక్షణకోసం సహజంగానే పశ్చిమ రాజ్యాలనుంచి ఆయుధ సహాయాన్ని మనం కోరక తప్పదు. అయితే పశ్చిమ రాజ్యాల ఆయుధ సహాయాన్ని స్వీకరించడంవల్ల దేశ స్వాతంత్ర్య శక్తిని, సర్వ సత్తాకను (సావిరానిటీ) కోల్పోగల ప్రమాదం కల

దని విబంధ విధాన్ని సమర్థించేవారు వాదించడంకద్దు. కాని, ప్రపంచ చరిత్రలో ఇందుకు సంబంధించిన సందర్భాలను పరిశీలించినప్పుడు ఫలితం మరొక రకంగా కనిపిస్తుంది. ఉదాహరణకు, ద్వితీయ ప్రపంచ యుద్ధకాలంలో చర్చిల్ నాయకత్వాన బ్రిటన్, పెక్కు ఐరోపా రాజ్యాలు అమెరికానుంచి ఆయుధ సహాయాన్ని స్వీకరించాయి. అందువల్ల ఆ దేశాల స్వాతంత్ర్యం నిలబడి, సర్వ సత్తాకకు రక్షణ సమకూడిందే కాని, భంగం కలగలేదు. అలాగే హిట్లర్ దండయాత్రను ఎదుర్కొనడానికి స్టాలిన్ నాయకత్వాన సోవియట్ రష్యా కూడా పశ్చిమ రాజ్యాల ఆయుధ సహాయాన్ని స్వీకరించింది. అందువల్ల దాని కెలాంటి ప్రమాదం సంభవించలేదు. చివరకు చైనాలో చాంగ్—కై—షేక్ నాయకత్వానికి లోబడి పని చేసిన మావ్—సే—టుంగ్ ప్రభృతులు కూడా జపానుకు వ్యతిరేకంగా అమెరికా ఆయుధ సహాయాన్ని వినియోగించుకున్నారు. దీనినిబట్టి అవసరమయిన సమయంలో ఆయుధ సహాయ స్వీకరణ వల్ల దేశ స్వాతంత్ర్యానికి, సర్వ సత్తాకకు రాగల ప్రమాదం లేదనే చెప్పుకోవచ్చు. ఇలాంటి అనుమానాలతో విబంధ విధానం పేరుతో ఆయుధ సహాయాన్ని స్వీకరించనప్పుడు కమ్యూనిస్టు చైనా ద్వారా ఉత్తర సరిహద్దులలో భారతదేశం పొందిన సైనిక, రాజకీయ పరాభవాలనే ఏ దేశమైనా పొందవలసి వస్తుందని కూడా సిద్ధాంతీకరించవచ్చు.

ఆయుధ సహాయ స్వీకరణ సందర్భంలోనే మరొక రకం వాదన కూడా వుంది. ఆయుధ సహాయం చేస్తున్నవారు పెట్టే "షరతులకు" సూచించే "విధానాలకు" తలొగ్గవలసి వస్తుందనేది ఈ వాదన సారాంశంగావుంది. నిజానికి ఇది వాదనేగాని, ఆచరణలో దీని ప్రభావం ఎక్కడా కనిపించడం లేదు. ఉదాహరణకు, అమెరికా ఆయుధ సహాయాన్ని స్వీకరించిన బ్రిటన్, ఫ్రాంసులు అనేక రాజకీయ సమస్యలపై, ముఖ్యంగా కలోనియల్ సమస్యలపై అమెరికా సలహాలు పాటించలేదు. అటు పశ్చిమ రాజ్యాలనుంచి, ఇటు రష్యానుంచి సహాయం పొందుతున్న యుగొస్లావియా, పోలెండులు స్వతంత్రంగా వ్యవహరిస్తున్నవేకాని, ఈ రాజ్యాల బాటను, మాటను పాటించడంలేదు. చివరకు పాకిస్తాన్‌కూడా అమెరికా బ్రిటన్‌ల సలహాను కాదని, కమ్యూనిస్టు చైనాతో మిత్ర సంబంధాలను నెలకొల్పుకున్నది. కనుక ఒక దేశం స్వతంత్ర విధానాలను అనుసరించడం ఆయుధ సహాయాన్ని స్వీకరించడం అనేది ఆయా దేశాల అంతర్గత బలంమీద ఆధారపడి ఉంటుందని దీనినిబట్టి చెప్పుకోవచ్చు.

కనుక దేశ రక్షణకు, జాతి భద్రతకు, పశ్చిమ రాజ్యాల ఆయుధ సహాయ స్వీకరణ తప్పనిసరి, తప్పులేదు అని తెలుసుకున్నప్పటికీ, కమ్యూనిస్టు చైనా తప్పు చేస్తున్నదని ప్రపంచానికి రుజువు చేయాలన్న తత్వంతో ఇంకా విబంధ విధానాన్నే కొనసాగించాలని ప్రధాని శ్రీ నెహ్రూ చెబుతున్నారు. కమ్యూనిస్టు చైనా తప్పు చేసిందని, ఇంకా చేస్తుందని అన్ని పశ్చిమ రాజ్యాలకు తెలుసు. చివరకు కమ్యూనిస్టు రాజ్యాలలో కూడా ఈ గ్రహింపు వుంది. కనుక ఇంకా కమ్యూనిస్టు చైనా చేసింది తప్పు అని ఎవ్వరికి రుజువు చేయాలో శ్రీ నెహ్రూకే తెలియాలి. అదీకాక, ఇప్పుడు కమ్యూనిస్టు చైనాది తప్పు అని రుజువు చేయడం ప్రధానమా లేక దేశ రక్షణ శక్తిని పెంచడం ప్రధానమా? ఆయన ఎంతగా ఎన్ని ప్రయత్నాలు చేసినా, భారత దేశాన్ని గురించి కమ్యూనిస్టు చైనాకు గల అభిప్రాయం మారదు. మన దేశ స్వాతంత్ర్యాన్ని, భౌగోళిక హద్దులను రక్షించుకొనలేనప్పుడు, ఇతరుల దృష్టిలో మన విబంధ విధానానికి అర్థం ఉండదు. మన విబంధ విధానంకంటె, మన మీదకు వచ్చిన శత్రువును తిప్పి కొట్టడంలో మనం చూపగల శక్తి మాత్రమే ప్రపంచ మన్నన పొందగలదు. ఈ శక్తిని చూపలేక పోవడానికి విబంధ విధానమనేది ఇంతవరకూ అడ్డువచ్చి, భారత దేశానికి సైనికంగా, రాజకీయంగా; నైతికంగా చిక్కులు తెచ్చింది. దురాక్రమణ ప్రమాదం అసంభవం కాదని నిరూపించింది. ఆచరణలో తన బండారాన్ని (**Myth**) బయట పెట్టుకుంది. వాంఛనీయమైన ఫలితాలను సాధించలేదని నిరూపితమైన తర్వాత, కూడా ఇంకా ఆ "బండారా"న్ని అంటిపెట్టుకొని ఉండడం సమర్థనీయం కాగలదా ?

గ్రంథ విమర్శనము

విక్రమాదిత్య

(కృతికర్త : శ్రీ మహావాది వేంకటరత్నము. భాషాకుటీరము, అమరావతి, గుంటూరుజిల్లా. మూల్యము : 5 రూపాయలు. (కౌనుసైజున 279 పుటలు.)

ఇది కథాకావ్యము. కథలేక కావ్యముండు నాయన వచ్చును. కాని, కావ్యములయందు కథ బహుముఖములుగా నుండును. రసభావనిరంతరముగా నుండుట యొకపద్ధతి. అచ్చమైన కావ్యము అట్టికథ గలిగియుండును. కథ కేవలము కథగా నుండుట మరొకపద్ధతి. ఏదో చమత్కారములేక కథ గూడ కథకాదు. ఆ మాత్రము చమత్కారముతో నున్న కథతోడి కావ్యము కథాకావ్యమన్నమాట. అనగా కాశీమజిలీ కథలున్నవి. అందు చమత్కారములేదా ? అట్టి చమత్కారము గల కథలు ఛందోబద్ధములై చెప్పబడి కథాకావ్యము లగుచున్నవి. ఆంధ్ర సాహిత్యమున నిట్టి కథాకావ్యరచన కేతన్నతో మొదలైనది. ఆ తరువాత జక్కన, కొఱవి గోపరాజు, అనంతామాత్యుడు, నారాయణామాత్యుడు, కదిరీపతి నాయకుడు— మొదలుగా గల వారందరును ఆ కథాకావ్య రచనను పెంచి పెద్ద చేశారు.

ఈ ఇరువదియవ శతాబ్ద మాంధ్రసాహిత్య చరిత్రలో చాల చిత్రమైన ప్రాముఖ్యము కలది. భావకవిత్వమని, అభ్యుదయ కవిత్వమని ఇత్యాదిగా ఎన్ని క్రొత్తదనములు వచ్చినవో, అంతకు వేయిరెట్లధికముగా ప్రాచీన సాహిత్యమర్యాద లన్నియు ఈ శతాబ్దమున తిరిగి నెలకొన్నవి. శ్రీ మహావాది వేంకటరత్నముగారి ఈ విక్రమాదిత్య వెలువడుటతో ప్రాచీనమైన ప్రసిద్ధమైన కథాకావ్య రచన మారాకు తొడిగినట్లైనది. శ్రీ వేంకటరత్నముగారీ తమ కృతితో ఒక ప్రాచీనమైన ప్రసిద్ధ కావ్యప్రక్రియను తిరుగదోడి ఆంధ్రమున నిలువద్రొక్కినవారైనారు.

విక్రమార్క చక్రవర్తి దేశకాలముల విషయ నిర్ణయ మట్లుంచినచో ఆయనను గూర్చి దేశము నలుమూలలను వ్యాపించిన చిత్రకథ విశేషము లెన్నియేనిగలవు. ఇపుడు శ్రీ వేంకటరత్నముగారా మహారాజును గూర్చి మరినాల్గు కథలట్టి వైచిత్ర్యముతోడనే కల్పించి కావ్యము రచించినారు. శ్రీ వేంకటరత్నముగారి విక్రమార్కునకును వెనుకటి విక్రమార్కునకు ప్రకృతి యొకటియే. మరియు నిరువురును కాళీదేవి భక్తులే. ఆ దేవిని ప్రసన్నము చేసికొన్నవారే. సాహసులే. వశీకృత భేతాళులే. ఇక భేదమేమనగా ప్రాచీన విక్రమార్కునకు, కావలసినసంపద, దివ్యాన్నము, గమనము, మహానగరము సంపాదించి పెట్టుటకు, బొంత, మణిపాత్ర, పాదుకలు, యోగదండము కలవు. శ్రీ వేంకటరత్నముగారి విక్రమార్కున కన్నియు దండములే. అజిత దండము, గమనదండము, అర్థదండము, అభిమతదండము. ఇవి వరుసగా విజయము, గమనము, సంపద, ఇష్టార్థములను సమకూర్చును. వెనుకటి విక్రమార్కునకు చిత్రరథుడు మిత్రుడు. ఈ విక్రమార్కునకు భార్యలయిన అజితాదులకు పూర్వజన్మమున తండ్రి, ఈ జన్మమున దండము లందించిన యోగి. శ్రీ వేంకటరత్నముగారు ఆ నాల్గు దండములను, దండములతోపాటు అజితాదులను విక్రమార్కుడు పొందిన వైనము నిముడ్చుకొన్న కథాంశములను కల్పించి, ముందువెనుకల తారుమారుమీద వైచిత్రిని సంపాదించుచు ఈ 'విక్రమాదిత్య' కథా కావ్యమును రచించిరి. ఇందు సంపాదింపబడిన వైచిత్రి పింగళిసూరన్న కళా పూర్ణోదయమున సంపాదించిన వైచిత్రి వంటిది.

విక్రమార్కుడు ఉజ్జయినీనగర ప్రభువు. వాని మంత్రి పేరు భట్టి. ఒకసారి ఉత్కల దేశమురాజు విక్రమార్కునిపై తిరుగబడినాడు. వానినదుపులో పెట్టుటకు విక్రమార్కుడు బయలుదేరినాడు. 'అజిత' ఎదురు వచ్చినది. ఆమె శస్త్రశాస్త్ర విద్యలయం దసమాన. తనను జయించి ఉత్కల పతిమీదకు పొమ్మన్నది. తనను జయించుటయనగా తనసౌధము ప్రాకారమున కనీసమొక బండను పెకలించుటగా చెప్పినది. విక్రముడు తన సైన్యముల నందుకు పురికొల్పినాడు. వారిప్రయత్నము వ్యర్థమైనది. విక్రముడు వెఱగుపడినాడు. అపుడు చెప్పినది— ఇదిగో నావద్దగల ఈ యోగదండము చూడుము. ఇది అజిత దండము. అందువలన నన్నునీవు జయింపలేవు. అంతేకాదు. ఇట్టివి మరిమూడు దండము లీ కోమునగలవు. ఇవన్నియు సంపాదించినపుడే ఈ ప్రాకారము భేదింపబడును. ముందు ఈ యోగదండములు నాల్గును సంపాదించుకొమ్ము— అని. అంత విక్రమార్కుడా దండముల వివరములడిగినాడు. మరొక విద్యయందైనను నను జయించినగాని ఆ దండముల వైనము చెప్పబడదని అజితయన్నది. ఇరువురును 'చదరంగము'నకు పూనుకొన్నారు. విక్రమార్కుడు కాళికాదేవిని ప్రసన్నము చేసికొని విజయము లభించునట్లు వరముపొంది ఆటకు దిగినాడు. అజితవద్ద అజిత దండమున్నది. ఆమె జయింపబడదు. ఆట సాగినది. దినములబడి సాగినది. గెలుపోటములు లేనిదై సాగినది. చివరకు భట్టి తీర్పుచెప్పినాడు.— నీవు మా రాజును ఆటకు రమ్మనినావు. కనుక నీవు మా రాజుగారి ఆటను కట్టింపవలెను. నీవు కట్టింపలేక పోవుచున్నావు. ఇక కట్టింపలేవు. అందువలన నీవే ఓడినట్లు. కనుక ఇక నీవు ఆ దండముల విషయము చెప్పవచ్చును.— అని. అపుడు అజిత చెప్పినది. అజిత చెప్పిన చొప్పున ఒక్కొక్క దండమును, ఆ దండముతోపాటు ఒక్కొక్క కన్యను

గ్రంథ విమర్శనము

విక్రమార్కుడు సాధించుకొని వచ్చినాడు. నాల్గు దండములను చేతపట్టుకొని అజిత సౌధము ప్రాకారమును బద్దలు కొట్టినాడు. ఆ నాల్గు దండములుచేత పట్టుకొని పూర్వజన్మ స్మృతి పొంది అజిత తమ నల్గురయొక్కయు, ఆ దండముల యుత్పత్తి యొక్కయు రహస్యమును వెల్లడించినది. విక్రమార్కుడా నల్వురను వివాహమాడినాడు— స్థూలముగా ఇదికథ. విక్రమార్కు డొక్కొక్క దండమును సాధించిన అద్భుతకథ ఒక్కొక్క ఆశ్వాసమన్నట్లుగా ఈ కావ్యము ఆ దండముల పేర్లతోడనే నాల్గు భాగములుగాను, అజితాదుల పూర్వజన్మ రహస్య విషయ వివరణము 'సమయపాలనము'అను ఐదవ భాగముగాను సమాప్త మగుచున్నది. పదునేనువందల గద్య పద్యములతో నున్న గ్రంథమిది.

ఈ గ్రంథములోని కథ కల్పనమున కంతకును మూలభూతమైనది 'సమయపాలన' ఖండము. అజితాదులు దేవేంద్ర శాపకారణమున భూలోకమున జన్మించినారు. వారితండ్రి చిత్ర రథుడు. దేవతలచేత ఈయబడిన నాల్గు మంత్ర దండములను సిద్ధుడై వారికి అందిచ్చినాడు. ఆ నాల్గు దండములను పొందినవాడే నలుగురకునుభర్త. ఇది దేవతా నిర్ణయము. ఈ దేవరహస్యమును కల్పించి పరమాద్భుతముగా కథాగత సన్నివేశములను నిర్వహించి ఈ కావ్యమునకు శ్రీ వేంకటరత్నము గారు దీప్తిని కల్గించినారు.

ఇట్టి కథా కావ్యముల విషయమున రసనిష్కర్ష కుదరదు. రసనిర్వహణైక దృష్టి ఇట్టి కావ్యములందు ఆ కవులకే యుండదు. కథలో చమత్కారమును పుట్టించుటకు చేయు ప్రయత్నములో నాల్గవ వంతుకూడ రస పరిపోషణమునకు చేయరు. చేయరనగా ఆ కావ్య ప్రక్రియా తత్వమట్టి దని యర్థము. సాలభంజనార్థము దండసాధన కుద్యమించిన విక్రమార్కుని ప్రకృతితో కావ్యముస్నరదున ఇందు వీరము రసమని కొందరు భావింతురు. దక్షిణాంధ్ర యుగాంతమునకు శృంగారమెట్లు నీళ్లకంబెనుం బలచనయైనదో ఒక విధముగా వేడు వీరమట్లగుచున్న దనవలయును. "వీరరస ప్రభేదవి నిర్ణయ వీరము" నేడెక్కువగా నున్నది. ఎవడేమి చేసినను ఆ చేయబడిన దానిపేరున ఒక వీరరస ప్రభేదము పుట్టింపబడుచున్నది. అదికూడదు. ఒకధర్మ ప్రయోజనదృష్ట్యా ప్రవర్తించిన ఉత్తమ ప్రకృతియొక్క ఉత్సాహ ప్రదర్శనము రసభరితమైనచో అది వీరమగును. అంతేగాని ప్రతిదియు వీరముకాదు. ఉత్కల దేశదండయాత్రకు సిద్ధమైన విక్రమార్కుని అజితకుమారి తనసౌధము ప్రాకారము పడగొట్టుమన్నది. విక్రముడు పడగొట్టలేక పోయినాడు. అజితకుమారి మార్గ ముపదేశించినది. ఆ మార్గమున విక్రముడు ప్రవర్తించుటద్వారా చిత్రమహనీయములైన అద్భుతగాథలు పుట్టుకొని వచ్చినవి. ఒకసామంతుడు తిరుగబడినాడని తెలిసి జైత్రయాత్రకు బయలుదేరినరాజు అన్యవిషయమున ప్రవర్తించుట వీరమున కుదాహరణమగునా ? కాదే. కథ మొదలుపెట్టుట వద్దనుండి అద్భుతమే సృష్టింపబడినది. అజితకుమారి యెవరు ? ఆమె ఏల అప్పుడు రావలయును ? సౌధము ప్రాకారము పడగొట్టుమనుటయేమి ? విక్రము డందుకు సమర్థుడు కాకపోయినాడేమి ? అజితదండ మదియేమి ? విక్రముని యందామెకు మిగిలిన దండముల యుదంతము చెప్పవలసినంత ఆప్యాయ లక్షణమునకు కారణమేమి ? ఇవన్నియును ప్రశ్నలే. ఈయన్ని ప్రశ్నలకు సమాధానములు మొత్తము గ్రంథముమీద పరుచుకొని యున్నవి. అందుకు గ్రంథమంతయు చదువవలయును. అపుడు కథాకల్పనము నందలి మెలికలు, నిర్వహణమునందలి చాకచక్యము, కథా బీజమును దేవలోకముతో ముడివడియున్నట్లు చిట్టచివరకు తెలియజేయుట—ఇవన్నియు కవి అద్భుతమును సృష్టించుట నుద్దేశించియే చేసినట్లు తెలియగలదు. సాహసమునకు వీరమునకు భేదమున్నదని అంగీకరించుచో ఇట్టి కావ్యములు మొదటి పద్ధతికి చెందినవనియే అనవలయును. సాహస విక్రమార్కుడుగాని వీరవిక్రమార్కుడు కదా మొదలు కథానాయకుడు ! శివాజీ వీరుడు. రాణా ప్రతాపుడు వీరుడు. విక్రమార్కుడా కోవలోనివాడుగా నిరూపించవా కథలు. అందువలన ఈ విక్రమాదిత్య యందు చెప్పదలచుకొన్నచో అద్భుతమును చెప్పవలయును. వీరమునసలు చెప్పరాదు.

కథా ప్రాధాన్యముగల ఇట్టి కావ్యములందు రస విషయముమొదలు పర్యాలోచింప దగినదేకాదు. కథాంశముల కల్పనము, ముందువెనుకల మీద తత్తదంశములను అపూర్వముగా ప్రసంగించుటలోని రచయితశక్తి— ఇవే ముఖ్యముగా చూడదగినవి. ఈ విషయమున శ్రీ వేంకటరత్నము గారు పింగళి సూరన్నగారి ప్రక్కకు చేరినారు. జక్కన విక్రమార్క చరిత్రలో కేవలము సాహసము పరమ సామాన్యముగా వర్ణింపబడినది. కథాంశ కల్పనమున నెట్టి, చమత్కారముగాని అచట మృగ్యములు. శ్రీ వెంకటరత్నముగారు చమత్కారయుతమైన అద్భుతమున విక్రమార్కుని సాహస లక్షణమును పొదివినారు. మరియు ప్రాచీనులైన గోపరాజు, నారాయణామాత్యుడు మొదలైనవారు కథాంశములను లోకాతిశాయి రమణీయములుగా కల్పింపలేక బహువిజ్ఞాన విషయములను గ్రుచ్చియెత్తి తమ వైదుష్యముచేత అద్భుతమును సృష్టించిరి. శ్రీ వేంకటరత్నముగారు తమ వైదుష్యమునంతయు కథాకావ్యమన్నది ఎట్లుండవలయునో అట్లుగా తీర్చిదిద్దుట కుపయోగించిరి. ఈ కావ్యమును జాగ్రత్తగా చదివిన విషయము తెలియును. ఈ విక్రమాదిత్య ప్రాచీనకావ్య మర్యాదలకు ప్రాతినిధ్యము వహించు నేటి బహుకావ్యములలో నొకటి. ఈ ప్రక్రియలో నేటి కాలమున నెక్కువగా గ్రంథములురాలేదు. ఆ లోటును తీర్చిదిద్దిన మహోదాత్తమైన కృతి ఇది. శ్రీ వేంకటరత్నముగా రందుకు నిస్సందేహముగా ప్రశంసింప దగియున్నారు. చిత్రరథుడు సిద్ధుడై భూలోకమున నవతరించిన తన కూతుండ్రకు మంత్ర దండములిచ్చుట, ఆ దండములను కాజేయుటకు మరొక సిద్ధుడు ప్రయత్నించుట, వాని ప్రయత్నము లెరిగినవాడువలె విక్రమార్కుడు వానినడంచి దండములను కన్యలను బహువేషములువేసి, బహువిధముల నటించి, బహ్వాయాసములను సహించి, సాధించుట— చిత్ర

మహనీయమైన కల్పనలతో కమనీయమై కథాగతిలోని బిగి బిగి సొంపు కలిగి దివ్యముగా నున్నది. పుస్తకము చదువుచు బోయినచో ఆ యందము తెలియును. శ్రీ వేంకటరత్నముగారి శక్తి తెలియును.

కథాకల్పన, నిర్వహణముల విషయమున మేలు బంతిగా నున్న ఈ కావ్యమునగల వర్ణనముల విషయమున గూడ కించిత్తు చెప్పబడవలసి యున్నది. కావ్యమంతయు వర్ణనమయమే యగుచున్నను వర్ణనలని కొన్ని ప్రసిద్ధి కెక్కినవిగదా—అవి మరియు కొన్ని విశేష విషయములు— ఇట స్పృశింప బడుచున్నవి.

గగనతలం బయిన పథముగా దివసంబను 'సైకిలుబండి' ఎ
క్కగ నుదయాద్రిఁ బాసి తన గమ్యతలంబగు పశ్చిమాద్రి కొ
ప్పుగఁ జనుదేర సంధ్యయను 'పోర్టరు' ధూరమునుండి
బండి నా
నగ నురి చూపు దీపమున భాస్కరుఁడొప్పె మహారుణప్రభన్.

ఇది సూర్యాస్తమయ వర్ణనము. సరిక్రొత్త వర్ణనము.

అకలంకప్రియుఁడైన నాథుఁ డెడఁబాయన్ జాల శోకించి యు
బ్జకుల స్త్రీజన మెల్లఁ బల్కు సతి సౌభాగ్య మొక్కింత యో
ర్వక క్రోధంబున నామెవంకఁ దిలకింపంజేసి రాబోవు గా
ఢ కషాయద్యుతి పర్వె నంబరము నిండన్ సంజ కెంజాయగా.

ఇదియు మరొకనాటి సూర్యాస్తమయ వర్ణనము. పూర్వ ప్రబంధముల మార్గమున చేయబడిన వర్ణనము.—ఈవిధముగా శ్రీ వేంకటరత్నముగారు చేసిన బహు వర్ణనములు ప్రాత క్రొత్తలను ఇముడ్చుకొనియే యున్నవి.—గమనదండ కథలో ఉమా కుమారిని కపటసిద్ధుడు లోబరచుకొన జూచి చివరకు పైన బడి బలివంతము చేయబోయినాడు. అపుడు "శైల విదారణంబునకుం గాలుదువ్వు నాల పోతుంబలె, మహా దీపజ్వాల మేలైన ఫలంబని భ్రమింగం గమకించు కీటకంబు వడువునఁ బలు బలంబున నామెం బట్టు నుంకిం" చి నాడని వ్రాయబడినది. రెండవ యుపమావాక్యమువలె మొదటిది ఉచితార్థ ప్రతీతికి సమర్థమై లేదు. మిగిలిన యన్ని చోట్లను ప్రకరణమున కుచితముగను, సరసార్థ ప్రతీతి నుద్దేశించియు అలంకారముల నుపయోగించిన శ్రీ వేంకట రత్నముగారు మరొకసారి దీనిని గూడ చూచుకొనియున్న బాగుండెడిది. ఈవిధముగనే తిరిగి చూచుకొనవలసిన ప్రయోగములు "ఊహా జగత్తు" (పుట 136) "సౌఖశాయినులు" (పుట 196) రెండున్నవి. ఆకారాంత స్త్రీ లింగముయొక్క యునికిని అంగీకరించినం లేక అచ్చు తప్పు కిందికి నెట్టివేసినను మొదటిదానితో నంత యిబ్బంది లేదుగాని రెండవది మాత్రము విచార్యమే యగును.

ఈ గ్రంథమున అవకాశము కల్పింపబడి విపులముగా చెప్పబడిన విశేష విషయములలో ముఖ్యముగా పేర్కొనదగినవి విద్యావిధానము, నిష్కామకర్మ, పల్లెటూళ్ల స్థితిగతులు, భూత వైద్యము ఇత్యాదులు. శ్రీ వేంకటరత్నముగారా యా విషయములను నిశితముగా పర్యాలోచనచేసి దర్శించి వ్రాసినారన్నది స్పష్టముగా తెలియుచున్నది. ఆయా సందర్భములయందు నేటి పరిస్థితులు కథాకాలము నాటివిగా చూపబడుచు నిరపింపబడిన ఘట్టములు కొన్ని ఉండవలసినంత సముచితముగా లేవు.

పద్య రచనమున కవియొక్క లెస్సగా చేయి తిరిగిన తనము, శక్తి గ్రంథమునందంతటను గలదు. ఏమాత్రము అన్వయక్లేశములేని ఈ కృతి ఒక విధముగా శుక సప్తతికి తరువాతి దనిపించుచున్నది. ఆద్యంతము పాఠకుల కుత్కంఠను పెంపొందించు కథా సందర్భములతో, ధారాళమైన శయ్యను బడి, ఈ కథా కావ్యము పరమోదాత్తముగా నున్నదనుట. ఉపచారముగా ననుట. ఈ మధ్య ఇట్టి బృహత్కావ్యము రాలేదు. అనివార్యముగా చదువదగినది.

—క్షేమేంద్ర.

మి ణు గు రు లు

వచన సంకీర్తనల సంపుటి. అవంత్స సోమసుందర్ రచన. ప్రకాశకులు: కళాకేళి నికేతన్, పిఠాపురం. 1/8 క్రౌను సైజున 66 పుటలు—వెల: ఒక రూపాయి.

సింహగిరి వచనములు, తాళ్లపాక వచనములు ప్రవర్తిల్లిన తెనుగు భాషకు వచన సంకీర్తనలు క్రొత్తకాదు. కాని 20 వ శతాబ్దములోని ప్రథమ పాదములో అమెరికన్ రచయిత వాల్ట్ విట్‌మన్ రచించిన గడ్డిపరకలు (**Leaves of grass**) రవీంద్రుడు అనువదించిన ఆంగ్ల గీతాంజలి, తోటమాలి మొదలయినవి ఈ సాహిత్య ప్రక్రియకు ఒక జిగీ బిగీ తెచ్చి, వచనము చేత మౌనసంగీతము పాడించినవి. వచన రచనలో భావుకత సాధించి కవితాగానము చేయుటకు భాషమీద పలుకుబడి, భావనలోని స్పష్టత అవసరము. ఆధునిక రచయితలు కొందరు వచన గీతికలు పలికించుటకు ప్రయత్నము చేసి విఫలమైనారు. ఈ మిణుగురులు—అభ్యుదయ కవి ఆవంత్స సోమసుందర్ పూర్వాశ్రమంలో ప్రణయగీతాలు, భక్తి సంకీర్తనలు పాడిన పాటలకు వ్రాత రూపములు. ఇవి చాలకాలం క్రితం పత్రికలలో అచ్చు పడినవి. 'వజ్రాయుధం', 'రక్తాక్షి' వంటి ప్రగతి పదాలు పాడిన కవి, జీవనస్వామి ముందు మోకరిల్లి భక్తి ప్రవచనాలు పలకడం ఏమిటని ఎవరైనా విస్తుపోతారేమోయని, 'శశాంక' తొలుత వ్రాసిన 'ఆముఖమ్' లో సోమసుందర్‌తో వచ్చిన పరిణామాన్ని చూచాయగా తెలియపరచారు. ఇది మొత్తం 27 వచనాల సంపుటి—ప్రతి వచనం చివర అంటోంది సుందరి అని పల్లవి. రవీంద్రుడు, కృష్ణశాస్త్రి పలికించిన భావాల ప్రతిబింబాలే లీలగా ఈ వచనాలలో గోచరిస్తాయి.

శైలికి—ఈ వచనం చూస్తే చాలు.

"నాకు తెలుసు స్వామీ ! నాకు వేసిన ప్రతి సంకెలూ నీకు నేను చేస్తున్న కాంచన శృంఖలమేనని ! నన్ను నీ కర్పించు, కోవడంతోనే—నిన్ను సంపూర్ణంగా స్వాయత్తం చేసుకోగలనని !

నీ స్వరూప స్వభావాలు నా కెరుకయే స్వామీ ! ...
అంటోంది నీ సుందరి."

ఏ భాషలోనో ఆలోచించిన మౌన భావాలకు తేటతనం, తెలుగుతనం తేవడానికి చేసిన ప్రయత్నము ఎంతవరకు ఫలించిందీ చెప్పడానికి ఈ మచ్చు చాలు !

మణిమంజీరాలు

పదిమంది రచయితల పది కథానికల సంకలనము. ప్రకాశకులు : శ్రీముఖ పబ్లికేషన్స్— మచిలీపట్టణం—1, 1/8 క్రౌనుసైజున 164 పుటలు. వెల : రెండున్నర రూపాయలు.

చదువరులలో ఉత్తమ సాహిత్యాభిరుచిని పెంపొందించే నిమిత్తం కళాకౌశలం చూపించే కథలు పది యెన్నికచేసి, సహకార పద్ధతిమీద ఒక్కొక్క రచయిత ఒక పాతిక రూపాయలు చందా చేసికొని యీ సంపుటి ప్రకటించారు. అమ్మాయి—అబ్బాయి మార్కు కథలుకాని, ఈనాడు పత్రికలలో కనిపించే దాంపత్య కుతూహల కథలుకాని ఈ సంపుటిలోలేవు. ఈ సంపుటిలో చౌకబారు ప్రేమకథలు మచ్చుకయినా లేవని సగర్వముగా చెపుతున్నానని— సంపాదకుడు కె. ఆర్. కె. మోహన్ ముందు మాసంలో ప్రకటించారు. కాని కథలలో నిజానికి ప్రేమకథలు లేకపోలేదు. అది పాపలమీద మమతలు పెంచే ప్రేమకథలు, మనుషులమీద రాగద్వేషాలకు అతీతమైన ప్రేమకథలు. ఈ పదింటిలోను మూడు పాపాయి కథలు. మొదటిది కంచి వాసుదేవరావుగారి మమతలు— నారాయణరావులనే పెద్దమనిషి తన యింటవచ్చి ఆడుకొంటున్న పాపపై మమకారం పెంచుకొన్న తర్వాత— ఆ ఊరినుండి వెళ్లి కొన్నాళ్ల తర్వాత ఆ పాపను, చూడబోతే ఆ పిల్లలేదు. ఆ పిల్లఫోటోఅయినా తీసుకోబోతే ఆ పిల్లతల్లి అది ఈయడానికి నిరాకరిస్తుంది. ఈ కథలో ఛాయలు రవీంద్రుని కాబూలీవాలాను జ్ఞాపకం చేస్తాయి. ముక్కామల వేంకటేశ్వరరావుగారి 'మా పాప' దాంపత్య జీవనానికి తళుకులు చిమ్మిన పాపాయిరాకను మనోహరంగా వర్ణించిన కథ. కె. ఆర్. కె. మోహన్ రచించిన ''పరిష్కారంలో''— శాస్త్రిగారి కుమార్తె కాంతం ఒకపాపను ప్రసవించి చనిపోతుంది. ఆ యింటిలో వంటలక్క వెంకాయి తనబిడ్డను కోల్పోయి యీ పాపను సాకుతుంది. ఆ తల్లికీ యీ బిడ్డకు కుదిరిన ఋణానుబంధమే ''జీవనాంతర సౌహృదాణి'' అని కథకుడు చిత్రిస్తాడు. ఇంక మిగిలిన కథలలో కోయల గూడెంలో నివసించే కొండవాళ్ల బ్రతుకులు చిత్రించే 'మధు'అనే కథలో పసుపులేటి మల్లికార్జునరావు మంచి ప్రయత్నమేచేసినా, ఆ కొండ పరిసరాలను కాని అక్కడ నివసించే జనుల జీవితాలనుగాని ఆచార సంప్రదాయాలనుకాని సమగ్రంగా కళ్లకుకట్టినట్లు తేలేదు. పుట్టు గ్రుడ్డిగా వచ్చిన 'రవి' జీవితంలో పగలు చీకటి చూపులుండటం, లేకపోవటం, చావు బ్రతుకుల మసక చీకటిలాగ చిత్రించిన 'ఉషోదయం' అనే పమిడి ముక్కల లక్ష్మణరావు కథలో శిల్పం చక్కగా ఉంది. ఈ పుస్తకంలో పెద్దకథ 'బాంధవ్యాలు' మెట్టా ఆంజనేయులు వ్రాసింది, కథగాకంటే నవలగా రాణించేది. ఇందులో భానుమూర్తి అనే యువకుడు ప్రయివేట్లు చెప్పుకొంటూ లక్ష్మీకాంతం గారి కుటుంబంలో కలిసిపోయి, ఆ యింటి యిల్లాలు శాంతమ్మ గారు చెప్పినట్లు— ఒక కురూపిపిల్లను వివాహం చేసుకొంటాడు. ఆ తల్లి దండ్రుల సొంతకొడుకునిరాకరించిన యీ సంబంధం యీ బ్రహ్మచారి చేసుకోవడం పెద్ద త్యాగం. ఇలాంటి కథలో వచ్చిన పరివర్తనాలు— స్వగతాలుగా చెప్పించే దానికంటె చాలినన్ని సన్నివేశాలతోను సంఘటనలతోను చక్కని పాత్ర చిత్రణంతో నవలగా రాణింపవచ్చు. ఈసంపుటిలో— 'సుధ' అనేఅమ్మాయి వ్రాసినకథ స్త్రీదృక్పథాన్ని చూపే ఏకైక కథానిక. దీనిలో ఈ రచయిత్రి ప్రేమగురించి ఆదర్శాలు వేదాంతాలు చెప్పిస్తుంది. ప్రేమద్వేషంగాను, ద్వేషం ప్రేమగానూ మారిన పరివర్తనము దీనిలో కనిపిస్తుంది. ఇది యొక మానవుని ఆత్మగతం. ''నేను ఒక అమాయకుణ్ణి హత్యచేసి హంతకుడ నయ్యేవాడిని. రేపీపాటికి ఉరికంబం మీద ఉండేవాడిని. ప్రేమ నన్ను దీనినుండి తప్పించింది. నాలోని పగని చల్లార్చి మనుష్యునిగా మార్చివేసింది. దానవుణ్ణి సైతం మానవునిగా మార్చగల శక్తి ఒక్క ప్రేమలోనే ఉంది'' ఇలాంటి, భావాలు చెప్పిన కథా రచయిత్రి అవి యెలాగ మారిందీ సంఘటనలతో చూపవలసింది.

మొత్తంమీద ఈ పదికథలు, పదికొత్త కథా వస్తువులు చూపించాయి. పుస్తకం చివర— ఈ పదిమంది రచయితలను కలుసుకోండి అని చిన్న పరిచయాలు వ్రాశారు. దానినిబట్టి రచయితలందరూ యువకులనీ ఉత్సాహంతో ఏదో చెప్పాలని ఉవ్విళ్లూరుతూ ఉన్నట్లు గ్రహించవచ్చు. ఈ ఉత్సాహానికి తోడు కొంత భాషా పరిజ్ఞానమూ, భావానుభవమూ అలవరచుకొంటే ఆ యుత్సాహం సరియైన ఉపజ్ఞ కాగలదు.

ఏ మయినా ఈ పదిమందీ కలిసి సహకారంతో ఇలాంటి ప్రయత్నంచేసి సాధించిన స్వల్ప విజయానికి వారిని అభినందింపవలసియున్నది.

నవకథామాల

పదికథల సంపుటి : 1/8 క్రౌనుసైజులో 122 పుటలు. వెల: రూపాయిన్నర. ప్రచురణ: ఉత్తరాంధ్ర గ్రంథమాల, రచయితల సహకార ప్రచురణ సంఘము, విశాఖపట్టణం—1.

ఈ పుస్తకం ముందుగా చేసిన విజ్ఞప్తిలో నిర్వాహకులు తమ గ్రంథమాల రచయితలకోసం, రచయితలచే, పాఠక మహాశయులకు ఉత్తమ సాహిత్యాన్ని అందజేయుటకు నెలకొల్పబడినదని చెప్పి, శుభకృత్ గ్రంథ ప్రణాళికలో తొలిగ్రంథముగా, పదిమంది ప్రసిద్ధ కథకుల కథలు ప్రకటించారు. ఈ పదిమంది రచయితలు విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన మంచికథకులే. రాచకొండ విశ్వనాథశాస్త్రి, చాగంటి సోమయాజులు, చిలివాడ కాంతారావు వంటివారలు ఉత్తమకథలు రచించుటలో చేయితిరిగినవారు. కాళీపట్నపు రామారావు, ఆకుండి నారాయణమూర్తి వంటివారలు కథలురచించి, వివిధ పత్రికలు నడిపిన పోటీలలో బహుమతులందినవారు. మిగిలిన

వారిలో పి. సరళాదేవి, ఘండికోట బ్రహ్మాజీరావు, అంగర వేంకట కృష్ణారావు, బులుసు–జీ–ప్రకాశ్, శ్రీపతిగారలు ఎడనెడ పత్రికలలో కథలు ప్రకటిస్తున్నవారే. అయితే ఈ సంపుటిలో వెలువడిన కథలుమాత్రం, పత్రికలలో కాలక్షేపానికి చదివే అబ్బాయి— అమ్మాయిల ప్రేమకథలుకావు. ప్రతీకథా ఒక ప్రయోజనంతో వ్రాసినట్టు ఉంది. ఉదాహరణకు మొదటి కథ 'పోయిందిపొల్లు'లో బలివాడ కాంతారావుగారు— ముప్ఫై యేండ్ల యిల్లాలు కమలమ్మ తన చంటిపాప పోవడంతో పొందిన విషాదం మధ్య ఒక ముసలమ్మ యిచ్చిన ధైర్యంతో తిరిగి ఎలాగు దిట్టము చేసికొన్నదీ, ఆమె జీవితంలో దరహాసం తిరిగి యెలాగ వెల్లివిరిసిందీ చిత్రించారు. అలాగే చివరికథ 'ఎంపు'లో ఒక కుంటివాడికీ— మరో గ్రుడ్డివాడు జోడయి బిచ్చమెత్తుకొని డబ్బు సంపాదిస్తే, ఆ కుంటివాడు చేరదీసిన 'ఎర్రి' అన్నపిల్లకు ఆ గ్రుడ్డివాడితో జతకలిసి, ఆ ముసలివాడు అప్పగిస్తాడు. ఎర్రికి ఎర్రపూసలుకావాలి. గ్రుడ్డివాడు అవి కొనిపెట్టి వాటితోపాటు గాజులూ కడియాలూ కొనుక్కోమంటాడు. కళ్లులేనివాడికి కడియాల రవళులూ గాజుల మోతలే కాబోలు కావాన్ని కదుపుతాయి అంటాడు కథకుడు. ఈ చిన్నకథ వ్రాయడంలో బిచ్చగాళ్ల జీవితంలో లోతులను వెదకి బయట పెట్టడంలో గొప్పనేర్పు చూపించారు రచయిత చాగంటి సోమయాజులు. ఈ కథలన్నిటిలోను ఉత్తరాంధ్రభాష రకరకాలుగా వినిపిస్తుంది. అందులోను ఒక సౌకుమార్యము ఒక సౌందర్యమూ కురిపిస్తూ పదికథలలోను ఒక వైవిధ్యం పాఠకుల్ని ఆకర్షిస్తోంది. 'పిన్ని ప్రేమ'లో పి. సరళాదేవి చిత్రించిన పాత్ర, సవతితల్లిగా వచ్చిన ''లక్ష్మీకాంతం'' ప్రవర్తన చూచి ఆ సంసారంలో పిల్లలూ, ఆమె అత్తగారు గోవిందమ్మ ఆమెను యెలాగ స్వీకరించిందీ, ఎలాంటి మార్పుచెంది ఆమె యెడల తమనడత మార్చుకొన్నదీ చాల నేర్పుగా చూపించారు. ఒక్క స్త్రీయే అలాంటిపాత్ర చిత్రం చేయగలదు. ఇలాగే మరొక వింతపాత్రచిత్రణ ఆకొండి నారాయణమూర్తిగారి 'సాక్షి' కథలో చూడవచ్చును. ఒక బస్సులో ప్రయాణం చేస్తున్న కనకరాజు అన్న బాటసారిని ఖూనీ చెయ్యాలని యెత్తువేస్తే, త్రోవలో దొంగలువచ్చి బస్సు దోచుకుంటారు. ఆ బస్సు కండక్టరుమీద కేసురాగా ఆ కనకరాజే సాక్ష్యమిచ్చి అతన్ని రక్షిస్తాడు. ఇదొకపాత్ర. అలాగే 'శ్రీపతి' రచించిన 'వరమీయని వేలుపు'లో, పోలేరమ్మకు బలియీయ దలచిన మేకపోతు బ్రతుకుతో రత్నాలమ్మపాప బ్రతుకు ఎలాగ ముడిపడిందీ చూపి, జంతుబలినాపించిన మానసిక సంఘర్షణ కథకుడు కళ్లకు కట్టినట్లు చిత్రించారు. ముష్టివాళ్ల బ్రతుకుతో మధ్యతరగతి కుటుంబీకుని కథ ముడిపెట్టి— ఆకలి కేకలు అందరికి సమానమే అనే సత్యాన్ని గొప్పగా నిరూపించారు. ఇలాగ ఈ చిన్నపుస్తకంలో వెలువడిన ప్రతికథా ఒక ప్రయోజనంతో, ఒక క్రొత్త పలుకుబడితో వినిపిస్తోంది. ప్రతిపాఠకుడూ, కథాశిల్పం తెలిసికొనే నిమిత్తం చదువతగిన పుస్తకం.

—శ్రీవాత్సవ.

జనభారతం

రచన : దేవులపల్లి సుబ్బారావు. వెల : రు 1.50
ప్రచురణ: మంజూపబ్లికేషన్సు, విశాఖపట్నం.

'విప్లవ మంజుల రవళి' అన్న వ్యాఖ్యానపు పేరుపెట్టారు కవిగారు ఈ పుస్తకానికి. ఈ తరము వారిదేశ ప్రపంచ సాంఘిక రాజకీయ పరిస్థితులే ఈపుస్తకాన్ని ఉద్దీపించినవట. ఇది కవ్యాన్విత సత్యవాణియట, అంటే, కావ్యరీతిని చెప్పే సత్యాలని కవి ఉద్దేశ్యము. ఈ 'గీతాలు' అన్నీ కమ్యూనిజ ప్రచారాలు. 'మతంలాంటి' నల్లమందు ప్రజలకి మేపుతున్నారయా అని ప్రారంభిస్తాయి. 'మతములాంటి నల్లమందు' అనికాదు, 'మతమనే నల్లమందు' అని కాబోలు రచయిత ఉద్దేశము. 'ఉత్తమ మానవుడు దైవస్వరూపమనీ నీ....మనం అనుకుందాం' ఉత్తమ మానవుడే అనడమేమీ, 'మానవునిలోని ఉత్తమ గుణమే దైవస్వరూపము, ఆ స్వరూపాన్నే 'ఉద్దీపిం' చండి అంటే అది మతం కాలేదా ? 'సుపవిత్ర గంగాస్నానము' మతం కాదా ? గీతాలు ఎక్కడో ప్రారంభించి ఇంకెక్కడికి పోతున్నాయి. నడుమ నడుమ 'శ్రామికులు' కర్షకులూ అంటూ కమ్యూనిస్టు కబురులు ! ఆ తత్వాలేవో మనస్సుకు పట్టేటట్టు ఉపన్యాసాలలాగు వ్రాసినా బాగుండును. లేదా విశ్వంలాగ ''వళ్లు వంచి కష్టపడే కూలీలకు తిండి చాలడములేదు'' అని కొండమీద నిలబడి ఘోషించే పాటపాడినా బాగుండును. కమ్యూనిస్టు గంధము పూసుకుంటే అయిపోయిందా పని ? 'ధనమదాంధులు' అని నోరుపారేసుకుని తిట్టితే ప్రయోజనమేమిటి ? కిట్టని వారంతా ఏదో విషపెట్టి చేసేపనే అది ! జనులముందు నడకకి వారు ఎలాగ అడ్డు అవుతున్నారో వాస్తవానుభవాలు వ్రాసి గుండెలు పిండితే వస్తుంది పరివర్తనం. 'దాహం దాహం' అంటే దాహము తీరనట్టు 'విప్లవం, విప్లవం' అంటే విప్లవంరాదు.

''వినయంతో టాగూరు మోడ్చిన ''గీతాంజలి''కి చెవుల్లో''గ్గే వారికి మతం నల్లమందు ఎట్లాగవుతుందీ ? 'స్వేచ్ఛా మలయమారుతాలు భువిలో హాయిగా వీస్తున్నప్పుడు కూడా 'విప్లవోద్రేకంతో పాటలు పాడతాను' అనే వారికి జగత్సుఖమా విప్లవోద్రేకమా కావలసినది ? ''కార్లమార్క్సు సర్ప్లస్ వాల్యూతీరీ ప్రకారం నిజంగా రావలసిన రాబడి కిట్టుబాటు కాలేదు'' అంటే చదువర్లకు రచయిత ఉత్సాహం పట్టేస్తుందా ? విప్లవంకూడా గజ్జెలు కట్టుకుని కవిత్వాభినయం చేస్తుందా అనిపిస్తోంది ఈ గీతాలు చదివితే. 'లేవోల్గా, గంగా, యాంగ్ట్సీ, ఇదేమిటి ఈ ఉత్సాహం ? తక్కిన నదుల పాపం ఏమిటి ? ఒకవైపు 'పాపలు చేపల్లా మిలమిల లాడుతున్న దేశం పావన గంగానదీ ప్రవాహవైదానం' అంటూ శతవందనం ! ఇంకొకవైపు రష్యారా, చీనారా నాకు కావలసినవారేరా ! వెనకటికి ఒకపెద్దమనిషి చేసిన వోటింగు కాన్వాసింగు జ్ఞప్తికి వస్తున్నది 'ఒరే బ్రదర్ నీకు కూడులేదురా, గుడ్డలేదురా, నీకు వోటువుందిరా, అది నాకివ్వరా' అన్నది.

'వచ్చినతార' అంటూ 'నీ.... ధ్వనివిని పరమాత్మలో' లీనముకావడమూ, 'జగతికి పురోగమిస్తుంది' అంటూ 'కమ్యూనిజం ఖాయంఅని పాతమాటలే పల్లవి పాడడమూ, దోపిడి పాపం నుంచి కూలిపుణ్య జీవుల్ని రక్షించు' అంటూ ప్రార్థనలు చెయ్యడమూ మళ్లి విప్లవం అంటూ ''విశాఖ సంద్రం.... మీసం మెలివెట్టిన విప్లవకేంద్రం''అని 'పెల్లి' రేగడమూ అర్థంకాని కలగాపులగాలు.

ఈ 'గీతాలు' అక్కడక్కడ లయగంధం అమర్చుకుని స్వేచ్ఛగా పాగేయి. అక్కడక్కడ స్వరాలు లాగడానికే కాని పాడడానికి సరిపోవు. మెగాఫోనులలో పాడినట్టు సాగించవచ్చు.

యుగపురుషుడు

వెల: రు 4—00 ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన వీరేశలింగం స్మారకోత్సవముల సంఘం, హైదరాబాదు.

కృష్ణశాస్త్రిగారూ, తెలికిచర్ల వెంకటరత్నంగారూ, ఆవుల సాంబశివరావుగారు శ్రమించి సేకరించిన సంపుటము.

బ్రిటిషు పరిపాలనతో, మధ్యయుగాలలోనే నిలిచి వుండిన భారతదేశం ఆధునిక యుగంలోకి నడిచి వచ్చిందంటారు చారిత్రకులు. వీరేశలింగంగారితో ఆంధ్రదేశం మధ్యయుగాలనుంచి ఆధునిక యుగానికి మళ్లింది. మతంలో ఆచార వ్యవహారాలలో హేతువాదమూ, వాఙ్మయంలో వైవిధ్యమూ సౌలభ్యమూ వారితోనే ప్రవేశించాయి తెలుగునాట. వారి జీవితమూ, సారస్వతసేవా, సంస్కారోద్యమమూ, ఉపన్యాసాలూ గ్రంథాలయ—, ఉపయోగసంస్థా— భాషా సంస్కార—, ప్రారంభాలూ, వారిబహుముఖ రచనలూ, వ్యక్తుల పరిచయాలూ వంటి పలుశక్తులను గురించి తెలుగునాటి అభ్యుదయాన్ని కాంక్షించే యాభయిమంది ప్రముఖ రచయితలు వ్రాసిన గద్య పద్యాలున్న సంపుటమిది. బరువైన, ఉపయోగ కరములైన, ఇంపైన వ్యాసాలకుతోడు పంతులుగారి ఫోటోలు, సంస్థల ఫోటోలు వారి సమాధిఫోటో చక్కగా ముద్రించబడినవి.

లచ్చిపాటలు

రచన: శిష్ట్ల కృష్ణమూర్తి, వెల: రు 1.00 ప్రచురణ: ఆనందసాహితి, హైదరాబాదు. ప్రాప్తిస్థానము: జయభారతి బుక్‌డిపో, కాచీగూడారస్తా, హైదరాబాద్‌.

యెంకి తెలుగునాట నిలద్రొక్కుకునేసరికి చాలాకాలం పట్టింది. ఆమె ప్రేమయోగిని. ఆమె సంపూర్ణ వికాసం పొందేసరికి నాయుడు ఆమెముందు పొట్టివాడై పోయాడన్నారు బుచ్చిబాబుగారు. యెంకి పాటలతర్వాత కొనకళ్లవారి 'బంగారు మామ పాటలు' వచ్చాయి ఆచాఅవి. ఊరిబయట, తోటలలో, పొలాలలో, కాలవగట్లమీది, అందచందాలు చక్కగా మెదిలేయి ఆ పాటలలో. లచ్చిపాటలు ఆ శాఖకు మూడోఫలము.

లచ్చి చలాకీపిల్ల. చిలిపి మాటల కర్థము చెప్పమంటుంది, పండువెన్నెల ప్రేమజీవుల పట్టుపానుపె అంటుంది, కళ్లాన తూర్పారబోస్తూ బావతొంగి చూస్తే సిగ్గుతో కుంగిపోతుంది. జీవితంలో ప్రతీయువకుని సరసకూ వచ్చే తరుణ భార్య చేష్టలు లచ్చిలో కనిపిస్తాయి. సందెకాడ, పరధ్యానంలో, తోటలో, పంటసేలో, పండుగనాడు, లచ్చి అందాలు గుర్తించి పొంగిపోతాడు బావ. అడుగడుక్కీ యెంకి పాటలకు నేస్తపు భావాలు వినిపిస్తాయి లచ్చిపాటలలో. మాత్రాచ్ఛందస్సు రచయితకు బాగా పట్టుబడలేదు, జానపదుల భాషా పట్టుబడలేదు. ''ప్రేమ ఫలము, ప్రేమ గీతము, నర్తించె, ప్రేమహృదయము, ఉరములో,'' అనే గ్రాంథిక పదాలు ఒకవేపూ, వ్యవహారానికి భిన్నమైన మాటలు ఇంకొకవైపూ క్రుంగదీస్తూంటే అక్కడో ఊహ ఇక్కడొక ఊహ అభ్రకపు మెఱుపులు మెరిపిస్తూంటే సహజమూ కృతకమూ కాకుండా తీరేయి లచ్చిపాటలు.

—మూర్తి.

శ్రీ వేదాంత పంచదశ సారసంగ్రహ రత్నావళి

సంగ్రాహకః: 'బ్రహ్మవిద్యాలంకార' శ్రీ ముదిగొండ వేంకటరామశాస్త్రి. 'మూల్యమ్: రూప్యమ్. పుటలు: 104— ప్రకాశకులు : ఓంకారమందిరమ్— చేటపాపాయపాలెము— బెల్లంకొండపోస్టు, గుంటూరుజిల్లా.

వివేకపంచకము 294, దీపపంచకము 848, ఆనంద పంచకము 429 శ్లోకాల నుండి, వరుసగా 123, 270, 166 శ్లోకములు ఏరి, మూల గ్రంథ స్వరూపము స్ఫురించునట్లు కూర్చిన సంగ్రహ గ్రంథమిది. బృహద్గ్రంథ విషయములను మననము చేయుట కిట్టిగ్రంథము లుపయోగపడును.

గ్రంథాంతమునందు సంస్కృతములో భూమికయు, సంస్కృతాంధ్రములలో వేరుగా తాత్పర్య సంగ్రహములును చేర్పబడినవి. సంస్కృత సంగ్రహము ప్రధానముగా ప్రకరణ భాగములకు అవతారికా ప్రాయముగా నున్నది. ఆంధ్ర సంగ్రహము కేవలాంధ్ర భాషాభిజ్ఞులకు ఎంతమాత్రము నవగాహనము కాదు. ''దృగ్దృశ్య వివేకయుక్తిచే జీవాత్మ పరమాత్మ తత్త్వముల సచ్చిదానంద మాత్రములుగ నిరూపించి, తత్త్వమస్యాది మహావాక్యోపదేశముఖమున నధ్యారోపాపవాద ప్రక్రియతో మాయాఽవిద్యా తత్కార్య వ్యష్టి సమష్టి స్థూల సూక్ష్మోపాధి త్రితయాత్మక ద్వివిధ వాచ్యార్థ నిరాకరణమున'' ఇత్యాది.

సనాతన పండితంమన్యులకు ఆధునికులను వృథాగా కూడ నిందించుట దురభ్యాసమైనది. అట్టిదే ఈ గ్రంథ భూమికలో, ''ప్రాచీనానేక గురుతర ప్రామాణిక మహా ప్రబంధ కర్తౄ ష్వాత్మీయ క్షుద్ర ప్రతిభాను రూపాధునాతన విమర్శక ధోరణ్యాను గుణవ్య నకోఽప్యవకాశలేశః'' అని యుండుట మిక్కిలి విచారకరము. ఈ సంగ్రాహకులుకూడ ఆధునికులే యని మరువరాదు.

ఈ మూల గ్రంథమునకు కర్త ఎవరు ? ఒకరా, ఇద్దరా, పలువురా, యను విచారణచేయుట క్షుద్ర విమర్శ కానేరదు. శ్రీ విద్యారణ్యుల వంటి పరమ ప్రామాణికుల రచన మని, దానిని సంగ్రాహకులేగాక, నారాయణ స్మరణము కావించిన శ్రీ మదభినవ విద్యాతీర్థ స్వామి వదులునుగూడ తెలిపిరి. కాని గ్రంథమే అది సరికాదని ఉద్ఘోషించుచున్నది. వేదాంత పంచదశ పూర్వముద్రణములలో ప్రకరణాంత వాక్యములను బట్టి, 4, 5, 11 ప్రకరణములు శ్రీ భారతీ తీర్థ విద్యారణ్యు లిరువురును, 6, 7, 8, 9, 10, 13, 14, 15 ప్రకరణములు శ్రీ విద్యారణ్యులును రచించినట్లు కలదు. 1, 2, 3, 12 ప్రకరణము లెవరు రచించిరో తెలియురాదు. ప్రథమ వ్యాఖ్యాత యగు రామకృష్ణకవి గ్రంథకర్త ఎవరో తెలుపలేదు.

గ్రంథస్థ విషయములు పరిశీలించినచో, "మహావాక్య వివేక'మని 5వ ప్రకరణముగా వేరుచేసిన 8 శ్లోకములును, సందర్భమునుబట్టి మొదటిదైన తత్త్వవివేకములో 52 వ శ్లోకము తర్వాత నుండవలసినవని, స్పష్టపడును. పూర్వ ప్రతులలోని 53వ శ్లోకము 'ఇత్థంవాక్యై స్తదర్థాను సంధానం శ్రవణం భవేత్'' అనుటవల్ల, దానికి పూర్వము మహావాక్య సంబంధమైన గ్రంథపాఠ మున్నదని నిశ్చయింపవచ్చును. ఆంధ్రములో విపులమైనవ్యాఖ్య రచించిన శ్రీ రాయప్రోలు లింగన సోమయాజిగారు మహావాక్య ప్రకరణము ను మొదటి ప్రకరణములో సముచిత స్థానము కు తెచ్చి వ్యాఖ్యానించినారు. అందువల్ల గ్రంథములో 14 ప్రకరణములే తేలును.

అదియునుగాక సంస్కృత భాషాపరిజ్ఞానము కలవారికి 'పంచదశ' అనుశబ్దము పదునేనవ అనునర్థమును స్ఫురింప జేయునేగాని, 15 ప్రకరణములున్న గ్రంథము అను నర్థము కలిగింపదు. ఆ యర్థము సాధించుటకు శ్రీ సోమయాజిగారు డొంకతిరుగుడుగా బాధపడిరి.

అదిగాక 'నమః శ్రీ శంకరానంద గురుపాదాంబు జన్మనే' ఇత్యాది ప్రథమశ్లోకములో గ్రంథకర్త, ఆది శంకరులనో, శ్రీ శంకరానంద నామముగల స్వగురువులనో స్మరించెను. అట్టిచో శ్రీ విద్యారణ్యులకు భారతీ తీర్థులు గురువులనియు, ఆ గురువులు కొంత స్వయముగాను, తక్కినది శిష్యముఖమునను, ప్రకటించి యుండవచ్చు ననియు, ఆధునికులలోగూడ జంటకవులున్నారనియు, ఏమేమో భూమికలో వ్రాసి, ధునాతన విమర్శకులను 'క్షుద్రప్రతిభు'లని నిందించుట, ఈసంగ్రాహకుల 'అక్షుద్ర ప్రతిభ'కు నిదర్శన మెంత మాత్రము కాజాలదు. గ్రంథకర్త ఎవరో విచారణచేయుటే క్షుద్రత్వమైనచో, శ్రుతికి అపౌరుషేయత్వమును సాధించిన పూర్వమీమాంసకు అందరునుగూడ, వీరి దృష్టిలో 'క్షుద్రకోటి' లోనే చేరెదరు. శాంతం పాపమ్ !

ఈ గ్రంథకర్త ఆంధ్రదేశములో నేటి పండితులలో అగ్రకోటిలోనివారు. సంగ్రాహక మాత్ర గ్రంథమునకు మూడు ఫొటోల బ్లాకులు కలిపి ప్రచురించినారు. అందులో శ్రీ విద్యారణ్య పూజ్యపాదులవి గాక, తక్కిన రెండును చేర్చుట వృథాడంబరముగా బుద్ధిమంతులకు తోచును! వేదాంత గ్రంథ ప్రచారములో వేదచోదితమైన కర్మమార్గమందు శ్రద్ధాభక్తులు క్షీణించుచున్న ఈ కాలములో, ఇట్టి విద్వాంసులు శ్రౌతస్మార్త కర్మలు ప్రబోధించు గ్రంథజాతమును ప్రచారము చేయుటలో, ఎక్కువ పాటుపడవలసి యున్నది. వేదాంతోపాదిత మగు బ్రహ్మనిష్ఠకు, గృహస్థులు ఎంతచదివిన వారైనను గౌణాధికారులేకదా!

హిందూమత తేజఃప్రభ

హిందూమత తేజఃప్రభ: కర్త: తిరుక్కోవలూరు పెద్ద స్వాములు ఆదివరాహాచార్యులు. ప్రాప్తిస్థానము : గ్రంథకర్త, C/o శ్రీ ఊటుకూరి హయగ్రీవగుప్త, అడ్వకేటు, బాపట్ల. పేజీలు: 117. వెల: రు. 1.50 న. పై. గ్రంథకర్త ఏ భాష్యముల ననుసరింపక సర్వమతముల సమన్వయించునేకైక సిద్ధాంతముగా భగవద్గీతకు టీక వ్రాసినారట. దానికీ గ్రంథము పీఠిక యట !

ఇందులో 1. బ్రహ్మతత్త్వము, 2. ఆత్మతత్త్వము, 3. ప్రకృతితత్త్వము, 4. ప్రాకృతతత్త్వము, 5. మతతత్త్వము అను నైదధ్యాయములు కలవు. గ్రంథము చదివిన తర్వాత గ్రంథకర్త ప్రదర్శించిన తత్త్వమేదియు బోధపడదు. తత్త్వశబ్దమునకే అనే కార్థములు చెప్పుకొన్ననేకాని సమన్వయముకాదు.

పే. 82 "వేదాంగమగు యజ్ఞోపవీతముపలె కర్మాంగమగు యఖండోర్ధ్వపుండ్రమే సర్వోపాసనలయం దనుగతమై యుండెను." పే. 83 "ప్రాచీన వైదికమత సిద్ధాంతములలో గర్మాంగమై యఖండోర్ధ్వ పుండ్రములు మొదలైన బాహ్య ధర్మములు సర్వ జనీయములుగా నున్నందున ప్రాచీన వైదిక మత మైక్యమే కలిగియుండెను."— ఇట్టిది, గ్రంథకర్త ప్రతిజ్ఞ చేసిన సర్వమత సమన్వయము ! ఈ యఖండోర్ధ్వ పుండ్రమును ఏ వేదవాక్యములు అఖండముగా విధించుచున్నవో మాత్రము, గ్రంథకర్త చూపుటకు శ్రమపడలేదు.

పే. 30 "ఈ యధ్యాసవాదము వేదములకు లోకమునకు విరుద్ధమనుట నిర్వివాదము"అని శ్రీ శంకర భగవత్పాద మూలసిద్ధాంతమునే, నిర్వివాద విషయముగా తీసివేయుటలోననే గ్రంథకర్త 'వాదబలము' ఎట్టిదో తెలియగలదు.

పే. 97 "శంకర రామానుజ మధ్వాచార్యులు ముగ్గురు కూడ కేవల కర్మయోగమునకు ప్రాధాన్యమును సిద్ధాంతీకరించి యుండనందున, కర్మయోగమునకు నిలకడ చిక్కలేదు." అని గ్రంథకర్త విమర్శ. బ్రహ్మస్వరూపమును విచారించుటకు వ్రాసిన భాష్యములలో కర్మప్రాశస్త్యముండునా యని కాని, ఆ ముగ్గు రాచార్యులే ఉండనిచో ఇప్పటికి దక్షిణదేశము పాషండప్రాయమై యుండునని కాని, గ్రంథకర్తకు తోచలేదు.

గ్రంథకర్త తన సర్వజ్ఞత్వమును ప్రదర్శించుకొనుటకు షణ్మతములను గూర్చి వారికి తోచినదెల్ల వ్రాసిరి. పే. 102 "వరాహపురాణమునందలి దేవీ మాహాత్మ్యమును వర్ణించు సప్తశతి." ఆ సప్తశతి మార్కండేయ పురాణములోనిదని

వారికి తెలియదు. దుర్గోపాసను అనాదిగా సమస్త వైదిక జనము అనుష్ఠించు చుండిరని, మహాభారతము, హరివంశమే కాక, (విష్ణు) భాగవతముకూడ ఉద్ఘోషించుచున్నవని, గ్రంథకర్తకు స్ఫురణకూడ ఉన్నట్లు తోచదు. ఇట్టి పొరపాట్లు గ్రంథమంతట నిండియున్నవి.

గ్రంథకర్త పే. 34లో, "ఈ బజారు వేదాంతులు చెప్పెడు వేదాన్త రహస్యములకు వారి నడవడులకు సంబంధమేమాత్రము నుండదు." అన్న మాటలలో సత్యములేక పోలేదు. ఈ గ్రంథకర్త తనకుగూడ నట్టి హెచ్చరిక చేసికొని, శ్రుతిస్మృతి సదాచారములను అవగాహన మొనర్చుకొన ప్రయత్నింప వలసినదని యర్థించుచున్నాము.

—నోరి నరసింహశాస్త్రి.

బ్యాంకింగు విజ్ఞానము

(రచయిత : శ్రీ ఎ. కె. రెడ్డి. ప్రకాశకులు : మద్దిరెడ్డి అంజిరెడ్డి S/o గురవారెడ్డి, చినపరిమి (పోస్టు) వయా తెనాలి, గుంటూరుజిల్లా, వెల : రు. 2.25, పేజీలు : 123)

"**India's Share Capital is shy**" అన్నారు ఎవరో. కాని "**Andhra's capital is shy**" అని మనం అనుకోవాలె. మనకు ఏ విషయాన్ని గురించి పుష్కలంగా తెలియదు. మనకు వ్యాపారంనాస్తి. పరిశ్రమలు సున్న. బ్యాంకింగు అంటే ఏమిటో తెలియదు. ఈ మూడు వుంటేగాని రాష్ట్రంగాని, దేశంగాని అభివృద్ధిలోకి రాలేవు. మన ఆంధ్రదేశంలో కోస్తా జిల్లాలలో కొన్ని ప్రాంతాలు మినహాయిస్తే తక్కినవన్ని మెట్ట ప్రాంతాలే. మాగాణీ భూముల ఆసాములవల్లే అందరూ కడుపునిండినవారిలాగా కూర్చోనలేరు. అందువలన చిన్నచిన్న పరిశ్రమలను వృద్ధి చేసుకొవేందుకు ప్రయత్నించాలె. చదువుకొన్నవారు గుమాస్తాగిరికి పాలుబడక కొత్తదారులు తొక్కాలె. డబ్బున్నవారు సాహసించి బయటకు రావాలె. దీక్షతో ప్రయత్నిస్తే వ్యాపారాభివృద్ధి చేసుకొన శక్తులున్నవి మనలో. తెలివి తేటలు చదువుసంధ్యలు వున్నవారు, ధనికులు సహకరించుకొని పరిశ్రమాభివృద్ధికి ప్రయత్నాలు జరపవలసివున్నది.

నాకు తెలిసినంతవరకు తెలుగులో అర్థశాస్త్రంమీద గాని, బ్యాంకింగు మీదగాని మంచి పుస్తకాలు వున్నట్లు కన్పించదు. ఎప్పుడో 30 సంవత్సరాలకు పూర్వం విజ్ఞాన చంద్రికా గ్రంథమండలివారు అర్థశాస్త్రం తెలుగులో రాయించారు. ఆ పుస్తకం సంగతి ఇప్పటికారుకు తెలిసియుండక పోవచ్చు ! పాతకాపీలు దొరుకుతవో దొరకవో ! ఆ పద్ధతిలో పుస్తకాలు రావాలె.

బ్యాంకింగు అంటే మనవారికి బ్యాంకులు డబ్బు అప్పిస్తవని, డబ్బు దాచుకోవచ్చునని వడ్డీ ఇస్తారని మాత్రమే తెలుసు. కొందరికి బ్యాంకీ దగ్గరకు వెళ్లడమే భయం. వివరాలు ఏమీ తెలియవు. తెలుసుకోవాలెననే కుతూహలం గూడా వుండదు.

ఈ గ్రంథకర్త సూక్ష్మంగా బ్యాంకింగు పదాలను విపులీకరించి తేలికగా అర్థమయ్యే భాషలో రాశారు. కొన్ని పదాలను ఇంగ్లీషులో అర్థంచేసుకోవడమే కష్టసాధ్యము. తెలుగుపదాలకు ఇంగ్లీషు పదంగూడా ప్రక్కనే రాశారు. తెలుగుపదాలకంటె ఇంగ్లీషుపదాలునే తేలికగా అర్థంచేసుకొనే పరిస్థితుల్లో వున్నాము మనము. కొన్నిచోట్ల గ్రంథకర్త ఇంగ్లీషు పదాలను మక్కికిమక్కిగా తెలుగుచేశారు. లిమిటెడ్ అంటే పరిమితపూచీ అన్నారు. బాగానే వున్నదికాని కావలసిన అర్థం స్ఫురించదు. గ్రంథకర్త పుస్తకంచివర పదాల పట్టిక ఇంగ్లీషు— తెలుగులోవేస్తే వుపయోగకారిగా వుంటుంది. ద్వితీయ ప్రచురణలో అయినా తప్పకుండా పదముల పట్టిక (Glossary) తయారుచేసి వేయవలయును.

ఈ పుస్తకం చదివితే బ్యాంకింగును గురించి ఎక్కువ కాకపోయినా దానికి సంబంధించిన పదాలను అవగాహన చేసుకొనవచ్చును. ఇది తెలుసుకొని తెలుగువారు వారి బ్యాంకింగు విజ్ఞానాన్ని వృద్ధి చేసుకొని బ్యాంకులతో లావాదేవీలు అలవాటు చేసికొనడానికి తోడ్పడుతుందని ఆశ.

— గట్టి రాధాకృష్ణ.

మన దేశం కోసం

అమర్ జీ. ప్రస్తుత దేశ అత్యవసర పరిస్థితులను దెలుపు రెండు నాటికలు (దేశభక్తులు—జైహింద్—) వెల: రూపాయి. పుటలు : 47. ప్రతులకు : ఆంధ్ర విశ్వసాహితి, బోయిగూడ, సికింద్రాబాదు.

లేఖలు

రవీంద్ర సాహిత్యము

ఎందరో మహానుభావులు మనదేశంలోనే కాదు, అన్ని దేశాల్లోను జనించారు మరణించారు. వారివారి గొప్పతనాలను ఆయా దేశస్థులు, ఇతరులు స్మరించారు జయంతులు చేశారు. మనదేశంలో వున్న విపరీతం ఎక్కడా కన్పించడల్లా. మన దేశస్థులకు ఏ ధోరణిలో పడితే అదేధోరణి.

రవీంద్రుని నూరు సంవత్సరాలు నిండినయ్. జయంతులు వుత్సవాలు నాటకాలు సభలు అందుగూర్చిన తదంగాలు ఎప్పుడో అయిపోయినవి. ఆయన గొప్పవాడు. కాదనడానికి ఎవ్వరికి ధైర్యంలేదు. అందులో ముఖ్యం "నోబెల్" బహుమానం వచ్చింది. అంటే పాశ్చాత్యులు గూడా ఆయన సాహిత్యాన్ని గౌరవించినట్లయింది. మఫం కృతార్థులయ్యాం.

ఇందులో విచిత్ర మేమంటే శతజయంతి సంవత్సరం పూర్వమే అయిపోయినా మనం ఆయన సాహిత్యాన్ని పట్టుకొని వదలటల్లేదా అనిపిస్తూన్నది.

పుస్తకాలు రాసేవారు రవీంద్రుని కథలు ఇంకా తర్జుమా

చేస్తున్నారు. దానికేమైనా అర్థంవుండాలె. ఒకే పుస్తకాన్ని పదిమంది తర్జుమా చేస్తున్నారు.

ప్రజలను కొనమంటారు. ఎన్నిసార్లు ఒకే పుస్తకాన్ని కొంటారు ? గ్రంథకర్తకు తెలియాలె. పుస్తకాలు అమ్ముడు పోలేదని ప్రజను నిందిస్తారు.

ఇక ఆల్ఇండియా రేడియోసంగతి. చెప్పనక్కర్లేదు. రవీంద్ర గీతాలంటూ పాటలొస్తాయి. ఆ పాటలోని మృదుత్వం సంగీత సాహిత్యము పాడేవారికి పాడించేవారికితప్ప రేడియో వినేవారికి కేవలం అయోమయం. ఒక్కొక్కప్పుడు రేడియో మీద విరక్తికూడా పుట్టుతుంది. ప్రజలను ఈ విధంగా ఎందుకు బాధపెట్టవలసి వస్తుందో తెలియదు. రేడియో కార్యక్రమాల సంఘాలవారికి ఒక వ్యక్తిని చిరస్మరణీయంగా షేక్స్పియర్, కాళిదాసుల్లాగా చెయ్యాలెనంటే అవాంఛనీయమైన పద్ధతులు జాతిమీద రుద్దితే ఏంలాభం ? "ఈశ్వరో రక్షతు" అనేవిధంగా వదలాలె. సాహిత్యంలో విలువ వుంటే నిలుస్తుంది. లేకపోతే ఎంతకాలం ఆక్సిజన్‌పోసి నిలబెట్టగలం ?

లక్షలు ఖర్చుపెట్టి భవనాలు నిర్మించాం. విశ్వవిద్యాలయాల్లో రవీంద్రసాహిత్యానికి ఒకస్థాన మిచ్చాం. ఇంకా అనేక సంస్థలు అనేక విధాలుగా ఆయన్ను స్మరించారు.

ఇంకా కొంతకాలం గడిచాక హిందీమనమీద రుద్దుతున్నారన్నామే అదే విధంగా రవీంద్ర సాహిత్యం మనమీద రుద్దుతున్నారని ఎందుకనుకోరు ?

—గట్టి రాధాకృష్ణ.

"ఇంగ్లీషు భాషతో పరిచయంలేని సామాన్య ప్రజానీకంలో విజ్ఞానం వ్యాప్తిచేయడానికి, ఇంగ్లీషునుండి తమిళంలోకి అనువాదాలు చేయడం మంచిపనే. అయితే, కాలేజీల్లో చదువుతూన్న విద్యార్థుల పఠనీయ గ్రంథాలెంత మాత్రమూ ఇంగ్లీషునుండి భాషాంతరీకరణ చేయరాదు. ఏమంటే వారా ఇంగ్లీషు మూలాన్నే చదువుకోగలరు. ఈ అనువాదాలని చేసేవారు బాగా చదువుకున్నవారు కాక పైపై మెఱుగు జ్ఞానం కలవారు కావడంచేత— అనువాదాలు ఆయా విషయాలను గూర్చి అధ్వాన్నంగా తయారవుతున్నాయి. అనువాదాలమూలంగా అధిక ధనార్జన చేయవచ్చును. కాని అవి స్వలాభం కోసమే అయితే దానివల్ల ఎంతో హానిసంభవిస్తుంది." పై మాటలు వ్రాసింది ఎవరోకాదు. శ్రీమాన్. సి. రాజగోపాలాచారిగారు స్వరాజ్య పత్రికలో వ్రాశారు. వారు వ్రాసినది తమిళ గ్రంథాలను గురించి అయినా, తెనుగులోకిచేసే అనువాద గ్రంథాల విషయంలో కూడా వస్తుంది. ఇంగ్లీషునుంచేకాక ఇతర భాషలనుంచి చేసే అనువాదాలకికూడా వర్తిస్తుంది. కథలు నవలలు అనువాదం చేయడానికి అకాడమీవారి ఆశ్రయం అక్కరలేదు.

మద్రాసు — భ. రామప్ప.

కీ. శే. శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు 1963 ఏప్రిల్ 18 వ తేదీన హైదరాబాదులో తమ కుమారుని గృహంలో పరమపదించారు. ఆచార్యుల వారు భారతి పాఠకులకు చిరపరిచితులు. జ్యోతిశ్శాస్త్రమును గురించి వీరి వ్యాసాలు ఏభైకి పైగా "భారతి"లో పడ్డాయి. జోస్యం చెప్పడంకాక, జరిగిన సంఘటనలద్వారా శాస్త్రాన్ని అర్థం చేసుకొనడానికి ఉపయోగ పడవలెననే ఉద్దేశ్యంతో వీరు వ్యాసాలు వ్రాశారు. ఆవ్యాసాలు కేవలం వ్యాసాలుగాకాక, కథలుగా చదివించేవి. అందువల్ల జ్యోతిశ్శాస్త్ర రచనకేకాక, సాహిత్యానికికూడ వీరి మరణంవల్ల తీరని లోటు ఏర్పడింది.

శ్రీ గోపాలకృష్ణమాచార్యులు 1888 ఫిబ్రవరి 19 వ తేదీన అనంతపురంజిల్లా కల్యాణదుర్గం తాలూకా రాళ్లపల్లిలో జన్మించారు. తండ్రి కర్ణమడకల కృష్ణమాచారి. తల్లి అలిమేలు మంగమ్మ. పండితులు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు వీరి తమ్ములు. ఆచార్యులవారు 1909 లో మెట్రిక్యులేషన్ అప్పర్ సెకండరీ పరీక్షలో ఉత్తీర్ణులై కల్యాణదుర్గం తాలూకా ఆఫీసులో గుమాస్తాగా చేరారు. 1945 లో హుజూర్ శిరస్తారుగా రిటైర్ అయినారు. 15 వ ఏటనే ఉషా పరిణయము అను మూడు అశ్వాసముల తెలుగు ప్రబంధము, ప్రణయ సరణి అను నవల, వదరబోతులు అను పేరులేని విమర్శక వ్యాసము రచించారు. ఎన్నో భజన, పెండ్లి పాటలు తెలుగు, సంస్కృతాలలో వ్రాశారు. వీరి ప్రధాన వ్యాసంగ విషయము—జ్యోతిశ్శాస్త్రము.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.